సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 196

శుక్రవారం 6-10-2023

'ప్రాజెక్టులన్నీ పూర్తిచేసి శాశ్వత వనరులతో రాష్ట్రానికి ఉజ్వల భవిష్యత్ నిర్మించాలన్నదే నా స్వప్నం'

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL

సాక్షి ఫ్యామిలీ
కరీంనగర్
శుక్రవారం ॥ 6-10-2023

పురస్కారం

'ఇంటి మూలన వంట గది'
'అడవిలో హరిణి'
'సంధ్య వెలుతురు'...
సి.ఎస్.లక్ష్మి అనే
చిత్తూరు సుబ్రహ్మణ్యం లక్ష్మి
కథల సంపుటాల పేర్లు ఇవి.
'అంబై' కలం పేరుతో
తమిళంలో స్త్రీల పారంపరిక బంధనాలను
ప్రశ్నించే కథలు రాస్తున్న
సి.ఎస్.లక్ష్మికి ప్రతిష్ఠాత్మక
'టాటా లిటరేచర్ లైఫ్‌టైమ్ అవార్డు'
ఈ సంవత్సరానికి ప్రకటించారు.
'స్పారో' అనే సంస్థను స్థాపించి
మహిళా సాహిత్యకారుల
చరిత్రను నిక్షిప్తం చేస్తున్న
లక్ష్మి పరిచయం... ఆలోచనలు...


సి.ఎస్.లక్ష్మి

నీ కోసం కథలు రాసి

'నన్ను మహిళా రచయిత అని ప్రత్యేకంగా పిలవొద్దు. పురుషులు ఏం రాసినా వారిని పురుష రచయిత అంటున్నారా? మమ్మల్ని మాత్రం మహిళా రచయితలు అనడం ఎందుకు? మమ్మల్ని కూడా రచయితలు అనే పిలవండి' అంటారు సి.ఎస్.లక్ష్మి.

'అంబై' కలం పేరుతో తమిళ పాఠకులకు సుదీర్ఘకాలంగా అభిమాన రచయిత్రిగా ఉన్న సి.ఎస్.లక్ష్మి ఒకటీ రెండు నవలలు రాసినా ఎక్కువగా అంకితమైంది కథలకే. అదీ స్త్రీల కథలకి. తమిళంలో స్త్రీవాద దృక్పథంతో రాసి ఒక కదలిక తేగలిగిన రచయితల్లో సి.ఎస్.లక్ష్మి ప్రముఖులు. సుదీర్ఘ కాలంగా తాను ఆశించిన స్త్రీ వికాసం కోసం కలాన్ని అంకితం చేయడం వల్లే ఆమెకు 'టాటా లిటరేచర్ లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు' 2023 సంవత్సరానికి ప్రకటించారు. టాటా సన్స్ ప్రతినిధి హరీష్ భట్ ఈ విషయాన్ని తెలియచేస్తూ 'స్త్రీలు తాము మోయక తప్పని మూసలను లక్ష్మి తన కథల ద్వారా బద్దలు కొడుతూనే వచ్చారు' అని వ్యాఖ్యానించారు. ఈ ప్రతిష్ఠాత్మక అవార్డును గతంలో అందుకున్న వారిలో వి.ఎస్.నైపాల్, మహాశ్వేతా దేవి, రస్కిన్ బాండ్, గిరిష్ కర్నాడ్ తదితరులు ఉన్నారు.

ఊరు కోయంబత్తూరు

కోయంబత్తూరులో జన్మించిన అంబై ఢిల్లీలోని జె.ఎన్.యు నుంచి పిహెచ్.డి పట్టా పొందారు. తమిళనాడులో అధ్యాపకురాలిగా పని చేస్తూ కథలు రాశారు. డాక్యుమెంటరీ ఫిల్మ్ మేకర్ విష్ణు మాథూర్‌ని వివాహం చేసుకుని తర్వాతి కాలంలో ముంబైలో స్థిరపడ్డారు. 18 ఏళ్ల వయసులో తొలిసారి పిల్లల కోసం 'నందిమలై చరలిలె' (నందిమల కొండల్లో) అనే డిటెక్టివ్ నవలతో ఆమె రచనా జీవితం మొదలైనా 1967లో రాసిన 'సిరగుగల్ మురియుమ్'(రెక్కలు విరిగిపోతాయి) అనే కథతో సిసలైన బాట పట్టారు. స్త్రీ స్వేచ్ఛ, సమానత్వం, స్త్రీవాద దృక్పథం గురించి తమిళంలో తొలిసారి గొంతు విప్పిన రచయిత్రి ఆమేనని విమర్శకులు అంటారు. సంప్రదాయం, ఆచారాలు మహిళల్ని ప్రత్యక్షంగా పరోక్షంగా అణచివేస్తున్నాయో ఆమె తన కథల్లో వివరించే ప్రయత్నం చేశారు. తప్పక చదవాల్సిన తమిళ కథల్లో అంబై రాసిన 'వీట్టిన్ మూలై ఒరు సమేలరై', 'అమ్మా ఒరు కొలై సెయ్‌దల్', 'కరుప్పు కుదిరై చతుక్కుమ్' కథలు ఉంటాయని రచయిత జయమోహన్ పేర్కొన్నారు. 2021లో అంబైకు సాహిత్య అకాడెమీ పురస్కారం దక్కింది.

కలం పేరు వెనుక కథ

తన కలం పేరు 'అంబై'గా మార్చుకోవడానికి వెనకున్న కథను గతంలో వెల్లడించారామె. శుక్రవారం పుట్టే ఆడపిల్లలకు 'లక్ష్మి' అనే పేరు పెడతారని, తనకూ అదే పేరు పెడితే ఆ పేరుతోనే కథలు రాయాలనిపించలేదని చెప్పారు. తమిళ సీనియర్ రచయిత దేవన్ రాసిన 'పార్వతిన్ సంగల్పం (పార్వతి సంకల్పం)' నవలలో భర్త చేత అణచివేతకు గురైన ఓ భార్య తన పేరును అంబైగా మార్చుకొని రాయడం మొదలు పెడుతుందని, అదే తనకు స్ఫూర్తినిచ్చి కలం పేరును అంబైగా మార్చుకున్నానని తెలిపారు.

సాహితీ కార్యకర్త

సి.ఎస్.లక్ష్మి కేవలం రాయడమే కాదు చాలా సాహితీ కార్యక్రమాలు చేస్తారు. తమిళంలో మహిళా సాహిత్యం గురించి ఆమె చేసిన పరిశోధన ముఖ్యమైనది. 1994లో చెన్నైలో స్థాపించిన రోజ ముత్తయ్య రీసెర్చ్ లైబ్రరీ ఏర్పాటు వెనుక అంబై కీలకంగా నిలిచారు. ప్రపంచంలోని అతి పెద్ద ప్రైవేటు లైబ్రరీల్లో ఇదీ ఒకటి కావడం విశేషం. ప్రస్తుతం ఇక్కడ మూడు లక్షల పుస్తకాల దాకా ఉన్నాయి. అలాగే 1988లో SPARROW (Sound and Picture Archives for Research on Women) అనే ఎన్జీవో ప్రారంభించారు. మహిళా రచయితలు, మహిళా కళాకారుల రచనలు, ప్రతిభ, వారి కృషిని డాక్యుమెంట్ చేయడం, నిక్షిప్తం చేయడం ఆ సంస్థ లక్ష్యం. ప్రస్తుతం ఆమె ఆ సంస్థకు అధ్యక్షురాలిగా ఉన్నారు. తన సంస్థ తరఫున అనేక పుస్తకాలు ప్రచురించారు.




ఫ్యాషన్

క్లాస్ గా ఉండాలి.. కలర్ ఫుల్ గా కనిపించాలి.
కంఫర్ట్‌వేర్‌గా కరెక్ట్ అనిపించాలి .. వెస్టర్న్‌లుక్ ఉండాలి.. ఇండియన్ స్టైల్ లో మెరవాలి
వీటన్నిటికి ఒకే ఒక ఆన్సర్... సింగిల్ షోల్డర్ టాప్స్.
సంప్రదాయపు వేడుకలకు వెస్టర్న్ పార్టీలకు నప్పే ఈ డ్రెస్సింగ్‌కి
కేప్ స్టైల్‌గానూ పేరుంది.
లెహంగా, పలాజో, టులిప్ ప్యాంట్స్‌కి నప్పే ఈ సింగిల్ షోల్డర్ కుర్తీలు
సరైన ఎంపికగా నిలుస్తున్నాయి.

సింగిల్ షోల్డర్.. డబుల్ బ్యూటీ

ఎంబ్రాయిడరీ

సంప్రదాయ వేడుకలకు ఎంబ్రాయిడరీ చేసిన కేప్ లేదా సింగిల్ షోల్డర్ కుర్తీలను ఎంచుకోవచ్చు.

ప్లెయిన్ లేదా ఫ్లోరల్

గెట్ టు గెదర్, బర్త్ డే పార్టీలకు ప్లెయిన్.

ఫ్లోరల్ సెట్స్ బాగా సూటవుతాయి.

ఈ డ్రెస్సింగ్ లోనే ప్రత్యేకత ఉంటుంది కాబట్టి, ఇతర అభరణ హంగులేవీ అక్కర్లేదు.

వంటిల్లు

ఒమేగా 3 ఫ్యాటీ యాసిడ్లు,
క్యాల్షియం పుష్కలంగా ఉండే రొయ్యలు ...
రుచిగా ఉండి తినేకొద్దీ తినాలనిపిస్తుంటాయి.
రొయ్యలను మరింత రుచిగా, కరకరలాడేలా,
కమ్మగా ఇలా వండుకోవచ్చని చెబుతోంది
ఈ వారం మన ప్రాన్స్‌పాట్...

కరకరగా.. కమ్మగా



గార్లిక్ బటర్ ప్రాన్స్



కావలసినవి: పచ్చిరొయ్యలు – అరకేజీ; వెల్లుల్లి రెబ్బలు – ఐదు; వెన్న – రెండు టేబుల్ స్పూన్లు; నూనె – టేబుల్ స్పూను; కారం – టీస్పూను; మిరియాల పొడి – అర టీస్పూను; నిమ్మరసం – టేబుల్ స్పూను; కొత్తిమీర తరుగు – పావు కప్పు; ఉప్పు – రుచికి సరిపడా.

తయారీ: ● రొయ్యలను శుభ్రం చేసి, నాలుగైదు సార్లు కడగాలి ● మందపాటి బాణలిలో టేబుల్ స్పూను వెన్న, నూనె వేసి మంటమీద పెట్టాలి ● వెన్న కరిగిన వెంటనే కడిగిన రొయ్యలు వేసి రెండు నిమిషాలు వేయించాలి ● తరువాత రుచికి సరిపడా ఉప్పు, మిరియాల పొడి వేసి కలపాలి ● ఐదు నిమిషాలు మగ్గిన తరువాత వెల్లుల్లి రెబ్బలను సన్నగా తరిగి వేయాలి ● రెండు నిమిషాలు తరువాత మిగిలిన వెన్న, కారం నిమ్మరసం వేసి అన్ని కలిసేలా కలపాలి ● వెన్న పైకి తేలేంత వరకు వేయించాలి ● వెన్న పైకి తేలిన తరువాత సన్నగా తరిగిన కొత్తిమీర చల్లి దించేయాలి.

రొయ్యల పచ్చడి



కావలసినవి: ఎండు రొయ్యలు – కప్పు; ఉల్లిపాయ – ఒకటి; పచ్చిమిర్చి – ఐదు; నూనె – టేబుల్ స్పూను; కొత్తిమీర – పావు కప్పు; జీలకర్ర – టేబుల్ స్పూను; వెల్లుల్లి రెబ్బలు – పది; ధనియాల పొడి – టేబుల్ స్పూను; కారం – టేబుల్ స్పూను; గరం మసాలా పొడి – అర టేబుల్ స్పూను.

తయారీ: ● రొయ్యల తల, తోక తీసేసి పది నిమిషాలు నానబెట్టుకోవాలి ● నానిన రొయ్యలను ఇసుక లేకుండా శుభ్రంగా కడిగి నీరు లేకుండా పిండాలి ● ఉల్లిపాయను పెద్ద ముక్కలుగా తరిగి బాణలిలో వేయాలి ● పచ్చిమిర్చిని కూడా దోరగా వేయించి తీసేయాలి ● ఇదే బాణలిలో నూనె వేయాలి. కాగిన నూనెలో పిండిపెట్టుకున్న రొయ్యలను వేసి నూనె పైకి తేలేంత వరకు వేయించాలి ● ఇప్పుడు మిక్సీజార్‌లో వేయించిన ఉల్లి, పచ్చిమిర్చి, కొత్తిమీర, వేయించిన రొయ్యలు, ధనియాల పొడి, కారం, గరం మసాలా, వెల్లుల్లి రెబ్బలు, రుచికి సరిపడా ఉప్పు వేసి కచ్చాపచ్చాగా గ్రైండ్ చేసుకుంటే రొయ్యల పచ్చడి రెడీ. వేడివేడి అన్నంలోకి ఈ పచ్చడి చాలా రుచిగా ఉంటుంది.

● టెక్.. టాక్



యాపిల్ ఐఫోన్ 15 ప్లస్

డిస్‌ప్లే: 6.70 అంగుళాలు
ఓఎస్/సాఫ్ట్‌వేర్: ఐఓఎస్ 17
రిజల్యూషన్: 1290X2796 పిక్సెల్స్
బ్యాటరీ: 4383 ఎంఏహెచ్
మెమోరీ: 128జీబి 6జీబి ర్యామ్/ 256జీబి 6జీబి ర్యామ్/ 512జీబి 6జీబి ర్యామ్

పిక్సెల్ వాచ్ 2



గూగుల్ వారి పిక్సెల్ వాచ్ 2 – కొన్ని వివరాలు...
- 100 శాతం అల్యూమినియం బాడీ
- సైజ్: 1.2 అంగుళాలు
- సేఫ్టీ చెక్ ఫీచర్
- బ్యాటరీ: 306 ఎంఏహెచ్
- హార్ట్ రేట్ సెన్సర్
- కలర్స్: సిల్వర్, మ్యాటీ బ్లాక్, గోల్డ్



వివో వై 17

సైజ్: 6.5 అంగుళాలు
● 50 ఎంపీ మెయిన్ కెమెరా
ర్యామ్: 4జీ
రిఫ్రెష్ రేట్: 60 హెచ్‌జడ్
బ్యాటరీ: 5000 ఎంఏహెచ్


వాట్సాప్‌లో చానల్స్ హైడ్ చేయడానికి...



వాట్సాప్ కొత్తగా తీసుకువచ్చిన చానల్స్ ఫీచర్ కొందరికి నచ్చింది. కొందరికి నచ్చలేదు. నచ్చని జాబితాలో మీరు ఉంటే ఆ ఫీచర్‌ని హైడ్ చేయడానికి (ఆన్‌ఆండ్రాయిడ్): వాట్సాప్ అప్‌డేట్ చేయకపోతే చానల్స్ ఫీచర్ లేకుండానే పాత వెర్షన్‌ను వాడుకోవచ్చు. ఒకవేళ అప్‌డేట్ అయితే.. ● చాట్స్‌ను బ్యాకప్ చేయాలి.
- అన్ ఇన్‌స్టాల్–న్యూ వెర్షన్.
- ఇన్‌స్టాల్ ఓల్డ్ వెర్షన్

బింగ్ ఇమేజ్ క్రియేటర్ ఉపయోగించడానికి...

1. మైక్రోసాఫ్ట్ ఎడ్జ్‌లో 'బింగ్ ఇమేజ్ క్రియేటర్' అందుబాటులో ఉంది. దీన్ని ఉపయోగించడానికి సైడ్‌బార్‌లో ఉన్న 'బింగ్ ఇమేజ్ క్రియేటర్' ఐకాన్‌ను క్లిక్ చేయాలి.
2. బ్రౌజర్ ఓపెన్ చేసి వెబ్‌సైట్‌లోకి వెళ్లాలి: బింగ్.కామ్ /ఇమేజెస్/క్రియేట్
3. వెబ్‌పేజీలో 'జాయిన్ అండ్ క్రియేట్' బటన్ క్లిక్ చేయాలి.
4. మైక్రోసాఫ్ట్ ఎకౌంట్ అవసరం. ఒకవేళ లేకపోతే కొత్త ఎకౌంట్ క్రియేట్ చేసుకోవాలి.
5. 'సైన్ ఇన్' అయిన తరువాత మీకు నచ్చిన ప్రాంప్ట్‌ను సెలెక్ట్ చేసుకోవచ్చు. లేదా సజెస్టెడ్ ప్రాంప్ట్ కోసం 'సర్‌ప్రైజ్‌మీ బటన్' క్లిక్ చేయాలి.
6. ప్రాంప్ట్‌లోకి ఎంటర్ అయిన తరువాత ఇమేజ్ జెనరేషన్ ప్రాసెస్ కోసం 'క్రియేట్ బటన్' నొక్కాలి. ఇమేజ్ జెనరేషన్‌కు ప్రతి ప్రాంప్ట్‌కు 10–20 సెకన్ల సమయం తీసుకుంటుంది.
7. ఇమేజ్ జనరేట్ అయిన తరువాత అవసరాన్ని బట్టి సేవ్, కాపీ పేస్ట్ చేసుకోవచ్చు.



● సక్సెస్ స్టోరీ

సాహోరే... టాప్ స్పీడ్ స్టార్స్



● నారాయణ్ సుబ్రమణ్యం, నీరజ్ రాజ్‌మోహన్

'ఇమాజినేషన్ ఈజ్ మోర్ ఇంపార్టెంట్ దేన్ నాలెడ్జ్' అంటూ ప్రఖ్యాత శాస్త్రవేత్త ఆల్బర్ట్ ఐన్‌స్టీన్ 'ఊహాశక్తి'కి ఉండే అపారమైన శక్తి ఏమిటో చెప్పకనే చెప్పారు. ఈ ఇద్దరు మిత్రులకు ఊహాశక్తితో పాటు సాంకేతిక నైపుణ్యశక్తి కూడా ఉంది. ఈ రెండు శక్తులను సమన్వయం చేసుకుంటూ కాలేజీ రోజుల నుంచి చిన్న చిన్న ఆవిష్కరణలు చేస్తున్నారు. ఆ ప్యాషన్ వారిని ఎంటర్‌ప్రెన్యూర్‌లుగా మార్చి బైక్ మార్కెట్‌లోకి అడుగు పెట్టేలా చేసింది. ఈవీ స్టార్టప్ 'అల్ట్రావయోలెట్'తో స్పీడ్‌గా దూసుకుపోతున్నారు...

2006లో...

బెంగళూరులోని బీఎంఎస్ కాలేజీ ఆఫ్ ఇంజనీరింగ్ స్టూడెంట్స్ నారాయణ్ సుబ్రమణ్యం, నీరజ్ రాజ్‌మోహన్‌లు ఐఐటీ, మద్రాస్ నిర్వహించిన పోటీలో ఎయిర్–ప్రొపెల్డ్ వాటర్ క్రాఫ్ట్ రూపొందించి 'బెస్ట్ డిజైన్' అవార్డ్ గెలుచుకున్నారు. ఈ పోటీలో దేశవ్యాప్తంగా ఎన్నో ఐఐటీ టీమ్‌లు పాల్గొన్నాయి.

కట్ చేస్తే... ఈ ఇద్దరు ఎలక్ట్రిక్ సూపర్ బైక్ స్టార్టప్ 'అల్ట్రావయోలెట్'తో అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చుకున్నారు. నారాయణ్, నీరజ్‌లకు స్కూలు రోజుల నుంచి ఎలక్ట్రానిక్స్, రోబోట్స్ అంటే ఇష్టం. కాలేజీలో చేరే నాటికి ఆ ఇష్టం మరోస్థాయికి చేరింది. అన్నిరకాల ఎయిర్ క్రాఫ్టలు, రోబోట్స్,హైడ్రోప్లెయిన్స్, ఎలక్ట్రిక్ సబ్‌మెరైన్‌లు తయారుచేసేవారు. దేశవ్యాప్తంగా ఎన్నో పోటీల్లో పాల్గొనేవారు.

సూపర్‌బైక్ తయారు చేయాలనేది వారి కల.

కాలేజీ చదువు పూర్తయిన తరువాత ఇద్దరి దారులు వేరయ్యాయి. పై చదువుల కోసం నీరజ్ కాలిఫోర్నియా, నారాయణ్ స్వీడన్ వెళ్లారు. ఆ తరువాత టాప్ ఆటోమోటివ్ కంపెనీలలో పనిచేశారు. అయితే ఇద్దరిలోనూ ఏదో అసంతృప్తి ఉండేది. వారు అనేకసార్లు మాట్లాడుకున్న తరువాత 'ఏదైనా సాధించాలి' అనే నిర్ణయానికి వచ్చారు.

అలా బెంగళూరు కేంద్రంగా ఈవీ స్టార్టప్ 'అల్ట్రావయోలెట్'కు శ్రీకారం చుట్టారు. ఆటోమోటివ్, కన్స్యూమర్ టెక్, ఏరో స్పేస్ నిపుణులతో గట్టి బృందాన్ని తయారుచేసుకున్నారు.

ఈ మిత్రద్వయం మోటర్‌ఫీల్డ్‌కు కొత్త కాబట్టి వారి టీమ్‌లో చేరడానికి తటపటాయించేవారు. అయితే కాస్త ఆలస్యంగానైనా ప్రతిభావంతులతో కూడిన బృందాన్ని ఏర్పాటు చేసుకోగలిగారు.

అందరిలాగే తమ స్టార్టప్‌కు కరోన కష్టాలు మొదలయ్యాయి. తమ ఫస్ట్ ఆల్–ఎలక్ట్రిక్ పెర్‌ఫార్‌మెన్స్ బైక్ ఎఫ్ 77 మోడల్ తయారీని నిలిపివేయాల్సి వచ్చింది. పరిస్థితి మెరుగుపడుతుందనుకుంటున్న సమయంలో 'ఎఫ్77'ను రీవ్యాంప్ చేశారు.

'భిన్నమైన సంస్కృతులు, అభిరుచులు ఉన్న మనలాంటి దేశంలో ఈవీలతో మెప్పించడం అనేది పెద్ద సవాలు. ఈ టెక్నాలజీ గురించి చాలామంది అపోహలతో ఉన్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకొని వారి మైండ్‌సెట్‌ను మార్చాలనుకున్నాం. ఈవీలో మాకు సాధ్యమైన కొత్త ఫీచర్‌లు తీసుకువచ్చాం. మా అల్ట్రావయోలెట్‌కు ఏవియేషన్, ఏరోస్పేస్ సెక్టార్‌లు స్ఫూర్తి. మాకు కొత్త ఆవిష్కరణలు అంటే ఆసక్తి' అంటున్నాడు 'అల్ట్రావయోలెట్' కో–ఫౌండర్, సీఇవో నారాయణ్.

ఇక ఇద్దరి అభిరుచుల విషయానికి వస్తే...నీరజ్ పుస్తకాల పురుగు. పుస్తకాలు ఎక్కువగా చదవడం ద్వారా తనకు కొత్త ఐడియాలు వస్తాయి అంటాడు. ఇక నారాయణ్‌కు 'క్రియేటివిటీ అండ్ ఫిట్‌నెస్' ఇష్టమైన సబ్జెక్ట్. అయితే టెక్నికల్ స్కిల్స్ విషయంలో మాత్రం ఇద్దరికీ సమ ప్రతిభ ఉంది. నారాయణ్ ఆటోమోటివ్ ఇంజనీరింగ్ అండ్ డిజైన్‌లో, రాజ్‌మోహన్ కంప్యూటర్ సైన్స్, ఎలక్ట్రానిక్స్ నాలెడ్జ్‌లో ఎక్స్‌పర్ట్.

'మేము అద్భుతాన్ని సృష్టించాలనుకున్నాం. అనుకోవడానికైతే ఎన్నైనా అనుకోవచ్చు. ఆచరణలో మాత్రం రకరకాల సవాళ్లు ఎదురొస్తుంటాయి. వాటిని తట్టుకొని నిలబడడమే అసలు సిసలు సవాలు. అలాంటి సవాలును అధిగమించి మా కలను నిజం చేసుకున్నందుకు సంతోషంగా ఉంది' అంటున్నాడు 'అల్ట్రావయోలెట్' ఫౌండర్‌లలో ఒకరైన నీరజ్.

యువర్స్

జీరో ఇన్ ఆన్

ఒక విషయం లేదా వ్యక్తిపై పూర్తిగా దృష్టి పెట్టడం.
ఉదా: మస్ట్ డిసైడ్ ఆన్ అవర్ టార్గెట్ మార్కెట్ అండ్ జీరో ఇన్ ఆన్ ఇట్


వెర్బల్ డయేరియా

నాన్ స్టాప్‌గా మాట్లాడే వారిని దృష్టిలో పెట్టుకొని ఉపయోగించే మాట...వెర్బల్ డయేరియా.

● ఇంగ్లిష్ ఇడియమ్స్



● అవును... ఇది నిజమే!



- రాజకీయాల్లోకి రాక ముందు అబ్రహం లింకన్ ఛాంపియన్ రెజ్లర్.
- టైటానిక్ షిప్ మునిగిపోవడానికి కొన్ని సంవత్సరాల ముందు ప్రముఖ రచయిత మోర్గాన్ రాబర్ట్‌సన్ 'ఫ్యుటిలిటి' అనే నవల రాశాడు. టైటానిక్ దుర్ఘటనకు, ఈ నవలలోని కొన్ని అంశాలకు పోలిక కనబడుతుంది. టైటానిక్ లాగే ఈ నవలలోని నౌక మంచుకొండను ఢీ కొట్టి ఉత్తర అట్లాంటిక్ మహా సముద్రంలో మునిగిపోతుంది. ఈ నవలలో కూడా ప్రయాణికులందరికీ తగినన్ని లైఫ్ బోట్లు ఉండవు. రెండు నౌకల కొలతలు కూడా దగ్గరగా ఉంటాయి.

చిత్రతేజం

● ఆర్ట్ అండ్ కల్చర్



'సృజనకారులకు పరిశీలనకు మించిన బలం లేదు' అంటుంది కోల్‌కత్తాకు చెందిన యంగ్ ఆర్టిస్ట్ శ్రేయా రాయ్. తాము పరిశీలించిన వాటిని కొందరు కవిత్వంలోకి తీసుకెళతారు. శ్రేయ మాత్రం చిత్రాల్లోకి తీసుకువచ్చింది. తనదైన శైలితో వాటికి కొత్త రూపం ఇస్తుంది. ఆమె జ్ఞాపకాలకు, పరిశీలనలకు డిజిటల్ కాన్వాస్‌ను వేదికగా చేసుకుంది.




శ్రేయ చిత్రాలు గ్రాఫిక్ నవలలోని క్యారెక్టర్‌లను గుర్తు తెస్తాయి. పాజిటివ్ ఎమోషన్స్ ఆమె చిత్రాలకు బలాన్ని ఇస్తాయి, నిత్యజీవిత దృశ్యాలను గుర్తు తెస్తాయి.

'స్త్రీలకు సంబంధించి నిత్యజీవిత దృశ్యాలు నా చిత్రాల్లో ఎక్కువగా కనిపిస్తాయి. ఆరు బయట కూర్చొని స్త్రీలు మాట్లాడుకునే దృశ్యాలలో కూడా ఎంతో అందం ఉంది. కాల్పనికతకు కాకుండా వాస్తవికతకే ప్రాముఖ్యత ఇస్తాను' అంటున్న రాయ్ ఆర్కిటెక్ట్ కూడా. అయితే ఆమెకు చిత్రలేఖనం అంటేనే బాగా ఇష్టం.

'ఆర్కిటెక్చర్‌లో రకరకాల కొలతలతో పని. చిత్ర ప్రపంచంలో ఆలోచనలతోనే పని' అంటోంది రాయ్.





'జల ప్రాజెక్టులపై జనం ఎన్నెన్నో ఆశలు పెట్టుకున్నారు. వాళ్ల నమ్మకం వమ్ము కాకుండా పనిచేయాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 196

శుక్రవారం 6-10-2023

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL

సాక్షి బిజినెస్
శుక్రవారం
6-10-2023

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
405	110
65,632	19,546

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలిరెండు రాత్రి 11.30 ముగింపు)

సూచీ	విలువ		మార్పు
నాస్‌డాక్	13,160	▽	76
డోజోన్స్	33,044	▽	125
ఎఫ్‌టీఎస్ఈ 100	7,452	▲	39
డాక్స్	15,070	▽	30
షాంఘై (గత గురువారం ముగింపు)	3,110	▲	3
నికాయ్	31,075	▲	548

• అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

బులియన్ రూ.లలో

ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	56,555	▽	98
బంగారం (99.5 స్వచ్ఛత)	56,329	▽	97
వెండి (కేజీ)	67,204	▽	242

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	[illegible]	82.47	84.14
£	బ్రిటన్ పౌండ్	[illegible]	98.87	102.21
€	యూరో	[illegible]	85.63	88.70
¥	జపాన్ ఎన్ (100)	[illegible]	54.95	56.65
AUS	ఆస్ట్రేలియా డాలర్	[illegible]	51.46	53.74
S$	సింగపూర్ డాలర్	[illegible]	59.65	61.57
SAR	సౌదీ రియాల్	[illegible]	21.29	22.82
UAE D	యూఏఈ దిర్హామ్	[illegible]	21.69	23.50
¥	చైనా యువాన్	[illegible]	10.25	12.29

ఎస్‌బీఐ చీఫ్ దినేష్ ఖారా పదవీకాలం పొడిగింపు!



న్యూఢిల్లీ: భారత్ బ్యాంకింగ్ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) చైర్మన్ దినేష్ ఖారా పదవీకాలాన్ని వచ్చే ఏడాది ఆగస్టు వరకు పొడిగించేందుకు ప్రభుత్వం గురువారం ఆమోదం తెలిపినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. 2023 అక్టోబర్ 6తో (శుక్రవారం) ఆయన మూడేళ్ల పదవీకాలం ముగియనున్న నేపథ్యంలో ఈ ఆమోదం లభించింది. నియామకపు వ్యవహారాల కేబినెట్ కమిటీ (ఏసీసీ) ఆదేశాల ప్రకారం ఎస్‌బీఐ చైర్మన్ తన 63 సంవత్సరాల వయస్సు వరకూ పదవిలో ఉండవచ్చని అత్యున్నత వర్గాలు తెలిపాయి. వచ్చే ఏడాది ఆగస్టులో ఖారాకు 63 ఏళ్లు నిండుతాయి. కాగా, 2024 జనవరి 27 తర్వాత రెండు సంవత్సరాల పాటు మేనేజింగ్ డైరెక్టర్‌గా అశ్విని కుమార్ తివారీ పదవీకాలాన్ని పొడిగించడానికి కూడా ఏసీసీ ఆమోదముద్ర వేసినట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి.

భారత్‌లో నోకియా 6జీ ల్యాబ్

ప్రారంభించిన కేంద్ర మంత్రి వైష్ణవ్



న్యూఢిల్లీ: టెలికం పరికరాల తయారీ సంస్థ నోకియా భారత్‌లో తమ 6జీ ల్యాబ్‌ను నెలకొల్పింది. కేంద్ర టెలికం మంత్రి అశ్విని వైష్ణవ్ దీన్ని వర్చువల్‌గా ప్రారంభించారు. భారత్‌ను నూతన ఆవిష్కరణల హబ్‌గా తీర్చిదిద్దాలన్న ప్రధాని నరేంద్ర మోదీ ఆకాంక్షల సాధన దిశగా ఇది మరో ముందడుగని ఆయన తెలిపారు. సురక్షితమైన రవాణా, ఆరోగ్య సంరక్షణ, విద్య తదితర విభాగాలకు ఉపయోగపడగలిగే 6జీ టెక్నాలజీ ఆధారిత నవకల్పనలపై ఈ ల్యాబ్ పనిచేయనున్నట్లు మంత్రి వివరించారు. బెంగళూరులోని తమ గ్లోబల్ రీసెర్చ్, డెవలప్‌మెంట్ సెంటర్‌లో నోకియా దీన్ని ఏర్పాటు చేసింది. భారత్ ఇప్పటికే 6జీ టెక్నాలజీలో 200 పైచిలుకు పేటెంట్లు దక్కించుకుంది.

సైబర్ బీమాకు డిమాండ్

- భారత్‌లో 60 మిలియన్ డాలర్ల మార్కెట్
- భవిష్యత్తులో ఏటా 27 శాతం వృద్ధి
- డెలాయిట్ నివేదికలో వెల్లడి



న్యూఢిల్లీ: దేశీయంగా సైబర్ బీమాకు గణనీయంగా డిమాండ్ పెరుగుతోంది. రాబోయే రోజుల్లో సైబర్ ఇన్సూరెన్స్ మార్కెట్ ఏటా 27–30% వృద్ధి చెందనుంది. కన్సల్టెన్సీ సంస్థ డెలాయిట్ రూపొందించిన నివేదికలో ఈ అంశాలు వెల్లడయ్యాయి. దీని ప్రకారం ప్రస్తుతం భారత్‌లో సైబర్ బీమా మార్కెట్ పరిమాణం 50–60 మిలియన్ డాలర్ల (దాదాపు రూ.500 కోట్లు) స్థాయిలో ఉంది. గత మూడేళ్లుగా 27–30% మేర చక్రగతిన వృద్ధి చెందుతోంది. 'సైబర్ ఇన్సూరెన్స్ అవసరంపై అవగాహన పెరుగుతున్న నేపథ్యంలో వచ్చే 3–5 ఏళ్లలో ఇదే స్థాయి వృద్ధి కొనసాగే అవకాశం ఉంది' అని నివేదికలో పేర్కొంది. ఐటీ, ఫార్మా, తయారీ రంగాలతో పాటు సరఫరా వ్యవస్థ, రిటైల్, ఫైనాన్స్ వంటి డిజిటైజేషన్ అధికంగా ఉండే విభాగాలు సైబర్ క్రిమినల్స్‌కు లక్ష్యాలుగా ఉంటున్నట్లు తెలిపింది. కాబట్టి, మిగతా రంగాలతో పోలిస్తే సైబర్ బీమాను తీసుకోవడంలో ఈ విభాగాలు ముందుంటాయని పేర్కొంది. పలువురు చీఫ్ ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీ ఆఫీసర్ల (సీఐఎస్‌వో)తో నిర్వహించిన సర్వే ఆధారంగా డెలాయిట్ ఈ నివేదికను రూపొందించింది. ప్రస్తుతం మార్కెట్లో ఒడిదుడుకులు, అనిశ్చితి నెలకొన్నప్పటికీ వచ్చే దశాబ్ద కాలంలో సైబర్ బీమా గణనీయంగా వృద్ధి చెందే అవకాశాలు ఉన్నాయని డెలాయిట్ ఇండియా పార్ట్‌నర్ (రిస్క్ అడ్వైజరీ) ఆనంద్ వెంకట్రామన్ తెలిపారు. విక్రేతలు, కొనుగోలుదారుల అవసరాల మేరకు పాలసీలను రూపొందించాల్సిన అవసరం ఉందన్నారు.

నివేదికలోని మరిన్ని అంశాలు..

- రాబోయే మూడేళ్లలో డిజిటల్ మౌలిక సదుపాయాలకు రక్షణ కల్పించుకునేందుకు సర్వేలో పాల్గొన్న సీఐఎస్‌వోల్లో 70% మంది మరింత ఎక్కువ వ్యయం చేయడానికి మొగ్గు చూపారు.
- గణనీయంగా వినియోగదారుల డేటాబేస్‌లు ఉన్న కొన్ని పెద్ద కంపెనీలు తమ డిజిటల్ ఇన్‌ఫ్రా బడ్జెట్‌లను పెంచుకునే విషయంలో ఆచితూచి వ్యవహరిస్తున్నాయి. డిజిటల్ మౌలిక సదుపాయాల భద్రతను మెరుగుపర్చుకునేందుకు మరింత ఇన్వెస్ట్ చేయడానికి బదులు బీమా కవరేజీని పెంచుకోవడంపై ఆసక్తిగా ఉన్నట్లు 60 శాతం సంస్థలు పేర్కొన్నాయి.
- దేశీయంగా సైబర్ ఇన్సూరెన్స్ మార్కెట్ వృద్ధి గతి ప్రధానంగా మూడు అంశాలపై ఆధారపడి ఉండనుంది. కంపెనీలు డిజిటల్ పరిపక్వతను సాధించే వేగం, డిజిటైజేషన్ .. కఠినతరమైన సైబర్ చట్టాల అమలుకు ప్రభుత్వం తీసుకునే చర్యలు, సంప్రదాయేతర సంస్థలైన టెక్నాలజీ కంపెనీల్లాంటివి కూడా సైబర్ ఇన్సూరెన్స్ మార్కెట్లోకి ప్రవేశించడం వీటిలో ఉండనున్నాయి.
- సైబర్ బీమాను ఒక వ్యయంగా కాకుండా పెట్టుబడిగా చూసే ధోరణి పెరగాలి. డిజిటైజేషన్ వేగవంతమవుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో తగు స్థాయిలో సైబర్ ఇన్సూరెన్స్ కవరేజీని తీసుకోవడం తప్పనిసరి అనేది కంపెనీలు గుర్తించాలి.
- సమగ్ర రిస్కుల నిర్వహణలో సైబర్ రిస్కులు ప్రధానమైనవని గుర్తించి బోర్డులు, సీఈవోలు సైబర్‌సెక్యూరిటీ విషయంలో తమ పరిజ్ఞానాన్ని పెంచుకోవాల్సిన అవసరం ఉంది.
- బీమా పాలసీలను సరళతరం చేయడంతో పాటు వివిధ కవరేజీల గురించి కొనుగోలుదార్లలో అవగాహన పెంచేందుకు బీమా కంపెనీలు కృషి చేయాలి.
- పౌరుల గోప్యతకు భంగం వాటిల్లకుండా పటిష్టమైన డేటా రక్షణ వ్యవస్థను నిర్వహించడంలో ప్రభుత్వం కీలకపాత్ర పోషించాలి.

కొత్త విక్రేతలకు అమెజాన్ ప్రోత్సాహకాలు



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: పండుగ సీజన్ నేపథ్యంలో కొత్తగా తమ ప్లాట్‌ఫాంలో చేరే విక్రేతలకు ఈ–కామర్స్ దిగ్గజం అమెజాన్ ఇండియా ప్రత్యేక ప్రోత్సాహకాలు అందిస్తోంది. వారికి రిఫరల్ ఫీజులో 50 శాతం రాయితీనిస్తున్నట్లు గురువారమిక్కడ విలేకరుల సమావేశంలో కంపెనీ డైరెక్టర్ అమిత్ నందా తెలిపారు. ఆగస్టు 27న ప్రారంభమైన ఈ ఆఫర్ నవంబర్ 4 వరకు ఉంటుందని తెలిపారు. విక్రేతలు చేరినప్పటి నుంచి 60 రోజుల పాటు ఇది వర్తిస్తుందని పేర్కొన్నారు. అలాగే ''గ్రేట్ ఇండియన్ రిఫరల్ ఆఫర్'' ప్రోగ్రాం కింద అమెజాన్ ప్లాట్‌ఫాంపై విక్రయించేందుకు తమ స్నేహితులను రిఫర్ చేసే విక్రేతలకు రూ. 11,500 విలువ చేసే ప్రయోజనాలు కల్పించనున్నట్లు నందా చెప్పారు. అక్టోబర్ 27 వరకు ఈ ఆఫర్ ఉంటుంది. ప్రస్తుతం అమెజాన్‌లో దేశవ్యాప్తంగా 14 లక్షల మంది సెల్లర్లు ఉండగా, తెలంగాణలో ఈ సంఖ్య 50,000గా ఉన్నట్లు నందా చెప్పారు. గతేడాది ఈ సీజన్‌లో దేశవ్యాప్తంగా 650 మంది పైచిలుకు విక్రేతలు అమెజాన్‌లో రూ. కోటికి పైగా విలువ చేసే అమ్మకాలు నమోదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

అన్‌క్లెయిమ్డ్ డిపాజిట్లు తెలుసుకోవడం సులభం

ఉద్గమ్ పోర్టల్‌పైకి 30 బ్యాంక్‌లు



ముంబై: బ్యాంకుల్లో డిపాజిట్లు చేసి, గడువు ముగిసినప్పటికీ, వెనక్కి తీసుకోని వాటి (అన్ క్లెయిమ్డ్ డిపాజిట్లు) వివరాలను తెలుసుకునే ఉద్గమ్(యూడీజీఏఎం) పోర్టల్‌పైకి 30 బ్యాంక్‌లు చేరాయి. ఈ వివరాలను ఆర్‌బీఐ గురువారం ప్రకటించింది. ఈ పోర్టల్ సాయంతో తమ, తమవారి అన్‌క్లెయిమ్డ్ డిపాజిట్ల వివరాలను ఏ బ్యాంకుల్లో ఉన్నదీ తెలుసుకోవచ్చు. ఆగస్టు 17 నుంచి ఈ పోర్టల్‌ను ఆర్‌బీఐ అందుబాటులోకి తీసుకొచ్చింది. ఆరంభంలో ఏడు బ్యాంక్‌లకు సంబంధించిన వివరాలే ఈ పోర్టల్‌పై అందుబాటులో ఉన్నాయి. సెప్టెంబర్ 28 నాటికి 30 బ్యాంక్‌లకు సంబంధించిన డిపాజిట్ల వివరాలు తెలుసుకునే విధంగా అప్‌గ్రేడ్ చేసినట్టు ఆర్‌బీఐ ప్రకటించింది. అన్‌క్లెయిమ్డ్ డిపాజిట్లలో 90 శాతం ఈ 30 బ్యాంక్‌ల కస్టమర్లకు చెందినవి కాగా, ప్రస్తుతం ఆ డిపాజిట్లు డిపాజిటర్ ఎడ్యుకేషన్ అండ్ అవేర్‌నెస్ ఫండ్ (డీఈఏ) రూపంలో ఉండడం గమనార్హం. అన్ని ప్రముఖ బ్యాంక్‌లు ఈ పోర్టల్‌తో అనుసంధానమయ్యాయి. 2023 ఫిబ్రవరి నాటికి ఎలాంటి క్లెయిమ్ రాని రూ.35,000 కోట్ల డిపాజిట్లు ఉన్నాయి. ఇందులో అత్యధికంగా ఎస్‌బీఐ కస్టమర్లకు చెందినవే రూ.8,086 కోట్లు ఉన్నాయి. ఆ తర్వాత పీఎన్‌బీ నుంచి రూ.5,340 కోట్లు, కెనరా బ్యాంక్ నుంచి రూ.4,558 కోట్లు, బ్యాంక్ ఆఫ్ బరోడా నుంచి రూ.3,904 కోట్ల చొప్పున ఉన్నాయి. నిబంధనల కింద గడువు తీరి పదేళ్లు అయినా క్లెయిమ్ రాని డిపాజిట్లను, బ్యాంక్‌లు డీఈఏకి బదిలీ చేయాల్సి ఉంటుంది.

రెండు రోజుల తర్వాత లాభాలు

- ప్రపంచ ఈక్విటీ మార్కెట్ల రికవరీ ప్రభావం
- సెన్సెక్స్ లాభం 405 పాయింట్లు
- 110 పాయింట్లు పెరిగిన నిఫ్టీ



ముంబై: ప్రపంచ ఈక్విటీ మార్కెట్ల రికవరీతో దేశీయ స్టాక్ మార్కెట్ రెండు రోజుల వరుస నష్టాలకు ముగింపు పడింది. క్రూడాయిల్ ధరలు భారీగా తగ్గుముఖం పట్టాయి. అమెరికా ట్రెజరీ బాండ్ల రాబడులు గణనీయంగా తగ్గాయి. భారత సేవారంగ వృద్ధి సెప్టెంబర్‌లో రికార్డు స్థాయిలో తొమ్మిదేళ్ల గరిష్టానికి చేరింది. ఈ పరిణామాలు సూచీలను లాభాలవైపు నడిపాయని ట్రేడర్లు తెలిపారు. బ్యాంకింగ్, ఫైనాన్స్, ఐటీ షేర్లు రాణించడంతో సెన్సెక్స్ 405 పాయింట్లు బలపడి 65,632 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 110 పాయింట్లు ర్యాలీ చేసి 19,546 వద్ద నిలిచింది. ఉదయం లాభాలతో మొదలైన సూచీలు కొంత అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. అయితే సానుకూల జాతీయ, అంతర్జాతీయ సంకేతాలతో సూచీలు పుంజుకోగలిగాయి. ఈ క్రమంలో సెన్సెక్స్ 527 పాయింట్లు పెరిగి 65,753 వద్ద, నిఫ్టీ 141 పాయింట్లు బలపడి 19,577 వద్ద ఇంట్రాడే గరిష్టాలను నమోదు చేశాయి. క్యాపిటల్ గూడ్స్, సర్వీసెస్, పారిశ్రామిక, కన్జూమర్, టెక్, ఆటో రంగాల్లోని చిన్న తరహా షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించింది. మరోవైపు మెటల్, ఫార్మా, ప్రభుత్వరంగ బ్యాంకుల రంగాలకు చెందిన మధ్య తరహా షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. అమెరికా ట్రెజరీ బాండ్లపై రాబడులు తాజాగా 16 ఏళ్ల గరిష్టం నుంచి దిగిరావడంతో పాటు, క్రూడాయిల్ ధరల అనూహ్య పతనంతో ప్రపంచ ఈక్విటీ మార్కెట్లు సానుకూలంగా ట్రేడవుతున్నాయి.

మార్కెట్లో సంగతులు

- భారీగా ఆర్డర్లు దక్కించుకోవడంతో ఎల్అండ్‌టీ షేరు 2% లాభపడి రూ. 3,097 వద్ద స్థిరపడింది.
- గేమింగ్ మార్కెటింగ్ ఏజెన్సీ 'పబ్లిష్‌మీ'ని 2 మిలియన్ డాలర్లకు చేజిక్కించుకోవడంతో నజారా టెక్నాలజీస్ 6% ఎగసి రూ.870 వద్ద ముగిసింది.
- రెండో క్వార్టర్‌లో రికార్డు స్థాయి విక్రయాలు జరిగినట్లు కంపెనీ తెలపడంతో రియల్టీ సంస్థ శోభ ఏడుశాతం ఎగసి రూ.709 వద్ద స్థిరపడింది.
- ఎఫ్ఎంసీజీ దిగ్గజం మారికో షేరు 5% పతనమైన రూ.543 వద్ద నిలిచింది. గ్రామీణ స్థాయిలో రికవరీ బలహీనంగా ఉండటంతో రెండో త్రైమాసిక ఆదాయం తగ్గినట్లు కంపెనీ తెలపడం షేరు పతనానికి కారణమైంది.

సినిమా



'గేమ్ ఛేంజర్'లో రామ్‌చరణ్

'పుష్ప–2'లో అల్లు అర్జున్

'సలార్'లో ప్రభాస్

'దేవర'లో ఎన్టీఆర్

ప్రతి చిత్రానికి ఓ కథ ఉంటుంది. ఆ కథలో ఇంకో కథ కూడా ఉండొచ్చు. అదే ఫ్లాష్‌బ్యాక్. కొన్ని చిత్రాలకు ఈ ఫ్లాష్‌బ్యాక్ ప్రధానాంశంగా ఉంటుంది. అలా 'కట్ చేస్తే.. కథ వెనక్కి' అంటూ ఫ్లాష్‌బ్యాక్ ఓ ప్రధానాంశంగా ప్రస్తుతం కొన్ని చిత్రాలు రూపొందుతున్నాయి. ఆ విశేషాలు తెలుసుకుందాం.

మలి భాగంలో ఫ్లాష్‌బ్యాక్

ప్రభాస్ కెరీర్‌లో రూపొందుతున్న మరో యాక్షన్ ఫిల్మ్ 'సలార్'. రెండు భాగాలుగా రిలీజ్ కానున్న ఈ సినిమా తొలి భాగం 'సలార్: సీజ్ ఫైర్' ఈ ఏడాది డిసెంబరు 22 విడుదల కానుంది. ఈ చిత్రంలో మెకానిక్‌గా, అతని తండ్రిగా ప్రభాస్ రెండు పాత్రల్లో కనిపిస్తారట. తొలి భాగం మొత్తం కొడుకు పాత్రతో సాగుతుందని, తండ్రి పాత్ర పరిచయంతో సినిమా ముగిసి, మలి భాగంలో ఫ్లాష్‌బ్యాక్‌గా 'సలార్' కథ కొనసాగుతుందని టాక్. ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో విజయ కిరగందూర్ నిర్మిస్తున్న ఈ చిత్రంలో శ్రుతీ హాసన్ హీరోయిన్‌గా నటిస్తున్నారు.

పగ.. ప్రతీకారం

దేశంలో విస్మరణకు గురైన తీర ప్రాంతాలు, అక్కడ నివశించే ప్రజల నేపథ్యంలో రూపొందుతున్న చిత్రం 'దేవర'. ఎన్టీఆర్ హీరోగా, జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రంలో సైఫ్ అలీఖాన్ విలన్. ఇందులో తండ్రీ కొడుకులుగా ఎన్టీఆర్ ద్విపాత్రాభినయం చేస్తున్నారని, ఇంట్రవెల్ తర్వాత తండ్రి పాత్రలో ఎన్టీఆర్ గెటప్, ఆ సన్నివేశాలు ప్రేక్షకులను ఆశ్చర్యపరిచేలా ఈ చిత్రదర్శకుడు కొరటాల శివ తీస్తున్నారని టాక్. అలాగే తండ్రిగా ఎన్టీఆర్ నటించే ఫ్లాష్‌బ్యాక్ సీన్స్, యాక్షన్ సీక్వెన్స్ ఓ హైలైట్‌గా ఉంటాయట. రెండు భాగాలుగా ఈ చిత్రం విడుదల కానుంది. కల్యాణ్ రామ్, కె. హరికృష్ణ, మిక్కిలినేని సుధాకర్ నిర్మిస్తున్న 'దేవర' తొలి భాగం ఏప్రిల్ 5న రిలీజ్ కానుంది.

ఇటు ఆఫీసర్.. అటు ఆటగాడు

ఐఏఎస్ ఆఫీసర్ విధులు, రాజకీయ రంగంలో వారి ప్రాధాన్యత వంటి అంశాల నేపథ్యంలో రామ్‌చరణ్ హీరోగా నటిస్తున్న చిత్రం 'గేమ్ చేంజర్'. కియారా అద్వానీ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రాన్ని దర్శకుడు శంకర్ తెరకెక్కిస్తున్నారు. ఈ సినిమాలో తండ్రీ కొడుకులుగా రామ్‌చరణ్ కనిపిస్తారని తెలుస్తోంది. కథ ప్రకారం సినిమాలో 1920 నేపథ్యంలో సాగే కొన్ని సన్నివేశాలు ఉన్నాయట. ఈ సీన్స్‌లో ఓ రాజకీయ పార్టీ క్రియాశీల నేతగా రామ్‌చరణ్ కనిపిస్తారని, ఈ పాత్రకు జోడీగా అంజలి కనిపిస్తారని, ఇదంతా 'గేమ్ చేంజర్'లోని ఫ్లాష్‌బ్యాక్ ఎపిసోడ్‌గా ఉంటుందని ఫిల్మ్‌నగర్ భోగట్టా. ఇక ఓ ఐఏఎస్ ఆఫీసర్‌గా రాజ్యాంగం ప్రకారం తన విధులు నిర్వర్తిస్తూనే, తండ్రికి అన్యాయం చేసిన కొందరు రాజకీయ నాయకులను దెబ్బతీసేలా రామ్‌చరణ్ వేసే గేమ్ చేంజింగ్ ప్లాన్ సినిమాలో హైలైట్ అట. 'దిల్' రాజు, శిరీష్ నిర్మిస్తున్న ఈ చిత్రం వచ్చే ఆగస్టులో విడుదల కానుందనే ప్రచారం సాగుతోంది. అలాగే రామ్‌చరణ్ హీరోగా బుచ్చిబాబు సన దర్శకత్వంలో ఓ సినిమా తెరకెక్కనున్న సంగతి తెలిసిందే. ఇదొక స్పోర్ట్స్ ఫిల్మ్ అని, ఇందులో అన్నదమ్ములుగా రామ్‌చరణ్ నటిస్తారని, ఓ ఆట కోసం దివ్యాంగుడైన అన్న కలను నెరవేర్చే తమ్ముడిగా.. ఇలా రెండు పాత్రల్లో కనిపిస్తారనే టాక్ వినిపిస్తోంది. ఫిబ్రవరిలో ఈ సినిమా షూటింగ్ ఆరంభం కానుందని సమాచారం.

పుష్ప జీవితంలో ఏం జరిగింది?

ఎర్ర చందనం స్మగ్లింగ్ నేపథ్యంలో రూపొందిన కల్పిత కథ 'పుష్ప'. అల్లు అర్జున్ హీరోగా సుకుమార్ దర్శకత్వంలో రూపొందుతున్న సినిమా ఇది. ఈ సినిమాలో పుష్పరాజ్‌గా అల్లు అర్జున్ నటిస్తున్నారు. 'పుష్ప' చిత్రంలోని తొలి భాగం 'పుష్ప: ది రైజ్' ఇప్పటికే విడుదలై సూపర్‌హిట్‌గా నిలిచింది. ఇందులో ఎర్ర చందనం స్మగ్లింగ్ సిండికేట్ హెడ్‌గా పుష్పరాజ్ కనిపిస్తారు. 'పుష్ప: ది రైజ్'కు కొనసాగింపుగా 'పుష్ప: ది రూల్' రానున్న విషయం తెలిసిందే. ఇటీవలే ఈ సినిమా టీజర్ విడుదలైంది. 'పుష్ప ఏం చేసి దుడ్డు సంపాదిస్తున్నాడో సెప్తాండారు గానీ.. సంపాదించిన దుడ్డు ఏం సేస్తన్నాడో సెప్తన్నారా?', 'నా కొడుక్కి గుండె ఆపరేషన్ అంటే పుష్పనే దుడ్డు పంపించినాడక్క.. అందుకే అక్క వీడు బతికున్నాడు', 'నా పిల్ల పెళ్లికి పుష్పానే సాయం సేసినాడు..' అనే డైలాగ్స్ 'పుష్ప: ది రూల్' సినిమాలో ఉన్నాయి. అంటే.. స్మగ్లర్‌లా సంపాదించిన డబ్బుని పుష్ప ఎందుకు దానం చేస్తున్నాడు? పుష్ప ఇలా చేయడానికి అతని జీవితంలో ఎలాంటి ఘటనలు చోటుచేసుకున్నాయి? అనే సన్నివేశాలు 'పుష్ప: ది రూల్'లో ఫ్లాష్‌బ్యాక్ ఎపిసోడ్స్‌గా వస్తాయని సమాచారం. రష్మికా మందన్నా హీరోయిన్‌గా నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ నిర్మిస్తున్న ఈ చిత్రం ఆగస్టు 15న విడుదల కానుంది.

ఇలా ఫ్లాష్‌బ్యాక్ ప్రధానాంశంగా సాగే చిత్రాలు మరికొన్ని ఉన్నాయి.

సంక్రాంతికి సైంధవ్



• వెంకటేశ్

సంక్రాంతికి సై అన్నారు సైంధవ్. వెంకటేశ్ హీరోగా శైలేష్ కొలను దర్శకత్వంలో వెంకట్ బోయనపల్లి నిర్మించిన చిత్రం 'సైంధవ్'. హిందీ నటుడు నవాజుద్దీన్ సిద్ధిఖీ, తమిళ నటుడు ఆర్య, హీరోయిన్లు శ్రద్ధా శ్రీనాథ్, రుహానీ శర్మ, ఆండ్రియా జెర్మియా, బాల నటి సారా కీలక పాత్రల్లో నటించారు. కాగా 'సైంధవ్'ను సంక్రాంతి సందర్భంగా జనవరి 13న విడుదల చేయనున్నట్లు చిత్ర యూనిట్ అధికారికంగా వెల్లడించి, కొత్త పోస్టర్స్‌ను రిలీజ్ చేసింది. ''సైంధవ్ షూటింగ్ పార్ట్ పూర్తయింది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. అన్ని దక్షిణాది భాషలతో పాటు హిందీలోనూ ఈ సినిమాను విడుదల చేస్తున్నాం'' అని యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: సంతోష్ నారాయణన్, కెమెరా: ఎస్. మణికందన్, సహ–నిర్మాత: కిషోర్ తాళ్లూరు.

మేడమ్ తుస్సాడ్స్‌లో...



• అల్లు అర్జున్

దుబాయ్‌లోని మేడమ్ తుస్సాడ్స్‌లో అల్లు అర్జున్ మైనపు బొమ్మ ఏర్పాటు కానుంది. ఇందుకు సంబంధించి మేడమ్ తుస్సాడ్స్ ప్రతినిధులు అల్లు అర్జున్ కొలతలను తీసుకున్నారు. దాదాపు 200 కొలతలు తీసుకున్నారట. ''ఉత్తమ నటుడిగా జాతీయ అవార్డు అందుకున్న తొలి తెలుగు నటుడు అల్లు అర్జున్ బొమ్మను ఏర్పాటు చేయబోతున్నాం. ఈ మైనపు బొమ్మ ఆవిష్కరణ వచ్చే ఏడాది ఉంటుంది'' అంటూ అల్లు అర్జున్ కొలతలు తీసుకుంటున్న వీడియోను షేర్ చేశారు నిర్వాహకులు. కాగా, దుబాయ్‌లోని మేడమ్ తుస్సాడ్స్‌లో తెలుగు నుంచి ప్రదర్శితం కానున్న తొలి మైనపు బొమ్మ అల్లు అర్జున్‌దే కావడం విశేషం.

ఏప్రిల్‌లో సెట్స్‌కి...



• ప్రశాంత్ నీల్, ఎన్టీఆర్

వరుస సినిమాలతో మరింత బిజీ కానున్నారు ఎన్టీఆర్. ప్రస్తుతం 'దేవర' సినిమా షూటింగ్‌లో పాల్గొంటున్నారు. రెండు భాగాలుగా రిలీజ్ కానున్న ఈ సినిమా తొలి పార్ట్ షూటింగ్ డిసెంబరు కల్లా పూర్తవుతుందని, అప్పట్నుంచి అయాన్ ముఖర్జీ దర్శకత్వంలోని 'వార్ 2' సినిమా సెట్స్‌లో ఎన్టీఆర్ జాయిన్ అవుతారని తెలుస్తోంది. ఈ చిత్రంలో హృతిక్ రోషన్ మరో హీరో. అలాగే ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో ఎన్టీఆర్ హీరోగా మైత్రీ మూవీ మేకర్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్ కలిసి ఓ సినిమాను నిర్మించనున్న సంగతి తెలిసిందే. ఈ సినిమా షూటింగ్ వచ్చే ఏడాది ఏప్రిల్‌లో ప్రారంభం కానుందని యూనిట్ వెల్లడించింది.

భలేగా బ్యాలెన్స్!



• వరలక్ష్మి

సినిమాలను, వెబ్ సిరీస్‌లను భలేగా బ్యాలెన్స్ చేస్తున్నారు వరలక్ష్మీ శరత్‌కుమార్. కథను బట్టి మెయిన్ లీడ్‌గా, క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా చేస్తుంటారు. ఇప్పటికే తెలుగు ఆంథాలజీ సిరీస్ 'అద్దం'తో డిజిటల్ వ్యూయర్స్‌కు దగ్గరైన వరలక్ష్మి తాజాగా మరో తెలుగు వెబ్ సిరీస్ 'మాన్షన్ 24'లో మెయిన్ లీడ్ రోల్ చేశారు. హారర్ బ్యాక్‌డ్రాప్‌లో రూపొందిన ఈ సిరీస్‌లో అవికా గోర్, బిందు మాధవి, నందు, మానస్, అయ్యప్ప పి. శర్మ, రావు రమేష్ ఇతర పాత్రధారులు. 'రాజుగారి గది' ఫ్రాంచైజీ ఫేమ్ ఓంకార్ ఈ వెబ్ సిరీస్‌కు దర్శకత్వం వహించారు. ''ఒకవైపు సినిమాల్లో నెగటివ్, పాజిటివ్ షేడ్స్ ఉన్న పాత్రలు చేస్తున్నాను. వెబ్ సిరీస్‌లలో కూడా మంచి పాత్రలు చేస్తున్నాను'' అన్నారు వరలక్ష్మి.

మాకు మంచి సింక్ కుదిరింది

- రత్నం కృష్ణ



కిరణ్ అబ్బవరం, నేహా శెట్టి జంటగా రత్నం కృష్ణ దర్శకత్వంలో రూపొందిన సినిమా 'రూల్స్ రంజన్'. మురళీ కృష్ణ వేమూరి, దివ్యాంగ్ లవానియా నిర్మించిన ఈ చిత్రం నేడు విడుదలవుతోంది. ఈ సందర్భంగా ఈ చిత్రదర్శకుడు రత్నం కృష్ణ మాట్లాడుతూ– ''రూల్స్ రంజన్' కథను నవీన్ పొలిశెట్టికి చెప్పాలనుకున్నాను. కుదరక పోవడంతో కిరణ్ అబ్బవరంకు వినిపించాను. కిరణ్‌కు కథ నచ్చడంతో ఈ సినిమాను ఆరంభించాం. కథా చర్చల్లో భాగంగా కిరణ్ మంచి క్రియేటర్ అని అర్థం అయ్యింది. మా ఇద్దరికీ మంచి సింక్ కుదిరింది. ఈ చిత్రం ఫస్టాఫ్ క్లాస్‌గా, సెకండాఫ్ మాస్‌గా ఉంటుంది. యూత్‌ఫుల్‌గా మొదలై, సెకండాఫ్‌లో ఫ్యామిలీ టర్న్ తీసుకుంటుంది. ఈ సినిమా రషెస్‌ను నాన్నగారి (ప్రముఖ నిర్మాత ఏయం రత్నం)తో పాటు, నా శ్రేయోభిలాషులు, కిరణ్ సన్నిహితులు చూసి, హాయిగా నవ్వుకున్నారు. ప్రేక్షకులను కూడా మెప్పిస్తుందనే నమ్మకం ఉంది. దర్శకత్వం అంటే నాకు ఆసక్తి. అయితే నాన్నగారి ప్రొడక్షన్ వ్యవహారాలు చూస్తుంటాను కాబట్టి డైరెక్షన్‌కి గ్యాప్ వచ్చింది. ఇక నా తమ్ముడు రవికృష్ణ నటించిన '7/జీ బృందావన కాలనీ' సినిమా రీ రిలీజ్‌కు మంచి స్పందన వచ్చింది. వచ్చే నెలలో ఈ సినిమా సెకండ్ పార్ట్ షూటింగ్ ఆరంభిస్తాం'' అని అన్నారు.

మ్యాడ్ బ్లాక్‌బస్టర్ అవుతుంది

- దుల్కర్ సల్మాన్



• 'మ్యాడ్' ఈవెంట్‌లో దుల్కర్ సల్మాన్, సిద్ధు, శ్రీ లీలతో యూనిట్

సంగీత్ శోభన్, నార్నే నితిన్, రామ్ నితిన్, శ్రీ గౌరి ప్రియా రెడ్డి, అనంతిక సనీల్‌కుమార్, గోపికా ఉద్యాన్ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'మ్యాడ్'. సూర్యదేవర హారిక నిర్మాతగా పరిచయం అవుతూ, సాయి సౌజన్య సహ–నిర్మాతగా కల్యాణ్ శంకర్ దర్శకత్వంలో రూపొందిన ఈ సినిమా నేడు విడుదలవుతోంది. ఈ సందర్భంగా జరిగిన ఈ సినిమా ప్రీ రిలీజ్ వేడుకకు ఓ ముఖ్య అతిథిగా హాజరైన దుల్కర్ సల్మాన్ మాట్లాడుతూ– ''మ్యాడ్' ట్రైలర్ నిజంగానే మ్యాడ్‌గా, చాలా ఫన్నీగా ఉంది. నటీనటులు ఎవరూ కొత్త వాళ్లలా లేరు. 'మ్యాడ్' చిత్రం బ్లాక్ బస్టర్ అవుతుంది'' అన్నారు. మరో అతిథి సిద్ధు జొన్నలగడ్డ మాట్లాడుతూ– ''మ్యాడ్' స్టోరీ లైన్ నాకు తెలుసు. సినిమాను ప్రేక్షకులు బాగా ఎంజాయ్ చేస్తారు'' అన్నారు. ''గుంటూరు కారం' సెట్స్‌లో 'మ్యాడ్' ప్రస్తావన విన్నాను. 'మ్యాడ్' చిత్రం 'మ్యాడ్'గా ఉంటుందట'' అన్నారు శ్రీ లీల. 'నా ఫ్రెండ్ అనుదీప్ లేకపోతే నేను లేను'' అన్నారు కల్యాణ్ శంకర్.


సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 16 వెల: ₹ 5.50
సంపుటి: 16 సంచిక: 196
శుక్రవారం 6-10-2023
SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL


'ఆర్థిక అసమానతలు తొలగకపోతే రాజకీయ స్వాతంత్య్రానికి అర్థం లేదు'


మన బాణం బంగారం
ఆసియా క్రీడల్లో స్వర్ణాలు నెగ్గిన భారత మహిళలు, పురుషుల జట్లు. - 11లో


గెలుపు 'రచిన్'చాడు
కాన్వే, రచిన్ సెంచరీలు. ఇంగ్లండ్‌పై న్యూజిలాండ్ విజయం. - 11లో


భారత్‌ను వ్యతిరేకిస్తున్న కాంగ్రెస్
భారత్ గళాన్ని నేడు ప్రపంచ దేశాలు వింటు న్నాయని, ఇది చూసి ప్రతిపక్ష కాంగ్రెస్ తట్టు కోలేకపోతుందని ప్రధాని మోదీ అన్నారు.
- వివరాలు 6లో


సిక్కింలో 18కి చేరిన వరద మృతులు
సిక్కింలో తీస్తా నదీ పరీవాహక ప్రాంతంలో సంభవించిన వరదల్లో మరణాల సంఖ్య 18కి చేరుకుంది.
- వివరాలు 6లో


ఆ ఇద్దరికి 'కార్పొరేషన్' తాయిలం
రాష్ట్రంలోని మూడు కార్పొరేషన్లకు చైర్మన్లను, ఓ కార్పొరేషన్‌కు వైస్ చైర్మన్‌ను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.
- వివరాలు 3లో


పోలవరం ఫలాలు త్వరగా అందాలి
పోలవరం ప్రాజెక్టు సవరించిన అంచనాలకు ఆమోదం తెలపాలని కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్‌కు ఏపీ సీఎం జగన్ విజ్ఞప్తి చేశారు.
- వివరాలు 5లో

ప్రలోభాలపై పక్కా నిఘా

స్వేచ్ఛాయుత వాతావరణంలో పారదర్శకంగా అసెంబ్లీ ఎన్నికలు నిర్వహిస్తాం

- కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్‌కుమార్ స్పష్టీకరణ
- రైల్వేస్టేషన్లు, బస్టాండ్లు, అంబులెన్సులు, ప్రభుత్వ వాహనాలు, ప్రైవేటు విమానాల్లో సైతం తనిఖీలు
- కుక్కర్లు, చీరలు, సరుకుల గోదాములపై కన్ను.. నగదు ఆన్‌లైన్ లావాదేవీలపైనా దృష్టి
- ధనం, మద్యం, మాదక ద్రవ్యాలు, కానుకల ప్రవాహంపై ఉక్కుపాదం
- రాష్ట్ర సరిహద్దులు, 148 చెక్ పోస్టులపై సీసీటీవీ కెమెరాల పర్యవేక్షణ
- సామాజిక మాధ్యమాల్లో ఫేక్‌న్యూస్ కట్టడికి ప్రత్యేక సెల్స్
- ప్రలోభాలపై ఫిర్యాదు చేసిన 100 నిమిషాల్లోగా చర్యలు
- రాష్ట్రంలో ముగిసిన ఈసీ మూడురోజుల పర్యటన
- ప్రజాస్వామ్య పండుగలో ఓటర్లంతా భాగస్వాములు కావాలని పిలుపు


సమావేశంలో కేంద్ర ఎన్నికల కమిషనర్లతో కలిసి మాట్లాడుతున్న సీఈసీ రాజీవ్‌కుమార్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర శాసనసభ ఎన్నికలను స్వేచ్ఛాయుత వాతావరణంలో, నిష్పక్షపాతంగా, పారదర్శకంగా, ఎలాంటి ప్రలోభాలకు తావులేకుండా నిర్వహించడానికి కట్టుబడి ఉన్నామని కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ రాజీవ్‌కుమార్ స్పష్టం చేశారు. అన్ని రకాల ప్రలోభాలపై ప్రత్యేక నిఘా ఉంచుతామని ప్రకటించారు. ఎన్నికల్లో ధనం, మద్యం, ఇతర కానుకలు, మాదకద్రవ్యాల ప్రవాహాన్ని పూర్తిగా నియంత్రించాలని, వీటిపట్ల అత్యంత అప్రమత్తంగా ఉంటూ కఠినంగా వ్యవహరించాల్సిందిగా కేంద్ర, రాష్ట్రాల ఎన్నికల యంత్రాంగాన్ని ఆదేశించామని తెలిపారు. వారు కఠిన చర్యలు తీసుకునేలా తాము చేస్తామని చెప్పారు. గత అసెంబ్లీ ఉప ఎన్నికల్లో ప్రలోభాల గురించి తాము విన్నామని, ఇలాంటి విషయంలో తమ చర్యలు ఎలా ఉంటాయో ఈసారి చూడబోతున్నారని అన్నారు. ఎన్నికల షెడ్యూల్ వెలువడగానే అధికార యంత్రాంగం యావత్తూ డిప్యుటేషన్‌పై ఈసీ పరిధిలోకి వస్తుందని వివరించారు. ఎన్నికల్లో ప్రలోభాలకు గురి చేయడం, వాటికి ఫైనాన్స్ చేయడం, నిర్మూలించాల్సిన బాధ్యతల్లో ఉండి అవకాశం కల్పించడం నేరమేనని, ఐపీసీలోని పలు సెక్షన్లతో పాటు ప్రజాప్రాతినిధ్య చట్టం కింద శిక్షార్హులని రాజీవ్‌కుమార్ స్పష్టం చేశారు. ఓటర్లందరూ తమ ఓటు హక్కు వినియోగించుకుని ప్రజాస్వామ్య పండుగలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర శాసనసభ ఎన్నికలకు సన్నద్ధతను పరిశీలించడానికి మూడురోజుల రాష్ట్ర పర్యటనకు వచ్చిన ఆయన.. గురువారం చివరిరోజు సహచర ఎన్నికల కమిషనర్లు అనూప్‌చంద్ర పాండే, అరుణ్ గోయల్, రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి (సీఈఓ) వికాస్‌రాజ్‌తో కలిసి విలేకరులతో మాట్లాడారు.

ఎస్‌ఎల్‌బీసీకి, ఆర్బీఐకి ప్రత్యేక ఆదేశాలు

'బ్యాంకులు నగదు రవాణా వాహనాలను నిర్దేశిత సమయాల్లోనే నడిపించాలని రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల కమిటీ (ఎస్‌ఎల్‌బీసీ)ని ఆదేశించాం. ఎన్నికల్లో అక్రమ నగదు రవాణాకు ఆ వాహనాలను వినియోగించే అవకాశం ఉందని గుర్తించాం. అంబులెన్సులు, ప్రభుత్వ వాహనాల్లో డబ్బు, ఇతర వస్తువుల అక్రమ రవాణా జరగకుండా

మిగతా 10వ పేజీలో ▶

నార్వే రచయితకు సాహిత్య నోబెల్..

మాటల్లో చెప్పలేని అంశాలకు గళంగా మారిన జాన్ ఫోసే రచనలు
నాటక రచయితగా ఎనలేని గుర్తింపు
సెప్టాలజీ సిరీస్‌కు అత్యంత ప్రజాదరణ



- నార్వే రచయిత జాన్ ఫోసేకు సాహిత్యంలో నోబెల్ పురస్కారం వరించింది. బయటకు చెప్పుకోలేని ఎన్నో అంశాలకు తన నవలలు, నాటకాలు, చిన్న పిల్లల పుస్తకాల ద్వారా గళంగా నిలిచినందుకు ఫోసే ఈ ఏడాది ప్రతిష్టాత్మక అవార్డుకు ఎంపికయ్యారు. ఫోసే చేసిన రచనల్లో నార్వే సంస్కృతి, స్వభావం, భాషలో సరళత్వం ఉట్టిపడుతూ ఉంటుందని నోబెల్ లిటరేచర్ కమిటీ చైర్మన్ కొనియాడారు.
- నిత్యజీవితంలో ఎదురయ్యే ఘటనలను స్ఫూర్తిగా తీసుకొని జాన్ ఫోసే రచనలు చేశారు. ఆ ఘటనల్ని సరళమైన భాషలో, శక్తిమంతమైన భావ ప్రకటనతో రచనలు చేసి సామాన్యుల మనసుల్ని కూడా దోచుకున్నారు. మానవ సంబంధాల్లోని బలమైన భావోద్వేగాలు, అభద్రత, ఆందోళన, సామాజిక పరిస్థితుల్ని చిన్నారులకి కూడా అర్థమయ్యేలా రచనలు చేసి సమాజంలో వివిధ వర్గాలపై ఎంతో ప్రభావాన్ని చూపించారు. నవలైనా, నాటకమైనా, పద్యాలైనా, గద్యాలైనా రచనల్లో ఆయన ముద్ర స్పష్టంగా కనిపించేది. ఫోసే చేసిన రచనలు ప్రపంచవ్యాప్తంగా దాదాపుగా 40 భాషల్లోకి అనువాదమయ్యాయి. - వివరాలు 6లో

ఫైనాన్స్, చిట్‌ఫండ్ సంస్థలపై ఐటీ దాడులు

- హైదరాబాద్, శివారు ప్రాంతాల్లోని 24 చోట్ల ఏకకాలంలో 100 బృందాల తనిఖీలు
- బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ సోదరుడు సహా పలువురు వ్యాపారుల ఇళ్లు, కార్యాలయాల్లో సోదాలు
- ఆదాయపన్ను చెల్లింపుల్లో అవకతవకల ఆరోపణలపైనే... కీలక పత్రాల స్వాధీనం - 3లో



న్యూస్‌రీల్

మొదటికొచ్చిన ఏఎన్‌ఎంల పంచాయితీ


ఏఎన్‌ఎంల ఆందోళన వ్యవహారం మళ్లీ మొదటికొచ్చింది. తమ సమస్యల పరిష్కారం కోసం సమ్మె చేసి అధికారుల హామీతో విరమించిన ఏఎన్‌ఎంలు... హామీలు నెరవేరకపోవడంతో మళ్లీ సమ్మె చేయాలని నిర్ణయించారు.
- వివరాలు 3లో

కల్వకుంట్ల ఫ్యామిలీకి.. ఆస్కార్ లేదా నోబెల్ ఇవ్వాలి


అబద్ధాలు ఆడుతూ.. అవినీతికి పాల్పడుతూ, రకరకాల ప్రకటనలతో ప్రజలను మభ్యపెడుతున్న కల్వకుంట్ల కుటుంబానికి ఆస్కార్ కాకపోతే నోబెల్ బహుమతి ఇవ్వాలని కేంద్రమంత్రి, బీజేపీ అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి అన్నారు.
- వివరాలు 2లో

ఇడ్లీ సాంబార్ .. పూరీ కుర్మా


సాంబార్ ఇడ్లీ, పూరీ–ఆలూ కుర్మా, ఉప్మా, వెజిటబుల్ పలావ్, ఉగ్గాని.. పాఠశాల విద్యార్థులకు వేడివేడిగా రోజుకో అల్పాహారం అందించేలా మెనూ ఖరారైంది. నేటి నుంచి 'ముఖ్యమంత్రి అల్పాహారం' పథకం ప్రారంభించేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు.
- వివరాలు 12లో

చంద్రబాబు రిమాండ్ 19 వరకు పొడిగింపు


టీడీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ కుంభకోణంలో మాజీ సీఎం చంద్రబాబునాయుడు జ్యుడీషియల్ రిమాండ్‌ను విజయవాడ ఏసీబీ న్యాయస్థానం ఈ నెల 19 వరకు పొడిగించింది.
- వివరాలు 5లో


..అక్కడ ఓటుకు కోట్లు కేసు కూడా యాక్టివ్‌గానే ఉంది సార్!

స్కీంల బీఆర్‌ఎస్ కావాలా.. స్కాంల కాంగ్రెస్ కావాలా?

- ప్రజలే ఆలోచించుకోవాలి: కేటీఆర్
- అలవికాని హామీలతో మోసం చేసేందుకు కాంగ్రెస్, బీజేపీ యత్నాలు
- ఆర్‌ఎస్‌ఎస్ వాది అయిన రేవంత్‌రెడ్డి బీజేపీలోకి వెళ్లడం ఖాయం
- షాద్‌నగర్‌లో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు పంపిణీ చేసిన మంత్రి
- రావిర్యాలలో విజయ డెయిరీ ప్రారంభం


షాద్‌నగర్‌లో డబుల్ బెడ్‌రూం పత్రాలను లబ్ధిదారుకు ఇస్తున్న మంత్రి కేటీఆర్. చిత్రంలో మంత్రి పట్నం

షాద్‌నగర్/తుక్కుగూడ/వికారాబాద్: వివిధ రకాల పథకాలు, కార్యక్రమాలతో రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్న బీఆర్‌ఎస్ కావాలా.. స్కాంలతో ప్రజాధనాన్ని లూటీ చేసే కాంగ్రెస్ కావాలా? ప్రజలే ఆలోచించుకోవాలని రాష్ట్ర ఐటీ, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ అన్నారు. ఎన్నికలు సమీపిస్తుండటంతో అమలు సాధ్యం కాని హామీలిస్తూ ప్రజలను మోసం చేసేందుకు కాంగ్రెస్, బీజేపీ నేతలు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్, బీజేపీలు రాష్ట్రానికి చేసిందేమీ లేదని విమర్శించారు. గురువారం ఆయన షాద్‌నగర్‌లో

మిగతా 2వ పేజీలో ▶

గవర్నర్‌ను అడ్డుపెట్టుకొని నీచ రాజకీయం: హరీశ్

- బీజేపీపై మంత్రి ధ్వజం
- పందులను నిషేధించిన చంద్రబాబును ప్రజలే నిషేధించారు
- మెదక్‌లో ఎరుకల సాధికారత పథకం, సిద్దిపేటలో వెయ్యి పడకల ఆస్పత్రి ప్రారంభం


సిద్దిపేటలో గురువారం రుతుప్రేమ యాప్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి హరీశ్‌రావు

మెదక్/సాక్షి, సిద్దిపేట/సిద్దిపేటకమాన్: గవర్నర్‌ను అడ్డుపెట్టుకొని బీజేపీ నీచ రాజకీయాలకు పాల్పడుతోందని మంత్రి టి.హరీశ్‌రావు ఆరోపించారు. బుధవారం మెదక్‌లో ఎరుకల సాధికారత పథకానికి మరోమంత్రి సత్యవతిరాథోడ్‌తో కలిసి శ్రీకారం చుట్టారు. గ్రంథాలయం, సఖి కేంద్రంతో పాటు పలు అభివృద్ధి పనులు ప్రారంభించారు. రూ.180 కోట్ల వ్యయంతో నిర్మించనున్న మెడికల్ కళాశాల భవనానికి మిగతా 2వ పేజీలో ▶

స్టాఫ్ నర్స్ ఇక నర్సింగ్ ఆఫీసర్
వైద్య ఆరోగ్యశాఖ నిర్ణయం
- వివరాలు 3లో

అసంతృప్తులకు కమిటీల కొలువులు

ఎన్నికల వేళ 14 కమిటీలను నియమించిన బీజేపీ రాష్ట్ర నాయకత్వం
స్క్రీనింగ్ కమిటీ చైర్మన్‌గా కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి నియామకం
వివేక్ వెంకటస్వామి ఆధ్వర్యంలో మేనిఫెస్టో, పబ్లిసిటీ కమిటీ
ఆందోళనల కమిటీ పగ్గాలు విజయశాంతికి.. - 2లో

క్లుప్తంగా...

15 రోజులుగా అజ్ఞాతంలోకి కేసీఆర్

ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు 15 రోజులుగా అజ్ఞాతంలోకి వెళ్లిపోయారని, ఆయన పాలన చూస్తే తెలంగాణ ఎందుకు వచ్చిందన్నంత బాధగా ఉందని కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ టి.జీవన్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం గాంధీభవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ...రాష్ట్రంలో అస్తవ్యస్తపాలన సాగుతుందని ధ్వజమెత్తారు. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ అంగట్లో అమ్మకానికి పెట్టిన సరుకుగా మారిందని వ్యాఖ్యానించారు. కేసీఆర్‌కు నైతికత ఉంటే సీఎం పదవి నుంచి తక్షణమే తప్పుకోవాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం బదిలీల విషయంలో అనుసరిస్తున్న వైఖరి వల్ల భార్యాభర్తలు కలిసి ఒకచోట ఉండలేకపోతున్నారని ధ్వజమెత్తారు. తెలంగాణ ఏర్పాటులో ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల పాత్ర గొప్పదని, వారికి 5% ఐఆర్ విషయాన్ని పునఃపరిశీలించి 20%కు పెంచాలని కోరారు. ఉద్యోగులకు రావాల్సిన మూడు పెండింగ్ డీఏలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. బిస్వాల్ కమిటీ నివేదిక ప్రకారం 1.90 లక్షల ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో జాబ్ క్యాలెండర్ ప్రకారం ఉద్యోగాల భర్తీ ఉంటుందని పేర్కొన్నారు. ఈ డిమాండ్లతో సీఎంకు లేఖరాసినట్లు జీవన్‌రెడ్డి తెలిపారు.

అసలు సినిమా ముందుంది

మోదీ సభలు ట్రైలర్ మాత్రమే: లక్ష్మణ్



సాక్షి, హైదరాబాద్: కేటీఆర్ ఎలాగూ ముఖ్యమంత్రి అయ్యే పరిస్థితి లేదనే అక్కసుతో బావ బామ్మర్దులు కేటీఆర్, హరీశ్‌రావు సభ్యసమాజం తలదించుకునేలా వ్యవహరిస్తున్నారని బీజేపీ పార్లమెంటరీ బోర్డు సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్ మండిపడ్డారు. ప్రధానిపై కేటీఆర్ సంస్కారహీనంగా విమర్శలు చేయడం చూసి తెలంగాణ సమాజం తలదించుకుంటోందన్నారు. తెలంగాణలో ప్రధాని మోదీ రెండు సభలు ట్రైలర్ మాత్రమేనని, అసలు సినిమా ముందుందని చెప్పారు. గురువారం లక్ష్మణ్ మీడియాతో మాట్లాడుతూ, 2018లో బీఆర్ఎస్‌తో బీజేపీ పొత్తుకు తహతహలాడిందని, నాడు రాష్ట్ర పార్టీ అధ్యక్షుడిగా తాను వారికి సంకేతాలు ఇచ్చినట్లుగా కేటీఆర్ మాట్లాడటం దిగజారుడు రాజకీయాలకు పరాకాష్ట అని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ పార్టీ, టీడీపీ, సీపీఐ, సీపీఎం, మజ్లిస్‌లతో అంటకాగిన బీఆర్ఎస్... బీజేపీని విమర్శించడం సిగ్గుచేటన్నారు. 2008లో తెలంగాణ ఉద్యమం సాగుతున్న సమయంలో కేసీఆర్ ఢిల్లీ వెళ్లి సీఎం పదవి నుంచి వైఎస్ రాజశేఖరరెడ్డిని తొలగించి.. తనను సీఎం చేస్తే తెలంగాణ ఉద్యమాన్ని బంద్ చేస్తానని చెప్పాడు. ఇది వాస్తవం కాదా? అని లక్ష్మణ్ ప్రశ్నించారు. 2013లో కాంగ్రెస్ వర్కింగ్ కమిటీలో నిర్ణయం జరిగేముందు తనను ముఖ్యమంత్రిగా ప్రకటిస్తే టీఆర్ఎస్‌ను కాంగ్రెస్‌లో విలీనం చేస్తానని చెప్పడం వాస్తవం కాదా అని లక్ష్మణ్ నిలదీశారు.

పక్కా వ్యూహంతో ప్రజల ముందుకు..

కాంగ్రెస్ సీనియర్ల సమావేశంలో నిర్ణయం

సాక్షి, హైదరాబాద్: తొమ్మిదేళ్ల కాలంలో రాష్ట్ర ప్రజలకిచ్చిన ఏ ఒక్క హామీని నెరవేర్చకుండా ప్రజలను మోసగిస్తున్న బీఆర్ఎస్‌ను గద్దె దించేలా.. పార్టీ ఎన్నికల వ్యూహంతో ముందుకెళ్లాలని కాంగ్రెస్ సీనియర్లు సూచించారు. ఆరు గ్యారంటీ పథకాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లడం ద్వారా ప్రజల్లో కాంగ్రెస్ పార్టీపై విశ్వాసాన్ని కల్పించాలని కోరారు. గాంధీభవన్‌లో గురువారం మాజీ ఎంపీ సురేశ్‌షెట్కర్, టీపీసీసీ ఉపాధ్యక్షుడు ఎంఆర్‌జీ వినోద్‌రెడ్డి, మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్, మాజీ ఎమ్మెల్యేలు పటోళ్ల శశిధర్‌రెడ్డి, అరికెల నర్సారెడ్డి తదితరులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని రాజకీయ పరిణామాలపై చర్చించిన వీరు.. కాంగ్రెస్ పార్టీ వ్యూహాలకు మరింత పదును పెట్టాలని పేర్కొన్నారు. బీఆర్ఎస్, కేసీఆర్‌ల మోసపూరిత విధానాలు, బీజేపీ విద్వేషపూరిత ఆలోచన విధానాలను, కాంగ్రెస్ పార్టీ లౌకిక, అభివృద్ధి నినాదాలు ప్రజలకు అర్థమయ్యేలా వివరించడం ద్వారా.. ఈసారి తెలంగాణలో గెలుపును ఖాయం చేసుకోవచ్చని అభిప్రాయపడ్డారు.

రూ. 2.19 కోట్ల విలువైన బంగారం పట్టివేత

రూ.16.24 లక్షల విదేశీ కరెన్సీ కూడా..

శంషాబాద్: శంషాబాద్ విమానాశ్రయంలో ఆరుగురు వేర్వేరు ప్రయాణికుల నుంచి రూ.2.19 కోట్ల విలువ చేసే బంగారం, రూ.16.24 లక్షల విలువ చేసే విదేశీ కరెన్సీని కస్టమ్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. దుబాయ్ నుంచి వచ్చిన నలుగురు వేర్వేరు ప్రయాణికుల్లో ఒకరు ప్యాంటులో దాచుకుని తీసుకొచ్చిన 724 గ్రాములు, మరో ప్రయాణికుడు ప్యాంటు లోపలి భాగంలో బంగారం స్ప్రేగా చల్లుకుని 214 గ్రాములు, లోదుస్తుల్లో ఓ ప్రయాణికుడు దాచుకుని తీసుకొచ్చిన 840 గ్రాములు, లోదుస్తుల్లో 734 గ్రాముల బంగారు కడ్డీని మరో ప్రయాణికుడి నుంచి స్వాధీనం చేసుకున్నారు. షార్జా నుంచి వచ్చిన ఓ ప్రయాణికుడు విమానంలో సీటు వెనకాల దాచిన 1220 గ్రాముల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. హైదరాబాద్ నుంచి బహ్రేన్ వెళుతున్న ఓ ప్రయాణికుడు ఎలాంటి అనుమతి లేకుండా తీసుకెళుతున్న యూఎస్ డాలర్లు భారత కరెన్సీలో రూ.16.24 లక్షలను కస్టమ్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు.

స్కీంల బీఆర్ఎస్ కావాలా.. | స్కాంల కాంగ్రెస్ కావాలా?



రావిర్యాలలో విజయ డైరీని ప్రారంభిస్తున్న మంత్రి కేటీఆర్, ఇతర మంత్రులు

▶ మొదటి పేజీ తరువాయి

ఎమ్మెల్యే అంజయ్య యాదవ్‌తో కలిసి పేద ప్రజలకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు పంపిణీ చేశారు. గిరిజన బంజారా భవన్‌ను ప్రారంభించారు. అనంతరం పట్టణ శివారులోని మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మాట్లాడారు. అలాగే వికారాబాద్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో, మహేశ్వరం మండలం రావిర్యాలలో విజయ డెయిరీని ప్రారంభించిన సందర్భంగానూ మంత్రి మాట్లాడారు.

బీజేపీ, కాంగ్రెస్‌లకు దండిగా డబ్బుల మూటలు

దేశాన్ని యాభై ఏళ్లు పాలించిన కాంగ్రెస్ ప్రజలకు ఏం చేసిందో అందరికీ తెలుసని కేటీఆర్ అన్నారు. ఆర్ఎస్ఎస్ వాది అయిన రేవంత్‌రెడ్డికి పీసీసీ ఇచ్చారని.. ఈ గాడ్సే బీజేపీలోకి వెళ్లడం ఖాయమని ఆరోపించారు. పంజాబ్‌కు సీఎంగా ఉన్న కెప్టెన్ అమరేందర్‌సింగ్ ఆనాడే ఈ విషయమై కాంగ్రెస్ అధినేత్రి సోనియాగాంధీకి లేఖ రాశారని గుర్తు చేశారు. ఎన్నికల సమయం దగ్గర పడుతుండటంతో కాంగ్రెస్‌కు కర్ణాటక నుంచి, బీజేపీకి అదానీ సంస్థల నుంచి డబ్బుల మూటలు వస్తున్నాయని ఆరోపించారు. వచ్చే ఎన్నికల్లో విపరీతంగా డబ్బులు పంపిణీ చేసి, ప్రజలను మభ్యపెట్టి ఓట్లు దండుకునేందుకు రెండు పార్టీలు కుట్ర పన్నుతున్నాయన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీలను ప్రజలు నమ్మే పరిస్థితి లేదని పేర్కొన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం కృష్ణా జలాల్లో తెలంగాణ నీటి వాటాను ఎందుకు తేల్చడం లేదని ప్రశ్నించారు. ప్రధాని మోదీ 2014లో 2022 కల్లా రైతుల ఆదాయం డబుల్ చేస్తామన్నారని కానీ ఇప్పటివరకు ఏ రైతు ఆదాయం కూడా డబుల్ కాలేదని ఎద్దేవా చేశారు. షాద్‌నగర్ సమీపంలోని సిద్దాపూర్‌లో 330 ఎకరాల్లో ఐటీ హబ్‌ను ఏర్పాటు చేస్తామని ఈ సందర్భంగా మంత్రి హామీ ఇచ్చారు.

పాడిపంటలకు సీఎం ప్రోత్సాహం

రాష్ట్రంలో పాడి, పంటలను సీఎం కేసీఆర్ ఎంతగానో ప్రోత్సహిస్తున్నారని కేటీఆర్ చెప్పారు. గత పాలకులు ప్రభుత్వ ఆధీనంలో ఉన్న విజయ డెయిరీని పట్టించుకోకుండా పూర్తిగా నిర్వీర్యం చేశారని విమర్శించారు. కేసీఆర్ ప్రభుత్వం పాడి రైతులకు లీటర్‌కు రూ.4 బోనస్ ఇచ్చి ప్రోత్సహిస్తోందని, ఇప్పటివరకు రూ.350 కోట్ల బోనస్ రైతులకు చెల్లించిందని తెలిపారు. మంత్రులు తలసాని శ్రీనివాస్ యాదవ్, పి.సబితాఇంద్రారెడ్డి, పి.మహేందర్‌రెడ్డి, ఎంపీ డాక్టర్ రంజిత్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి, ఎమ్మెల్సీలు దయానంద్, నవీన్ పలువురు ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఘర్ కే వాస్తే పైసే దియా క్యా

'ఘర్ కే వాస్తే కిసీకూ పైసే దియా క్యా'..? (ఇంటి కోసం ఎవరికైనా డబ్బులిచ్చారా?) అంటూ డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పంపిణీ సందర్భంగా కేటీఆర్ లబ్ధిదారులను ఆరా తీశారు. లబ్ధిదారు రహనా మాట్లాడుతూ.. 'ఏక్ పైసా బీ కిసీకూ నై దియా.. బీస్ పచ్చీస్ లాక్‌కా ఘర్ సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ సాబ్‌నే హమారేకు దియా'(ఎవరికీ పైసా ఇవ్వలేదు. 20–25 లక్షల విలువైన ఇంటిని సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ మాకిచ్చారు) అని చెప్పారు.

కోడలమ్మ మంచిగా చూసుకుంటోంది సార్..

సీఎం కేసీఆర్ రూ.2 వేల వృద్ధాప్య పెన్షన్ ఇస్తుండటంతో కోడలమ్మ తనను బాగా చూసుకుంటోందని ఆసరా పెన్షన్ లబ్ధిదారు సరోజ నమ్మ తనను పలుకరించిన మంత్రి కేటీఆర్‌తో చెప్పింది.

అసంతృప్తులకు కమిటీల కొలువులు

ఎన్నికల వేళ 14 కమిటీలను నియమించిన బీజేపీ రాష్ట్ర నాయకత్వం

- స్క్రీనింగ్ కమిటీ చైర్మన్‌గా కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి నియామకం
- వివేక్ వెంకటస్వామి ఆధ్వర్యంలో మేనిఫెస్టో, పబ్లిసిటీ కమిటీ
- ఆందోళనల కమిటీ పగ్గాలు విజయశాంతికి..





సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ముఖ్యనేతలతోపాటు అసంతృప్త నేతలకు కీలక కమిటీల్లో చోటు కల్పిస్తూ బీజేపీ రాష్ట్ర నాయకత్వం నిర్ణయం తీసుకుంది. ఇందులో భాగంగా 14 కమిటీలకు చైర్మన్లు, కన్వీనర్లు, కో–కన్వీనర్లను కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి నియమించారు.

అసంతృప్తవాదులకు బుజ్జగింపు...

పార్టీలో తమకు తగిన ప్రాధాన్యత, గుర్తింపు దక్కడం లేదని, ఎన్నికల నేపథ్యంలో బీఆర్ఎస్ సర్కార్‌పై ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా, జాతీయనాయకత్వం తగిన విధంగా వ్యవహరించడం లేదంటూ కొంతకాలంగా కొందరు జాతీయ కార్యవర్గ సభ్యులు, ఇతర ముఖ్యనేతలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. బీజేపీ తగిన విధంగా వ్యవహరించకపోతే, బీఆర్ఎస్‌ను ఓడించగలిగే పార్టీలోకి వెళ్లేందుకు కూడా సిద్ధమేనంటూ కూడా వారిలో కొందరు ప్రకటించారు. ప్రస్తుత రాజకీయ పరిస్థితుల్లో ఎలాంటి కార్యాచరణ చేపట్టాలనే దానిపై, ఇతర అంశాలపై చర్చకు జాతీయ కార్యవర్గ సభ్యులు వివేక్ వెంకటస్వామి, కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, విజయశాంతి, మాజీ ఎంపీలు కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, ఎం.రవీంద్ర నాయక్, జి.విజయరామారావు, మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డి తదితరులు ఇటీవల కాలంలో పలుమార్లు భేటీ అయ్యారు. వారిలో కొందరు త్వరలోనే బీజేపీని వీడతారంటూ జోరుగా ప్రచారం జరిగింది. తాజాగా ప్రధాని మోదీ మహబూబ్‌నగర్, నిజామాబాద్‌లలో నిర్వహించిన బహిరంగ సభలకు ప్రజల నుంచి మంచి స్పందన రావడంతోపాటు కేసీఆర్ సర్కార్, బీఆర్ఎస్ తీరును తీవ్రంగా ఎండగట్టడం వంటి పరిణామాలతో వారి వైఖరిలో మార్పు వచ్చినట్లు పార్టీ వర్గాల సమాచారం. అలాగే పార్టీ రాష్ట్ర నాయకత్వం కూడా ఎన్నికల నేపథ్యంలో వివిధ కమిటీలను నియమించాల్సి ఉండటంతో వారందరికీ ఆయా కమిటీల్లో ప్రాధాన్యత కల్పిస్తూ నిర్ణయం తీసుకుంది. అయితే ఎన్నికలుండగా ఆందోళనల కమిటీకి చైర్మన్‌గా విజయశాంతిని నియమించడం గమనార్హం. అదేవిధంగా వివిధ కమిటీల్లో వివేక్ వెంకటస్వామి, రాజ్‌గోపాల్‌రెడ్డి, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, రవీంద్రనాయక్, విజయరామారావులకు ప్రాతినిధ్యం కల్పించారు. వారితోపాటు ముఖ్యనేతలు డా.కె.లక్ష్మణ్, బండి సంజయ్, డీకే అరుణ, ఇంద్రసేనారెడ్డి, మురళీధర్‌రావు, మర్రి శశిధర్‌రెడ్డి, పొంగులేటి సుధాకరరెడ్డిలకు కూడా అవకాశం కల్పించారు.

కమిటీలు ఇలా...

- **సోషల్ అవుట్‌రీచ్ కమిటీ:** చైర్మన్‌గా పార్లమెంటరీ బోర్డు సభ్యుడు డా.కె.లక్ష్మణ్, కన్వీనర్‌గా మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్
- **పబ్లిక్ మీటింగ్ కమిటీ:** చైర్మన్‌గా జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్, కన్వీనర్‌గా గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి, జాయింట్ కన్వీనర్‌గా డా. కాసం వెంకటేశ్వర్లు యాదవ్
- **ప్రజలను ప్రభావితం చేసే వారికి చేరువయ్యే కమిటీ:** చైర్మన్‌గా జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ, కన్వీనర్‌గా పొంగులేటి సుధాకర్‌రెడ్డి
- **మేనిఫెస్టో, పబ్లిసిటీ కమిటీ:** చైర్మన్‌గా జాతీయ కార్యవర్గ సభ్యుడు జి.వివేక్ వెంకటస్వామి, కన్వీనర్‌గా మాజీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, జాయింట్ కన్వీనర్‌గా మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి.
- **చార్జిషీట్ కమిటీ:** చైర్మన్‌గా పార్టీ మధ్యప్రదేశ్ ఇన్‌చార్జి పి.మురళీధర్‌రావు, కన్వీనర్‌గా మాజీ ఎమ్మెల్యే యెండల లక్ష్మీనారాయణ, జాయింట్ కన్వీనర్‌గా మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, మాజీ ఐఏఎస్ రామచంద్రుడు
- **స్క్రీనింగ్ కమిటీ:** చైర్మన్‌గా జాతీయ కార్యవర్గ సభ్యుడు కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, కన్వీనర్‌గా దుగ్యాల ప్రదీప్‌కుమార్
- **ఆందోళనల కమిటీ:** చైర్మన్‌గా విజయశాంతి, కన్వీనర్‌గా డా.జి.మనోహర్‌రెడ్డి
- **సోషల్ మీడియా కమిటీ:** చైర్మన్‌గా ఎంపీ అర్వింద్ ధర్మపురి, కన్వీనర్‌గా పోరెడ్డి కిషోర్‌రెడ్డి
- **ఎన్నికల కమిషన్ అంశాల కమిటీ:** చైర్మన్‌గా మాజీ మంత్రి మర్రి శశిధర్‌రెడ్డి, కన్వీనర్‌గా మాజీ ఎమ్మెల్సీ కె.దిలీప్‌కుమార్
- **ప్రధాన కార్యాలయ సమన్వయ కమిటీ:** చైర్మన్‌గా జాతీయ కార్యవర్గసభ్యుడు నల్లు ఇంద్రసేనారెడ్డి, కన్వీనర్‌గా బంగారు శ్రుతి
- **మీడియా కమిటీ:** చైర్మన్‌గా ఎమ్మెల్యే ఎం.రఘునందన్‌రావు, కన్వీనర్‌గా మాజీ ఎమ్మెల్సీ ఎన్. రామచందర్‌రావు, జాయింట్ కన్వీనర్‌గా డా.ఎస్. ప్రకాష్‌రెడ్డి
- **క్యాంపెయిన్ ఇష్యూస్/టాకింగ్ పాయింట్స్ కమిటీ:** చైర్మన్‌గా వెదిరె శ్రీరామ్, కన్వీనర్‌గా మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్
- **ఎస్సీ నియోజకవర్గాల సమన్వయ కమిటీ:** చైర్మన్‌గా జాతీయ కార్యవర్గసభ్యుడు ఏపీ జితేందర్‌రెడ్డి, కన్వీనర్‌గా మాజీ మంత్రి జి.విజయరామారావు
- **ఎస్టీ నియోజకవర్గాల సమన్వయ కమిటీ:** చైర్మన్‌గా జాతీయ కార్యవర్గ సభ్యుడు గరికపాటి మోహన్‌రావు, కన్వీనర్‌గా ఎంపీ సోయం బాపూరావు, జాయింట్ కన్వీనర్‌గా మాజీ మంత్రి ఎం. రవీంద్రనాయక్ నియమితులయ్యారు.

ఇక అమీతుమీయే!


- 34 సీట్లు ఇవ్వకపోతే ప్రత్యక్ష కార్యాచరణ
- నగర శివార్లలో సమావేశమైన కాంగ్రెస్ బీసీ నేతలు
- మరోసారి ఢిల్లీ వెళ్లాలని నిర్ణయం!



సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్‌లో టికెట్ల వ్యవహారం చిచ్చురేపుతోంది. బీసీలకు 34 సీట్లు ఇస్తామని రాజకీయ వ్యవహారాల కమిటీలో ఇచ్చిన హామీ మేరకు టికెట్లు కేటాయించకపోతే ప్రత్యక్ష కార్యాచరణకు సిద్ధం కావాలని ఆ వర్గం నేతలు నిర్ణయించారు. గురువారం రాత్రి నగర శివారు శంషాబాద్‌కు సమీపాన రాళ్లగూడలోని ఓ కళాశాలలో సమావేశమైన బీసీ నేతలు.. పార్టీలోని కొందరు బీసీలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్న తీరుపై కూలంకషంగా చర్చించినట్లు సమాచారం. బీసీలకు టికెట్ల వ్యవహారంపై అంతర్గతంగా పార్టీలోనే చర్చించాలని, బహిరంగంగా పత్రికలకు ఎక్కరాదంటూ పార్టీలోని కొందరు నేతలు హెచ్చరికలు చేయడాన్ని వారు తీవ్రంగా తప్పుపట్టినట్లు తెలిసింది. ఇది బీసీలను అణగదొక్కే చర్యగా వారు అభిప్రాయపడినట్లు సమాచారం. ఈ సమావేశంలో పార్టీ సీనియర్ ఉపాధ్యక్షుడు చెరుకు సుధాకర్, కాసుల బాలరాజ్, శ్రీహరి ముదిరాజ్ దండ శ్రీనివాస్, ఐనేల దామోదర్, ప్రదీప్‌కుమార్ వంటి నేతలు దాదాపు 40 మంది పాల్గొన్నారు. టికెట్ల వ్యవహారంలో సామాజిక సమతుల్యత పాటించకపోతే ఎలా అని, రాజకీయ వ్యవహారాల కమిటీలో చేసిన నిర్ణయాన్ని కూడా గౌరవించకపోవడం ఏమి పద్ధతి అని కొందరు ప్రశ్నించారు. సర్వేలు, ఆర్థిక పరిస్థితులనే సాకులు చూపి బీసీలకు టికెట్లలో కోత విధించడం సమంజసం కాదని వారు పేర్కొన్నట్లు తెలిసింది. టికెట్ల ఖరారుకు ముందే బీసీలకు 34 స్థానాలు (ప్రతి పార్లమెంట్‌లో రెండు అసెంబ్లీ స్థానాలు) కేటాయింపు విషయం మరోసారి టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లాలని, ఢిల్లీ కూడా వెళ్లి పార్టీ పెద్దలను కలిసి పరిస్థితిని వివరించాలనే నిర్ణయానికి వచ్చినట్లు ఈ సమావేశంలో పాల్గొన్న ఓ నాయకుడు వెల్లడించారు. సీనియర్లు మధుయాష్కీ, పొన్నం ప్రభాకర్, మహేశ్‌కుమార్‌గౌడ్ వంటి నేతలు హాజరుకాకపోయినా.. సమావేశంలో చర్చించిన అంశాలను వారికి వివరించినట్లు తెలిసింది. గత నెలలోనే బీసీ నేతలంతా ఢిల్లీ వెళ్లి పార్టీ సంస్థాగత వ్యవహారాల ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌తో సమావేశమై బీసీలకు 34 సీట్లు ఇవ్వాలని కోరిన విషయం విదితమే.

కేటీఆర్‌ను సీఎం అభ్యర్థిగా ప్రకటించే దమ్ముందా?

కేసీఆర్‌పై మండిపడ్డ బండి సంజయ్



సాక్షి, హైదరాబాద్: 'కేసీఆర్.... నీ కొడుకు కేటీఆర్‌ను సీఎం అభ్యర్థిగా ప్రకటించే దమ్ముందా?' అని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ సవాల్ విసిరారు. కేటీఆర్‌ను సీఎం అభ్యర్థిగా ప్రకటించిన మరుక్షణమే బీఆర్ఎస్ పార్టీ చీలిపోతుందని, కేటీఆర్ అహంకారం చూసి మెడకాయ మీద తలకాయ ఉన్నోడెవరూ బీఆర్ఎస్‌కు ఓట్లేయరని అన్నారు. 'అజయ్ రావు (కేటీఆర్) కండకావరం తలకెక్కి మాట్లాడుతున్నడు. ముడతల చొక్కా, రబ్బర్ చెప్పులేసుకున్న నీ చరిత్ర మాకు తెలియదా? ప్రజల సొమ్మును దోచుకుని వేల కోట్లు ఎట్లా సంపాదించావో తెల్వదా? కేసీఆర్ నెలరోజులుగా బయటకు ఎందుకు రావడం లేదు? ట్రిబ్యునల్ ఏర్పాటు, పసుపు బోర్డు, గిరిజన వర్సిటీ ఏర్పాటైనా స్పందించరా? ట్రిబ్యునల్, పసుపు బోర్డు ఏర్పాటు కేసీఆర్‌కు ఇష్టం లేదా? అని ప్రశ్నించారు. 'ఏపీ మాజీ సీఎం చంద్రబాబుతో ఒప్పందం కుదుర్చుకుని కృష్ణా నీటివాటాలో తెలంగాణకు తీరని ద్రోహం చేసిన మోసగాడు కేసీఆర్' అని బండి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. గురువారం సంజయ్ మీడియాతో మాట్లాడుతూ, నెలరోజులుగా సీఎం కేసీఆర్ బయటకు కనిపించకపోవడంపై కేసీఆర్ కుటుంబంపై అనేక అనుమానాలున్నాయని ఆరోపించారు.

గవర్నర్‌ను అడ్డుపెట్టుకొని నీచ రాజకీయం: హరీశ్

▶ మొదటి పేజీ తరువాయి

శంకుస్థాపన చేశారు. సిద్దిపేటలో వెయ్యి పడకల ప్రభుత్వ ఆస్పత్రి, ముదిరాజ్ కన్వెన్షన్ హాలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయా సభల్లో మంత్రి హరీశ్ మాట్లాడారు. ఎరుకల జాతికి చెందిన మాజీ ఎమ్మెల్యే సత్యనారాయణ, విశ్వబ్రాహ్మణ కులానికి చెందిన దాసోజ్ శ్రావణ్‌లకు ఎమ్మెల్సీలు ఇస్తే వారు బీఆర్ఎస్ నాయకులంటూ గవర్నర్ రిజెక్టు చేయటం ఎంతవరకు సమంజసమన్నారు. తమిళనాడు బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలిగా ఉన్న తమిళిసైకి గవర్నర్ పదవి ఎలా ఇచ్చారని నిలదీశారు. ఉత్తరప్రదేశ్‌లో బీజేపీ వారికి నామినేట్ పదవులు కట్టబెట్టారని, ఆ రాష్ట్రానికి ఒక నీతి.. మన రాష్ట్రానికి మరో నీతా అంటూ ప్రశ్నించారు. రాష్ట్రంలో మొదటిసారిగా ఎరుకల సాధికారత పథకానికి రూ. 60 కోట్లు కేటాయించామని, పందుల పెంపకానికి ప్రభుత్వ భూములు కేటాయిస్తామని హామీ ఇచ్చారు. చంద్రబాబు హయాంలో పందులను నిషేధించారని, వారికి ప్రత్యామ్నాయం చూపటంలో ఆయన చొరవ చూపలేదని, దీంతో చంద్రబాబును ప్రజలు నిషేధించారని చెప్పారు. డబ్బు సంచులతో హైదరాబాద్ నుంచి గుండాల ముఠా మెదక్ వస్తోందని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే మైనంపల్లినుద్దేశించి మంత్రి వ్యాఖ్యానించారు. డబ్బుల కట్టలు గెలవాలా? పని చేసే ఎమ్మెల్యే పద్మారెడ్డి గెలవాలో మీరే ఆలోచించుకోవాలని కోరారు. ఎవరెన్ని ట్రిక్కులు చేసినా కేసీఆరే హ్యాట్రిక్ సీఎం ఖాయమన్నారు.

హరీశ్ ఉన్నాడు.. భయం లేదు బిడ్డా..

సిద్దిపేటలోని వైద్య కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతున్న ఎంబీబీఎస్ విద్యార్థులతో మంత్రి హరీశ్ ముచ్చటించారు. ఢిల్లీ, గుజరాత్, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్ వంటి రాష్ట్రాల నుంచి వచ్చి చదువుతున్న విద్యార్థులతో ఆప్యాయంగా పలకరించారు. సిద్దిపేట మెడికల్ కళాశాలనే ఎందుకు ఎంచుకున్నారని వారిని అడగ్గా, ఇక్కడి అభివృద్ధిని చూసి, మీ గురించి తెలిసి జాయిన్ అయ్యామని చెప్పడంతో మంత్రి సంతోషం వ్యక్తం చేశారు. నకిరేకల్‌కు చెందిన వైద్య విద్యార్థిని సౌమ్య ఇదే విషయమై స్పందిస్తూ.. వ్యవసాయం చేసుకునే మా నాన్న న్యూస్ పేపర్, టీవీలలో సిద్దిపేట అభివృద్ధి గురించి చూసేవారు. ''అక్కడ హరీశ్‌రావు ఉంటాడు.. ఏం భయంలేదు బిడ్డా.. మంచిగా చూసుకుంటాడు.. నీవు అక్కడనే (సిద్దిపేట) చేరాలి అని చెప్పడంతో ఇక్కడ జాయిన్ అయ్యానని చెప్పగా, హరీశ్ భావోద్వేగానికి గురయ్యారు.

కల్వకుంట్ల కుటుంబానికి.. ఆస్కార్ కాకపోతే నోబెల్ ఇవ్వాలి

కేంద్రమంత్రి, బీజేపీ అధ్యక్షుడు జి. కిషన్‌రెడ్డి ఎద్దేవా

సాక్షి, హైదరాబాద్: అబద్ధాలు ఆడుతూ..అవినీతికి పాల్పడుతూ, రకరకాల ప్రకటనలతో ప్రజలను మభ్యపెడుతున్న కల్వకుంట్ల కుటుంబానికి ఆస్కార్ కాకపోతే అంతకుముందు నోబెల్ బహుమతి ఇవ్వాలని కేంద్రమంత్రి, బీజేపీ అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి అన్నారు. ప్రధాని మోదీ బహిరంగసభల్లో కేసీఆర్ కుటుంబబండారం బయటపెట్టడంతో, వారు పూర్తిగా కుంగుబాటుకు గురై ఏం మాట్లాడుతున్నారో కూడా తెలియడం లేదని చెప్పారు. గురువారం కిషన్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ ప్రగతిభవన్‌లో వారుండేది ఇంకా రెండునెలలే, ఆ తర్వాత ఖాళీచేసి ఫామ్‌హౌస్‌కు పోవాల్సిందేనన్నారు. పెండింగ్‌లో ఉన్న ఏపీ–తెలంగాణకు కృష్ణానీటి పంపకాల బాధ్యత బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్‌కు అప్పగింత, ములుగులో గిరిజనవర్సిటీ, జాతీయ పసుపుబోర్డు ఏర్పాటు వంటి మూడు కీలక అంశాలపై కేంద్ర కేబినెట్ ఒకేరోజు చరిత్రాత్మక నిర్ణయం తీసుకుందన్నారు. గిరిజన విశ్వవిద్యాలయ ఏర్పాటు జాప్యంలో పూర్తి బాధ్యత చేతకాని దద్దమ్మ ప్రభుత్వం కేసీఆర్‌దేనని మండిపడ్డారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అసమర్థత, నిర్లక్ష్యం కారణంగా తెలంగాణకు పదేళ్లుగా అన్యాయం జరుగుతోందన్నారు. కేంద్రానికి తాము పన్నులు, ఇతర రూపాల్లో రూపాయి ఇస్తే. అందులో 56 పైసలు ఇతరరాష్ట్రాలకు మళ్లిస్తున్నారని, తెలంగాణకు తగిన వాటా రావడం లేదని కేటీఆర్ చెబుతున్నారు కదా అన్న ప్రశ్నకు అవన్నీ చిల్లరోళ్ల చిల్లర మాటలని కిషన్‌రెడ్డి ఎద్దేవా చేశారు.

వారికి అధికారం, అహంకారం తలకెక్కింది

'కల్వకుంట్ల కుటుంబానికి పూర్తిగా అధికారం తలకెక్కి అహంకారమదంతో ప్రధానిపై విమర్శలు చేయడం సిగ్గుచేటు. ప్రధానిని టూరిస్ట్ అంటూ విమర్శలు చేస్తున్నరు. ఇచ్చిన హామీలు అమలు చేయని ముఖ్యమంత్రికి సిగ్గుండాలి' అంటూ కిషన్ రెడ్డి మండిపడ్డారు. 'అభివృద్ధి పనులకు ప్రధాని మోదీ తెలంగాణకు వస్తే ముఖ్యమంత్రి ఫామ్ హౌస్‌లో కూర్చుంటున్నడు. మోదీ పర్యటనకు వస్తే విమర్శిస్తూ పోస్టర్లు వేయడానికి సిగ్గుండాలి. బయ్యారం స్టీల్ ఫ్యాక్టరీపై ప్రధాని మోదీ ఏనాడు హామీ ఇవ్వలేదు. కేంద్రంతో సంబంధం లేకుండా తామే దానిని ఏర్పాటు చేస్తామని మాట తప్పినందుకు, ఇతర హామీలు నెరవేర్చనందుకు కేసీఆర్, కల్వకుంట్ల కుటుంబసభ్యుల దిష్టిబొమ్మలు దహనం చేయాలి' అన్నారు. పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టు పూర్తయి ఈ జిల్లాలు సస్యశ్యామలమైనట్టు, పొలాలు, ప్రజలకు తాగునీరు కల్పిస్తున్నట్టు హైదరాబాద్‌లో హోర్డింగ్‌లు పెట్టడం విడ్డూరమని, కేసీఆర్ నిర్లక్ష్యం కారణంగా దీని వ్యయం రూ.35 వేల కోట్ల నుంచి రూ. 57వేల కోట్లకు చేరిందన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కిషన్‌రెడ్డి. చిత్రంలో తరుణ్ చుగ్, లక్ష్మణ్, రఘునందన్, బీఎల్ సంతోష్, పొంగులేటి, డీకే అరుణ, జవదేకర్

ధైర్యంగా ముందుకెళదాం

- బీజేపీ రోడ్‌మ్యాప్‌పై కసరత్తు.. నడ్డా పాల్గొనే భేటీలో నేడు ఖరారు
- ఎన్నికల నేపథ్యంలో రాష్ట్రపదాధికారులు, జిల్లా అధ్యక్షులు, జిల్లా ఇన్‌చార్జ్‌ల భేటీ



గురువారం అర్ధరాత్రి ఎయిర్ పోర్టులో నడ్డాకు స్వాగతం పలుకుతున్న నేతలు

సాక్షి, హైదరాబాద్: ప్రధాని మోదీ సభలతో రాష్ట్రంలో రాజకీయ వాతావరణం మారింది..బీజేపీకి అనుకూలంగా టోన్‌సెట్ చేయడంతోపాటు జటిలమైన పసుపు బోర్డు, ట్రైబల్ యూనివర్సిటీ, కృష్ణా జలాల్లో తెలంగాణ వాటా వంటి విషయంలో పరిష్కారాలు చూపినందున ధైర్యంగా ముందుకెళ్లాలని పార్టీశ్రేణులకు బీజేపీ నేతలు పిలుపునిచ్చినట్టు సమాచారం. గురువారం పార్టీ కార్యాలయంలో రాష్ట్రపదాధికారులు, జిల్లా అధ్యక్షులు, జిల్లా ఇన్‌చార్జ్‌ల సమావేశం జరిగింది. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో పార్టీపరంగా చేపట్టాల్సిన ప్రచార కార్యక్రమాలు, షెడ్యూల్ మొదలు ప్రచారపర్వం ముగిసే దాకా 30.40 సభల్లో ప్రధాని మోదీ, అమిత్‌షా, ఇతరనేతలు పాల్గొనడం, తదితర అంశాలపై చేపట్టాల్సిన రోడ్‌మ్యాప్‌పై ఈ సమావేశంలో చర్చించారు. శుక్రవారం జరిగే సమావేశానికి నడ్డా హాజరవుతున్నారు.

సిద్ధాంతమే ముఖ్యం..

'బీఆర్ఎస్, బీజేపీ ఒక్కటే అనే ప్రచారాన్ని బలంగా తిప్పికొట్టండి. ఇది కేవలం పార్టీని బలహీనపరిచేందుకు పనిగట్టుకొని విపక్షాలు చేస్తున్న దుష్ప్రచారంలో భాగమే. ఇదే విషయాన్ని ప్రధాని మోదీ ఇటీవల మహబూబ్‌నగర్, నిజామాబాద్ సభలలో కుండబద్దలు కొట్టినట్టు స్పష్టం చేశారు. బీజేపీకి ఎవరితోనూ పొత్తు, అవగాహన వంటివి ఉండవు. తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావడమే మన ఏకైక లక్ష్యం. దీనిని సాధించేందుకు మీరంతా కృషి చేయండి. ఇక్కడ పార్టీ ఒంటరిగానే పోటీచేస్తుంది. అధికారంలోకి వస్తుంది'అని బీజేపీ జాతీయ ప్రధానకార్యదర్శి (సంస్థాగత) బీఎల్.సంతోష్ పేర్కొన్నట్టు సమాచారం.

మనకు ప్రధాని మోదీ ట్రంప్ కార్డు

'మనకు ప్రధాని మోదీ ఒక ట్రంప్ కార్డు. కేసీఆర్ సర్కార్‌పై ప్రజల్లో తీవ్రస్థాయిలో వ్యతిరేకత ఉంది. ఇది పార్టీకి అనుకూలంగా పనిచేస్తుంది. కష్టపడి పనిచేసి, పార్టీని అధికారంలోకి తీసుకురావాలనే లక్ష్యసాధన మార్గంలో అందరూ కలిసికట్టుగా పని చేయండి అని రాష్ట్రపార్టీ ఎన్నికల ఇన్‌చార్జ్ ప్రకాష్ జవదేకర్ పిలుపునిచ్చినట్టు తెలిసింది. ఎన్నికల సహఇన్‌చార్జ్ సునీల్ బన్సల్ 18 పాయింట్స్ ప్రోగ్రామ్‌లో భాగంగా చేపట్టాలని చెప్పినట్టు సమాచార. ప్రచార కార్యక్రమాలు, బహిరంగసభలపై తరుణ్ చుగ్ వివరించినట్టు తెలిసింది.

ఓటర్ల జాబితాలో అవకతవకలపై న్యాయ పోరాటం చేస్తాం

టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు నిరంజన్

సాక్షి, హైదరాబాద్: ఓటర్ల జాబితాలో జరిగిన అనేక అవకతవకలపై న్యాయపోరాటం చేస్తామని టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు నిరంజన్ తెలిపారు. గాంధీభవన్‌లో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆధారాలతో సహా బోగస్ ఓట్ల వివరాలను కేంద్ర ఎన్నికల సంఘం అధికారులకు అందించామన్నారు. డోర్ టూ డోర్ పరిశీలన చేయకుండా ఓటర్ల జాబితా ప్రకటించారని ఆరోపించారు. రెండు చోట్ల ఓట్లు ఉన్న పేర్లను తొలగించాలని చెప్పినా తొలగించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఓటర్ల జాబితాలో ఇంటి నంబర్ వరుస క్రమం జిగ్‌జాగ్‌గా ఉన్నాయని, అదేవిధంగా ఓటర్ల మల్టిపుల్ ఎంట్రీలు కూడా అలాగే ఉన్నాయని విమర్శించారు. ఓటర్ల జాబితాను సరిచేసి ప్రజాస్వామ్యాన్ని రక్షించాలని డిమాండ్ చేశారు.

స్టాఫ్‌నర్స్ ఇక నర్సింగ్ ఆఫీసర్

వైద్య, ఆరోగ్యశాఖ నిర్ణయం



సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వాస్పత్రుల్లో విధులు నిర్వహిస్తున్న నర్సింగ్ సిబ్బందికి తెలంగాణ ప్రభుత్వం శుభవార్త తెలిపింది. కేంద్ర ప్రభుత్వం మార్చినట్టుగా, తమ డిజిగ్నేషన్‌ను స్టాఫ్ నర్స్ నుంచి నర్సింగ్ ఆఫీసర్‌గా మార్చాలన్న డిమాండ్‌ను నెరవేర్చింది. వివిధ హోదాల్లో పేర్లు మార్పు చేస్తూ వైద్య, ఆరోగ్యశాఖ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. స్టాఫ్ నర్స్ హోదాను నర్సింగ్ ఆఫీసర్‌గా, హెడ్ నర్స్ హోదాను సీనియర్ నర్సింగ్ ఆఫీసర్‌గా, నర్సింగ్ సూపరింటెండెంట్ (గ్రేడ్ 2) పేరును డిప్యూటీ నర్సింగ్ సూపరింటెండెంట్‌గా, నర్సింగ్ సూపరింటెండెంట్ (గ్రేడ్ వన్) పేరును చీఫ్ నర్సింగ్ ఆఫీసర్‌గా మారుస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొంది. వైద్య ఆరోగ్యశాఖతో పాటు, ఇతర శాఖల్లో విధులు నిర్వర్తించే నర్సింగ్ సిబ్బందికి కూడా ఇది వర్తిస్తుందని ఆదేశాల్లో పేర్కొంది.

మంత్రి హరీశ్‌రావు శుభాకాంక్షలు

సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు వైద్య సిబ్బంది గౌరవాన్ని పెంచేలా పోస్టుల పేర్లు ఉన్నతీకరిస్తూ ప్రభుత్వం మంచి నిర్ణయం తీసుకుందని మంత్రి హరీశ్‌రావు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన వైద్య సిబ్బందికి శుభాకాంక్షలు అందజేశారు.

ఫైనాన్స్, చిట్‌ఫండ్ సంస్థలపై ఐటీ దాడులు

- హైదరాబాద్, శివారు ప్రాంతాల్లోని 24 చోట్ల ఏకకాలంలో 100 బృందాల తనిఖీలు
- బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ సోదరుడు సహా పలువురు వ్యాపారుల ఇళ్లు, కార్యాలయాల్లో సోదాలు
- ఆదాయపన్ను చెల్లింపుల్లో అవకతవకల ఆరోపణలపైనే... కీలకపత్రాల స్వాధీనం



ఎల్లారెడ్డిగూడలో పూజాకృష్ణ చిట్‌ఫండ్స్ కార్యాలయం

సాక్షి, హైదరాబాద్/శ్రీనగర్ కాలనీ/శంషాబాద్: రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లోని పలు ఫైనాన్స్, చిట్‌ఫండ్, ఈ–కామర్స్ వ్యాపారుల ఇళ్లు, కార్యాలయాలపై ఆదాయపన్నుశాఖ మెరుపు దాడులు చేసింది. గురువారం తెల్లవారుజాము నుంచి సాయంత్రం వరకు హైదరాబాద్, శివారు ప్రాంతాల్లోని 24 చోట్ల ఏకకాలంలో 100 బృందాలతో తనిఖీలు చేపట్టింది. ఆదాయపన్ను చెల్లింపులో అవకతవకల ఆరోపణలపై సోదాలు కొనసాగినట్లు సమాచారం. హైదరాబాద్‌తోపాటు కర్ణాటక, ఒడిశా, తమిళనాడుకు చెందిన ఐటీ అధికారులు ఈ సోదాల్లో పాల్గొన్నట్లు తెలిసింది. బీఆర్‌ఎస్‌కు చెందిన జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ సోదరుడి ఇల్లు, ఆఫీసులు, కూకట్‌పల్లి హిందూ ఫార్చ్యూన్ విల్లాలోని అరికపూడి కోటేశ్వరరావు, రైల్వే కాంట్రాక్టర్ వరప్రసాద్ ఇళ్లతోపాటు వారి బంధువుల ఇళ్లలో సోదాలు జరిగినట్లు సమాచారం. అయితే ఎమ్మెల్యే మాగంటి బంధువులు, స్నేహితుల వ్యాపారాలు లక్ష్యంగానే సోదాలు జరిగినట్లు ప్రచారం సాగింది. ఈ సోదాల్లో పలు కీలక పత్రాలను ఐటీ అధికారులు స్వాధీనం చేసుకున్నట్లు తెలియవచ్చింది.

పన్ను చెల్లింపుల్లో వ్యత్యాసంపై ఆరా..

ఎల్లారెడ్డిగూడలోని పూజకృష్ణ చిట్‌ఫండ్స్‌లో 40 మంది ఐటీ అధికారులు సోదాలు నిర్వహించారు. చిట్‌ఫండ్స్ డైరెక్టర్స్ నాగరాజేశ్వరి, పూజాలక్ష్మి, ఎండీ కృష్ణప్రసాద్ ఇళ్లలోనూ తనిఖీలు జరిగాయి. అమీర్‌పేట్‌లోని సన్‌షైన్ అపార్ట్‌మెంట్‌లోనూ తనిఖీలు చేశారు. రంగారెడ్డి జిల్లా శంషాబాద్‌లో ఈ–కామర్స్ వ్యాపారవేత్త రఘువీర్ ఇంటితోపాటు జూబ్లీహిల్స్‌లోని ఆఫీసుల్లో సోదాలు జరిగాయి. ఐదేళ్ల ఐటీ లావాదేవీలను పరిశీలించారు. చిట్‌ఫండ్స్, ఫైనాన్స్ వ్యాపారాల్లో పెట్టుబడులు పెట్టిన వారి వివరాలు సేకరించారు. ఆర్థిక లావాదేవీలకు చెందిన రికార్డులతోపాటు ఆఫీసుల్లోని కంప్యూటర్ హార్డ్‌డిస్క్‌లు, పలు ల్యాప్‌టాప్‌లను స్వాధీనం చేసుకున్నారు. మరోవైపు జీవనశక్తి చిట్‌ఫండ్, ఈ–కామ్ చిట్‌ఫండ్ సంస్థలపైనా సోదాలు జరిగాయి. ఐటీ రిటర్న్‌లపై ఆరా తీసినట్లు తెలుస్తోంది. సోదాలకు సంబంధించి ఐటీ అధికారులు ఎలాంటి ప్రకటన జారీ చేయలేదు.



ధర్నా నిర్వహిస్తున్న ఏఎన్‌ఎంలు

మొదటికొచ్చిన ఏఎన్‌ఎంల పంచాయితీ

- సమ్మె విరమించినా సమస్యలు పరిష్కరించని సర్కార్
- మళ్లీ సమ్మెలోకి వెళ్తామని హెచ్చరిక.. భారీ స్థాయిలో ధర్నా

సాక్షి, హైదరాబాద్/సుల్తాన్ బజార్: రెండో ఏఎన్‌ఎంల ఆందోళన వ్యవహారం మళ్లీ మొదటికొచ్చింది. తమ సమస్యల పరిష్కారం కోసం సమ్మె చేసి అధికారుల హామీతో విరమించిన ఏఎన్‌ఎంలు... హామీలు నెరవేరకపోవడంతో తిరిగి సమ్మె చేయాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా గురువారం హైదరాబాద్ ప్రజారోగ్య సంచాలకుడి కార్యాలయం వద్ద ధర్నాకు దిగారు. గత కొన్నాళ్లుగా ఏఎన్‌ఎంలు ఆందోళనలు, నిరసనలు చేస్తుండటం తెలిసిందే. అందులో భాగంగా ఆగస్టు 16 నుంచి నిరవధిక సమ్మెకు సిద్ధమవగా ప్రభుత్వం నాలుగుసార్లు వారితో చర్చలు జరిపింది. సెప్టెంబర్ ఒకటిన యూనియన్ నేతలతో జరిగిన చర్చల్లో ఏఎన్‌ఎంల సమస్యల పరిష్కారానికి త్రిసభ్య కమిటీ వేయాలని నిర్ణయించింది. దీంతో ఒప్పందం ప్రకారం అదే నెల నాలుగో తేదీ నుంచి ఏఎన్‌ఎంలు సమ్మె విరమించారు. ఒప్పందంలో భాగంగా సెప్టెంబర్ నెల 15గా పీఆర్సీ బకాయిలతోపాటు సమ్మె కాలపు వేతనాన్ని ఈ నెల జీతంతో చెల్లిస్తామని ప్రభుత్వం తెలిపింది. కానీ సమ్మె విరమించి నెల రోజులైనా ఇప్పటివరకు తమ డిమాండ్లను పరిష్కరించలేదని ఏఎన్‌ఎంలు ఆరోపిస్తున్నారు. ఈ నేపథ్యంలో మళ్లీ ఆందోళనకు దిగారు.

ఇవీ ప్రధాన డిమాండ్లు...

- నోటిఫికేషన్లో ఇచ్చిన బేసిక్ పేతో 100 శాతం గ్రాస్ శాలరీ ఇవ్వాలి. పీఆర్సీ బకాయిలను వెంటనే విడుదల చేయాలి. రూ. 10 లక్షల ఆరోగ్య బీమా, ఏఎన్‌ఎంలు దురదృష్టవశాత్తూ మరణిస్తే రూ. 10 లక్షల ఎక్స్‌గ్రేషియాను అందించడంతోపాటు వారి కుటుంబంలో ఒకరికి 6 నెలల్లోగా కారుణ్య నియామకం కింద కాంట్రాక్ట్ ఉద్యోగాన్ని ఇవ్వాలి.
- కాంట్రాక్ట్ ఉద్యోగులకు రిటైర్మెంట్ తర్వాత పూర్తి కాలానికి గ్రాట్యుటీ చెల్లించాలి.
- సమ్మె కాలానికి సంబంధించిన జీతం విడుదల చేయాలి.
- కరోనాకాలంలో మరణించిన రెండో ఎఎన్‌ఎంలను గుర్తించి వారి కుటుంబాలకు రూ. 5 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించడంతోపాటు వారి కుటుంబంలో ఒకరికి అర్హతను బట్టి కాంట్రాక్ట్ బేసిక్ లోనైనా సరే కారుణ్య నియామకం చేపట్టాలి.
- యూపీహెచ్‌సీల్లో పనిచేసే వారికి కూడా పీహెచ్‌సీ వాళ్లకు ఇచ్చినట్లే రెండు మార్కుల వెయిటేజీ ఇవ్వాలి.
- నవంబర్ 10న జరిగే పరీక్షలకు సిద్ధమయ్యేందుకు వీలుగా అక్టోబర్ 10 నుంచి నవంబర్ 10 వరకు వేతనంతో కూడిన ప్రిపరేషన్ హాలిడేస్ ఇవ్వాలి.
- పీహెచ్‌సీల్లో ఫస్ట్ ఏఎన్‌ఎంలు లేని సబ్ సెంటర్లలో పనిచేస్తున్న రెండో ఏఎన్‌ఎంకు రూ. 10 వేల అదనపు వేతనాన్ని అందించాలి.
- 8 గంటల పని విధానాన్ని అమలు చేస్తూ సాయంత్రం 6 గంటల తర్వాత ఏదైనా రిపోర్టు పంపాలని ఒత్తిడి చేయకూడదు.
- యూనిఫాం అలవెన్స్ కింద రూ. 4,500 ఇవ్వాలి.
- లక్ష్యాలను నిర్దేశిస్తూ జీతాలను నిలిపే ప్రక్రియను ఆపాలి.
- సమ్మె సందర్భంగా ఇచ్చిన షోకాజ్ నోటీసులను ఉపసంహరించుకోవాలి.
- వివాహం కాకముందు ఉద్యోగంలో నియమితులైన ఏఎన్‌ఎంలను వారి భర్తల సొంత మండలాలకు బదిలీ చేయడానికి అవకాశం కల్పించాలి.
- పరీక్షను ఆఫ్‌లైన్‌లోనే ఓఎంఆర్ షీట్‌తో నిర్వహించాలి.

కేసీఆర్, ఎర్రబెల్లిని పోటీకి అనర్హులుగా ప్రకటించాలి

ఎన్నికల కమిషన్‌ను కోరిన బీఎస్పీ అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్



చౌటుప్పల్‌లో పార్టీలో చేరిన యువతులను అభినందిస్తున్న ఆర్‌ఎస్.ప్రవీణ్‌కుమార్

చౌటుప్పల్/నకిరేకల్: సీఎం కేసీఆర్, మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయకుండా నిషేధం విధించాలని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్.ప్రవీణ్‌కుమార్ ఎన్నికల కమిషన్‌ను డిమాండ్ చేశారు. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చేలోగా సంక్షేమ పథకాలను బీఆర్‌ఎస్‌కు ఓట్లు వేసే వారికే విడుదల చేయాలని టెలీకాన్ఫరెన్స్‌లో ఎర్రబెల్లి ప్రకటించడం సిగ్గుచేటన్నారు. దీనిపై కేంద్ర ఎన్నికల కమిషన్ తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్‌లో గురువారం వివిధ పార్టీలకు చెందిన పలువురు ప్రవీణ్‌కుమార్ సమక్షంలో బీఎస్పీలో చేరారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. చౌటుప్పల్ మండలం దండుమల్కాపురంలో 600 ఎకరాల కాందిశీకుల భూములను కాజేసేందుకు జిల్లా మంత్రి, ఎమ్మెల్యే ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో బీఎస్పీ రాష్ట్ర మహిళావిభాగం కన్వీనర్ నిర్మల తదితరులు పాల్గొన్నారు.

ప్రతిపక్షాల నాయకుల ఫోన్లు ట్యాప్

తెలంగాణలో రిటైర్డ్ పోలీసు అధికారులను ఇంటలిజెన్స్ విభాగంలో పెట్టకుని ప్రతిపక్షాల నేతల ఫోన్లు ట్యాప్ చేస్తున్నారని ప్రవీణ్‌కుమార్ ఆరోపించారు. నల్లగొండ జిల్లా నకిరేకల్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ సూర్యాపేటలో తమ పార్టీ అభ్యర్థి వట్టె జానయ్యను చంపడం కోసం కోటి రూపాయలతో సుపారీ ఇచ్చి కుట్ర చేస్తున్నారన్నారు. వీటన్నింటిపై డీజీపీకి ఫిర్యాదు చేస్తామని తెలిపారు.

స్థానిక అభివృద్ధికి గోల్డ్‌మన్ సాచ్స్ తోడ్పాటు

నాలెడ్జ్ సిటీలో 'ఓపెల్'ను ప్రారంభించిన మంత్రి కేటీఆర్



నాలెడ్జ్ సిటీలో 'ఓపెల్' కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న మంత్రి కేటీఆర్

సాక్షి, హైదరాబాద్: డిజిటల్ అక్షరాస్యత, మహిళా ఎంట్రప్రెన్యూర్లకు చేయూత, స్థానిక విక్రేతలతో ఒప్పందాలు వంటి వాటి ద్వారా గోల్డ్‌మన్ సాచ్స్ సంస్థ స్థానిక అభివృద్ధికి తోడ్పాటు అందిస్తుందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖల మంత్రి కె.తారకరామారావు అన్నారు. గోల్డ్‌మన్ సాచ్స్ వంటి దిగ్గజ సంస్థల కార్యాలయాల ఏర్పాటుతో హైదరాబాద్ కేంద్రంగా అంతర్జాతీయ సంస్థల ఏర్పాటు, భాగస్వామ్యాలకు అవకాశాలు మరింత మెరుగవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. అంతర్జాతీయంగా పెట్టుబడులు, బ్యాంకింగ్, సెక్యూరిటీలు, పెట్టుబడుల నిర్వహణ రంగాల్లో పేరొందిన గోల్డ్‌మన్ సాచ్స్ గురువారం ఇక్కడి నాలెడ్జ్ సిటీలో ఏర్పాటు చేసిన నూతన కార్యాలయం 'ఓపెల్'ను కేటీఆర్ ప్రారంభించారు. హైదరాబాద్‌లో ఉన్న అంతర్జాతీయ కంపెనీలు, స్టార్టప్‌ల వాతావరణం మరింత బలోపేతం కావడంతోపాటు స్థానిక నైపుణ్యానికి అంతర్జాతీయ అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు. తమ సంస్థ రెండు దశాబ్దాల అంతర్జాతీయ ప్రస్థానంలో హైదరాబాద్, బెంగుళూరు అంతర్భాగంగా ఉన్నాయని గోల్డ్‌మన్ సాచ్స్ ఇంటర్నేషనల్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ రిచర్డ్ నోడ్ అన్నారు. కార్యక్రమంలో గోల్డ్‌మన్ సాచ్స్ గ్లోబల్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ గుంజన్ సమ్తానీ, ఐటీ, పరిశ్రమల శాఖల ముఖ్య కార్యదర్శి జయేశ్ రంజన్ తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యాలయంలో 2,500 మందికి వసతి

ఇంజనీరింగ్, ఫైనాన్స్, హ్యూమన్ క్యాపిటల్ మేనేజ్‌మెంట్, కన్స్యూమర్ బిజినెస్, క్లౌడ్ కంప్యూటింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషీన్ లెర్నింగ్ తదితర రంగాలకు సంబంధించిన కార్యకలాపాల కోసం గోల్డ్‌మన్ సాచ్స్ 2021లో హైదరాబాద్‌లో కార్యాలయాన్ని ప్రారంభించింది. ప్రస్తుతం 1,500 మంది నిపుణులు ఇక్కడ పనిచేస్తుండగా తాజాగా నాలెడ్జ్ సిటీలోని సలార్‌పురియా సత్వ నాలెడ్జ్ పార్క్‌లో 3.51 లక్షల చదరపు అడుగులలో కొత్త కార్యాలయాన్ని ప్రారంభించింది. దీనిలో 2,500 మంది నిపుణులు కూర్చునేందుకు అనువైన ఆధునిక వసతులు ఉన్నాయి.

7 నుంచి జెన్‌కోలో ఏఈ, కెమిస్ట్ పోస్టులకు దరఖాస్తుల స్వీకరణ

- సమగ్ర నోటిఫికేషన్ జారీ చేసిన యాజమాన్యం
- డిసెంబర్ 3న రాతపరీక్ష

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర విద్యుదుత్పత్తి సంస్థ (జెన్‌కో)లో 339 అసిస్టెంట్ ఇంజనీర్ (ఏఈ), 60 కెమిస్ట్ పోస్టులను ప్రత్యక్ష నియామకాల పద్ధతిలో భర్తీ చేసేందుకు గురువారం సంస్థ యాజమాన్యం సమగ్ర ప్రకటనలు జారీ చేసింది. ఈ వివరాలను సంస్థ వెబ్‌సైట్ (https://tsgenco.co.in)లో అందుబాటులో ఉంచింది. ఏఈ (ఎలక్ట్రికల్) పోస్టులు 187, ఏఈ (మెకానికల్) పోస్టులు 77, ఏఈ (ఎలక్ట్రానిక్స్) పోస్టులు 25, ఏఈ (సివిల్) పోస్టులు 50 కలిపి మొత్తం 339 ఏఈ పోస్టులను భర్తీ చేయనున్నారు. ఏఈ, కెమిస్టు పోస్టులకు ఈ నెల 7 నుంచి 29 వరకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులను స్వీకరిస్తారు. రెండు రకాల పోస్టులకు డిసెంబర్ 3న రాతపరీక్ష జరగనుంది. ఎలక్ట్రికల్/ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ వి భాగాల్లో ఇంజనీరింగ్‌లో డిగ్రీ కలిగిన వారు ఏఈ (ఎలక్ట్రికల్) పోస్టుల కు, సివిల్ ఇంజనీరింగ్ డిగ్రీ కలిగి ఉన్న వారు ఏఈ (సివిల్) పోస్టుల కు, మెకానికల్ ఇంజనీరింగ్ డిగ్రీ కలి గి ఉన్న వారు ఏఈ (మెకానికల్) పోస్టులకు, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్/ఇన్‌స్ట్రుమెంటేషన్ కంట్రోల్స్ ఇంజనీరింగ్/ ఎలక్ట్రానిక్స్ అండ్ కంట్రోల్ ఇంజనీరింగ్/ఇన్‌స్ట్రుమెంటేషన్ అండ్ పవర్/పవర్ ఎలక్ట్రానిక్స్ విభాగాల్లో ఇంజనీరింగ్ కలిగిన అభ్యర్థులు ఏఈ (ఎలక్ట్రానిక్స్) పోస్టుకు అర్హులు. కెమిస్ట్రీ లేదా ఎన్విరాన్‌మెంటల్ సైన్స్‌లో ప్రథమ శ్రేణి ఎంఎస్సీ డిగ్రీ కలిగిన వారు కెమిస్ట్ పోస్టులకు అర్హులు అవుతారు.

టోకెన్లతోనే సరి

- స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బిల్లులు ఆమోదం పొందినా విడుదల కాని నిధులు
- గత ఏడాది అక్టోబర్ నెలలో రూ.1,115 కోట్ల బిల్లులకు సంక్షేమ శాఖల ఆమోదం
- ఏడాది కావొస్తున్నా ట్రెజరీల్లో ఇంకా పెండింగ్‌లోనే



సాక్షి, హైదరాబాద్: టోకెన్లు ఇచ్చి ఏడాది అవుతున్నా..పోస్టుమెట్రిక్ విద్యార్థుల ఉపకార వేతనాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బిల్లులు మాత్రం విడుదల కాలేదు. గతేడాది అక్టోబర్‌లో ఆయా బిల్లులకు సంబంధించి ఆర్థికశాఖ పోర్టల్‌లో జనరేట్ అయ్యి టోకెన్ నంబర్లు కూడా జారీ అయ్యాయి. నిధులు విడుదల కాకపోవడంతో ఇటు విద్యార్థులు..అటు ప్రైవేట్ కాలేజీ యాజమాన్యాలు లబోదిబోమంటున్నాయి.

దరఖాస్తు నుంచి ట్రెజరీ వరకు ఇలా...

పోస్టుమెట్రిక్ కోర్సుల్లో ప్రవేశాలు పొందిన, కోర్సు కొనసాగిస్తున్న విద్యార్థులు ఈపాస్ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేయడం..వాటిని కాలేజీస్థాయిలో యాజమాన్యాలు పరిశీలించి సంక్షేమశాఖలకు సమర్పించడం... సంక్షేమశాఖల అధికారులు ఆయా దరఖాస్తులను మరోమారు పరిశీలించి ఆమోదం తెలపడం.. ఆ తర్వాత అర్హులైన విద్యార్థులకు ఉపకారవేతనాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధుల విడుదలకు ఖజానా శాఖకు సిఫార్సు చేయడం అంతా ఒక క్రమపద్ధతిలో జరుగుతుంది. కాలేజీ యాజమాన్యాలు ఒక్కో విద్యార్థికి సంబంధించిన ఫైలు కాకుండా ఒక కోర్సు చదువుతున్న విద్యార్థులందరి ఫైళ్లు కలిపి ఒక బిల్లుగా తయారు చేసి ఖజానాశాఖకు సమర్పిస్తాయి.

అవన్నీ రెండేళ్ల కిందటివే...

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఉపకారవేతనాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాలు బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ సంక్షేమ శాఖల ద్వారా అమలవుతున్నాయి. 2019–20, 2020–21 విద్యా సంవత్సరాలకు సంబంధించి పలు బిల్లులు గతేడాది అక్టోబర్ నాటికి ఖజానా శాఖకు సమర్పించాయి. నాలుగు సంక్షేమ శాఖలకు సంబంధించి రూ.1115 కోట్లు వరకు బిల్లులు న్నాయి. ఇందులో సగానికిపైగా బీసీ సంక్షేమ శాఖకు సంబంధించినవే. సంక్షేమ శాఖలు సమర్పించిన బిల్లులను ఖజానా అధికారులు పరిశీలించి టోకెన్లు జనరేట్ చేస్తారు. అయితే ఇప్పటివరకు ఆర్థిఖశాఖ పోర్టల్‌లో ఆ బిల్లులకు ఆమోదం దక్కలేదు. ఏడాది కాలంగా ఇవన్నీ పెండింగ్‌లో ఉండడంతో ఒకవైపు విద్యార్థులు, మరోవైపు కాలేజీ యాజమాన్యాలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఉపకారవేతన నిధులు విద్యార్థి బ్యాంకు ఖాతాలో, ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు కాలేజీ బ్యాంకు ఖాతాలో జమ చేస్తారు. ప్రభుత్వం నుంచి నిధులు విడుదల కాక జాప్యం జరుగుతుండడంతో కాలేజీ యాజమాన్యాలు ఉద్యోగులకు జీతాలు చెల్లించలేని పరిస్థితులు నెలకొన్నాయి. తెలంగాణ ప్రైవేటు కాలేజీ యాజమాన్యాల సంఘం ప్రతినిధులు రాష్ట్ర సంక్షేమశాఖ ఉన్నతాధికారులు, ఆర్థికశాఖ అధికారులను ప్రత్యేకంగా కలిసి పలుమార్లు వినతిపత్రాలు సమర్పించినా, నిధుల విడుదలపై ప్రభుత్వం స్పందించలేదు. ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులతో కాలేజీల నిర్వహణపై చేతులెత్తేయాల్సి వస్తోందంటూ తెలంగాణ ప్రైవేటు కాలేజీ యాజమాన్యాల సంఘం అధ్యక్షుడు గౌరి సతీశ్ 'సాక్షి'తో అన్నారు.

చంద్రబాబు కనుసన్నల్లోనే.. 'ఫైబర్ గ్రిడ్' అక్రమాలు

- ముగిసిన వాదనలు.. తీర్పు రిజర్వ్ చేసిన హైకోర్టు

సాక్షి, అమరావతి: ఏపీ ఫైబర్ గ్రిడ్ ప్రాజెక్టులో అక్రమాలన్నీ అప్పటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కనుసన్నల్లోనే జరిగాయని హైకోర్టుకు సీఐడీ నివేదించింది. ప్రాజెక్టు రూపకల్పన మొదలు అమలు వరకు ప్రతి దశలో చంద్రబాబు పాత్ర ఉందని సీఐడీ తరఫున అడ్వొకేట్ జనరల్ (ఏజీ) ఎస్.శ్రీరామ్ వివరించారు. చంద్రబాబు ప్రోద్బలంతోనే ప్రాజెక్టు వ్యయాన్ని రూ.333 కోట్లకు పెంచారని చెప్పారు. ఈ విషయాన్ని పలువురు వాంగ్మూలాల్లో స్పష్టంగా చెప్పారన్నారు. ఫైబర్‌గ్రిడ్ కేసులో ముందస్తు బెయిల్ కోరుతూ చంద్రబాబు హైకోర్టులో దాఖలు చేసిన వ్యాజ్యంపై జస్టిస్ కంచిరెడ్డి సురేష్‌రెడ్డి గురువారం మరోసారి విచారణ జరిపారు. ఇరుపక్షాలు పోటాపోటీగా వాదనలు వినిపించాయి. వాదనలు పూర్తవడంతో తీర్పును రిజర్వ్ చేస్తూ జస్టిస్ సురేష్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. అంతకు ముందు ఏజీ శ్రీరామ్ వాదనలు వినిపిస్తూ.. టెండర్ నిబంధనలు, ఒప్పందంలో నిర్దేశించిన ప్రమాణాలకు భిన్నంగా కాంట్రాక్టు సంస్థ నాసిరకం సామగ్రిని ఉపయోగించిందని, దీనివల్ల ఖజానాకు రూ.115 కోట్ల మేర నష్టం వాటిల్లిందన్నారు. ఈ మొత్తాన్ని టెరాసాఫ్ట్ అధినేత, చంద్రబాబుకు సన్నిహితుడైన వేమూరి హరిప్రసాద్ తొలుత తన కుటుంబ సభ్యుల ఖాతాలకు, అక్కడి నుంచి చంద్రబాబు, ఆయన కుటుంబ సభ్యుల ఖాతాలకు మళ్లించారన్నారు. ఈ విషయంలో మరిన్ని వివరాలను రాబట్టేందుకు చంద్రబాబును కస్టడీలోకి తీసుకుని విచారించాల్సిన అవసరం ఉందని తెలిపారు. అసలు వేమూరి హరిప్రసాద్ చంద్రబాబు సిఫారసుతోనే గవర్నింగ్ కౌన్సిల్‌లో సభ్యుడు అయ్యారన్నారు. టెరాసాఫ్ట్‌కు లబ్ధి చేకూర్చేందుకే ఎలాంటి కారణం లేకుండా టెండర్ గడువును పొడిగించారని తెలిపారు. చంద్రబాబు కార్యాలయం మౌఖిక ఆదేశాలతో టెండర్ గడువు చివరి తేదీకి ముందు రోజు టెరాసాఫ్ట్‌ను బ్లాక్ లిస్ట్ నుంచి తొలగించారని కోర్టుకు నివేదించారు. సంబంధిత శాఖకు ఇన్‌చార్జ్‌గా ఉన్న ఓ ఉన్నతాధికారి టెరాసాఫ్ట్‌కు ప్రాజెక్టు అప్పగించడంపై అభ్యంతరం తెలిపారని, దీంతో ఆయన్ని బదిలీ చేసి, నామమాత్రపు పోస్టు ఇచ్చారని తెలిపారు. చంద్రబాబు పాత్రకు సంబంధించి ప్రాథమిక దర్యాప్తులో ఆధారాలు లభించలేదని, ఆ తరువాత సీఐడీ పలువురు వాంగ్మూలాలను నమోదు చేసి, లోతైన దర్యాప్తు చేసిందన్నారు. దీంతో చంద్రబాబు పాత్రపై పలు ఆధారాలు లభించాయని, ఆయన్ని నిందితునిగా చేర్చామని అన్నారు. చంద్రబాబు కుమారుడు రెడ్ బుక్ పేరుతో అధికారులను బెదిరిస్తున్నారని చెప్పారు. చంద్రబాబు చాలా పలుకుబడి కలిగిన వ్యక్తే కాక, బయట ఉంటే సాక్షులను ప్రభావితం చేసి, సాక్ష్యాలను తారుమారు చేయగల సమర్థత ఉన్న వ్యక్తి కూడానని కోర్టుకు వివరించారు. దర్యాప్తు కీలక దశలో ఉన్నందువల్ల ఈ కేసులో చంద్రబాబుకు ముందస్తు బెయిల్ మంజూరు చేయవద్దని కోర్టును కోరారు. చంద్రబాబుపై కేసు నమోదు వెనుక ఎలాంటి రాజకీయ కారణాలు లేవన్నారు. మరోవైపు చంద్రబాబు తరఫున సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది సిద్ధార్థ అగర్వాల్ వాదనలు వినిపిస్తూ.. సీఐడీ ఈ కేసు నమోదు చేసి రెండేళ్లయిందని, ఇప్పటివరకు దర్యాప్తు పూర్తి చేయలేకపోయిందని, చార్జిషీట్ దాఖలు చేయలేదని తెలిపారు. ఈ ప్రాజెక్టు ద్వారా చంద్రబాబు లబ్ధి పొందినట్లు సీఐడీ ఒక్క ఆధారం కూడా చూపడంలేదన్నారు.

ఆ ఇద్దరు ఎమ్మెల్యేలకు 'కార్పొరేషన్' తాయిలం

- ఆర్టీసీ చైర్మన్‌గా ముత్తిరెడ్డి, రైతుబంధు సమితి చైర్మన్‌గా తాటికొండ రాజయ్య
- ఉప్పల వెంకటేశ్, నందికంటి శ్రీధర్‌కు కూడా పదవులు
- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం



ముత్తిరెడ్డి



టి.రాజయ్య



ఉప్పల వెంకటేశ్



నందికంటి శ్రీధర్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని మూడు కార్పొరేషన్లకు చైర్మన్లను, ఓ కార్పొరేషన్‌కు వైస్ చైర్మన్‌ను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం గురువారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. వచ్చే అసెంబ్లీ ఎన్నికలకు బీఆర్‌ఎస్ టికెట్ దక్కని సిట్టింగ్ ఎమ్మెల్యేలు ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి, తాటికొండ రాజయ్యకు కీలక పదవులు లభించాయి. వీరితో పాటు ఇటీవల పార్టీలో చేరిన ఉప్పల వెంకటేశ్ గుప్తా, నందికంటి శ్రీధర్‌కు కూడా అధికారిక పదవులు దక్కాయి. జనగామ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీఎస్ఆర్టీసీ) చైర్మన్‌గా, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే రాజయ్య రైతుబంధు సమితి చైర్మన్‌గా నియమితులయ్యారు. ఇక ఉప్పల వెంకటేశ్ గుప్తా (కల్వకుర్తి)ను మిషన్ భగీరథ కార్పొరేషన్ వైస్ చైర్మన్‌గా, నందికంటి శ్రీధర్ (మల్కాజిగిరి)ను ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్‌గా ప్రభుత్వం నియమించింది.

రాజీ ఫార్ములాలో భాగంగానే..!

బీఆర్‌ఎస్ టికెట్‌లు దక్కని ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి, తాటికొండ రాజయ్యకు రాజీ ఫార్ములాలో భాగంగా ఈ పదవులు దక్కాయి. జనగామలో ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి, స్టేషన్ ఘనపూర్‌లో ఎమ్మెల్సీ కడియం శ్రీహరి బీఆర్‌ఎస్ అభ్యర్థులుగా పోటీ చేస్తున్న విషయం తెలిసిందే. ఇదిలా ఉంటే మల్కాజిగిరి కాంగ్రెస్ టికెట్ ఆశించిన నందికంటి శ్రీధర్ నాలుగు రోజుల క్రితమే బీఆర్‌ఎస్‌లో చేరారు. ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావుకు టికెట్ ఇచ్చినా బీఆర్‌ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరిన నేపథ్యంలో..ఆ పార్టీకి చెందిన నందికంటి శ్రీధర్‌ను బీఆర్‌ఎస్‌లోకి ఆహ్వానించి తాజాగా ఆయనకు కార్పొరేషన్ చైర్మన్ పదవి కట్టబెట్టారు. మరోవైపు ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి కూడా బీఆర్‌ఎస్‌ను వీడిన నేపథ్యంలో అక్కడ పార్టీని బలోపేతం చేసేందుకు వీలుగా ఉప్పల వెంకటేశ్‌కు మిషన్ భగీరథ వైస్ చైర్మన్ పదవి అప్పగించారు.

నేడు బీఆర్‌ఎస్‌లోకి కంఠారెడ్డి తిరుపతిరెడ్డి

తిరుపతిరెడ్డితో మంత్రి హరీశ్ భేటీ.. పార్టీలోకి ఆహ్వానం

మెదక్: ఇటీవల కాంగ్రెస్ పార్టీకి, మెదక్ డీసీసీ అధ్యక్ష పదవికి రాజీనామా చేసిన కంఠారెడ్డి తిరుపతిరెడ్డి బీఆర్‌ఎస్‌లో చేరనున్నారు. శుక్రవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీ.రామారావు సమక్షంలో తన ముఖ్య అనుచరులతో కలసి గులాబీ కండువా కప్పుకోనున్నారు. గురువారం రాత్రి హైదరాబాద్‌లో తిరుపతిరెడ్డి ఇంట్లో మంత్రి హరీశ్‌రావు, మెదక్ ఎమ్మెల్యే పద్మ భర్త దేవేందర్‌రెడ్డి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్‌లో చేరాల్సిందిగా హరీశ్‌రావు ఆహ్వానించగా అందుకు తిరుపతిరెడ్డి అంగీకరించారు. తిరుపతిరెడ్డి మంచి నాయకుడని రాష్ట్రాభివృద్ధిలో భాగస్వామ్యం అవడానికి ముందుకురావడం శుభపరిణామం హరీశ్‌రావు పేర్కొన్నారు.



తిరుపతిరెడ్డితో కలిసి మాట్లాడుతున్న హరీశ్‌రావు

2014 నుంచి బీజేపీ, బీఆర్‌ఎస్ కలిసే ఉన్నాయి

- మోదీ, కేటీఆర్ మాటల పరమార్థం ఇదే
- ఎంఐఎం ఎటువైపో తేల్చుకోవాలి: టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని దెబ్బతీయడానికి 2014 నుంచి బీఆర్‌ఎస్, బీజేపీ సందర్భానుసారం అంతర్గతంగా సహకరించుకుంటూనే ఉన్నాయని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ధ్వజమెత్తారు. రెండురోజుల నుంచి ప్రధాని మోదీ, మంత్రి కేటీఆర్ మాటలను నిశితంగా పరిశీలిస్తే ఇదే విషయం స్పష్టమవుతుందన్నారు. గురువారం అచ్చంపేట నియోజకవర్గానికి చెందిన జెడ్పీటీసీలు, మంత్రినాయక్, ప్రతాప్ రెడ్డి, ఎంపీపీ అరుణ నర్సింహారెడ్డి, వైస్ఎంపీపీ అమరావతి సీఎంరెడ్డి, బద్రీనాథ్‌యాదవ్ తదితరులు రేవంత్ రెడ్డి సమక్షంలో ఆయన నివాసంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ గడిచిన 9 ఏళ్లలో మోదీ తీసుకున్న ప్రతి నిర్ణయానికి కేసీఆర్ మద్దతు ఉన్నదనే విషయం పార్లమెంట్ రికార్డులను తిరగేస్తే అర్థమవుతుందని చెప్పారు. 2018 ఆగస్టులో రాష్ట్రంలో అసెంబ్లీ రద్దు చేస్తారనే చర్చ జరిగినప్పుడు ఢిల్లీకి వెళ్లి వచ్చిన కేసీఆర్, ఏ నాయకుడికి అపాయింట్‌మెంట్ ఇవ్వకుండా కేవలం బీజేపీ నేతలను మాత్రమే ప్రగతిభవన్‌కు పిలిపించుకున్నారన్నారు. 2018 ఎన్నికలు ముగిసిన తర్వాత అప్పటి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్ ఏ పార్టీకి మెజారిటీ రాకపోతే టీఆర్‌ఎస్ మద్దతిస్తామని మీడియాతో వ్యాఖ్యానించారని గుర్తు చేశారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ, బీఆర్‌ఎస్, ఎంఐఎం మధ్య పొత్తు కుదిరిందని, సీట్ల సర్దుబాటు కూడా జరిగిందన్నారు. ఎంఐఎం ఎవరివైపు నిలబడుతుందో స్పష్టం చేయాలన్నారు.

బీఎల్.సంతోష్‌ను అరెస్ట్ చేసే దమ్ముందా?

బీఆర్‌ఎస్ సర్కారును కూలదోస్తామన్న కుట్రదారు బీఎల్. సంతోష్ హైదరాబాద్ వచ్చిండటగదా..అరెస్ట్ చేసే దమ్ముందా ? అని రేవంత్‌రెడ్డి సీఎం కేసీఆర్‌కు 'ఎక్స్' (ట్విట్టర్)లో సవాలు విసిరారు.

కార్వీ ఆస్తుల జప్తుపై స్టేటస్ కో

'ముసద్దీలాల్'కు కూడా.. ఈడీ అప్పీల్‌పై హైకోర్టు ఆదేశాలు



సాక్షి, హైదరాబాద్: కార్వీ గ్రూప్ కంపెనీ ఆస్తుల జప్తుపై హైకోర్టు స్టేటస్ కో ఆదేశాలిచ్చింది. ముసద్దీలాల్ కంపెనీ డైరెక్టర్లు, హైగ్రో కెమికల్స్, దివిజ జ్యువెల్లర్స్, శీతల్ రిఫైనరీస్ సంస్థల ఆస్తుల జప్తుపై కూడా యథాతథస్థితి కొనసాగించాలని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ)ని హైకోర్టు ఆదేశించింది. ఈ మేరకు మధ్యంతర ఉత్తర్వులు జారీచేసింది. పలు కేసులలో తమ ఆస్తులను ఈడీ తాత్కాలికంగా జప్తుచేయడాన్ని సవాల్ చేస్తూ ఆయా కంపెనీలు హైకోర్టును ఆశ్రయించాయి. సింగిల్ జడ్జి విచారణ జరిపి ఈడీ జప్తు ఉత్తర్వులను కొట్టివేశారు. దీనిపై ద్విసభ్య ధర్మాసనం ముందు ఈడీ అప్పీల్ చేసింది. అలాగే కొన్ని కంపెనీలు కూడా ఇతర ఆస్తుల జప్తుపై పిటిషన్లు వేశాయి. ఈ పిటిషన్లపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ ఎన్వీ శ్రవణ్‌కుమార్ ధర్మాసనం గురువారం విచారణ చేపట్టింది. ఈడీ తరఫున అదనపు సొలిసిటర్ జనరల్ సుందరేశన్ వాదనలు వినిపించారు. అడ్జ్యుడికేటింగ్ అథారిటీలో సాంకేతిక సభ్యుడు మాత్రమే ఉన్నారని, ఆయనకు న్యాయశాస్త్రంలో పట్టాలేదని పేర్కొంటూ సింగిల్ జడ్జి అథారిటీ ఉత్తర్వులను కొట్టివేయడం సరికాదన్నారు. ఈ సందర్భంగా పలు సుప్రీంకోర్టు తీర్పులను వివరించారు. వాదనలు విన్న ధర్మాసనం నవంబర్ 7న తుది విచారణ చేపడతామంటూ వాయిదా వేసింది.

మేడారం సమ్మక్క పూజారి మృతి



ఎస్ఎస్ తాడ్వాయి: మేడారం సమ్మక్క పూజారి సిద్దబోయిన లక్ష్మణ్‌రావు (45) అనారోగ్యంతో గురువారం కన్నుమూశారు. ములుగు జిల్లా ఎస్ఎస్ తాడ్వాయి మండలం మేడారం గ్రామానికి చెందిన పూజారి లక్ష్మణ్‌రావు కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. చికిత్సకోసం హనుమకొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేరారు. అయితే పరిస్థితి విషమించి గురువారం తెల్లవారుజామున చనిపోయారు. ఆయనకు భార్య సనిత, కుమార్తెలు సౌమ్య, సౌజన్య, కుమారుడు నితిన్‌లు ఉన్నారు. మంత్రి సత్యవతి రాథోడ్ మేడారం చేరుకుని లక్ష్మణ్‌రావు మృతదేహంపై పుష్పగుచ్ఛాలుంచి సంతాపం తెలిపారు. ఎమ్మెల్యే సీతక్క, ఈఓ రాజేంద్రం, పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్ద బోయిన జగ్గారావు, పలువురు బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆయన మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు.

మధ్యాహ్నం సూర్యుడు వాలినప్పటి నుండి, రాత్రి అయి చీకటి పడేవరకూ నమాజ్‌లను నలుపు. ప్రాతఃకాలంలో (నమాజ్‌లో ఖుర్ఆన్) పఠించు. ప్రాతఃకాల పఠనం (దేవదూతల ద్వారా) వీక్షింపబడుతుంది. – ఇస్లాం ధర్మం

సాక్షి

శుక్రవారం, 6 అక్టోబర్ 2023

నలభయ్యారు రోజుల పండుగ!

నలభై ఆరు రోజులు... 48 మ్యాచ్‌లు... దేశంలోని 10 వేర్వేరు నగరాలు... 10 అంతర్జాతీయ క్రికెట్ జట్లు. ఒక క్రీడా సంరంభానికి ఇంతకు మించి ఇంకేం కావాలి? అక్టోబర్ 5న ఆరంభమైన ఐసీసీ పురుషుల క్రికెట్ వరల్డ్ కప్–2023 కచ్చితంగా మరో పెద్ద ఆటల పండుగ. ఒక పక్కన చైనాలో ఆసియా క్రీడోత్సవాల హంగామా సాగుతుండగానే మన గడ్డపై మరో సందడి మొదలైపోయింది. నాలుగేళ్ళకు ఓసారి సాగే అంతర్జాతీయ వన్డే ప్రపంచ కప్ షురూ అయింది. నిరుటి ఛాంపియన్ ఇంగ్లండ్ ఈసారీ బలమైన జట్టుగా ముందుకు వస్తుంటే, సొంతగడ్డపై సాగుతున్న పోటీలో కప్పు కొట్టాలనే ఒత్తిడి భారత జట్టుపై ఉంటుంది. న్యూజిలాండ్, ఆస్ట్రేలియా జట్లు సైతం బలమైన పోటీదార్లుగా నిలుస్తుంటే, ఆఖరు నిమిషంలో తడబడతారనే పేరున్న దక్షిణాఫ్రికా జట్టు 'అనూహ్యమైన గెలుపుగుర్రం' కావచ్చని ఓ అంచనా. గత వరల్డ్ కప్‌లో లానే పోటీలో పాల్గొనే పది జట్లూ లీగ్ దశలో పరస్పరం తలపడే ఈ ప్రపంచపోటీ రానున్న నెలన్నర కాలంలో విస్తృత చర్చనీయాంశం కానుంది.

యాభై ఓవర్ల ఈ వన్డే మ్యాచ్‌ల వరల్డ్ కప్‌కు గతంలో 1987, 1996, 2011ల్లో భారత్ ఆతిథ్యమిచ్చింది. అయితే, అప్పుడు ఉపఖండంలోని ఇతర దేశాల సహ ఆతిథ్యంలో అవి సాగాయి. కానీ, ఈసారి పూర్తిగా మనమే ఆతిథ్యమిస్తున్నాం. సరిగ్గా దసరా, దీపావళి పండుగ సీజన్‌లోనే వరల్డ్ కప్ రావడంతో తమకు కలిసొస్తుందని ప్రకటనకర్తలు భావిస్తున్నారు. తమ ఉత్పత్తుల కొనుగోళ్ళు పెరుగుతాయని బ్రాండ్‌లన్నీ ఉత్సాహపడుతున్నాయి. దానికి తోడు ఆతిథ్య దేశం భారత్ కావడంతో ఉత్పత్తుల ప్రచారం మరింతగా జనంలోకి చొచ్చుకుపోతుందని భావిస్తున్నాయి. ఈ వాణిజ్య ప్రకటనల ఆదాయంలో సింహభాగం తాజా వరల్డ్ కప్‌కు అధికారిక మీడియా హక్కులున్న డిస్నీ స్టార్‌కు చేరుతుంది. పలు బ్రాండ్లు టీవీ, డిజిటల్ వేదికల్లో స్పాన్సర్‌షిప్ కోసం డిస్నీస్టార్‌తో ఒప్పందాలు కుదుర్చుకున్నాయి. నాకౌట్ మ్యాచ్‌ల వేళ టీవీలో 10 సెకన్ల ప్రకటన ఇప్పుడు రూ. 30 లక్షల పైనే అని వార్త. ఈ వరల్డ్ కప్‌తో ప్రయాణ, పర్యాటక, ఆతిథ్య, ఆహార రంగాలు ప్రధానంగా లబ్ధి పొందుతాయని నిపుణుల విశ్లేషణ. మ్యాచ్‌ల పుణ్యమా అని ఇప్పటికే విమాన టికెట్ల రేట్లు, హోటల్ బస రేట్లు భారీగా పెరిగాయి. దేశ స్టాక్ మార్కెట్‌పైనా గణనీయమైన ప్రభావం ఉంటుందని అంచనా.

సినిమా, క్రికెట్‌లంటే ప్రాణాలిచ్చే భారత్‌లో మామూలుగా అయితే, వన్డే క్రికెట్ వరల్డ్ కప్ అంటే చంద్రమండల యాత్ర అంత సంబరం ఉండాలి. విచిత్రంగా ఈసారి ఎందుకనో ఆ క్రేజు వ్యాపారంలోనే తప్ప వ్యవహారంలో కనిపించట్లేదు. మన దేశమే పూర్తిగా ఆతిథ్యమిస్తున్నప్పటికీ, తాజా కప్‌కు ముందస్తు హంగామా అంతగా లేదు. దాదాపు లక్షా 30 వేల మంది కూర్చొనే సౌకర్యంతో ప్రపంచంలోనే పెద్ద క్రికెట్ స్టేడియమ్‌గా పేరొందిన అహ్మదాబాద్ నరేంద్ర మోదీ స్టేడియమ్‌లో గురువారం అంతా కలిపి 20 వేల మంది కూడా లేరు. ఆది నుంచీ ఆన్‌లైన్‌లో కొనడానికి టికెట్లు దొరకలేదు గానీ, తీరా మ్యాచ్ రోజున మైదానమంతా ఖాళీగా ఉంది. లార్డ్స్‌లో గత 2019 వరల్డ్ కప్ ఫైనల్‌లో హోరాహోరీగా తలపడ్డ న్యూజిలాండ్, ఇంగ్లండ్ జట్ల మధ్య మ్యాచ్‌తో ఈ తాజా ప్రపంచ కప్‌ను ప్రారంభించారు. కానీ లాభం లేకపోయింది. భారత జట్టుతో తొలి మ్యాచ్ మొదలుపెడితే ఊపు వచ్చేదేమో! నిజానికి, 1999 నుంచి ఐసీసీ వరల్డ్ కప్‌గా పేరుబడ్డ ఈ పోటీల్లో ఆతిథ్యదేశం ఆరంభమ్యాచ్‌లో పాల్గొనడం ఆనవాయితీ. అదెందుకు మార్చారో తెలియదు.

ఈసారి మ్యాచ్ టికెట్ల కొనుగోలు అసాధ్యమైపోయింది. ఆఖరి నిమిషంలో మ్యాచ్‌ల తేదీలు, వేదికలు మారిపోయాయి. ఇవి చాలదన్నట్టు 2000లల్లో టీ20 మ్యాచ్‌లకు అలవాటు పడ్డ కొత్త తరానికి ఐపీఎల్ సరికొత్త నంబర్ వన్ టోర్నమెంట్‌గా అవతరించింది. వెరసి, 2011లో భారత్ ఆతిథ్యమిచ్చినప్పటితో పోలిస్తే పన్నెండేళ్ళ తర్వాతి ఈ వరల్డ్ కప్ ఆ స్థాయి హడావిడి సృష్టించట్లేదు. అలాగే, గతంలో వరల్డ్ థీమ్‌సాంగ్ ప్రతి ఛానల్‌లో మోత మోగేది. ఈసారి రణ్‌బీర్ సింగ్‌తో చేసిన 'దిల్ జష్న్ బోలే...' పాట విఫలమైంది. ఇక, మైదానం వెలుపల అవలక్షణాలకు కొదవ లేదు. ఐసీసీ వార్షిక ఆదాయంలో భారత క్రికెట్ కంట్రోల్ బోర్డ్ (బీసీసీఐ) వాటా 72 శాతానికి పెరిగింది. మిగతా దేశాల క్రికెట్ బోర్డులు బాగా వెనకబడ్డాయి. దాంతో, ఎప్పటిలానే బీసీసీఐ తన హజం చూపిస్తోంది. బీసీసీఐ అక్రమాలకు నెలవంటూ సుప్రీమ్ కోర్ట్ వేసిన ముగ్గురు సభ్యుల సంఘం నివేదిక లోపాలెత్తిచూపినా అది తన పంథా మార్చుకోలేదు. చిత్రంగా అధికారిక అమ్మకాలు మొదలైనా కాక ముందే టికెట్లు 'అమ్ముడైపోయాయి' అని బోర్డులు వెలిశాయి. మచ్చుకు, అహ్మదాబాద్‌లోని అదే భారీ స్టేడియమ్‌లో జరిగే భారత – పాకిస్తాన్ మ్యాచ్‌కు 8500 టికెట్లే అమ్మకానికి పెట్టారంటే ఏమనాలి?

భారీ క్రికెట్ వేదికలైన ముంబయ్, కోలకతాలను వెనక్కినెట్టి, ఈసారి అహ్మదాబాద్ ముందుకు రావడంలోనూ రాజకీయాలు కనిపిస్తున్నాయి. ఆటకు సంబంధం లేని ఇతర ప్రయోజనాలను పక్కనపెట్టి, భారత్ తన ప్రతిష్ఠను పెంచుకోవడానికి ఇది మరో అవకాశం. జీ20 సదస్సు నిర్వహణ తర్వాత అంతర్జాతీయ వేదికపై మరోసారి మన పేరు మోగడానికి మంచి సందర్భం. దాన్ని చేజార్చుకోకూడదు. 1975లో మొదలైనప్పటి నుంచి ఆతిథ్య దేశాలేవీ కప్ గెల్చుకోలేదన్న వాదనను 2011 ఏప్రిల్‌లో మన ధోనీ సేన సమర్థంగా తిప్పికొట్టింది. తర్వాత 2015లో ఆస్ట్రేలియా, 2019లో ఇంగ్లండ్‌లు అదే బాటలో నడిచాయి. కోహ్లీ, శుభ్‌మన్ గిల్, సూర్యకుమార్, హార్దిక్ పాండ్యా లాంటి బ్యాట్స్‌మన్లు, బుమ్రా, షమీ, షిరాజ్ లాంటి పేసర్లు, అశ్విన్, కుల్దీప్ యాదవ్ లాంటి స్పిన్నర్లతో పటిష్ఠమైన రోహిత్ సేన ఆ కథ పునరావృతం చేయాలని ఆశ. రాజకీయాల కన్నా ఆట, వ్యక్తిగత రికార్డుల కన్నా దేశం గొప్పదని గ్రహిస్తే, నిర్వాహకులైనా, ఆటగాళ్ళైనా అద్భుతాలు చేయడం అసాధ్యమేమీ కాదు!

గ్రహం అనుగ్రహం

శ్రీశోభకృత్‌నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు భాద్రపద మాసం, **తిథి:** బ.సప్తమి ఉ.9.11 వరకు, తదుపరి అష్టమి **నక్షత్రం:** ఆరుద్ర రా.12.44 వరకు, తదుపరి పునర్వసు **వర్జ్యం:** ఉ.8.19. నుండి 10.00 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.17 నుండి 9.04 వరకు తదుపరి ప.12.13 నుండి 1.01 వరకు, **అమృతఘడియలు:** ప.2.11 నుండి 3.45 వరకు.

సూర్యోదయం : 5.54
సూర్యాస్తమయం: 5.44
రాహుకాలం : ఉ.10.30 నుండి 12.00 వరకు
యమగండం : ప.3.00 నుండి 4.30 వరకు

ఆకలిపై పోరాటం జరిపిన శాస్త్రవేత్త

సందర్భం



దేవీందర్ శర్మ

ఆయనను తరచుగా భారతదేశ హరిత విప్లవ పితామహుడిగా కీర్తిస్తారు. ఘనత వహించిన శాస్త్రవేత్త–వ్యవహర్త అయిన ప్రొఫెసర్ ఎం.ఎస్. స్వామినాథన్‌కు 'వరల్డ్ ఫుడ్ ప్రైజ్' తొలి అవార్డు వచ్చినప్పుడు, ఆయన్ని అప్పటి ఐక్యరాజ్యసమితి సెక్రటరీ జనరల్ కర్ట్ వాల్డ్‌హీమ్ ఒక లేఖలో 'లివింగ్ లెజెండ్' అని ప్రశంసించారు. స్వామినాథన్ మరణంతో ఒక శకం ముగిసింది. 'ఓడ నుండి నోటికి' అనే దుర్భర స్థితిలో ఉండిన దేశం ఆయన మార్గదర్శకత్వంలో వ్యవసాయంలో అద్భుతమైన విజయం సాధించింది. హరిత విప్లవ రూపశిల్పి అయినప్పటికీ ఎరువులు అధికంగా వాడితే కలిగే ప్రతికూల పరిణామాలు ఆయనకు తెలుసు. అలాగే రైతు క్షేమాన్నే ఎల్లవేళలా తలిచారు.

'హరిత విప్లవ చరిత్ర వాస్తవానికి నాటి ప్రధాని ఇందిరా గాంధీతో కలిసి నేను చేసిన అరగంట కారు ప్రయాణంలో లిఖితమైంది,' అని ఒకసారి స్వామినాథన్ నాతో చెప్పారు. వ్యవసాయ విప్లవానికి మద్దతు ఇవ్వడానికి కావలసిన రాజకీయ సంకల్పాన్ని పొందడం ఎంత కష్టమనే నా ప్రశ్నకు ఆయన జవాబిస్తూ, అప్పటి ప్రధాని ఇందిరా గాంధీతో కలిసి న్యూఢిల్లీలోని ఇండియన్ అగ్రికల్చరల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్‌గా పూసా కాంప్లెక్స్‌లో ఒక భవన ప్రారంభోత్సవానికి వెళ్లిన సంగతిని గుర్తు చేసుకున్నారు. దారిలో ప్రధాని ఆయన్ని అడిగారు: ''స్వామీ, మీరు చెబుతున్న కొత్త గోధుమ పొట్టి వంగడాల రకాలకు నేను అనుమతిస్తాను. కానీ, కొన్నేళ్లలో ఒక కోటి టన్నుల మిగులు గోధుమలు చూపుతానని మీరు నాకు మాటివ్వగలరా? ఈ 'బ్లడీ అమెరికన్ల' హింస నాకు తప్పాలి.'' స్వామినాథన్ మాటిచ్చారు, తర్వాతిదంతా చరిత్ర!

'ఓడ నుండి నోటికి' అనే దుర్భర స్థితిలో ఉండిన దేశం అనంతరం వ్యవసాయంలో అద్భుతమైన విజయం సాధించింది. భారతదేశాన్ని స్వయం సమృద్ధ దేశంగానే కాకుండా, నికర ఎగుమతిదారుగా మార్చింది. తగిన విధానాల ద్వారా మద్దతు లభ్యమైన హరిత విప్లవ వీరోచిత గాథ, ప్రధానంగా ఆకలి ఉచ్చు నుండి బయటపడే లక్ష్యంపై దృష్టి పెట్టింది. 1943 బెంగాల్ క్షామం తర్వాత కేవలం నాలుగు సంవత్సరాల లోపే స్వాతంత్ర్యం రావడంతో, ఆకలిని అధిగమించే సవాలు అప్పటికి ఎదుర్కోలేదు. దశాబ్దాలుగా, ఉత్తర అమెరికా నుండి పీఎల్–480 పథకం కింద భారత్‌కు ఆహారం వస్తూ ఉండేది.

1970ల మధ్య నాటికి భారతదేశంలోని సగం జనాభా కబేళాలకు దారి తీస్తుందని కొందరు నిపుణులు అంచనా వేశారు. ఆ తర్వాత దేశ క్షుద్బాధపై పోరాడేందుకు స్వామినాథన్ చేసిన తీవ్రాతితీవ్ర ప్రయత్నం, ప్రపంచం వీక్షించిన అత్యంత ముఖ్యమైన ఆర్థిక పరిణామాలలో ఒకటిగా చరిత్రలో నిలిచిపోతుంది. ఇది దేశంలోని కోట్లాది ప్రజల జీవితాలను మార్చడమే కాకుండా, మిగిలిన ప్రపంచానికి కూడా స్ఫూర్తిగా నిలిచింది.

హరిత విప్లవానికి రూపశిల్పిగా ఉన్నప్పటికీ కూడా, స్వామినాథన్‌కు వ్యవసాయంలో ఎరువులు అధికంగా వాడితే కలిగే ప్రతికూల పరిణామాల గురించి తెలుసు. ఆయన ప్రతి కోణంలోనూ దూరదృష్టి గలవారు. రాబోయే పరాజయం గురించి అనేకసార్లు ముందే హెచ్చరించారు. హరిత విప్లవం ప్రారంభమైన కొన్ని సంవత్సరాల తర్వాత, 1968 లోనే ఆయన ఇలా రాశారు: ''నేల సారాన్ని, నేల నిర్మాణాన్ని పరిరక్షించకుండా భూమిపై తీవ్ర ఒత్తిడి కలిగించే సేద్యం చేయడం అంతిమంగా ఎడారుల పుట్టుకకు దారి తీస్తుంది. పురుగు మందులు, శిలీంద్ర (ఫంగస్) సంహారిణులు, కలుపు సంహారకాలను విచక్షణారహితంగా ఉపయోగించడం వలన ధాన్యాలు లేదా ఇతర తినదగిన భాగాలలో చేరే విషపూరిత అవశేషాల వల్ల క్యాన్సర్, ఇతర వ్యాధులకు సంబంధించిన ప్రతికూల మార్పులు సంభవించవచ్చు. భూగర్భ జలాలను అశాస్త్రీయంగా తోడిపారేయడం వల్ల ఈ అద్భుతమైన మూలధన వనరు వేగంగా తరిగిపోతుంది.''



ప్రొఫెసర్ ఎం.ఎస్. స్వామినాథన్

ఫిలిప్పీన్స్‌లోని అంతర్జాతీయ ధాన్య పరిశోధనా సంస్థ (ఐఆర్ఆర్ఐ) డైరెక్టర్ జనరల్‌గా స్వామినాథన్ ఉన్న సమయంలోనే ఇండోనేషియా అధ్యక్షుడు సుహార్తో నుంచి ఆయనకు అసాధారణ కబురు వచ్చింది. ఇండోనేషియా వరి పంటను బ్రౌన్ ప్లాంట్‌హాపర్ తెగులు నాశనం చేయడంతో, స్వామినాథన్ ఒక పరిష్కార మార్గాన్ని అందించాలని సుహార్తో కోరారు. ఇండోనేషియాకు వెళ్లిన శాస్త్రవేత్తల బృందాన్ని ఒకచోట చేర్చి, వారికి మరిన్ని శక్తిమంతమైన పురుగు మందులను ఉపయోగించాలని సూచించడానికి బదులుగా, వరి పంటపై ఉపయోగించే పురుగు మందులను నిషేధించాలని సుహార్తోకు స్వామినాథన్ సలహా ఇచ్చారు. అదే సమయంలో సమీకృత తెగులు నిర్వహణను ప్రారంభించాలని చెప్పారు. సుహార్తో అధ్యక్ష హోదాలో 57 పురుగు మందులను నిషేధించారు.

ప్రొఫెసర్ స్వామినాథన్ టెక్నాలజీని గుడ్డిగా విశ్వసించేవారు కాదని చాలామందికి తెలియదు. జన్యుమార్పిడి పంటలకు వ్యతిరేకంగా ప్రచారం తారస్థాయికి చేరిన రోజుల్లో, బీటీ వంకాయల వాణిజ్యీకరణకు వ్యతిరేకంగా తాత్కాలిక నిషేధం విధించడంపై అప్పటి పర్యావరణ మంత్రి జైరాం రమేష్‌కు ఆయన ప్రతిస్పందన గమనించదగ్గది. చెన్నైలోని ఎం.ఎస్.స్వామినాథన్ రీసెర్చ్ ఫౌండేషన్‌లో జరిగిన ఒక సమావేశంలో, ఆయన ఒక మునగకాయ స్లయిడ్‌ను ప్రదర్శించి, ఆ తర్వాత 'విటమిన్ ఏ'ని కలిగిన జన్యుమార్పిడి బియ్యం ఆవశ్యకతపై ఒక ప్రశ్నను సంధించారు. అన్నంతోపాటు కలిపి వండిన మునగ ఆకులు మన సాంప్రదాయ ఆహారంలో భాగమనీ, ఇవి తమకు తాముగా విటమిన్ ఏ అందించగలవనీ ఆయన ఉద్దేశ్యం. స్వామినాథన్ పదే పదే లేవనెత్తిన పర్యావరణ పరమైన ఆందోళనలను విధాన నిర్ణేతలు తగిన విధంగా పరిష్కరించినట్లయితే, భారతీయ వ్యవసాయరంగం తీవ్రమైన సంక్షోభంలో చిక్కుకునేది కాదు.

ఆయన అంతర్జాతీయ వ్యవసాయ పరిశోధనా కేంద్రాల కన్సార్టియంకు చెందిన మొక్కల జన్యు వనరులపై సెంట్రల్ అడ్వైజరీ బోర్డ్‌కు కూడా నాయకత్వం వహించారు. నేను ఆ సమయంలో మేధా సంపత్తి హక్కులపై సీజీఐఏఆర్ సెంట్రల్ అడ్వైజరీ బోర్డు సభ్యుడిని. ప్రపంచ వ్యాప్తంగా అందుబాటులో ఉన్న మొక్కల జన్యు వనరులను ప్రైవేట్ కంపెనీలకు ఏకమొత్తంగా విక్రయించడాన్ని నిలువరించడంలో ఆయన పోషించిన పాత్ర గుర్తింపు పొందలేదు. ప్రపంచ జీవవైవిధ్యానికి చెందిన అపారమైన సంపదను ప్రైవేటీకరించడానికి జరిగిన ప్రతి ప్రయత్నాన్ని అడ్డుకోవడానికి ఆయన చేసిన తీవ్రమైన ప్రయత్నాలకు నేనే సాక్షిని.

స్వామినాథన్ 2004లో జాతీయ రైతుల కమిషన్ ఛైర్‌పర్సన్‌గా నియమితులైనప్పుడు, కమిషన్ నివేదికకి చెందిన జీరో డ్రాఫ్ట్‌ను రాయమని నన్ను ఆహ్వానించారు. ఆ తర్వాత దేశవ్యాప్తంగా దానిపై చర్చించి, తుది నిర్ణయం తీసుకోవాలి. రైతును కేంద్ర స్థానంలో ఉంచి, ఆపై అతని పరిస్థితిని ఎలా మెరుగుపరచవచ్చో చూడాలని నాకు ఆదేశం ఇచ్చారు. అయితే కేవలం రైతుపై మాత్రమే దృష్టి పెట్టడం కాకుండా, వివిధ వాటాదారులను కూడా అందులో చేర్చాలని తర్వాత చెప్పినప్పుడు, నేను క్షమాపణలు చెప్పాను. అయితే, ఆ మొత్తం కాలం రైతులకు ఆదాయ భద్రత కల్పించడంపై స్వామినాథన్ దృష్టి సారించారు. ఆహారోత్పత్తిని పెంచడంలో రైతులు పోషిస్తున్న పాత్రను ఆయన అభినందించేవారు. కానీ రైతు సమాజం దుఃస్థితికి ఎప్పుడూ బాధపడేవారు.

2004, 2006 మధ్య ఐదు భాగాలుగా సమర్పించిన స్వామినాథన్ కమిషన్ నివేదిక, భారతీయ వ్యవసాయంలో ఉత్పాదకత, లాభదాయకత, స్థిరత్వాన్ని పెంపొందించే లక్ష్యంతో రూపొందింది. ఇది దేశవ్యాప్తంగా రైతు సంఘాలకు కీలకమైన అంశంగా నిలుస్తోంది. సగటు(వెయిటెడ్ యావరేజ్) మీద 50 శాతం లాభం రైతులకు అందించాలన్న ఆయన సూచనను ఆ తర్వాత వచ్చిన ప్రభుత్వాలు పట్టించుకోలేదు. ఈ గొప్ప దార్శనికుడికి దేశం అర్పించే అత్యుత్తమ నివాళి ఏమిటంటే, స్వామినాథన్ కమిషన్ నివేదికను అక్షరమక్షరం అమలు చేయడమే!

వ్యాసకర్త ఆహార, వ్యవసాయ నిపుణులు

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

ఏం కానుందో!



అఫ్గాన్ వలసలందరినీ వెనక్కి పంపాలన్న పాకిస్తాన్ పథకానికి తాలిబన్ గట్టిగా ప్రతిస్పందిస్తోంది. తాలిబన్ రక్షణ మంత్రి ముల్లా యాకూబ్ దీన్ని అన్యాయం, క్రూరం, సహించలేని ఆటవికత అన్నారు. రానున్న రోజుల్లో పాకిస్తాన్‌కు పరిస్థితులు బాగున్నట్టు లేవు.

– సోనమ్ మహాజన్, పొలిటికల్ అబ్జర్వర్

అనుభవ తత్వం



భారతదేశంలోని చాలామంది మధ్యతరగతి జీవులకు నిర్మాణంలో ఉన్న ఇంటిని కొనుగోలు చేసిన తర్వాత గానీ న్యాయ సంబంధ విద్య పట్టుబడదు.

– విశాల్ భార్గవ, రియల్ ఎస్టేట్ నిపుణుడు

సహనపు శిఖరం



క్రికెటర్ శిఖర్ ధవన్ మీద నా గౌరవం అమాంతం పెరిగింది. 11 ఏళ్లుగా విషపూరిత వివాహాన్ని తట్టుకున్నాడు. మారు తండ్రి అయినా తన మారు కూతుళ్లకు అన్నీ చూసుకున్నాడు. తన సొంత కొడుకును చూసుకోవడానికి పోరాటం చేశాడు. ఇన్ని ఒత్తిళ్లలోనూ నవ్వును కోల్పోలేదు. దేశానికీ, ఫ్రాంఛైజ్ టీమ్స్‌కూ ఇవ్వాల్సినంత ఇచ్చాడు. ఇప్పటికైనా ఆ పెళ్లి నుంచి బయటపడ్డందుకు సంతోషం (విడాకులు మంజూరయ్యాయి).

– రోషన్ రాయ్, వ్యాఖ్యాత

మరో ఎమర్జెన్సీ



దిగ్భ్రమ! తమను ఎందుకు అరెస్ట్ చేస్తున్నారో కూడా జనానికి ఎఫ్ఐఆర్ కాపీ చూపరట. మోదీ రాజ్యంలో న్యాయ సూత్రాలు ఇంకా ఏమైనా మిగిలివున్నాయా? 1977 అత్యవసర పరిస్థితి కంటే ఇది దారుణంగా మారుతోంది.

– ప్రశాంత్ భూషణ్, న్యాయవాది

రిస్కీ గేమ్



ఇండియా ప్రమాదకరమైన ఆట ఆడుతోంది. అది కెనడా పట్ల తన అసంతృప్తిని వెళ్లగక్కే సంకేతం ఇవ్వాలనుకుంటోంది. స్థూలంగా పాశ్చాత్య దేశాలకూ, మిగతా ప్రపంచానికీ మేము ఎదుగుతున్న శక్తి అని చాటాలనుకుంటోంది. కానీ బలహీనతలు స్థిరంగా ఉన్నప్పుడు దూకుడుతో కూడిన విదేశాంగ విధానంతో ఎదురుదెబ్బలు తగలొచ్చు.

– థామస్ జ్యానో, అసోసియేట్ ప్రొఫెసర్

కొత్త పవర్



జనాభాలో ఇండియా ఈ ఏడాది చైనాను అధిగమించింది. అలాగే అది ప్రపంచంలో అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థ. పైగా మాంద్యపు సూచనలు ఏ కోశానా లేవు. ప్రస్తుతం ఇండియాకు పాశ్చాత్య దేశాల అవసరం కన్నా, చైనాతో వ్యవహరించడానికి పాశ్చాత్య దేశాలకు ఇండియా అవసరం ఎక్కువ.

– వెలీనా చకరోవా, వ్యూహాత్మక అంశాల వ్యాఖ్యాత

ఎందుకు కుటుంబం?



కన్సల్టేషన్ కోసం తల్లిదండ్రులు తమ టీనేజ్ పిల్లల్ని వెంట తెచ్చుకుంటున్నప్పుడు నేనొకటి గమనిస్తున్నాను. తల్లిదండ్రులకు ఏమైందో చూడకుండా, వాళ్లు తమ ఫోన్లలో మునిగిపోతున్నారు. ఒక తండ్రితో ఆయనది క్యాన్సర్ అయివుంటుందేమోనని అంటున్నాను; వాళ్లబ్బాయి ఉదాసీనంగా ఫోన్ చూస్తున్నాడు. నన్ను పాతకాలపు మనిషి అనుకున్నాసరే, ఆ తండ్రి పట్ల బాధేసింది. చాలామందికి కుటుంబాలున్నాయి గానీ, అవి ఆచరణలో అనాథాశ్రమాలు.

– కార్తీక్ బాలచందర్, ఎండోక్రైనాలజిస్ట్

ఈ విమర్శ సరైనదేనా?

సామాజిక, భౌతిక పరిణామాలు కొన్ని సాహిత్య, సాంస్కృతిక, రాజకీయ స్వరూపాలను మారుస్తాయి. అప్పుడు అస్తిత్వ సంఘర్షణ మొదలవుతుంది. ఈ అలజడిలో బాణీ కొత్త దారులు అన్వేషిస్తుంది. అది చరిత్రను తడిమి, శాసనాలను తుడిచి సరికొత్త పాటగా జీవం పోసుకుంటుంది. ఇదీ కాల ధర్మం.

60 ఏళ్ల ప్రత్యేక తెలంగాణ ఆకాంక్ష సిద్ధించిది. కేసీఆర్ నాయకత్వంలో ఇప్పుడు తెలంగాణ తెప్పరిల్లింది. ఇప్పుడు సృజనకారులు ఎటు వైపు అడుగులు వేయాలి? వారు ప్రభుత్వంలో భాగం కాకూడదా అనే చర్చ నడుస్తోంది. ఏపూరి సోమయ్య జెండా మార్చిండు. కానీ పంథా మార్చలేదు. తన బలమే పాట. పాటే ఆయన పంథా. రాజ్య హింస జరిగినప్పుడు గొంతెత్తిన ఆ గాయకుడు ఇప్పుడు మరో రూపంలోకి మారాడు. దీని కెందుకింత రాద్ధాంతం. గోరటి వెంకన్నకు ఎమ్మెల్సీ ఇచ్చినప్పుడు ఇదే రాద్ధాంతం. వేదికల మీద ఇప్పటికీ నిప్పులు పోసుకుంటున్న వాళ్లను చూస్తున్నాం. వెంకన్న జాతి స్పృహ ఉన్న బహుజన కవి గాయకుడు. ఆయనకు చట్ట సభలో ఇంత చోటు దొరికితే అది సాహిత్య లోకానికి జరిగిన సన్మానం కిందకు రాదా? ఉత్పత్తి జాతులు కట్టుబానిసలుగా... కట్టప్పలుగానే రాజ్యాధికారానికి ఆవల ఉండాలా?

ఇక్కడో సందర్భాన్ని గుర్తు చేయాలి. ఏపూరి సోమన్న ఊరు మా ఊరుకు రెండు ఆమడల దూరం. మాది కర్విరాల కొత్తగూడెం. ఆయనది వెలిశాల. ఒకటే నియోజకవర్గం. ఇక్కడ బతకాలి అంటే బండైనా కొట్టాలి. హత్యలైనా చేయాలి. రాయలసీమను మించిన ఫ్యాక్షనిజం తుంగతుర్తి పల్లెల్లో ఉండేది. ఎదిగిన పోరలకు పనులు దొరక్క రాజకీయ గ్రూపుల్లో చేరి కత్తి పట్టేటోళ్లు. బీడు భూముల్లో నెత్తుర్లు పారించేది.

తెలంగాణ సిద్ధించిన తరువాత గోదావరి పంట చేల వైపు మళ్ళింది. 'మిషన్ కాకతీయ'తో ఊరూరా చెరువులు నిండినయి. ప్రతి మడి తడిసింది. పల్లె పచ్చబడ్డది. మలి తరం పిల్లలు బడిబాట పట్టిండ్రు. హత్యలు ఆగిపోయినయి. సుఖశాంతులు వెల్లివిరుస్తున్నయి. ఇంతకు మించిన గొప్ప విప్లవం ఇంకేం ఉంటుంది. ఒక్క సోమన్న ఏమిటి? బుద్ధిజీవులంతా ఇటువంటి అద్భుతమైన ప్రగతికి ప్రణమిల్లాల్సిందే కదా! మతోన్మాదం బలవంతంగా మీద పడి తరుముతున్న వేళ, దాన్ని ఆపటానికి ప్రగతిశీల సృజన శక్తుల పునరేకీకరణ జరుగుతోంది. ఇప్పుడది చారిత్రక అవసరం. మనస్ఫూర్తిగా ఆహ్వానిద్దాం.

– వర్ధెల్లి వెంకటేశ్వర్లు, ఏపీ మీడియా కో–ఆర్డినేటర్

ఆయన కోసం నిరసనలా?

'చంద్రబాబు నాయుడు అరెస్ట్ పై తెలంగాణలో నిరసనలు చేస్తే తప్పేంటి?' ఈ వ్యాఖ్యలు టీడీపీ నాయకుల్లో, ఆంధ్రరాష్ట్రం వారో, చంద్రబాబు అభిమానులో చేస్తే తప్పు పట్టాల్సిన అవసరం కించిత్ కూడా లేదు. కానీ, కాంగ్రెస్ పార్టీ తెలంగాణ అధ్యక్షుడి నోట్లో నుంచి ఈ ఆణిముత్యాలు రాలడమే అసలు పంచాయితీ. తెలంగాణలో ఒక్కొక్కటిగా పరిశ్రమలను మూసేస్తున్నా కార్మికులు నిరసనలు కూడా తెలుపకుండా నిషేధాజ్ఞలు విధించి, నరనరాన తెలంగాణ వ్యతిరేకతను నింపుకున్న నారా చంద్రబాబు నాయుడుకు మద్దతుగా రేవంత్ రెడ్డి మాట్లాడటం తెలంగాణ సమాజాన్నీ, ఉద్యమకారులనూ అవమానించడమే.



రేవంత్ రెడ్డి తెలంగాణ కాంగ్రెస్ అధ్యక్షుడా లేక టీడీపీ నాయకుడా అనే అనుమానం కలగడం కొత్త కాదు. కానీ, ఇటీవల ఆయన బాహాటంగా అనుసరిస్తున్న తీరు 'పోశమ్మ పోగు చేస్తుంటే, మైసమ్మ మాయం చేసిన' తీరోలె ఉంది. తెలంగాణలో కాంగ్రెస్‌ను అధికారంలోకి తెచ్చేందుకు కాంగ్రెస్ హైకమాండ్ ఓవైపు, సీనియర్లు మరోవైపు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. కానీ, రేవంత్ తీరు అందుకు భిన్నంగా ఉంది. అందువల్లే రేవంత్ రెడ్డిని కాంగ్రెస్ పార్టీ పెద్దలే నమ్మడం లేదు. వచ్చే ఎన్నికల్లో తెలంగాణలో కాంగ్రెస్ గెలుపొందడం కన్నా ఏపీలో టీడీపీ అధికారంలోకి రావడంపైనే రేవంత్ రెడ్డి దృష్టి పెట్టినట్టు ఆయన వ్యాఖ్యలే రూఢి పరుస్తున్నాయి. కొన్నాళ్ల క్రితం టీడీపీని రేవంత్ వీడినప్పటికీ రాహుల్ గాంధీ కన్నా చంద్రబాబుకే ఆయన వీర విధేయుడిగా కనిపిస్తున్నారు. అర్జంటుగా బాబును సీఎంగా చేసెయ్యాలనే కసి 'ఓటు ఫర్ నోటు' కేసులో ముద్దాయి అయిన రేవంత్ లో కనిపిస్తోంది.

కర్ణాటకలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక తెలంగాణ కాంగ్రెస్‌కు కొంత అనుకూల వాతావరణం ఏర్పడింది. కానీ రేవంత్ రెడ్డి వ్యాఖ్యలతో ఈ వాతావరణం చెడిపోతోంది. యాభై ఏళ్ల కాంగ్రెస్ పాలనలో కన్నా పద్నాలుగేళ్ల టీడీపీ ప్రభుత్వ హయాం లోనే తెలంగాణ సర్వనాశనం అయింది. చంద్రబాబు సీఎంగా ఉన్నప్పుడుఏ తెలంగాణలో ఆర్థిక విధ్వంసం కొనసాగింది. ప్రభుత్వ రంగ కంపెనీల మూత ఓవైపు, ఉద్యమకారులు, కవులు, కళాకారుల హత్యలు మరో వైపు సమాంతరంగా కొనసాగాయి. మూతపడిన కంపెనీల కార్మికలోకం అన్నమో రామచంద్రా అంటూ రోడ్డున పడ్డారు. చంద్రబాబు హయాంలోనే రైతుల ఆకలి చావులు, ఆత్మహత్యలు, కరువులు, వలసలు అధికమైనాయి. ఈ ఆర్థిక విధ్వంసం నేపథ్యంలోనే తెలంగాణ మలిదశ ఉద్యమం ఊపందుకుంది.

తెలంగాణ కోసం గొంతెత్తిన బెల్లి లలిత, ముక్కా కరుణాకర్, ఇక్కిరి సిద్దులు, శ్రీరాముల రాములు, మారోజు వీరన్న వంటి తెలంగాణ ఉద్యమకారులను బాబు హత్య చేయించాడు. ఒక్క భువనగిరిలోనే పదహారు మంది ఉద్యమకారులను హత్య చేయించి, నయీం మీద నేరం తోసేశాడు. హత్యలతో సంబంధం లేని నయీంను చివరికి పెద్ద తోపుగా మార్చాడు. తెలంగాణ పాట పాడినందుకు గద్దర్ మీద తూటాల వర్షం కురిపించాడు. ఇది జనానికి గుర్తు లేదన్నట్టుగా గద్దర్ మరణానంతరం తగుదునమ్మా అంటూ ఆయన ఇంటికెళ్లి పరామర్శించాడు.

నక్కజిత్తుల నారా చంద్రబాబు మీడియానూ, అధికార వర్గాన్నీ, చట్టసభలనూ, ఇతర వ్యవస్థలనూ అప్పుడూ, ఇప్పుడూ, ఎప్పుడైనా తనకు అనుకూలంగా సమర్థవంతంగా మల్చుకోవడంలో దిట్ట. అందులో రేవంత్ రెడ్డి చాలా చిన్న పాత్రధారుడు.


కర్ణాటక వలె తెలంగాణలో కూడా 'ఎద్దేలు కర్ణాటక' (మేలుకో తెలంగాణ లేదా ఉఠో తెలంగాణ) వంటి పౌర సంఘాల ఐక్య సంఘటన ఏర్పాటు చేసుకోవడానికి ప్రధాన అడ్డంకి రేవంత్ రెడ్డి లాంటి వారి నాయకత్వమే. కర్ణాటకలో వలె సిద్ధరామయ్య లాంటి పోస్టర్ బాయ్, స్ఫూర్తిదాయకమైన, అనుభవజ్ఞుడైన నాయకుడు తెలంగాణలో లేడు. పార్టీ కోసం ఖర్చు చేయగల డీకే శివకుమార్ లాంటి నాయకుడు కూడా ఇక్కడ లేడు. ఫలితంగా మచ్చలేని నాయకత్వం లేక డబ్బు వెచ్చించగల విశాల హృదయుడు లేక పరస్పర సంఘర్షణలు కావాలనే రెచ్చగొట్టే నాయకత్వం కింద కాంగ్రెస్ పార్టీ తెలంగాణలో నలిగిపోతున్నది.

– కౌడె సమ్మయ్య, జర్నలిస్ట్

బుద్ధుడు – పతంజలి

బుద్ధుడు క్రీ.పూ. 6వ శతాబ్దివాడు కాగా, తరువాత వచ్చిన పతంజలి 2వ శతాబ్దివాడు. పతంజలి 'యోగసూత్రాలు' రచించే నాటికి బుద్ధుడి బోధనలు ప్రజల్లో ఇంకా ప్రచారంలో ఉనాయి. పతంజలి తన రచనావ్యాసంగమప్పుడు ఆ బోధనలను కూడా పరిగణన లోనికి తీసుకొని ఉండవచ్చు. ఆ కారణం చేత బుద్ధుడి బోధనలకు, పతంజలి యోగ సూత్రాల్లో చెప్పిన విషయాలకు పోలిక కనిపిస్తుంది.

బుద్ధుడి ప్రవచనాల్లో ముఖ్యమైనది దుఃఖం గురించినది. దుఃఖం, దుఃఖ సముదాయం, దుఃఖ నిరోధం, దుఃఖ నిరోధ మార్గం అనే నాలుగు ఆర్య సూత్రాలు దుఃఖం గురించినవే. బుద్ధుని ప్రకారం ప్రపంచం అంతటా దుఃఖమే పరుచుకుని ఉన్నది. సంతోషంలోనూ దుఃఖమే దాగి ఉన్నది. ఎలాగంటే, సంతోషం ఎప్పుడు అంతమవుతుందో అనే ఆందోళన సంతోషంగా ఉండనీయదు.



జ్యోతిర్మయం

సంయోగం చెందినవన్నీ వియోగం కాక తప్పదు. వియోగం దుఃఖ హేతువు. ఈ విధంగా సంతోషం కూడా పరిణామంలో దుఃఖంగా మారుతుంది. ఇదే విషయాన్ని పతంజలి తన 'యోగదర్శనం సాధనపాదం' 15వ సూత్రంలో 'దుఃఖమేవ సర్వం వివేకినః' అని చెబుతాడు. వివేకంతో యోచించే వానికి ప్రపంచమంతటా దుఃఖమే ఉన్నదని దీనర్థం.

సుత్తపిటకం 'అంగుత్తరనికాయం' ప్రకారం ఇతరుల యందు మైత్రీ భావన వంటి వాటిని దృఢంగా పెంపొందించుకున్న వానికి అనేక శక్తులు సమకూరుతాయి. విభూతి పాదం 23వ సూత్రంలో పతంజలి కూడా ఈ భావాన్ని 'మైత్రి మొదలైన భావనల యందు సంయమము సిద్ధించిన వాని శక్తి అమోఘమవుతుంది' అని చెబుతాడు.

సుత్తపిటకం మధ్యమ నికాయంలో 'అజ్ఝత్తసం పసాదో' అనే పదాన్ని ఆంతరంగిక ప్రశాంతత అనే అర్థంలో బుద్ధుడు వాడతాడు. సమాధి పాదం 47వ సూత్రంలో 'ఆధ్యాత్మ ప్రసాదః' అనే పదాన్ని అదే అర్థంలో పతంజలి 'నిర్విచార వైశారద్యే ఆధ్యాత్మ ప్రసాదః' అని వాడాడు. ఎస్.ఎన్. టాండన్ బుద్ధవచనాలకు పతంజలి యోగసూత్రాలకు గల సామ్యం మీద ఈ వరకే ఇంగ్లీషులో ఒక గ్రంథాన్ని వెలువరించాడు.

– దీవి సుబ్బారావు

'నేటి నుంచి సాగర్ ఎడమకాల్వకు నీటివిడుదల'



సాక్షి, హైదరాబాద్: నాగార్జునసాగర్ ప్రాజెక్టు ఎడమకాల్వ కింద నల్లగొండ, ఖమ్మం జిల్లాల పరిధిలోని ఆయకట్టుకు శుక్రవారం నుంచి సాగునీటిని విడుదల చేయాలని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు నిర్ణయించారు. సరైన వర్షాలు కురవకపోవడంతో వరిచేన్లు దెబ్బతినే ప్రమాదం ఉందని ఆయా ప్రాంతాల రైతాంగం, శాసనసభ్యులు, మంత్రులు గత నాలుగైదు రోజులుగా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వీరి నుంచి వచ్చిన విజ్ఞప్తుల మేరకు సీఎం కేసీఆర్ గురువారం నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. తెలంగాణ వాటాలోని కృష్ణాజలాలను సాగర్ ఎడమకాల్వ కింద ఉన్న వరిపొలాలకు విడుదల చేయాలని ఆదేశించారు. 20 రోజుల తర్వాత మరో తడి కోసం నీటిని విడుదల చేయనున్నట్లు సీఎం తెలిపారు. సరిపడా వానలు లేకపోవడమేకాక సాగర్ రిజర్వాయర్‌లో ఆశించిన మేరకు నీటినిల్వలు లేని కారణంగా సాగునీటిని పొదుపుగా వాడుకొని వరిపంటను కాపాడుకోవాలని రైతాంగానికి పిలుపునిచ్చారు. సాగర్ ఎడమకాల్వకు నీళ్ల విడుదల చేస్తున్న నేపథ్యంలో ఆయా జిల్లాల మంత్రులు, ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గాల్లో పర్యవేక్షిస్తూ, రైతుల చివరి పొలాలు, చివరి ఆయకట్టు దాకా సాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

లండన్ బ్రిడ్జ్ ఇండియా సదస్సుకు కవిత



సాక్షి, హైదరాబాద్: 'మహిళా రిజర్వేషన్ చట్టం – ప్రజాస్వామ్య ప్రక్రియలో మహిళల భాగస్వామ్యం'.. అనే అంశంపై లండన్‌లో ఈ నెల 7న జరగనున్న సదస్సులో పాల్గొనేందుకు ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత గురువారం హైదరాబాద్ నుంచి బయలుదేరి వెళ్లారు. బ్రిడ్జ్ ఇండియా సంస్థ లండన్‌లోని వెస్ట్‌మినిస్టర్ సెంట్రల్ హాల్‌లో నిర్వహిస్తున్న ఈ సదస్సులో ఎమ్మెల్సీ కవిత కీలకోపన్యాసం చేస్తారు. చట్టసభల్లో మహిళలకు రిజర్వేషన్ల కోసం జరిగిన ఉద్యమ తీరుతెన్నులు, మహిళా రిజర్వేషన్ల ద్వారా ఒనగూరే మేలు, చట్టసభల్లో ప్రజాస్వామ్య ప్రక్రియలో మహిళల భాగస్వామ్యం పెంచడం, రాజకీయాల్లో మహిళల పాత్ర వంటి అంశాలపై ఆమె ప్రసంగిస్తారు. అనంతరం అదేరోజు ఉదయం లండన్ లోని అంబేడ్కర్ హౌస్ మ్యూజియంను సందర్శిస్తారు. శనివారం నేషనల్ స్టూడెంట్స్ యూనియన్ అండ్ అలుమ్ని యూనియన్ యూకే నిర్వహించే రౌండ్ టేబుల్ సమావేశంలోనూ కవిత ప్రసంగిస్తారు.

రెండు ఎన్జీఓలతో మహిళా భద్రత విభాగం ఒప్పందం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో చిన్నారుల, మానవ అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు అనుసరించాల్సిన విధానాలు, న్యాయ సహాయం తదితర అంశాలపై శిక్షణ కోసం తెలంగాణ రాష్ట్ర మహిళా భద్రత విభాగం రెండు ఎన్జీఓలతో గురువారం ఒప్పందం కుదుర్చుకుంది. మై చాయిసెస్ ఫౌండేషన్ (ఎంసీఎఫ్), ఇంటర్నేషనల్ జస్టిస్ మిషన్ (ఐజేఎం)ల ప్రతినిధులతో కలిసి మహిళా భద్రత విభాగం అడిషనల్ డీజీ శిఖాగోయెల్ ఒప్పందాలపై సంతకాలు చేశారు. ఈ ఒప్పందాల్లో భాగంగా ఈ రెండు ఎన్జీఓలు తెలంగాణ పోలీసులకు శిక్షణ మెటీరియల్‌ను, ఎస్‌ఓపీ(స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్స్)ను రూపొందించనున్నాయి.

సిక్కిం వరదల్లో నిజామాబాద్ ఆర్మీ జవాన్ మృతి

బోధన్: సిక్కింలో మంగళవారం అర్ధరాత్రి సంభవించిన వరదల్లో చిక్కుకొని చనిపోయిన ఆర్మీ జవాన్లలో నిజామాబాద్ జిల్లా సాలూర మండలం కుమ్మన్‌పల్లికి చెందిన నీరడి గంగాప్రసాద్ ఉన్నట్లు ఆర్మీ అధికారుల నుంచి కుటుంబసభ్యులకు సమాచారం వచ్చింది. గురువారం మృతదేహం లభ్యం కాగా, పోస్టుమార్టం కోసం పశ్చిమ బెంగాల్‌లోని జల్‌పాయ్‌గిరి జిల్లా కేంద్ర ఆస్పత్రికి ఆర్మీ అధికారులు తరలించారు. శుక్రవారంరాత్రి స్వగ్రామానికి మృతదేహం చేరుకునే అవకాశాలున్నాయి. ఎమ్మెల్యే షకీల్ సమకూర్చిన విమానంలో మృతుడి తమ్ముడు సుధాకర్, మరో బంధువు దిలీప్ బయలుదేరి వెళ్లి ఘటనాస్థలానికి చేరుకున్నారు. పశ్చిమబెంగాల్‌లోని బినాగుడి ఆర్మీ హెడ్‌క్వార్టర్‌లో విధులు నిర్వహిస్తున్న గంగాప్రసాద్ శిక్షణలో భాగంగా 20 రోజుల క్రితం సిక్కింలోని జులుక్ ప్రాంతానికి వెళ్లి తిరుగు పయనమయ్యారు. అతి భారీవర్షాల వల్ల ఉప్పొంగిన తీస్తా నది వరదల్లో గల్లంతయ్యారు. గంగాప్రసాద్‌ది నిరుపేద దళిత కుటుంబం. ఆయన ఎనిమిదేళ్ల క్రితం ఆర్మీ జవాన్‌గా ఎంపికయ్యాడు. గంగాప్రసాద్‌కు భార్య శిరీష, ఇద్దరు కుమారులు హర్ష(6), ఆదిత్య(3) ఉన్నారు.

పోలవరం ఫలాలు త్వరగా అందాలి

- ప్రాజెక్టు తాజా అంచనాలకు ఆమోదం తెలపండి
- కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు సీఎం వైఎస్ జగన్ విజ్ఞప్తి
- రూ.55,548.87 కోట్లకు సాంకేతిక సలహా కమిటీ ఆమోదం
- దీనిని కేంద్ర ఆర్థిక శాఖ ఆమోదించేలా చూడండి
- విద్యుత్‌కు సంబంధించి కేంద్ర మంత్రి ఆర్కే సింగ్‌తోనూ సీఎం చర్చలు



కేంద్రమంత్రి ఆర్కే సింగ్‌తో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

సాక్షి, న్యూఢిల్లీ: పోలవరం ప్రాజెక్టుకు సంబంధించి సవరించిన అంచనాలకు వెంటనే ఆమోదం తెలపాలని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. వీలైనంత త్వరగా ప్రాజెక్టు పూర్తి చేసి, ఫలితాలు అందించడానికి కేంద్రం సహకరించాలని కోరారు. గురువారం సాయంత్రం సీఎం జగన్.. కేంద్ర మంత్రితో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రానికి రావాల్సిన నిధులు, పెండింగ్ బకాయిలపై చర్చించారు. పోలవరం ప్రాజెక్టును సత్వరమే పూర్తి చేయాల్సిన ఆవశ్యకతను వివరించారు. ప్రజలకు ప్రాజెక్టు ఫలితాలు అందించడానికి సహకరించాలని కోరారు. పూర్తి నిర్మాణ వ్యయంపై తాజా అంచనాలకు ఆమోదం తెలపాలన్నారు. 2017–18 ధరల సూచీ ప్రకారం పోలవరం ప్రాజెక్టు వ్యయం రూ.55,548.87 కోట్లుగా ఇప్పటికే టెక్నికల్ అడ్వైజరీ కమిటీ ఆమోదం తెలిపిందని గుర్తు చేశారు. దీనికి ఆర్థిక శాఖ ఆమోదం తెలపాలని విజ్ఞప్తి చేశారు. ప్రాజెక్టు పనులను వేగంగా ముందుకు తీసుకెళ్లేందుకు అడ్‌హాక్‌గా నిధులు విడుదల చేయాలన్న రాష్ట్ర ప్రభుత్వ విజ్ఞప్తి మేరకు రూ.12,911.15 కోట్ల విడుదలకు ఆమోదం లభించడం సంతోషకరమని, అయితే దీన్ని పునఃపరిశీలించి తాజాగా అంచనాలను రూపొందించామని తెలిపారు. లైడార్ సర్వే ప్రకారం అదనంగా 36 ఆవాసాల్లో ముంపు కుటుంబాలను రక్షిత ప్రాంతాలకు తరలించాల్సి ఉందని, 2022 జూలైలో వచ్చిన భారీ వరదల వల్ల తలెత్తిన పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని తొలి దశ ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా చేయాల్సిన పనులపై ఈ అంచనాలు రూపొందించామని చెప్పారు. పోలవరం తొలి దశను పూర్తి చేయడానికి ఇంకా రూ.17,144.06 కోట్లు అవసరమవుతాయని, ఆ మేరకు నిధులు విడుదలచేయాలని కోరారు.

రూ.1,355 కోట్లు రీయింబర్స్ చేయాలి

ప్రాజెక్టు నిర్మాణం నిమిత్తం రాష్ట్ర ప్రభుత్వం సొంత నిధుల నుంచి ఖర్చు చేసిన రూ.1,355 కోట్లను రీయింబర్స్ చేయాలని సీఎం జగన్ కేంద్ర మంత్రికి విజ్ఞప్తి చేశారు. తెలంగాణ రాష్ట్రం చెల్లించాల్సిన విద్యుత్ బకాయిలు సుదీర్ఘ కాలంగా పెండింగులో ఉన్న విషయాన్ని గుర్తు చేశారు. రూ.7,359 కోట్లను తెలంగాణ ప్రభుత్వం విద్యుత్ బకాయిల రూపంలో చెల్లించాల్సి ఉందన్నారు. 2014 జూన్ నుంచి 2017 జూన్ వరకు సరఫరా చేసిన విద్యుత్‌కు ఇప్పటి వరకు చార్జీలు చెల్లించలేదని, తొమ్మిదేళ్లుగా ఈ సమస్య పెండింగులో ఉందని గుర్తు చేశారు. తెలంగాణ నుంచి సొమ్ము వచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం కేంద్ర విద్యుత్ శాఖ మంత్రి ఆర్కే సింగ్‌తో ముఖ్యమంత్రి భేటీ అయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర విద్యుత్ రంగానికి సంబంధించి పలు అంశాలపై చర్చించారు. అనంతరం కేంద్ర విద్యుత్ శాఖ మంత్రి ఆర్కే సింగ్ మీడియాతో మాట్లాడారు. ఏపీలో విద్యుత్ రంగం అభివృద్ధిపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో చర్చించానన్నారు. ఏపీలో విద్యుత్ రంగం పనితీరుపై కేంద్రం సంతృప్తిగా ఉందని స్పష్టం చేశారు. రీ వ్యాంప్డ్ డిస్ట్రిబ్యూషన్ సెక్టార్ స్కీం (ఆర్‌డీఎస్ఎస్)కు ఏపీ క్వాలిఫై అయిందని తెలిపారు.

'స్కిల్ స్కామ్' సూత్రధారి, లబ్ధిదారు చంద్రబాబే..

ఆధారాలతో సహా ఏసీబీ కోర్టుకు వివరించిన అదనపు ఏజీ సుధాకర్ రెడ్డి

- కొల్లగొట్టిన రూ.371 కోట్లలో రూ.27 కోట్లు టీడీపీ ఖాతాకు చేరాయని వెల్లడి
- ఆ రికార్డులను న్యాయస్థానానికి సమర్పించిన అదనపు ఏజీ
- మిగిలిన నిధులూ షెల్ కంపెనీల ద్వారా చంద్రబాబుకే చేరాయని స్పష్టీకరణ
- కీలక దశలో దర్యాప్తు.. కాబట్టి బాబుకు బెయిల్ ఇవ్వొద్దని వినతి
- విచారణ నేటికి వాయిదా

సాక్షి, అమరావతి: టీడీపీ ప్రభుత్వ హయాంలో రూ.371 కోట్లు కొల్లగొట్టిన స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ కుంభకోణంలో అప్పటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడే ప్రధాన సూత్రధారి, లబ్ధిదారు అనేందుకు ఆధారాలను సీఐడీ ఒక్కొక్కటిగా కోర్టు ముందుంచుతోంది. ఈ కుంభకోణంలో కొల్లగొట్టిన సొమ్ములో రూ. 27 కోట్లు టీడీపీ బ్యాంకు ఖాతాకు చేరిన బ్యాంకు స్టేట్‌మెంట్లు, రికార్డులను సీఐడీ తరఫున అదనపు అడ్వొకేట్ జనరల్ (ఏఏజీ) పొన్నవోలు సుధాకర్‌రెడ్డి గురువారం ఏసీబీ న్యాయస్థానం ముందుంచారు. ఈ కుంభకోణం ప్రధాన సూత్రధారి, లబ్ధిదారు చంద్రబాబేనని ఏఏజీ స్పష్టంచేశారు. దారి మళ్లించిన స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ నిధులు షెల్ కంపెనీల ద్వారా చంద్రబాబుకే చేరాయని చెప్పారు. అందులో రూ.27 కోట్లు టీడీపీ బ్యాంకు ఖాతాలో జమ అయ్యాయని చెబుతూ ఆ రికార్డులను న్యాయస్థానానికి సమర్పించారు. కేసు దర్యాప్తు కీలక దశలో ఉన్న ప్రస్తుత తరుణంలో చంద్రబాబుకు బెయిల్ మంజూరు చేయకూడదని న్యాయస్థానాన్ని కోరారు. ఈ కుంభకోణం కేసులో అరెస్టయి రిమాండ్ ఖైదీగా ఉన్న చంద్రబాబు దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌ను విజయవాడ ఏసీబీ న్యాయస్థానం వరుసగా రెండో రోజు గురువారం విచారించింది. సీఐడీ తరఫున ఏఏజీ సుధాకర్ రెడ్డి వాదనలు వినిపిస్తూ.. ఈ కుంభకోణం ద్వారా అక్రమంగా తరలించిన నిధుల్లో రూ.27 కోట్లు టీడీపీ బ్యాంకు ఖాతాల్లోకి చేరడం సాధారణ విషయం కాదని చెప్పారు. ఈ అంశంపై విచారించేందుకు టీడీపీ ఆడిటర్‌ను ఈ నెల 10న సీఐడీ విచారణకు పిలిచిందని తెలిపారు. ఈ కుంభకోణంలో మిగిలిన నిధులు కూడా షెల్ కంపెనీల ద్వారా చంద్రబాబుకు ఎలా చేరాయో వివరించారు. ఆర్థిక శాఖ అనుమతి లేకుండానే నిధులు విడుదల చేశారని చెప్పారు. నిధుల విడుదలకు అప్పటి ఆర్థిక శాఖ కార్యదర్శి సునీత లిఖితపూర్వకంగా తెలిపిన అభ్యంతరాలను న్యాయస్థానానికి సమర్పించారు. ఈ కుంభకోణంపై సీఐడీ దర్యాప్తు కీలక దశలో ఉందన్నారు. ఈ తరుణంలో చంద్రబాబుకు బెయిల్ ఇస్తే సాక్షులను బెదిరించి కేసు దర్యాప్తును ప్రభావితం చేసే అవకాశాలున్నాయని తెలిపారు. నిధుల తరలింపులో కీలక పాత్ర పోషించిన చంద్రబాబు మాజీ పీఎస్ పెండ్యాల శ్రీనివాస్‌ను సీఐడీ విచారణకు హాజరుకావాలని నోటీసులు ఇవ్వగానే ఆయన పరారైన విషయాన్ని మరోసారి న్యాయస్థానం దృష్టికి తీసుకొచ్చారు. స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ నిధులు దారి మళ్లాయని గతంలో 164 సీఆర్‌పీసీ కింద వాంగ్మూలం ఇచ్చిన అప్పటి ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి పీవీ రమేశ్ ఇటీవల అందుకు భిన్నంగా వ్యాఖ్యలు చేస్తున్న విషయాన్ని కోర్టు దృష్టికి తీసుకువచ్చారు. చంద్రబాబు సాక్షులను ప్రభావితం చేస్తున్నారనడానికి ఇవన్నీ ఉదాహరణలని చెప్పారు. దర్యాప్తు సక్రమంగా సాగి మొత్తం కుట్రను వెలికితీసే వరకూ చంద్రబాబుకు బెయిల్ ఇవ్వొద్దని కోరారు. రెండు రోజుల కస్టడీలో విచారణకు చంద్రబాబు సహకరించలేదని, అందువల్ల ఆయన్ని మరోసారి కస్టడీలోకి తీసుకుని విచారించేందుకు అనుమతించాలని కోరారు. చంద్రబాబు తరఫున ఢిల్లీ నుంచి వచ్చిన న్యాయవాది ప్రమోద్ కుమార్ దూబే వాదనలు వినిపిస్తూ స్కిల్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు ఒప్పందంతో అప్పటి సీఎం చంద్రబాబు పాత్ర ముగిసిందని, ఆ తరువాత జరిగే అవినీతి, అక్రమాలతో ఆయనకు సంబంధం లేదని అన్నారు. సాంకేతికంగా ఈ ప్రాజెక్టుతో చంద్రబాబుకు సంబంధం లేదన్నారు. ముఖ్యమంత్రి హోదాలోనే చంద్రబాబు నిధుల మంజూరుకు అనుమతించారని చెప్పారు. కాబట్టి చంద్రబాబును మరోసారి కస్టడీకి ఇవ్వొద్దని, బెయిల్ మంజూరు చేయాలని కోరారు. చంద్రబాబు బెయిల్, కస్టడీ పిటిషన్లపై ఇరువర్గాల వాదనలను శుక్రవారం కూడా వింటామని ఏసీబీ న్యాయస్థానం తెలిపింది. విచారణను శుక్రవారానికి వాయిదా వేసింది.

యూరియా గుప్పించారు

- పంట సాగు తగ్గినా భారీగా పెరిగిన యూరియా వినియోగం
- వానాకాలం సీజన్లో 10 లక్షల టన్నుల వాడకం
- గత వానాకాలం సీజన్ కంటే 1.29 లక్షల టన్నులు అధికం

సాక్షి, హైదరాబాద్: రైతులు పంట పొలాల్లో యూరియాను గుప్పిస్తున్నారు. ఇలా ఏడాదికేడాదికి యూరియా వినియోగం పెరుగుతోందని వ్యవసాయ వర్గాలు చెబుతున్నాయి. అవసరమున్నా లేకున్నా కొందరు రైతులు యూరియాను విరివిగా వాడుతున్నారని అంటున్నారు. దీనివల్ల భూసారంపై ప్రభావం చూపుతుందని చెబుతున్నారు. ఈ ఏడాది వానాకాలంలో 10.34 లక్షల మెట్రిక్ టన్నుల యూరియాను రైతులు పంట పొలాల్లో వాడారని వ్యవసాయశాఖ వెల్లడించింది. ఈ మేరకు ప్రభుత్వానికి నివేదిక పంపించింది. 2021–22 వానాకాలం సీజన్‌లో 9.50 లక్షల మెట్రిక్ టన్నులు, 2022–23 వానాకాలం సీజన్‌లో 9.05 లక్షల ఎకరాల్లో యూరియా వినియోగించగా, ఈసారి ఏకంగా 1.29 లక్షల మెట్రిక్ టన్నులు అదనంగా వాడటం గమనార్హం. ఆగస్టు నెలలో 3.42 లక్షల మెట్రిక్ టన్నులు, సెప్టెంబర్ నెలలో 3.44 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా వినియోగించారు.

సాగు తగ్గినా పెరిగిన యూరియా వినియోగం...

వాస్తవానికి ఈ ఏడాది యూరియా వాడకం తగ్గుతుందని భావించారు. కానీ పెరిగింది. దీంతో కేంద్ర కేటాయింపుల కంటే ఎక్కువగా యూరియాను రాష్ట్ర వ్యవసాయశాఖ అందుబాటులోకి తీసుకొచ్చింది. వాస్తవంగా గత ఏడాది వానాకాలం సీజన్ కంటే ఈ ఏడాది వానాకాలం సీజన్‌లో పంటల సాగు విస్తీర్ణం తగ్గింది. గత ఏడాది వానాకాలం సీజన్‌లో 1.47 కోట్ల ఎకరాల విస్తీర్ణంలో అన్ని రకాల పంటలు సాగు కాగా, ఈ ఏడాది వానాకాలం సీజన్‌లో 1.26 కోట్ల ఎకరాల్లోనే పంటలు సాగయ్యాయి. అంటే 21 లక్షల ఎకరాల్లో పంటల సాగు విస్తీర్ణం తగ్గింది. కానీ యూరియా వాడకం మాత్రం గతేడాది కంటే ఏకంగా 1.29 లక్షల మెట్రిక్ టన్నులు అదనంగా పెరగడం విశేషం.

పలుమార్లు విత్తనాలు విత్తడంతో పెరిగిన వినియోగం


ఈసారి రుతుపవనాలు ఆలస్యమయ్యాయి. కీలకమైన సమయంలో వర్షాలు లేకపోవడంతో పత్తి, ఆరుతడి పంటల సాగు ఆలస్యమైంది. కొన్నిచోట్ల అక్కడక్కడ వర్షాలు కురవడంతో రైతులు పత్తి వంటి వాటిని వేశారు. కానీ ఆ తర్వాత వర్షాలు రాకపోవడంతో వేసిన పంటలు ఎండిపోయాయి. దీంతో మొక్కలు భూమిలోనే మాడిపోయాయి. తర్వాత వర్షాలు కురిశాక మళ్లీ దున్ని విత్తనాలు చల్లారు. ఇలా పలుమార్లు విత్తనాలు చల్లడం వల్ల యూరియా కూడా రెండు మూడు సార్లు వేయాల్సి వచ్చింది. దీంతో రెండు బస్తాలు వాడాల్సిన చోట మూడు నాలుగు బస్తాల యూరియా చల్లారని వ్యవసాయ శాఖ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. ఆ తర్వాత భారీ వర్షాలు కురవడంతో అనేకచోట్ల పంటలు కొట్టుకుపోయాయి. ఇసుకమేటలు వేశాయి. పంట చేలల్లో నీరు నిలిచిపోయింది. అటువంటి చోట్ల మళ్లీ విత్తనాలు వేయడం, కొన్నిచోట్ల నీటిని తొలగించడం చేశారు. దీనివల్ల కూడా యూరియాను మరోసారి వినియోగించాల్సి వచ్చింది. పైగా సబ్సిడీ వల్ల యూరియా ధర కూడా తక్కువగా ఉండటంతో రైతులు విరివిగా వినియోగించారని చెబుతున్నారు.



వలస కార్మికులకు స్థానికంగా పునరావాసం

- ప్రయోగాత్మకంగా మూడు జిల్లాల్లో శ్రీకారం చుట్టిన అంతర్జాతీయ, జాతీయ సంస్థలు

మోర్తాడ్(బాల్కొండ): ఉపాధికోసం గల్ఫ్ ఇతర దేశాలకు వలస వెళ్లి తర్వాత సొంతూరికి తిరిగి వచ్చిన కార్మికులకు స్థానికంగానే స్వయం ఉపాధి చూపడానికి అంతర్జాతీయ, జాతీయ సంస్థలు అడుగులు వేస్తున్నాయి. వలస కార్మికులకు పునరావాసం, పునరేకీకరణకు చర్యలు తీసుకోవడానికి అంతర్జాతీయ స్థాయిలో పనిచేస్తున్న ఐవోఎంతో పాటు నేషనల్ వర్కర్స్ వెల్ఫేర్ ట్రస్ట్ (ఎన్‌డబ్ల్యూడబ్ల్యూటీ) సంస్థలు ఉపాధి కల్పన అధికారులతో సమన్వయం చేసుకున్నాయి. విదేశాల్లో కంపెనీల మోసాలు, యజమానుల వంచనకు గురై ఇంటి బాట పట్టిన వలస కార్మికులకు స్థానికంగానే ఉపాధి పొందడానికి అవసరమైన రంగంలో శిక్షణ ఇవ్వడానికి శ్రీకారం చుట్టాయి. ఇందులో భాగంగా ప్రయోగాత్మకంగా నిజామాబాద్, జగిత్యాల్, హైదరాబాద్‌లలో ప్రవాసీ కార్మికుల వనరుల కేంద్రాలను ప్రారంభించారు. ఐవోఎం ప్రతినిధి ఎల్సా, ఎన్‌డబ్ల్యూడబ్ల్యూటీ చైర్‌పర్సన్ లిస్సీ జోసెఫ్, ప్రతినిధులు జలజ, డాక్టర్ త్రిలోక్ చందన్‌గౌడ్‌లు పునరావాసం, పునరేకీకరణ చర్యలపై గల్ఫ్ కార్మికుల సంఘాలు, ఉపాధి కల్పన అధికారులతో సమావేశాలను నిర్వహిస్తున్నారు.



వలస కార్మికులకు స్వయం ఉపాధి చూపే అంశంపై చర్చిస్తున్న ప్రతినిధులు

వలస కార్మికుల సంఖ్య 15 లక్షల పైమాటే...

గల్ఫ్‌తో పాటు ఇతర దేశాలకు వలస వెళ్లిన తెలంగాణ కార్మికుల సంఖ్య 15 లక్షలకు పైగానే ఉందని అంచనా. కరోనా సమయంలో ఇంటికి వచ్చిన వలస కార్మికులు అనేక మంది మళ్లీ గల్ఫ్ వెళ్లడానికి ఆసక్తిని చూపడం లేదు. అలాంటి వారితో పాటు వివిధ కారణాల వల్ల ఇంటికి తిరిగి వచ్చిన వారికి వారు ఎంచుకున్న రంగంలో శిక్షణ ఇప్పించడానికి రెండు సంస్థలు ఉత్సాహం చూపుతున్నాయి. శిక్షణ అనంతరం స్వయం ఉపాధి పొందడానికి అవసరమైన కెరీర్ గైడెన్స్ ఇవ్వడంలాంటి చర్యలు తీసుకోనున్నారు. వలస కార్మికులు మళ్లీ విదేశాలకు వెళ్లాలనే ఆలోచన చేయకుండా స్థానికంగానే ఉపాధి పొందేలా కార్యాచరణ రూపొందిస్తున్నారు. శిక్షణ ద్వారా వారు ఇక్కడే స్థిరపడితే వలసలను నిరోధించడానికి అవకాశం ఉంటుందని స్వచ్ఛంద సంస్థలు భావిస్తున్నాయి. వలస కార్మికుల్లో నైపుణ్యాలను మెరుగుపరిస్తే ఇక్కడి ప్రజలకు కూడా ప్రయోజనం కలుగుతుందని ఆయా సంస్థల ప్రతినిధులు ఆశిస్తున్నారు.

చంద్రబాబు రిమాండ్ 19 వరకు పొడిగింపు

- ఏసీబీ న్యాయస్థానం ఉత్తర్వులు
- జైలు నుంచి వర్చువల్ విధానంలో కోర్టు ఎదుట బాబు హాజరు

సాక్షి, అమరావతి/సాక్షి, రాజమహేంద్రవరం: టీడీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ కుంభకోణంలో మాజీ సీఎం నారా చంద్రబాబునాయుడు జ్యుడీషియల్ రిమాండ్‌ను విజయవాడ ఏసీబీ న్యాయస్థానం ఈ నెల 19 వరకు పొడిగించింది. ఈ కేసులో నిందితుడైన చంద్రబాబును గత నెల 9వ తేదీన సీఐడీ అధికారులు అరెస్టు చేశారు. 10వ తేదీ నుంచి ఆయనకు రిమాండ్ ఏసీబీ కోర్టు రిమాండ్ విధించింది. అప్పటి నుంచి ఆయన రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్నారు. ఆయనకు గత నెల 24న రిమాండ్‌ను న్యాయస్థానం పొడిగించింది. ఆ గడువు ముగియడంతో ఆయన్ని గురువారం రాజమహేంద్రవరం సెంట్రల్ జైలు నుంచి వర్చువల్ విధానంలో విజయవాడ ఏసీబీ న్యాయస్థానం ముందు హాజరుపరిచారు. ఆయన రిమాండ్‌ను పొడిగించాలని కోరుతూ సీఐడీ అధికారులు అప్పటికే మెమో దాఖలు చేశారు. దీనిని పరిగణనలోకి తీసుకున్న న్యాయస్థానం చంద్రబాబు రిమాండ్‌ను మరో 14 రోజులు అంటే ఈ నెల 19 వరకు పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

డ్రైవర్ తప్పిదంవల్లే అశ్లీల వీడియో

- మాజీ మంత్రి వినోద్ స్పష్టీకరణ



బెల్లంపల్లి: మాజీ మంత్రి, కాంగ్రెస్ నేత గడ్డం వినోద్ సెల్‌ఫోన్ నుంచి ఓ అశ్లీల వీడియో మంచిర్యాల జిల్లా వాట్సాప్ గ్రూప్‌లో షేర్ చేయడం కలకలం రేపింది. గ్రూపులో ఎవరు పోస్టు చేశారో తెలియకపోయినా మాజీ మంత్రి ఫోన్ నుంచి రావడంతో క్షణాల్లో వైరల్‌గా మారింది. ఈ విషయం మాజీ మంత్రి వినోద్ దృష్టికి వెళ్లడంతో ఆయన తీవ్రంగా స్పందిస్తూ ఓ ప్రకటన విడుదల చేశారు. తనకున్న రెండు సెల్‌ఫోన్లలో ఒకటి తన వద్ద, మరొకటి డ్రైవర్ వద్ద ఉంటాయని తెలిపారు. డ్రైవర్ వద్ద ఉన్న సెల్‌ఫోన్‌ను తానెప్పుడూ వినియోగించలేదని, డ్రైవర్ తప్పిదంతో జరిగి ఉంటుందని అభిప్రాయపడ్డారు. ఆ అశ్లీల వీడియోతో తనకెలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. డ్రైవర్ తప్పిదంతో జరిగిన పొరపాటును రాజకీయం చేయడం బుద్ధి జీవుల లక్షణం కాదని.. విజ్ఞతతో ఆలోచించాలని వినోద్ కోరారు.

విషాహారం.. 30 కోతులు మృతి




సుల్తానాబాద్ రూరల్ (పెద్దపల్లి): విషాహారం పెట్టడంతో 30 కోతులు మృతి చెందాయి. పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండలం దుబ్బపల్లి శివారులోని రాజీవ్ రహదారి పక్కన వైకుంఠధామం వద్ద గురువారం వీటిని గ్రామస్తులు గుర్తించారు. అక్కడ కోతుల కళేబరాలను గుర్తు తెలియని వ్యక్తులు వదిలివెళ్లారు. దీనిపై గ్రామస్తులు సర్పంచ్ శ్రవణ్‌కు సమాచారం అందించారు. దీంతో అటవీ సెక్షన్ అధికారి మంగిలాల్, పశువైద్యుడు రఘుపతిరెడ్డి పరిశీలించి కోతుల మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించారు. పుట్నాల పప్పులో మందు పెట్టి చంపినట్లు నిర్ధారించారు. గ్రామ పంచాయతీ సిబ్బంది అంత్యక్రియలు నిర్వహించారు. దీనిపై పూర్తి విచారణ నిమిత్తం స్థానిక పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు అటవీ సెక్షన్ అధికారి పేర్కొన్నారు.

జాన్ ఫోసేకు సాహిత్య నోబెల్

మాటల్లో చెప్పలేని అంశాలకు గళంగా మారిన రచనలు

- నాటక రచయితగా ఎనలేని గుర్తింపు
- సెప్టాలజీ సిరీస్‌కు అత్యంత ప్రజాదరణ



నార్వే రచయిత జాన్ ఫోసేకు సాహిత్యంలో నోబెల్ పురస్కారం వరించింది. బయటకు చెప్పుకోలేని ఎన్నో అంశాలకు తన నవలలు, నాటకాలు, చిన్న పిల్లల పుస్తకాల ద్వారా గళంగా నిలిచినందుకు ఫోసే ఈ ఏడాది ప్రతిష్టాత్మక అవార్డుకు ఎంపికయ్యారు. నోబెల్ లిటరేచర్ కమిటీ చైర్మన్ ఆండర్స్ ఓల్సన్ గురువారం అవార్డును ప్రకటించారు. ఫోసే చేసిన రచనల్లో నార్వే సంస్కృతి, స్వభావాలు ఉట్టిపడుతూ ఉంటాయని కొనియాడారు. ఈ పురస్కారం కింద ఫోసేకు 1.1 కోట్ల స్వీడిష్ క్రోనర్లు (10 లక్షల డాలర్లు) లభిస్తాయి. సాహిత్యంలో నోబెల్ పురస్కారం లభించిందంటే తనని తాను నమ్మలేకపోయానంటూ జాన్ ఫోసే తీవ్ర ఉద్విగ్నానికి లోనయ్యారు. ''నోబెల్ కమిటీ ఫోన్ చేసి చెప్పగానే సంభ్రమాశ్చర్యాలకు లోనయ్యాను. మళ్లీ నన్ను నేనే నిలవరించుకున్నారు. గత పదేళ్లుగా నోబెల్ వస్తుందేమోనని ఎదురు చూస్తున్నాను. ఈ అవార్డు విపరీతమైన ఆనందాన్ని ఇస్తోంది. కాస్త కూడా భయం వేస్తోంది. '' అని నార్వే మీడియాకు చెప్పారు. నార్వేలో అత్యంత ప్రతిభావంతుడైన నాటక రచయితగా గుర్తింపు పొందిన ఫోసే 43 వరకు నవలలు, నాటకాలు, చిన్న కథలు, పిల్లల పుస్తకాలు, అనువాదాలు, పద్యాలు, గద్యాలు రచించారు. అయితే నాటక రచయితగానే ఆయనకు విశేషమైన గుర్తింపు లభించింది. మాటల్లో తమ బాధల్ని చెప్పుకోలేని ఎన్నో వర్గాలకు ఆయన తన రచనలతో ఒక గళంగా మారి సామాజిక పరిస్థితుల్ని అద్దంలో చూపించారంటూ ప్రశంసలు వ్యక్తమవుతున్నాయి.

రోజువారీ ఘటనలే కథా వస్తువు

నిత్యజీవితంలో మనకు ఎదురయ్యే ఘటనలే జాన్ ఫోసే రచనలకు ఆధారం. అలాంటి ఘటనల్ని సరళమైన భాషలో,, శక్తిమంతమైన భావ ప్రకటనతో రచనలు చేసి సామాన్యుల మనసుల్ని కూడా దోచుకున్నారు. మానవ సంబంధాల్లోని బలమైన భావోద్వేగాలను , సామాజిక పరిస్థితుల్ని చిన్నారులకి కూడా అర్థమయ్యేలా రచనలు చేసి సమాజంలో వివిధ వర్గాలపై ఎంతో ప్రభావాన్ని చూపించారు. నార్వేలో 1959లో క్రిస్టియన్ మతాచారాల్ని గట్టిగా ఆచరించే ఒక సంప్రదాయ కుటుంబంలో జన్మించారు. విద్యార్థి దశలోనే ఆయన తన కుటుంబంపైన, మతంపైనా తిరుగుబాటు ప్రకటించారు. తాను నాస్తికుడినని ప్రకటించారు. చిన్నప్పట్నుంచి తిరుగుబాటు ధోరణి కలిగిన జాన్ ఫోసే రచనల్లో, నాటకాల్లో అది వ్యక్తమయ్యేది. 1983లో ఆయన రాసిన మొదటి నవల రెడ్, బ్లాక్‌లో ఆత్మహత్యల అంశాన్ని స్పృశించారు. అప్పట్నుంచి ఆయన వెనక్కి చూసుకోలేదు. నవలైనా, నాటకమైనా, పద్యాలైనా, గద్యాలైనా ఆ రచనల్లో ఆయన ముద్ర స్పష్టంగా కనిపించేది.

- సాక్షి, నేషనల్ డెస్క్

40 భాషల్లో పుస్తకాల అనువాదం

ఫోసే చేసిన రచనలు ప్రపంచవ్యాప్తంగా దాదాపుగా 40 భాషల్లోకి అనువాదమయ్యాయి. 2015లో ది డైలీ టెలిగ్రాఫ్ రూపొందించిన భూమ్మీద ఉన్న లివింగ్ జీనియస్‌లలో టాప్ 100 జాబితాలో ఫోసే 83వ స్థానంలో నిలిచారు. 2022లో ఇంటర్నేషనల్ బుకర్ ప్రైజ్ అవార్డు కోసం ఆయన రాసిన ''ఏ న్యూ నేమ్ :సెప్టాలజీ VI& VII'' షార్ట్ లిస్ట్‌లో నిలిచింది. జాన్ ఫోసేకు మూడు పెళ్లిళ్లయ్యాయి. ఆరుగురు పిల్లలకు తండ్రి. 64 ఏళ్ల వయసున్న జాన్ ఫోసే ఆస్ట్రియాలోని తన రెండో భార్యతో కలిసి ఉంటున్నారు. యువకుడిగా ఉన్నప్పుడు దేవుడ్ని నమ్మని జాన్ ఫోసే ప్రస్తుతం కాథలిజంలోకి మారి దానినే అనుసరిస్తున్నారు. ఫోసే చేసిన రచనల్లో బోట్‌హౌస్, మెలాంకలి, సెప్టాలజీ అత్యంత ప్రజాదరణ పొందాయి. ఫోసే రచించిన నాటకాలను వేలాది ప్రొడక్షన్ హౌస్‌లు వివిధ దేశాల్లో ప్రదర్శించాయి. ఇంగ్లిష్ భాషలోకి అనువదించిన ఫోసే సెప్టాలజీ సిరీస్‌లో ది అదర్ నేమ్, ఐ ఈజ్ అనదర్, ఏ న్యూనేమ్ ఆయనకు చాలా గుర్తింపు తీసుకువచ్చాయి.

భాషకు పట్టాభిషేకం

జాన్ ఫోసే రచనలు నార్వేజియన్ భాషలో రాస్తారు. నార్వేలో 10% మంది మాత్రమే ఈ భాష మాట్లాడే ప్రజలు ఉన్నారు. నార్వేలో ఉన్న రెండు అధికారిక భాషల్లో ఇదొకటి. గ్రామీణ ప్రాంత ప్రజలు మాట్లాడే మాండలికంలో ఉండే ఈ భాష 19వ శతాబ్దంలో డానిస్‌కు ప్రత్యామ్నాయంగా పుట్టింది. స్వచ్ఛమైన సెలయేరులాంటి భాషలో ప్రజలు రోజువారీ ఎదుర్కొనే సమస్యలకి తన రచనల్లో కొత్త కోణంలో పరిష్కారం మార్గం చూపించడంతో ఆయన పుస్తకాలు అపరిమితమైన ఆదరణ పొందాయి. అందుకే ఈ పురస్కారం తనకే కాకుండా, తన భాషకి కూడా పట్టాభిషేకం జరిగినట్టుగా ఉందని ఫోసే ఆనందంతో ఉబ్బితబ్బిబ్బవుతున్నారు.

వ్యతిరేకంగా సాక్ష్యాలున్నాయా?

సిసోడియా కేసులో సీబీఐను ప్రశ్నించిన సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ: ఢిల్లీ మద్యం కుంభకోణంలో ఆమ్ ఆద్మీ పార్టీ నేత, ఢిల్లీ మాజీ ఉప ముఖ్యమంత్రి మనీశ్ సిసోడియాకు వ్యతిరేకంగా బలమైన ఆధారాలు ఏవైనా ఉన్నాయా? అని సుప్రీంకోర్టు సీబీఐను ప్రశ్నించింది. ఇదే కేసులో నిందితుడైన దినేశ్ అరోరా వాంగ్మూలం మినహా ఇంకా ఏం ఆధారాలున్నాయని అడిగింది. మద్యం కుంభకోణం కేసులో తనకు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ సిసోడియా దాఖలు చేసిన రెండు పిటిషన్లపై సుప్రీంకోర్టు గురువారం విచారణ చేపట్టింది. కొందరు వ్యక్తులకు లబ్ధి చేకూర్చే విధంగా ఢిల్లీ మద్యం విధానాన్ని రూపొందించారని సీబీఐ పేర్కొంది. కొన్ని వాట్సాప్ సందేశాలను సాక్ష్యంగా కోర్టుకు సమర్పించింది. ఈ సాక్ష్యం ఆమోద యోగ్యమేనా? అప్రూవర్‌గా మారిన వ్యక్తి ఇచ్చిన వాంగ్మూలాన్ని సాక్ష్యంగా ఎలా భావించగలం? అని కోర్టు వ్యాఖ్యానించింది. మద్యం కుంభకోణం కేసులో సిసోడియాకు వ్యతిరేకంగా సరైన సాక్ష్యాధారాలు చూపించలేకపోయారని అభిప్రాయపడింది. సిసోడియా ముడుపులు తీసుకున్నారని కేంద్ర దర్యాప్తు సంస్థలు చెబుతున్నాయని, మరి ఆ డబ్బులు ఆయనకు ఎవరిచ్చారు? డబ్బులిచ్చినట్లు ఆధారాలున్నాయా? ఈ కేసులో అరోరా వాంగ్మూలం కాకుండా సాక్ష్యాలున్నాయా? అని సుప్రీంకోర్టు ప్రశ్నించింది.

సంజయ్ సింగ్‌కు ఐదు రోజుల కస్టడీ

బుధవారం అదుపులోకి తీసుకున్న ఆప్ నేత ఎంపీ సంజయ్ సింగ్‌ను ఈడీ అధికారులు గురువారం ప్రత్యేక కోర్టు జడ్జి నాగ్‌పాల్ ఎదుట హాజరుపరిచారు. ఈ కేసులో మిగతా నిందితులతో కలిపి ఆయన్ను విచారించాల్సి ఉందని ఈడీ పేర్కొంది. దీంతో జడ్జి నాగ్‌పాల్ ఆయన్ను విచారణ నిమిత్తం అయిదు రోజుల ఈడీ కస్టడీకి పంపుతూ ఆదేశాలిచ్చారు. ఈ సందర్భంగా జడ్జి అనుమతి మేరకు సంజయ్ సింగ్ కోర్టులో మాట్లాడారు.

ఉగ్రవాదాన్ని నిర్దాక్షిణ్యంగా అణచేయాలి



- ఎన్‌ఐఏ, రాష్ట్రాల విభాగాలు కలిసికట్టుగా పనిచేయాలి
- జాతీయ సదస్సులో అమిత్ షా

న్యూఢిల్లీ: ఉగ్రవాదం పట్ల నిర్దాక్షిణ్యంగా వ్యవహరించాలని హోం మంత్రి అమిత్ షా పిలుపునిచ్చారు. దేశంలో మళ్లీ కొత్తగా ఉగ్ర గ్రూపు ఏర్పడకుండా కఠినమైన వైఖరిని అవలంబించాలని ఉగ్రవాద వ్యతిరేక విభాగాలను కోరారు. ఉగ్రవాదాన్ని మాత్రమే కాదు, ఉగ్రవాదుల నెట్‌వర్క్‌ను కూకటివేళ్లతో పెకిలించివేయాలన్నారు. ఇందుకోసం ప్రభుత్వంతోపాటు అన్ని విభాగాలు ఉమ్మడిగా ముందుకు సాగాలన్నారు. జాతీయ దర్యాప్తు సంస్థ(ఎన్‌ఐఏ) ఆధ్వర్యంలో గురువారం ఢిల్లీలో రెండు రోజుల జాతీయ ఉగ్ర వ్యతిరేక సదస్సునును అమిత్ షా ప్రారంభించి, ప్రసంగించారు. క్రిప్టో కరెన్సీలు, హవాలా, ఉగ్ర నిధులు, వ్యవస్థీకృత నేర ముఠాలు, డ్రగ్స్– ఉగ్ర లింకులు వంటి అనేక సవాళ్లను ఎదుర్కొనేందుకు తొమ్మిదేళ్లుగా ప్రధాని మోదీ ప్రభుత్వం తీసుకున్న కఠిన చర్యలు మంచి ఫలితాలు సాధించాయని ఆయన అన్నారు. ఎన్‌ఐఏ, ఉగ్ర వ్యతిరేక బృందాలు, రాష్ట్రాల టాస్క్‌ఫోర్స్‌లు కేవలం కేసుల దర్యాప్తునకే పరిమితం కారాదన్నారు. ఉగ్రవాదాన్ని ఎదుర్కొనేందుకు తమ పరిధిని దాటి వినూత్నవిధానాలను ఆలోచించాలని కోరారు. ఉగ్రవాదాన్ని సమూలంగా పెకిలించి వేసే క్రమంలో అంతర్జాతీయ సహకారంతోపాటు దేశంలోని వివిధ రాష్ట్రాల సహకారం కూడా అవసరమని తెలిపారు. ఉగ్రవాదాన్ని ఎదుర్కొనేందుకు కేంద్రం, రాష్ట్రాలు, వివిధ ఏజెన్సీల మధ్య సహకారం ఉండాలన్నారు. ఇందుకోసం కేంద్రం పలు డేటా బేస్‌లను అందుబాటులోకి తెచ్చిందన్నారు. ఎన్‌ఐఏ పరిధిలో మోడల్ యాంటీ టెర్రరిజం నిర్మాణాన్ని ఏర్పాటు చేయాలి, కేంద్ర, రాష్ట్ర సంస్థల మధ్య మెరుగైన సమన్వయం కోసం అన్ని రాష్ట్రాల్లోని ఉగ్రవాద వ్యతిరేక విభాగాల అధికార క్రమం, నిర్మాణం, విచారణ, కార్యాచరణ విధానం ఏకరీతిగా ఉండాలన్నారు. 94 శాతం కంటే ఎక్కువగా నేరారోపణ సాధించిన ఎన్‌ఐఏ కృషిని షా ప్రశంసించారు. ఈ ఏడాదిలో ఎన్‌సీబీ చేపట్టిన ఆపరేషన్ సముద్రగుప్తతో రూ.12 వేల కోట్ల విలువైన డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకోగలిగామన్నారు.

సిరియాలో భీకర డ్రోన్ దాడి.. 100 మందికి పైగా మృతి

బీరుట్: పదమూడేళ్లుగా అంతర్యుద్ధంతో సతమతమవుతోన్న సిరియాలో భీకర డ్రోన్ దాడి సంభవించింది. హామ్స్ నగరంలో గురువారం మిలటరీ జవాన్ల స్నాతకోత్సవ కార్యక్రమం లక్ష్యంగా జరిగిన దాడిలో పౌరులు, సైనికులు కలిపి 100 మందికి పైగా చనిపోగా మరో 125 మంది గాయపడ్డారు. సిరియాలో ఇటీవలి సంవత్సరాల్లో జరిగిన దాడుల్లో ఇదే తీవ్రమైందని చెబుతున్నారు. ఘటన నేపథ్యంలో ప్రభుత్వం మూడు రోజులు సంతాప దినాలుగా ప్రకటించింది. 'మాకు తెలిసిన అంతర్జాతీయ బలగాల మద్దతు ఉన్న తిరుగుబాటుదారులే పేలుడు పదార్థాలు కలిగిన డ్రోన్లతో దాడికి పాల్పడ్డారు'అని సిరియా సైన్యం ఆరోపించింది. ఘటనకు తామే కారణమంటూ ఎవరూ ప్రకటించుకోలేదు.

డీఎంకే ఎంపీ ఇళ్లలో సోదాలు

చెన్నై: డీఎంకే ఎంపీ ఎస్.జగత్‌రక్షకన్‌కు చెందిన పలు ప్రాంతాలపై గురువారం ఆదాయ పన్ను(ఐటీ) శాఖ అధికారులు దాడులు జరిపారు. ఎంపీకి చెందిన కొన్ని విద్యాసంస్థల్లోనూ సోదాలు జరిగాయని పోలీసు వర్గాలు తెలిపాయి. ఐటీ దాడులపై సీఎం ఎంకే స్టాలిన్ తీవ్రంగా మండిపడ్డారు. ఇది కేంద్రం పాల్పడుతున్న అధికార దుర్వినియోగం, వేధింపు రాజకీయాలంటూ విమర్శించారు. తమిళనాడులోని అరక్కోణమ్ లోక్‌సభ స్థానం నుంచి జగత్‌రక్షకన్ ప్రాతినిధ్యం వహిస్తున్నారు.

భారత్‌ను వ్యతిరేకిస్తున్న కాంగ్రెస్

- రాజస్తాన్ ఎన్నికల ప్రచార సభలో ప్రధాని నరేంద్ర మోదీ
- రూ.5,000 కోట్ల విలువైన ప్రాజెక్టులు ప్రారంభం



జోధ్‌పూర్‌లో ప్రజలకు అభివాదం చేస్తున్న ప్రధాని మోదీ

జోధ్‌పూర్: భారతదేశం గళాన్ని నేడు ప్రపంచ దేశాలు వింటున్నాయని, ఇది చూసి ప్రతిపక్ష కాంగ్రెస్ తట్టుకోలేకపోతుందని ప్రధాని మోదీ అన్నారు. ఆ పార్టీ బీజేపీని వ్యతిరేకించే క్రమంలో భారత్‌ను వ్యతిరేకించడం ప్రారంభించిందని విమర్శించారు. త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్న రాజస్తాన్‌లో మోదీ గురువారం పర్యటించారు. దాదాపు రూ.5,000 కోట్ల విలువైన పలు ప్రాజెక్టులను ప్రారంభించారు. మరికొన్ని ప్రాజెక్టులకు శంకుస్థాపన చేశారు. అనంతరం జోధ్‌పూర్‌లో ఎన్నికల ప్రచార సభలో ప్రసంగించారు. గహ్లోత్ ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. రాష్ట్రంలో పేపర్ లీక్ మాఫియా వల్ల లక్షలాది మంది యువత భవిష్యత్తు అంధకారంగా మారిందన్నారు. రాజస్తాన్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం అవినీతిలో కూరుకుపోయిందని ఆరోపించారు. రాష్ట్రంలో తాము అధికారంలోకి వచ్చాక కాంగ్రెస్ అవినీతిని బయటపెడతామన్నారు.

మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్

కాంగ్రెస్ పార్టీకి రైతుల పట్ల గానీ, సైనికుల పట్ల గానీ ఏమాత్రం శ్రద్ధ లేదని మోదీ ఆరోపించారు. ఆ పార్టీకి అధికారమే పరమావధిగా మారిందని ఆక్షేపించారు. సొంత ఓటు బ్యాంకును ప్రేమించడం తప్ప ప్రజా ప్రయోజనాల గురించి ఆలోచించడం లేదని కాంగ్రెస్‌పై మండిపడ్డారు. అంతర్జాతీయ స్థాయిలో భారతదేశ కీర్తి ప్రతిష్టలు పెరుగుతున్నాయని, ప్రపంచ దేశాల్లో మన ప్రభావం విస్తరిస్తోందని, విదేశాల్లో మన గురించి గొప్పగా మాట్లాడుకుంటున్నారని, కాంగ్రెస్ పార్టీ నాయకులకు ఇదంతా నచ్చడం లేదని అన్నారు. భారత్ త్వరలో ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరిస్తుందని, ఇది మోదీ ఇస్తున్న గ్యారంటీ అని ప్రధానమంత్రి వ్యాఖ్యానించారు. మహిళా రిజర్వేషన్ బిల్లు పార్లమెంట్‌లో ఆమోదం పొందడం ప్రతిపక్షాలకు ఇష్టం లేదని చెప్పారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు ఈ బిల్లు పరిస్థితి ఏమిటో తెలిసిందేనని పేర్కొన్నారు. కేంద్రంలో తాము అధికారంలోకి వచ్చిన తర్వాత దేశంలో పేదరికం గణనీయంగా తగ్గిందని నరేంద్ర మోదీ హర్షం వ్యక్తం చేశారు. కోట్లాది మంది పేదరికం నుంచి బయటపడ్డారని తెలిపారు.

'ద వ్యాక్సిన్ వార్'పై మోదీ ప్రశంసలు

బాలీవుడ్ చలనచిత్రం 'ద వ్యాక్సిన్ వార్'పై ప్రధాని నరేంద్ర మోదీ ప్రశంసల వర్షం కురిపించారు. ఈ చిత్రం ప్రతి భారతీయుడిని గర్వపడేలా చేసిందని అన్నారు. వివేక్ అగ్నిహోత్రి దర్శకత్వం వహించిన ద వ్యాక్సిన్ వార్ సినిమా సెప్టెంబర్ 28న విడుదలైంది. కోవిడ్–19 మహమ్మారి వ్యాప్తిని అరికట్టడమే లక్ష్యంగా వ్యాక్సిన్‌ను అభివృద్ధి చేయడానికి మన సైంటిస్టులు అహోరాత్రులు శ్రమించారని, వారి శ్రమను ఈ చిత్రంలో చక్కగా చూపించారని మోదీ కొనియాడారు. మన సైంటిస్టుల అంకితభావాన్ని తెరకెక్కించిన చిత్ర దర్శకుడు, నిర్మాతలను ప్రశంసించారు.

ఉక్రెయిన్‌పై భీకర దాడి

51 మంది దుర్మరణం

కీవ్: ఉక్రెయిన్‌పై దురాక్రమణకు దిగిన రష్యా మూకలు గురువారం భారీ దాడికి తెగబడ్డాయి. ఖర్కీవ్ రీజియన్‌లోని హరోజా గ్రామంపై రష్యా విచక్షణారహితంగా జరిపిన రాకెట్ దాడిలో ఏకంగా 51 మంది అమాయక పౌరులు ప్రాణాలు కోల్పోయారు. మరణించిన వారిలో ఆరేళ్ల బాలుడు సైతం ఉన్నాడు. దాడి ఘటనలో పలువురు గాయపడ్డారు. ఇటీవల కాలంలో ఒకే ప్రాంతంలో ఇంతమంది సాధారణ ప్రజలు ప్రాణాలు కోల్పోవడం ఇదే తొలిసారి. గ్రామంలోని కేఫ్, స్టోర్‌పై ఈ దాడి జరిగింది. దాడి సమయంలో ఆ కేఫ్‌లో ఓ సంతాప సభ జరుగుతోంది. ఐరోపాలోని మిత్ర దేశాల నుంచి మరింత మద్దతు కూడగట్టేందుకు ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ స్పెయిన్‌లో పర్యటిస్తున్న వేళ ఈ దాడి జరగడం గమనార్హం. 'గ్రామంపై రష్యా రాకెట్లతో దాడిచేయడం నిజంగా హేయమైన నేరం. రష్యా ఉగ్రవాదానికి సిసలైన రుజువు' అని జెలెన్‌స్కీ ఆగ్రహం వ్యక్తంచేశారు. ' ఇంతటి దారుణానికి ఒడిగట్టిన ఉగ్ర రష్యాను ఆపాలంటే పశ్చిమ దేశాలు ఉక్రెయిన్‌కు వైమానిక దళానికి సాయం మరింత పెంచాలి' అని ఆయన మిత్ర దేశాలకు విజ్ఞప్తిచేశారు. ఇన్నాళ్లూ భూతలంపై దాడులకు దిగిన రష్యా తాజాగా సముద్ర మందుపాతరలను అమరుస్తోంది. సముద్రమార్గంలో పౌర రవాణాను అడ్డుకుని, నల్లసముద్రంలో పేలుళ్ల సంభవిస్తే ఆ నేరం ఉక్రెయిన్‌పై మోపాలని రష్యా కుట్రపన్నుతోందని బ్రిటన్ విదేశాంగ శాఖ తన నిఘా నివేదికలో పేర్కొంది.

సిక్కిం వరదలు..18కి చేరిన మరణాలు



రాంగ్‌పో పట్టణంలో వరదలకు వాహనాలు కొట్టుకొస్తున్న దృశ్యం

- 22 మంది జవాన్లు సహా 98 మంది గల్లంతు
- అన్వేషణ కొనసాగుతోందన్న ఎస్‌ఎస్‌డీఎంఏ

గ్యాంగ్‌టక్: సిక్కింలో సంభవించిన ఆకస్మిక వరదల్లో మృతుల సంఖ్య 14కు చేరుకుంది. అదేవిధంగా, 22 మంది ఆర్మీ అధికారులు సహా గల్లంతైన వారి సంఖ్య 98కు పెరిగింది. ఉత్తర సిక్కింలో తీస్తా నదీ పరీవాహక ప్రాంతంలోని ఎల్‌హొనాక్ సరస్సు ఉప్పొంగి సంభవించిన వరదల్లో గల్లంతైన మరో ఆరుగురి మృతదేహాలు లభ్యం కావడంతో మరణాల సంఖ్య 18కు చేరుకుందని రాష్ట్ర విపత్తు నిర్వహణ ప్రాధికార సంస్థ(ఎస్‌ఎస్‌డీఎంఏ) గురువారం బులెటిన్‌లో తెలిపింది. ఇప్పటివరకు 2,011 మందిని కాపాడినట్లు పేర్కొంది. గల్లంతైన 22 మంది జవాన్ల ఆచూకీ కోసం దిగువ ప్రాంతాల్లో గాలింపు చర్యలు ముమ్మరం చేశామని వివరించింది. ఇలా ఉండగా, వరదల్లో కొట్టుకు వచ్చిన 18 మృతదేహాల్లో నాలుగు జవాన్లవని పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం తెలిపింది. ఇవి సిక్కింలో గల్లంతైన జవాన్ల మృతదేహాలా కాదా అనే దానిపై స్పష్టత రావాల్సి ఉంది. బుధవారం సంభవించిన ఆకస్మిక వరదలతో చుంగ్‌థంగ్ డ్యామ్ ధ్వంసం కావడం.. విద్యుత్ మౌలిక వ్యవస్థలు దారుణంగా దెబ్బతినడంతోపాటు నాలుగు జిల్లాల్లోని పలు గ్రామాలు, పట్టణాలు జల దిగ్బంధంలో చిక్కుకున్న విషయం తెలిసిందే. మంగన్ జిల్లాలోని 8 వంతెనలు సహా మొత్తం 11 బ్రిడ్జీలు వరదల్లో కొట్టుకుపోయాయి. రాష్ట్రానికి గుండెకాయ వంటి పదో నంబర్ రహదారి పలుచోట్ల ధ్వంసమైంది. చుంగ్‌థంగ్ పట్టణం తీవ్రంగా దెబ్బతింది. తీస్తా నదికి వరద ఉధృతి మరింత పెరిగే అవకాశాలున్నందున, పరీవాహక ప్రాంతాల ప్రజలు సురక్షిత ప్రదేశాలకు చేరుకోవాలని ఎస్ఎస్‌డీఎంఏ కోరింది. సిక్కింలోని వేర్వేరు ప్రాంతాల్లో వరదల్లో చిక్కుకుపోయిన వేల మంది పర్యాటకుల్లో విదేశీయులూ ఉన్నారు.

లంచం తీసుకున్న చట్టసభ సభ్యులకు విచారణ నుంచి మినహాయింపు ఉండదు

- సుప్రీంకోర్టుకు తెలియజేసిన అటార్నీ, సొలిసిటర్ జనరల్స్
- ఎంపీలు, ఎమ్మెల్యేలు చట్టప్రకారం నడుచుకోవాల్సిందే

న్యూఢిల్లీ: చట్టసభ సభ్యుడు లంచం తీసుకొంటే తదుపరి విచారణ నుంచి అతడు ఎలాంటి మినహాయింపు, వెసులుబాటు పొందలేడని, ఎంపీ అయినా, ఎమ్మెల్యే అయినా చట్టం ప్రకారం నడుచుకోవాల్సిందేనని అటార్నీ జనరల్ వెంకటరమణి, సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా గురువారం సుప్రీంకోర్టుకు తెలియజేశారు. ఎంపీలు, ఎమ్మెల్యేలు అయినప్పటికీ చట్టానికి ఎవరూ అతీతులు కారన్నారు. పార్లమెంట్‌లో ముడుపులు తీసుకున్నప్పటికీ చట్ట ప్రకారం విచారించి, శిక్ష విధించాలని చెప్పారు. లంచం ఇచ్చినా, తీసుకున్నా అవినీతి నిరోధక చట్టం కింద విచారించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. చట్టసభల్లో మాట్లాడడానికి, ఓటు వేయడానికి లంచం తీసుకున్న ఎంపీలు, ఎమ్మెల్యేలకు విచారణ నుంచి వెసులుబాటు ఉంటుందంటూ 1998 నాటి జేఎంఎం ముడుపుల కేసులో నాడు సుప్రీంకోర్టు తీర్పు చెప్పింది. కొన్ని వర్గాల విజ్ఞప్తి మేరకు ఈ తీర్పును సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ చంద్రచూడ్ నేతృత్వంలోని ఏడుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం పున:పరిశీలిస్తోంది. భాగస్వామ్యపక్షాల వాదనలు వింటోంది. కేంద్ర ప్రభుత్వం తరఫున అటార్నీ జనరల్, సొలిసిటర్ జనరల్ ధర్మాసనం ఎదుట తమ వాదనలు వినిపించారు. పార్లమెంట్‌లో ముడుపులు తీసుకున్నట్లు ఒక్క సంఘటన బయటపడినా సరే విచారణ చేపట్టాలని తుషార్ మెహతా అన్నారు. లంచం స్వీకరించిన పార్లమెంట్ సభ్యుడికి రాజ్యాంగంలోని ఆర్టికల్ 105, 194 కింద విచారణ నుంచి వెసులుబాటు కల్పించవద్దని కోర్టును కోరారు. పార్లమెంట్ సభ్యుడికి కల్పించిన వెసులుబాట్లు, ఇచ్చిన మినహాయింపులు అతడి వ్యక్తిగత అవసరాల కోసం కాదని గుర్తుచేశారు. చట్టసభ సభ్యుడిగా బాధ్యతలను నిర్భయంగా నిర్వర్తించడానికే వాటిని ఉపయోగించుకోవాలని అన్నారు. ఏడుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం తన తీర్పును రిజర్వ్ చేసింది.

ఒక్క ఆడపిల్ల ఉంటే రూ.2 లక్షలు

భ్రూణహత్యల నివారణకు ప్రోత్సాహకం ప్రకటించిన హిమాచల్ ప్రదేశ్

సిమ్లా: ఆడపిల్లల భ్రూణ హత్యల నివారణకు హిమాచల్‌ప్రదేశ్ ఒక కొత్త మార్గాన్ని ఎంచుకుంది. ఒకే ఒక్క ఆడపిల్ల ఉన్న తల్లిదండ్రులకు రూ.2 లక్షలు ప్రోత్సాహకంగా ఇస్తామని ప్రకటించింది. గతంలో ఒక్క ఆడపిల్ల ఉన్న తల్లిదండ్రులకు రూ.35 వేలు ఇన్సెంటివ్‌గా ఇచ్చే వారు. ఇప్పుడు దానికి 2 లక్షల రూపాయలకు పెంచినట్టుగా హిమాచల్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి సుఖ్‌వీందర్ సింగ్ సుఖు చెప్పారు. డైరెక్టరేట్ ఆఫ్ హెల్త్ సేఫ్టీ అండ్ రెగ్యులేషన్స్ ఆధ్వర్యంలో గురువారం జరిగిన ఒక కార్యక్రమానికి హాజరవడానికి వచ్చిన సీఎం సుఖు విలేకరులతో మాట్లాడారు. ఒక్క ఆడపిల్ల పుట్టిన తర్వాత కుటుంబ నియంత్రణ పాటించే తల్లిదండ్రులకు లక్ష రూపాయలు, ఇద్దరు ఆడపిల్లలు పుట్టిన తర్వాత ఇక పిల్లలు వద్దు అనుకున్న వారికి మరో లక్ష రూపాయలు అందిస్తామని చెప్పారు. హిమాచల్‌ప్రదేశ్‌లో లింగ నిష్పత్తి 1000:950గా ఉంది. దేశంలో అత్యుత్తమ రాష్ట్రాల్లో మూడో స్థానంలో నిలిచింది.

ప్రభుత్వ ఉద్యోగాల్లో మహిళలకు 35% రిజర్వేషన్లు

మధ్యప్రదేశ్ ప్రభుత్వం నోటిఫికేషన్

భోపాల్: అటవీ శాఖ మినహా అన్ని రకాల ప్రభుత్వ ఉద్యోగాల్లో మహిళలకు 35 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ మధ్యప్రదేశ్ ప్రభుత్వం తాజాగా నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ మేరకు మధ్యప్రదేశ్ సివిల్ సర్వీసెస్(స్పెషల్ ప్రొవిజన్ ఫర్ అపాయింట్‌మెంట్ ఆఫ్ ఉమెన్) రూల్స్–1997కు సవరణ చేసింది. ప్రభుత్వ ఉద్యోగాల భర్తీలో ఇకపై మహిళలకు 35 శాతం కోటా అమలవుతుందని నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. రాష్ట్రంలో త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్నాయి. పోలీసు శాఖతోపాటు ఇతర ప్రభుత్వ పోస్టుల్లో 35 శాతం రిజర్వేషన్లు కల్పించడంతోపాటు టీచర్ల పోస్టుల భర్తీలో మహిళలకు 50 శాతం రిజర్వేషన్లు ఇస్తామని మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ ఇటీవల ప్రకటించారు.

కాంగ్రెస్, బీజేపీ పోస్టర్ యుద్ధం

న్యూఢిల్లీ: బీజేపీ, కాంగ్రెస్ పోటాపోటీగా పోస్టర్ వార్ మొదలుపెట్టాయి. అతిపెద్ద అబద్ధాలకోరు, ఉత్తిహామీలిచ్చే పిల్లాడు అంటూ బుధవారం కాంగ్రెస్ పార్టీప్రధాని మోదీపై 'ఎక్స్'లో పోస్టర్లు పోస్ట‌చేయగా మరుసటి రోజే బీజేపీ దీటుగా స్పందించింది. పది తలల కలియుగ రావణుడంటూ రాహుల్ గాంధీ తలతో పోస్టర్‌ను తయారుచేసి బీజేపీ 'ఎక్స్'లో పోస్ట్‌చేసింది. ' భారత్‌కు ప్రమాదం పొంచి ఉంది. ఇది కాంగ్రెస్ పార్టీ ప్రొడక్షన్. జార్జ్ సోరెస్ దీనికి దర్శకుడు' అని బీజేపీ పోస్ట్‌చేసింది. జార్జ్ సోరెస్ హంగేరీ–అమెరికా వ్యాపార దిగ్గజం. భారత్‌లో పలు సంస్థలకు విరాళాలిస్తూ తరచూ భారత్‌లో రాజకీయ వ్యవహారాల్లో జోక్యం చేసుకుంటారని అపవాదు ఉంది. 'నవతరం రావణుడు ఈయన. ఇతనో రాక్షసుడు. ధర్మానికి వ్యతిరేకి. రాముడికి వ్యతిరేకి. భారత్‌ను నాశనం చేయడమే ఈయన లక్ష్యం' ఆ పోస్ట్‌లో బీజేపీ రాహుల్‌పై ఆరోపణలు చేసింది.

9న సీడబ్ల్యూసీ సమావేశం

సాక్షి, న్యూఢిల్లీ: కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ(సీడబ్ల్యూసీ) ఈ నెల 9న ఢిల్లీలో భేటీ కానుంది. రానున్న ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు సహా, వచ్చే ఏడాది జరిగే సార్వత్రిక ఎన్నికలకు రోడ్‌మ్యాప్ సిద్ధం చేయడంతో పాటు కులగణన, కేంద్ర దర్యాప్తు సంస్థల దుర్వినియోగం వంటి అంశాలపై ఈ సమావేశంలో చర్చించే అవకాశం ఉంది. మహిళా రిజర్వేషన్ చట్టం అమలులో చిక్కులు, ప్రస్తుత రాజకీయ పరిస్థితులు, రాష్ట్రాల వారీగా ఇండియా కూటమి పక్షాలతో పొత్తులు వంటి అంశాలపై చర్చించనున్నట్లు సమాచారం. ప్రధానంగా తెలంగాణ సహా మధ్యప్రదేశ్‌లో అధికారం చేజిక్కించుకోవడం, చత్తీస్‌గఢ్, రాజస్తాన్‌లో అధికారం కాపాడుకోవడం లక్ష్యంగా సీడబ్ల్యూసీలో కీలక నిర్ణయాలు తీసుకొనే అవకాశం కనిపిస్తోంది.

అంతరిక్ష కేంద్రం ఏర్పాటుపై దృష్టి: ఇస్రో

న్యూఢిల్లీ: చంద్రయాన్–3 మిషన్ విజయవంతంతో భారత అంతరిక్ష పరిశోధన సంస్థ(ఇస్రో) దృష్టి ఇప్పుడు ప్రతిష్టాత్మక అంతరిక్ష పరిశోధన ప్రాజెక్టులపై పడిందని సంస్థ చైర్మన్ ఎస్.సోమనాథ్ వెల్లడించారు. చైనా గ్లోబల్ టెలివిజన్ నెట్‌వర్క్(సీజీటీఎన్)కు ఆయన ఇంటర్వ్యూ ఇచ్చారు. ఇందులో భాగంగా అంతరిక్ష కేంద్ర నిర్మాణం, దీర్ఘకాల మానవ అంతరిక్షయానంతోపాటు భవిష్యత్తు మిషన్ల కోసం వివిధ అవకాశాలను అన్వేషిస్తోందని తెలిపారు. అంతరిక్ష కేంద్రం ఏర్పాటు భారతీయ అంతరిక్ష ఆర్థిక వ్యవస్థకు ఎలా ప్రయోజనకరంగా ఉంటుందనే విషయం పరిశీలిస్తున్నామన్నారు. సమీప భవిష్యత్తులో సొంతంగా అంతరిక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేసి, రోబోటిక్ ఆపరేషన్స్‌తో ప్రారంభించాలని ప్రణాళిక రూపొందించుకున్నట్లు వివరించారు. ప్రస్తుతానికి మానవ సహిత అంతరిక్ష యానంపై దృష్టిసారించామన్నారు. గగన్‌యాన్ కార్యక్రమం అదే దిశగా సాగుతోందని చెప్పారు. అది నెరవేరితే, ఆ తర్వాత వచ్చే 20–25 ఏళ్లలో చేపట్టే మిషన్లలో స్పేస్ స్టేషన్ ఏర్పాటు ఉంటుందన్నారు. తద్వారా ఇప్పటికే ఈ దిశగా విజయం సాధించిన అమెరికా, రష్యా, చైనాల సరసన భారత్ చేరుతుందన్నారు. చైనా గ్లోబల్ టెలివిజన్ నెట్‌వర్క్(సీజీటీఎన్)

2 వారాలు గడువివ్వండి: రణ్‌బీర్

ముంబై: మహదేవ్ యాప్ ఆన్‌లైన్ బెట్టింగ్ కేసులో బాలీవుడ్ నటుడు రణ్‌బీర్ కపూర్ ఆరోపణలు ఎదుర్కొంటున్న విషయం తెలిసిందే. ఈ నెల 6న ఛత్తీస్‌గఢ్ రాజధాని రాయ్‌పూర్ కార్యాలయంలో జరిగే విచారణకు హాజరుకావాలంటూ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) పంపిన నోటీస్‌పై రణ్‌బీర్ స్పందించారు. తనకు రెండు వారాల గడువు కావాలని ఈడీని కోరినట్లు సమాచారం. ఇదే కేసులోకమెడియన్ కపిల్ శర్మ, హీరోయిన్లు హుమా ఖురేషి, హినా ఖాన్‌లకు కూడా ఈడీ గురువారం సమన్లు జారీ చేసింది. ముగ్గురినీ వేర్వేరు తేదీల్లో రాయ్‌పూర్ కార్యాలయంలో జరిగే విచారణకు రావాలని పేర్కొంది. మహదేవ్ యాప్ ప్రమోటర్లు రాయ్‌పూర్‌కు చెందిన వారే. వీరు యూఏఈలో ఉంటూ తమ ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్ ప్రచారం కోసం చేపట్టిన కార్యక్రమాల్లో బాలీవుడ్‌కు చెందిన సుమారు 15 మంది సెలిబ్రిటీలు, నటులు పాల్గొన్నట్లు ఈడీ ఆరోపిస్తోంది.

ఏకంగా బస్‌షెల్టర్‌నే మాయం చేశారు

శివాజీనగర: ఇనుప వంతెనలు, భారీ వస్తు సామగ్రిని మాయం చేస్తున్న దొంగల కళ్లు..ఇప్పుడు బస్ షెల్టర్‌పై పడ్డాయి. బెంగళూరు నగరం నడిబొడ్డున నగర పోలీస్ కమిషనర్ కార్యాలయానికి దగ్గర్లో ఉన్న సిటీ బస్ షెల్టర్‌ను దొంగలు ఎత్తుకుపోయారు. ఒక ప్రైవేటు సంస్థ విరాళంగా అందజేసిన రూ.10 లక్షలతో స్థానిక కన్నింగ్‌హం రోడ్డులో బెంగళూరు మెట్రో సిటీ బస్ సంస్థ (బీఎంటీసీ) ఏడాదిన్నర క్రితం స్టీల్, ఇనుప రాడ్‌లు, షీట్లతో బస్‌షెల్టర్‌ను ఏర్పాటు చేసింది. కొన్నిరోజులుగా అక్కడ బస్సు షెల్టర్ స్థానం ఖాళీగా కనిపిస్తుండటంతో అధికారులే తొలగించి ఉంటారని స్థానికులు భావించారు. సదరు ప్రైవేటు సంస్థకు విషయం తెలిసి కార్పొరేషన్ అధికారులను ఆరా తీశారు. ఈ విషయం బయటకు రావడంతో స్థానికులు వారం క్రితం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సీసీ కెమెరాలు, ఇతర ఆధారాలతో పోలీసులు దొంగలను పట్టుకునేందుకు ప్రయత్నాలు ప్రారంభించారు.

కరుస్తున్న 'కమాండర్' కథ కంచికి

వాషింగ్టన్: అమెరికా అధ్యక్ష భవనం వైట్‌హౌజ్‌లో సీక్రెట్ సర్వీస్ అధికారులు, సిబ్బందిని తరచూ కరుస్తూ వార్తల్లో నిలుస్తున్న అధ్యక్షుడి శునకం 'కమాండర్' ఇకపై శ్వేతసౌధంలో కనిపించదు. అది ఇప్పటికే 11 సార్లు అక్కడి వారిని కరిచింది. దీంతో విసిగిపోయి దానికి వేరే ప్రాంతానికి తరలించారు. ఈ విషయాన్ని దేశాధ్యక్షుడు బైడెన్ భార్య జిల్ అధికార ప్రతినిధి ఎలిజబెత్ అలెగ్జాండర్ గురువారం మీడియాకు వెల్లడించారు. 'తమ రక్షణ బాధ్యతల్ని అనుక్షణం చూసే అధికారుల, సిబ్బంది క్షేమం తమకు ముఖ్యమని బైడెన్ దంపతులు భావించారు. అందుకే దానిని వేరే చోటుకు పంపారు' అని ఎలిజబెత్ వ్యాఖ్యానించారు. రెండేళ్ల వయసున్న జర్మన్ షెపర్డ్ జాతి 'కమాండర్' శునకం ఇప్పుడు ఎక్కడ ఉందనే వివరాలను ఆమె బయటపెట్టలేదు. అంతకుముందు 'మేజర్' అనే మరో శునకాన్ని బైడెన్ కుటుంబం పెంచుకునేది. అది కూడా ఇలా తరచూ ఇతరులను కరుస్తుండటంతో దానినీ సాగనంపారు.

సాక్షి
కరీంనగర్

శుక్రవారం | 6 | అక్టోబర్ | 2023

పట్టుపట్టారు.. కొలువు కొట్టారు

యువతరం కల సాకారమైంది. ఖాకీ కొలువు చేయాలన్న లక్ష్యం నెరవేరింది. వారి కష్టానికి ఫలితం లభించింది. సర్కారు కొలువు సాధించడంతో ఆయా కుటుంబాల్లో సంతోషం వ్యక్తమవుతోంది. కానిస్టేబుల్ ఫలితాల్లో జిల్లాలోని పలువురు యువత సత్తాచాటారు. పేద, మధ్యతరగతికి చెందిన ఎందరో ఖాకీ కొలువు సాధించి.. శభాష్ అనిపించుకున్నారు.!! 8లో▸



న్యూస్‌రీల్

బల్దియా కమిషనర్ బదిలీపై సందిగ్ధత

కరీంనగర్ కార్పొరేషన్: నగరపాలకసంస్థ కమిషనర్ బదిలీ సందిగ్ధంలో పడింది. గత నెల 23వ తేదీన సంగారెడ్డి జిల్లా తెల్లాపూర్ కమిషనర్‌గా పనిచేస్తున్న బోనగిరి శ్రీనివాస్ రావును కరీంనగర్‌కు బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అయితే గురువారం వరకు ఆయన కరీంనగర్‌లో బాధ్యతలు చేపట్టడానికి రాలేదు. ఎన్నికల సంఘం క్లియరెన్స్ లేకపోవడంతోనే ఆయన జాయిన్ కావడం లేదని సమాచారం. ఎన్నికల వేళ అధికారుల బదిలీలు ఎన్నికల సంఘం కనుసన్నల్లో జరుగుతుండడం తెలిసిందే. ప్రస్తుతం జిల్లా అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయి నగరపాలకసంస్థ కమిషనర్‌గా పూర్తి అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. అయితే ప్రఫుల్ దేశాయి చొప్పదండి ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా ఉండడంతో అదనపు బాధ్యతల నుంచి తప్పుకొనేందుకు మొగ్గుచూపుతున్నట్లు సమాచారం. ఇదిలాఉంటే శ్రీనివాస్‌రావు బాధ్యతలు చేపడుతారా, మరో కొత్త కమిషనర్ కరీంనగర్‌కు వస్తారా...ఒకటి రెండు రోజుల్లో తేలనుంది.

పనులపై శ్రద్ధ చూపాలి



మాట్లాడుతున్న ప్రఫుల్ దేశాయ్

కరీంనగర్: జిల్లాలో నిర్వహించే అభివృద్ధి పనులపై శ్రద్ధ వహించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ సూచించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సీసీ చార్జీలు, ఎల్ఆర్ఎస్, ఇంటింటా చెత్తసేకరణ, వర్మి కంపోస్ట్, వందశాతం ట్యాక్స్ కలెక్షన్, పబ్లిక్ ఇన్‌స్టిట్యూట్ క్లీనింగ్‌లపై ఎంపీవో, డీఎల్‌పీవో, విద్యుత్ అధికారులతో సమీక్షించారు. గ్రామపంచాయతీల్లో స్ట్రీట్‌లైట్, మంచినీటి సరఫరా పనులు సక్రమంగా జరగాలని, వారంలోగా అన్ని జీపీల్లో వందశాతం ట్యాక్స్ కలెక్షన్ పూర్తిచేయాలని, కరెంట్ బిల్లులు పెండింగ్ లేకుండా చెల్లించాలని సూచించారు. పంచాయతీ కార్యదర్శులు ఉదయం 9గంటల లోగా డీఎస్ఆర్ యాప్ ద్వారా నమోదు చేయాలన్నారు. డీపీవో వీరబుచ్చయ్య ఉన్నారు.

ఆడబిడ్డలకు కానుక



చీరలు పంపిణీ చేస్తున్న మేయర్

కరీంనగర్ కార్పొరేషన్: రాష్ట్ర ప్రభుత్వం ఆడబిడ్డలకు పండుగ కానుకగా బతుకమ్మ చీరలు అందిస్తోందని మేయర్ యాదగిరి సునీల్‌రావు అన్నారు. గురువారం నగరంలోని 33వ డివిజన్ భగత్‌నగర్ ఎస్‌బీఎస్ ఫంక్షన్‌హాల్‌లో బతుకమ్మ చీరలు పంపిణీ చేశారు. బతుకమ్మ ఘనంగా నిర్వహించుకొనేలా నగరపాలకసంస్థ ఏర్పాట్లు చేస్తుందని వివరించారు.

సబ్‌స్టేషన్ పరిశీలించిన సీఎండీ గోపాల్‌రావు



కొత్తపల్లి: 33/11 కేవీ పద్మనగర్ విద్యుత్ సబ్‌స్టేషన్‌ను గురువారం రాత్రి టీఎస్ఎన్‌పీడీసీఎల్ సీఎండీ అన్నమనేని గోపాల్‌రావు పరిశీలించారు. సబ్‌స్టేషన్ ఆవరణలో లైటింగ్ తక్కువగా ఉండడంతో కొంచెం లైటింగ్ పెంచాలని సూచించారు. సబ్‌స్టేషన్ నిర్వహణను క్రమం తప్పకుండా చేపట్టాలని ఆదేశించారు. విజిలెన్స్ ఆఫీసర్ జనార్దన్, సర్కిల్ ఎస్ఈ గంగాధర్, డీఈటీ విజేందర్‌రెడ్డి, డీఈలు రాజం, తిరుపతి, ఏడీలు కొల్లూల రాజు, నరేందర్, సుధీర్, ఏఈ రఘు, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

మధ్యంతర భృతి సవరించాలి



కరీంనగర్: మధ్యంతర భృతి 15 శాతంగా సవరించాలని తెలంగాణ ఆల్ పెన్షనర్స్, రిటైర్డు పెన్షనర్స్ అసోసియేషన్(టాప్ర)జిల్లాశాఖ ఆధ్వర్యంలో గురువారం అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్‌కు వినతిపత్రం సమర్పించారు. మధ్యంతర భృతి కేవలం 5శాతంగా నిర్ణయించడం పెన్షనర్లను తీవ్ర నిరాశకు గురిచేసిందన్నారు. ఈ కార్యక్రమంలో టాప్ర రాష్ట్ర కార్యదర్శి జి అశోక్, జిల్లా అధ్యక్షుడు జనార్దన్ తిరుమలయ్య, కె.నాగభూషణాచారి, వెంకటయ్య, రామకిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.







రేపు కేబుల్ బ్రిడ్జిపై మెగా డ్రోన్ షో

కరీంనగర్ కేబుల్ బ్రిడ్జి మరో ఆహ్లాదకర వేడుకకు వేదిక కానుంది. నగరవాసులను ఈనెల 7 (శనివారం) సాయంత్రం మెగా డ్రోన్ షో అలరించనుంది. మహానగరాల్లో నిర్వహించే ఈ షోను కరీంనగర్ తీసుకురావడంలో మంత్రి గంగుల కమలాకర్ ప్రత్యేక చొరవ తీసుకున్నారు. కరీంనగర్‌లో ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులను కేబుల్ బ్రిడ్జి వేదికగా ప్రజల కళ్లకు కట్టినట్లు చూపించేందుకు ఈ ప్రదర్శన ఏర్పాటు చేస్తున్నారు. కార్యక్రమంలో సినీ సంగీత విభావరితోపాటు అనేక సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. వీకెండ్ మస్తీ పేరిట గతంలో నిర్వహించిన కార్యక్రమాలను మించిన వినోదం పంచేలా ఇవి ఉంటాయని మంత్రి కార్యాలయం గురువారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపింది. – సాక్షిప్రతినిధి, కరీంనగర్

కాగుతున్న కల్తీ!



ఇది నగరంలోని ఓ వ్యాపారి అనధికారిక గోడౌన్. భారీ ఎత్తున కల్తీ నూనెలు నిల్వ చేయగా గ్రామీణ ప్రాంతాలకు ఆటోల్లో తరలిస్తున్నారు. పత్తి నూనె, సోయాబీన్, పశువుల ఎముకల నూనెను కలిపి పొద్దుతిరుగుడు నూనె పేరుతో విక్రయిస్తున్నారు. గతంలో ఇలాంటి గోడౌన్‌లోనే తనిఖీలు నిర్వహించగా సదరు నూనె సురక్షితం కాదని గతంలో ఆహార నియంత్రణ అధికారులు తేల్చారు.



ఈ డబ్బాలు చూశారుగా.. వీటినే మళ్లీ రీసైక్లింగ్ చేస్తారన్న మాట. ఆ డబ్బాలకు ఆకర్షణీయంగా ఉండే లేబుళ్లను అతికిస్తారు. వారు ఏ పేరు పెడితే అదే నూనెగా నమ్మాలి మరి.

- వసూళ్లు తప్ప పట్టించుకునే దిక్కేది
- దసరా వేళ కల్తీరాయుళ్ల భారీ దందా
- నిబంధనలకు మించి నూనెల నిల్వలు..
- అనధికారిక గోదాంలే అడ్డాలు



నగరంలోని ఓ గోదాంలో పరిమితికి మించి నిల్వలు

కరీంనగర్ అర్బన్:

పండుగ పూట కల్తీ కాగుతోంది. ఆహార నియంత్రణశాఖ నామమాత్రంగా మిగలడంతో కల్తీ మాఫియా రెచ్చిపోతోంది. జిల్లాలో విడినూనె విక్రయాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. కల్తీ రక్కసిని నియంత్రించాల్సిన విభాగం నామమాత్రంగా మిగలడం ఆందోళనకరం. గతంలో జరిగిన తనిఖీల్లో భారీగా కల్తీనూనె వెలుగుచూసినా పండుగపూట ముందస్తు తనిఖీలు లేకపోవడం విడ్డూరం. విడి నూనె విక్రయాలు లేవని సుద్దులు చెప్పే వ్యాపారులు చాటుమాటుగా విక్రయించడం యథాతథం.

ఖాళీలతో సతమతం

ఆహార తనిఖీ విభాగం ప్రతినెలలో తప్పనిసరిగా తనిఖీలు నిర్వహించాల్సి ఉంటుంది. గెజిటెడ్ ఫుడ్ ఇన్‌స్పెక్టర్, ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్లకు ఒక్కొక్కరికి నిర్దేశిత లక్ష్యముంటుంది. కానీ గత ఆరేళ్లుగా పూర్తిస్థాయి అధికారులు లేక కార్యాలయం వెలవెలబోతుంది. ఒక గెజిటెడ్ ఫుడ్ ఇన్‌స్పెక్టర్‌తో పాటు ఇద్దరు ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్లు, ఒక క్లర్క్, ఇద్దరు అటెండర్లు కార్యాలయంలో విధులు నిర్వహించాల్సి ఉంది. కేవలం ఒక జూనియర్ అసిస్టెంట్, ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్‌తో నెట్టుకొస్తున్నారు. గెజిటెడ్ ఫుడ్ ఇన్‌స్పెక్టర్ ఎప్పుడు కార్యాలయంలో ఉంటారో తెలియని పరిస్థితి. విశ్రాంత అటెండర్ ద్వారా విధులు నిర్వహించడం ఆరోపణలకు తావిస్తోంది.

పండుగల పూట భారీ దందా

పండుగల సమయంలో దందా అంతాఇంతా కాదు. వీలైనంత మేర కల్తీ చేసి పొద్దుతిరుగుడు, పల్లీ నూనె పేరుతో విక్రయిస్తున్నారు. బతుకమ్మ, దసరా, ఏకాదశి, సంక్రాంతి పండుగల సమయాల్లో భారీగా వ్యాపారం సాగుతోంది. తక్కువ ధరకు దొరికే వివిధ రకాల నూనెలు కొనుగోలు చేసి, వాటిని స్వల్ప నాణ్యమైన నూనెలో అధిక మొత్తంలో కలిపి విక్రయించడం అప్రతిహతంగా సాగుతోంది. ఆయా శాఖల అధికారులతో ముందే ఒప్పందాలు కుదుర్చుకుని సదరు సమయంలో తనిఖీలు లేకుండా జాగ్రత్త పడుతున్నారు. సీజన్ ముగిశాకా అరకొర దుకాణాల్లో తనిఖీలు నిర్వహించాలని వారే సూచిస్తున్నారని సమాచారం. నగరంలోని ప్రకాశంగంజ్, మంకమ్మతోట, రాంనగర్ ప్రాంతాల్లో ఎక్కువగా కల్తీ విక్రయాలు సాగుతున్నాయని సమాచారం. చింతకుంట, బొమ్మకల్, బైపాస్ ప్రాంతాల్లోని గోడౌన్లలో విడినూనెను దించుకోవడం అక్కడి నుంచి ప్యాకెట్లు, డబ్బాల్లో నింపి దుకాణాలకు తరలించడం తంతుగా సాగుతోంది. హుజూరాబాద్, జమ్మికుంట, గంగాధర, తిమ్మాపూర్ ప్రాంతాల్లోని పలువురు వ్యాపారులు భారీగా నిల్వలు చేశారు.

అంతా సోయాబీన్..

ఏ నూనె అయినా కల్తీ చేయడం పలువురు వ్యాపారులకు వెన్నతో పెట్టిన విద్య. హైదరాబాద్, రాజమండ్రి, కాకినాడ ప్రాంతాల నుంచి ట్యాంకర్ల ద్వారా ఎలాంటి వే బిల్లులు లేకుండా నూనెను కరీంనగర్‌కు దిగుమతి చేస్తున్నారు. ఎముకల నూనెను కూడా మిశ్రమంగా వాడుతున్నట్లుగా గతంలో తేలింది. ఇక్కడికి రాగానే తక్కువ ధరకు లభించే సోయాబీన్ నూనెను పొద్దుతిరుగుడు నూనెలో, వేరుశనగ నూనెలో కలుపుతున్నారు. కల్తీ చేసిన నూనెల నుంచి స్వచ్ఛమైన వాసన వచ్చేందుకు రసాయన పదార్థాలను వినియోగిస్తున్నారు. 48కిలోల సోయాబీన్ నూనెలో కేవలం 2 కిలోల పల్లి నూనెను కలిపి మొత్తంగా పల్లి నూనెగా విక్రయిస్తున్నారంటే కల్తీ ఏ స్థాయిలో జరుగుతుందో అర్థం చేసుకోవచ్చు.

పరిమితికి మించి నిల్వలు..

నాణ్యమైన నూనెల విక్రయాలు, ధరల నియంత్రణ, జీరో వ్యాపారాన్ని నియంత్రించడంలో అధికారుల మధ్య సమన్వయలోపం వ్యాపారులకు కల్పతరువుగా మారింది. ఐదుక్వింటాళ్ల కన్నా ఎక్కువ నూనె నిల్వ చేసుకుంటే పౌరసరఫరాల శాఖ అనుమతి తప్పనిసరి. హోల్‌సేల్ వ్యాపారులు జిల్లాకేంద్రంలో అయితే 600 క్వింటాళ్లు, ఇతర ప్రాంతాల్లో అయితే 377 క్వింటాళ్లు, జిల్లా కేంద్రంలో రిటైల్ అయితే 50 క్వింటాళ్లు, ఇతర ప్రాంతాల్లో 30 క్వింటాళ్లు నిల్వ చేసుకునేందుకు అనుమతి ఉంటుంది. అయితే అనుమతి లేని దుకాణాలు వందల్లో ఉన్నాయని తెలుస్తోంది. ఒక్క జిల్లాకేంద్రంలోనే వందవరకు దుకాణాలను నిర్వహిస్తున్నారు. అయితే తనిఖీలు నిర్వహిస్తామని, కల్తీ వ్యాపారాన్ని అరికడుతామని ఆహార నియంత్రణ, పౌరసరఫరాలు, రెవెన్యూశాఖల అధికారులు చెబుతున్నారు.

నగర అభివృద్ధి నిరంతర ప్రక్రియ



నైట్ ఫుడ్ బజార్ ప్రారంభించి టిఫిన్ రుచిచూస్తున్న మంత్రి కమలాకర్, మేయర్ సునీల్ రావు

- మంత్రి గంగుల కమలాకర్

కరీంనగర్ కార్పొరేషన్: నగర అభివృద్ధి నిరంతర ప్రక్రియ అని బీసీ సంక్షేమ, పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ పేర్కొన్నారు. గురువారం నగరంలోని 12, 13, 32, 38, 39, 43, 57 డివిజన్‌ల పరిధిలోని విద్యానగర్, వినాయకనగర్, విజయదుర్గాకాలనీ, సంతోష్‌నగర్, వెంకటేశ్వర కాలనీలో సీఎం హామీ నిధులతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు మేయర్ యాదగిరి సునీల్‌రావుతో కలిసి శంకుస్థాపన చేశారు.మినీహైమాస్ట్ లైట్లు ప్రారంభించారు. సవరన్ స్ట్రీట్‌లో మహిళలకు బతుకమ్మ చీరలు పంపిణీ చేశారు. ఎల్ఎండీ కట్ట కింద ఏర్పాటు చేసిన వాకింగ్ ట్రాక్‌ను, 105 లైట్లను ప్రారంభించారు. కోతిరాంపూర్ గిద్దెపెరుమాండ్ల స్వామి ఆలయం మైదానం వాకింగ్ ట్రాక్‌పై 39 లైట్లను, ఎస్ఆర్ఆర్ కళాశాల మైదానంలో వాకింగ్ ట్రాక్‌పై ఏర్పాటుచేసిన 90 లైట్లను ప్రారంభించారు. విద్యానగర్ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో పూజలు చేశారు. మంత్రి మాట్లాడుతూ కాంగ్రెస్, బీజేపీలకు అధికారం ఇస్తే తెలంగాణలోని నీళ్లు, నిధులు ఆంధ్రకు తీసుకెళ్లి రాష్ట్రాన్ని అంధకారం చేస్తారన్నారు. స్వరాష్ట్రంలో నగరం శరవేగంగా అభివృద్ధి చెందుతుందని, ఇది నిరంతర ప్రక్రియగా చెప్పారు. ఓ వైపు ఐటీ టవర్, తీగల వంతెన, సుందర కూడళ్లు, మానేరు రివర్ ఫ్రంట్‌తో నగర రూపురేఖలు మార్చామన్నారు. బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, కార్పొరేటర్లు కొండపల్లి సరిత, కచ్చు రవి, సరిళ్ల ప్రసాద్, తోట రాములు, బండ సుమ, బండారి వేణు, చొప్పరి జయశ్రీ, మర్రి భావన, భూమాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నైట్ ఫుడ్ బజార్ ప్రారంభం

నగరంలోని విద్యానగర్‌లో ఏర్పాటు చేసిన నైట్ ఫుడ్ బజార్ అందుబాటులోకి వచ్చింది. గురువారం రాత్రి బీసీ సంక్షేమ, పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ నగర్ మేయర్ యాదగిరి సునీల్ రావుతో కలిసి ప్రారంభించారు. నైట్ ఫుడ్ బజార్‌లో ఏర్పాటు చేసిన శాఖాహార మాంసాహారంనకు చెందిన ఎనిమిది ఫుడ్‌స్టాల్స్‌ ను కూడా మంత్రి ప్రారంభించారు. అందుబాటులో ఉన్న వివిధ రకాల ఆహార పదార్థాలను కొనుగోలు చేసి, రుచి చూశారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ చల్ల స్వరూప రాణి హరిశంకర్, స్థానిక కార్పొరేటర్ కోల బాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ‘సీఎం అల్పాహారం’

- మొగ్దుంపూర్‌లో ప్రారంభించనున్న మంత్రి గంగుల కమలాకర్

కరీంనగర్: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే ఏ విద్యార్థి కూడా ఆకలితో బడికి రావద్దనే ఉద్దేశంతో నాణ్యమైన టిఫిన్ అందించేందుకు ప్రభుత్వం నిర్ణయించిన విషయం తెలిసిందే. సీఎం అల్పాహార పథకాన్ని జిల్లా వ్యాప్తంగా ఈనెల 24న ప్రారంభించాలని ప్రభుత్వం భావించినా త్వరలోనే ఎన్నికల షెడ్యూల్ వెలువడనున్న నేపథ్యంలో శుక్రవారం జిల్లావ్యాప్తంగా ప్రారంభించేందుకు విద్యాశాఖ అన్ని ఏర్పాట్లు చేపట్టింది. ఇటీవలే 1 నుంచి 10వ తరగతి వరకు అన్ని పాఠశాలల్లో ఉదయం విద్యార్థులకు రాగి అంబలి పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించిన విషయం తెలిసిందే. దీనిని వారంలో మూడు రోజులు అందిస్తున్నారు. తాజాగా అల్పాహార పథకం ప్రవేశపెట్టడం పాఠశాలల్లో కొత్త మైలురాయిని చేరుకోనున్నట్లు పలువురు హర్షిస్తున్నారు. బీసీ సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్ కరీంనగర్‌రూరల్ మండలం మొగ్దుంపూర్‌లో ఈ పథకాన్ని లాంఛనంగా ప్రారంభించనున్నారు. చొప్పదండి నియోజకవర్గంలోని గంగాధర హైస్కూల్‌లో ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, మానకొండూర్ బాలికల ఉన్నత పాఠశాలలో ఎమ్మెల్యే రసమయి బాలకిషన్, హుజూరాబాద్ బాలుర ఉన్నత పాఠశాలలో ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి పథకాన్ని ప్రారంభించనున్నారు. కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు కలెక్టర్ బి.గోపి అధికారులను సమన్వయ కర్తలుగా నియమించారు. గంగాధర హైస్కూల్‌కు డీఆర్‌డీవో శ్రీలత, మొగ్దుంపూర్ హైస్కూల్‌కు డీఈవో జనార్దన్‌రావు, మానకొండూర్ స్కూల్‌కు జెడ్పీ సీఈవో పవన్‌కుమార్, హుజూరాబాద్‌కు డీపీవో వీరబుచ్చయ్యను నియమించారు.

ప్రజలతో మమేకం కావాలి



కరీంనగర్ పోలీసు అధికారులతో రిటైర్డ్ ఐజీ ఆనంద్‌శుక్లా

- రిటైర్డ్ ఐజీ ఆనంద్ శుక్లా

కరీంనగర్‌క్రైం: ప్రజలతో మమేకమవుతూ అంకిత భావంతో కూడిన సేవలు అందిచినప్పుడే విశిష్టమైన గుర్తింపు వస్తుందని రాజస్థాన్ కేడర్ రిటైర్డ్ ఐజీ ఆనంద్‌శుక్లా అన్నారు. గురువారం నగరంలోని హెడ్‌క్వార్టర్ కాన్ఫరెన్స్‌హాల్‌లో జిల్లాలోని ఎస్‌హెచ్‌వోలు, ఏసీపీలకు ఇన్వెస్టిగేషన్, సాఫ్ట్‌స్కిల్స్ ప్రాధాన్యం, యాక్టివ్ లిజనింగ్‌తో చేకూరే లాభాలను వివరించారు. ఇన్వెస్టిగేషన్‌లో సమస్య ఉత్పన్నం చేసే మూలాలను గుర్తించి ఫిర్యాదుదారుడు, నేరస్తుడి మధ్య ఇతివృత్తం అనుసంధానం చేసి త్వరితగతిన ఫలితాలు పొందవచ్చన్నారు. పర్సనాలిటీ డెవలప్‌మెంట్‌లో భాగంగా ఫిర్యాదుదారుడి సమస్యను పూర్తిగా అర్థంచేసుకుని సమస్యను పరిష్కరించవచ్చని తెలిపారు. అడిషనల్ డీసీపీ(అడ్మిన్) ఇ.రాజు, అడిషనల్ డీసీపీ (లా అండ్ ఆర్డర్) లక్ష్మి నారాయణ, టౌన్ ఏసీపీ జి.నరేందర్, రూరల్ ఏసీపీ తాండ్ర కరుణాకర్‌రావు, హుజూరాబాద్ ఏసీపీ జీవన్‌రెడ్డి, సీసీఎస్ ఏసీపీ మాధవి, ఏసీపీ వర్టికల్స్ కాశయ్య, ఏఆర్ ఏసీపీ సి.ప్రతాప్ పాల్గొన్నారు.

సిటీలో వెహికిల్ మర్డర్స్!

‘ఇటీవల సిటీలోని భగత్‌నగర్‌లో ఓ భూమి విషయంలో గొడవ జరిగింది. ఎదుటి వ్యక్తిని ఎలాగైనా చంపాలనుకున్న మరో వ్యక్తి ఇంకొకరికి సుపారీ ఇచ్చాడు. అయితే, అతన్ని వాహనంతో ఢీకొట్టి హత్య చేయాలకొని, పథకం ప్రకారం ఢీకొట్టారు. కానీ, అదృష్టవశాత్తు బాధితుడు బతికాడు. ఈ కేసును చేధించిన కరీంనగర్ టౌన్ ఏసీపీ నరేందర్, వన్‌టౌన్ సీఐ రవికుమార్ బృందం నిందితులిద్దరిపై హత్యాయత్నం కేసు నమోదు చేసి, జైలుకు తరలించారు.’

‘గతంలో కరీంనగర్ త్రీటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో భూమి గొడవతో ఓ వ్యక్తిపై కక్ష పెంచుకొని, వాహనంతో ఢీకొట్టిన కేసును అప్పటి సీఐ దామోదర్‌రెడ్డి బృందం లోతుగా దర్యాప్తు చేసింది. రోడ్డు ప్రమాదం కాదని హత్య అని తేల్చారు. నిందితులను జైలుకు తరలించి, పీడీయాక్టు అమలు చేశారు.’

- ప్రత్యర్థులను ఢీకొట్టించి, ప్రమాదాలుగా చిత్రీకరణ
- చంపుకునే వరకు వెళ్తున్న స్థిరాస్తుల గొడవలు
- పోలీసులకు చిక్కి కటకటాలపాలు
- టెక్నాలజీ ద్వారా కేసులను ఛేదిస్తున్న పోలీసులు



హత్యాయత్నం కేసులో నిందితుల అరెస్టు చూపుతున్న ఏసీపీ నరేందర్ (ఫైల్)

కరీంనగర్ క్రైం: స్థిరాస్తుల గొడవలతో పలువురు మృగాలుగా మారుతున్నారు. మానవత్వం మంటగలవడంతో కర్కశంగా వ్యక్తుల ప్రాణాలు తీయడానికి సిద్ధపడుతున్నారు. ఈ క్రమంలో ప్రత్యర్థులను వాహనాలతో ఢీకొట్టి చంపుతూ ప్రమాదాలుగా చిత్రీకరిస్తున్నారు. చివరికి దర్యాప్తులో పోలీసులకు చిక్కి, కటకటాలపాలవుతున్నారు. వాహనంతో ఢీకొట్టి పారిపోతే రోడ్డు ప్రమాదంగా భావిస్తారనే చాలా మంది ఈ దారిని ఎంచుకుంటున్నారని పోలీసులు చెబుతున్నారు. కానీ, పట్టుబడితే కఠిన శిక్షలు తప్పవని గుర్తుంచుకోవాలని వారు హెచ్చరిస్తున్నారు.

పట్టిస్తున్న సీసీ కెమెరాలు..

కరీంనగర్ త్రీటౌన్ ఠాణా పరిధిలో జరిగిన ఘటన విషయానికి వస్తే.. సుభాష్‌నగర్‌లో నంబర్ ప్లేట్ లేని కారుతో బైక్‌ను ఢీకొట్టగా దంపతులిద్దరూ కిందపడి తీవ్రంగా గాయపడ్డారు. కానీ, ఆ మహిళ మృతిచెందింది. రోడ్డు ప్రమాదంగా కేసు నమోదు చేసిన పోలీసులు సీసీ ఫుటేజీ పరిశీలించి, లోతుగా దర్యాప్తు చేశారు. వారిని కావాలనే హత్య చేశారని తేలడంతో నిందితులను జైలుకు తరలించారు. అదే విధంగా ఇటీవల భగత్‌నగర్‌లో జరిగిన ఘటనలోనూ సీసీ కెమెరాలు, కాల్‌డేటా ఆధారంగా రోడ్డు ప్రమాదం కాదు హత్య చేసేందుకే ప్రయత్నించారని పోలీసులు తేల్చారు. బాధితుడు ప్రాణాలతో బయటపడటంతో కరీంనగర్ వన్‌టౌన్ పోలీసులు హత్యాయత్నం కేసు నమోదు చేసి, నిందితులిద్దరినీ జైలుకు పంపించారు.

నిందితులు తప్పించుకోలేరు

చిన్న చిన్న స్థిరాస్తుల గొడవల్లో మనుషుల ప్రాణాలు తీసేవరకు వెళ్లడం సరికాదు. నేరం జరిగిన తర్వాత గంటల వ్యవధిలోనే నిందితులను పట్టుకుంటున్నాం. టెక్నాలజీ వినియోగం పెరిగింది. నేరం చేస్తే తప్పించుకోలేరు. ఇటీవల భగత్‌నగర్‌లో జరిగిన ఘటనలో ఇద్దరిపై హత్యాయత్నం కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించాం.

– జి.నరేందర్, కరీంనగర్ టౌన్ ఏసీపీ

జైళ్లలో చాలా మంది..

హత్య చేసిన వ్యక్తికి మరణశిక్ష లేదా యావజ్జీవ శిక్షతోపాటు జరిమానా విధించవచ్చు. భూముల గొడవలతో చట్టం, శిక్షల గురించి ఏ మాత్రం ఆలోచించని వారు వాహనాలతో ఢీకొట్టి, పోలీసులకు దొరకకుండా పారిపోవాలని చూస్తున్నారు. కూర్చొని మాట్లాడుకుంటే పోయేదానికి చంపడం వరకు వెళ్తున్నారు. ఇలాంటి కేసుల్లో చాలా మంది జైళ్లలో మగ్గుతున్నారు. టెక్నాలజీ ద్వారా పోలీసులు గంటల వ్యవధిలోనే కేసులను ఛేదిస్తున్నారు.

క్లుప్తంగా

జాతీయ పోటీలకు 'పారమిత' విద్యార్థి



కొత్తపల్లి(కరీంనగర్): రాజస్థాన్‌లోని జైపూర్‌లో శుక్రవారం నుంచి జరిగే 42వ జాతీయస్థాయి జూనియర్ అండర్-19 షూటింగ్ బాల్ చాంపియన్‌షిప్ పోటీలకు కరీంనగర్ పద్మనగర్‌లోని పారమిత హెరిటేజ్ పాఠశాల పదోతరగతి విద్యార్థి డి.అశ్విత్ పటేల్ ఎంపికయ్యాడని ప్రధానోపాధ్యాయుడు రితేష్ మెహతా తెలిపారు. అశ్విత్ పటేల్‌ను గురువారం పాఠశాల చైర్మన్ ఇ.ప్రసాదరావు, డెరెక్టర్లు ప్రసూన, అనూకర్ రావు, రాకేశ్ అభినందించారు.

'శ్రీ చైతన్య ఫార్మసీ'లో ఓరియంటేషన్



తిమ్మాపూర్: మండలంలోని మహాత్మానగర్ శ్రీచైతన్య ఫార్మసీ కళాశాలలో నూతనంగా ప్రవేశం పొందిన బీఫార్మసీ, డీఫార్మసీ విద్యార్థులకు గురువారం ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. కళాశాల చైర్మన్ ముద్దసాని రమేశ్‌రెడ్డి మాట్లాడుతూ.. ఫార్మసీలో విద్యనభ్యసించిన తమ విద్యార్థులు ఉన్నతమైన శిఖరాలను అందుకున్నారని, ఫార్మసీరంగం ఆవశ్యకతను వివరించారు. కళాశాల డైరెక్టర్ నరేందర్‌రెడ్డి , ప్రిన్సిపాల్ రామ నర్సింహరెడ్డి, ప్రొఫెసర్ అప్పారావు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

జమ్మికుంట: మద్యానికి బానిసై పురుగులమందు తాగి ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తి చికిత్స పొందుతూ చనిపోయాడు. పోలీసుల వివరాల ప్రకారం.. పట్టణంలోని 16వార్డు ఎస్టీ కాలనీకి చెందిన రేవల్లి రాజయ్య(52) మద్యానికి బానిసయ్యాడు. మద్యం తాగేందుకు డబ్బులు ఇవ్వాలని, లేకుంటే చనిపోతానని ఇంట్లో వాళ్లను బెదిరిస్తూ.. గతనెల 20వ తేదీన పురుగుల మందు తాగాడు. కుటుంబసభ్యులు వరంగల్ ఎంజీఎంకు తరలించారు. చికిత్స పొందుతూ గురువారం చనిపోయాడు. మృతుడి భార్య రాధమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ చంద్రారెడ్డి తెలిపారు.

ఎల్‌ఎల్‌ఎం ఫీజు గడువు

కరీంనగర్‌సిటీ: శాతవాహన యూనివర్సిటీ పరిధిలోని ఎల్‌ఎల్‌ఎం విద్యార్థులు రెండోసెమిస్టర్ పరీక్ష ఫీజులు చెల్లించాలని పరీక్షల నియంత్రణ అధికారి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 12వ తేదీ నుంచి 16వ తేదీ వరకు ఎలాంటి లేట్ ఫీజు లేకుండా చెల్లించవచ్చు. రూ.300 అపరాధ రుసుంతో 17వ తేదీ నుంచి ఈనెల 19వ తేదీ వరకు చెల్లించవచ్చని వారు పేర్కొన్నారు. సకాలంలో ఫీజులు చెల్లించి పరీక్షకు హాజరు కావాలని ఈ సందర్భంగా సూచించారు.

పట్టుపట్టారు.. కొలువు కొట్టారు

- పోలీసు కానిస్టేబుల్ ఉద్యోగాలు సాధించిన యువత
- కలలు సాకారం చేసుకున్న ఈ'తరం'
- సంతోషంలో కుటుంబసభ్యులు..



కరీంనగర్‌క్రైం/మానకొండూర్/గన్నేరువరం/శంకరపట్నం: కలులు కన్నారు.. కష్టపడ్డారు.. కొలువు కొట్టారు.. చిన్ననాటి నుంచి పోలీస్ కావాలనే లక్ష్యంతో నిరంతరం శ్రమించారు. ప్రభుత్వ ఉద్యోగం సాధించి ఆదర్శంగా నిలిచారు. ఏళ్లతరబడి శిక్షణ తీసుకుని తల్లిదండ్రులతో పాటు టీచర్ల ప్రోత్సాహంతో కలను సాకారం చేసుకున్నారు. కరీంనగర్ జిల్లాలోని యువత చాలామంది పోలీసుశాఖ విడుదల చేసిన కానిస్టేబుల్ ఫలితాల్లో సివిల్, ఏఆర్, ఫైర్‌తో పాటు వివిధ విభాగాల్లో ఉద్యోగాలు సాధించారు. పేద, మధ్యతరగతి కుటుంబాల్లో నుంచి 'ఖాకీ'గా కొలువు కొట్టారు.. ఈ సందర్భంగా పలువురి మనోభావాలు..

చిన్ననాటి కల



మాది కుమ్మరికుంట. చిన్ననాటి నుంచి పోలీస్‌కావాలని కలకన్నాను. మా తల్లిదండ్రులు భూలక్ష్మి- అయిలయ్య. ఇద్దరూ వ్యవసాయం చేస్తుంటారు. నేను కరీంనగర్‌లో హాస్టల్‌లో ఉంటూ డిగ్రీ ఫైనల్ ఇయర్ చదువుతున్నాను. పోలీస్‌కానిస్టేబుల్ కోసం శిక్షణ పొందాను. ఏఆర్ కానిస్టేబుల్‌గా ఎంపికయ్యాను. సంతోషంగా ఉంది.

– తమ్మనవేణి అక్షిత

కోరుకున్న కొలువు



మాది చింతకుంట. అమ్మానాన్న స్వరూప-ఆంజనేయులు. నాన్న మున్సిపల్ వర్కర్. అమ్మ గృహిణి. 2020లో బీటెక్ పూర్తిచేశాను. అప్పటి నుంచి బ్యాంకు ఉద్యోగాలకు ప్రిపేర్ అయ్యాను. కానిస్టేబుల్ పోస్టులు పడడంతో పరీక్ష రాశాను. ఈవెంట్స్ సాధించాను. ఇప్పుడు సివిల్ పోలీస్‌కానిస్టేబుల్‌గా ఎంపికయ్యాను. కోరుకున్న కొలువు రావడం సంతోషంగా ఉంది.

– పొన్నం అనూష

పట్టుబట్టి



కొత్తపల్లి మండలం కమాన్‌పూర్ ఒడ్డెపల్లి మాది. అమ్మానాన్న వేముల ఆనందమ్మ-పాపన్న. బండపని మా కుల వృత్తి. ఉస్మానియా యూనివర్సిటీలో పీజీ జువాలజీ పూర్తి చేశాను. ఎనిమిదేళ్లుగా ప్రభుత్వ కొలువుకోసం ప్రయత్నించి విఫలమయ్యా. ఈ సారి సివిల్ కానిస్టేబుల్‌గా ఎంపికయ్యాను.

– వేముల అశ్విని

ఆనందంగా ఉంది



మాది కొత్తపల్లి మండలం కమాన్‌పూర్. అమ్మనాన్నలు భాగ్య- మల్లయ్య. వ్యవసాయం చేస్తుంటారు. 2018లో ఎంబీఏ మధ్యలో ఆపివేశాను. అప్పటి నుండి ప్రభుత్వ ఉద్యోగాలకు కోచింగ్ తీసుకుంటున్నా. కానిస్టేబుల్ ఫలితాల్లో టీఎస్ఎస్‌పీకి ఎంపికయ్యాను. సంతోషంగా ఉంది.

– కట్ల సందీప్

కూలీ కుటుంబం నుంచి



మాది మానకొండూర్. అమ్మానాన్న పోచయ్య-శాంత. వ్యవసాయ కూలీలు. మేము ఇద్దరం ఆడపిల్లలం. కష్టపడి చదివించారు. అక్క పీజీ చేసింది. ప్రస్తుతం ప్రయివేటు ఉద్యోగం చేస్తోంది. నేను పీజీ చేశాను. కానిస్టేబుల్ పరీక్ష రాయగా.. సివిల్ డిపార్టుమెంటుకు ఎంపికయ్యాను.

– బోయిని లత

గన్నేరువరం యువత



కొట్టె మౌనిక



కొట్టె సాయికృష్ణ

కానిస్టేబుల్ ఫలితాల్లో గన్నేరువరం మండలంలోని పలు గ్రామాలకు చెందిన యువత సత్తా చాటారు. గుండ్లపల్లి, యాస్వాడ, గన్నేరువరం గ్రామాలకు చెందిన వెల్బుల అజయ్, దానవేని వినయ్, ముత్యం అఖిల్‌గౌడ్ టీఎస్ఎస్‌పీ కానిస్టేబుళ్లుగా ఎంపికయ్యారు. యాస్వాడకు చెందిన వడ్లూరి రాజేశ్ ఏఆర్‌కు, గన్నేరువరంకు చెందిన అక్కాతమ్ముళ్లు కొట్టె మౌనిక, సాయికృష్ణ ఇదే గ్రామానికి చెందిన కనకలక్ష్మి సివిల్ కానిస్టేబుల్ ఉద్యోగాలు సాధించారు. కనకలక్ష్మి భర్త శ్రీకాంత్ ఇప్పటికే ఏఆర్ కానిస్టేబుల్‌గా ఉన్నారు.



నవీన్ నాయక్, ప్రవీణ్‌నాయక్



తీగల సాయికృష్ణ



తీగల మహేశ్



ఇమ్మడి విజయ్



ఇమ్మడి వినయ్

పోలీస్ బ్రదర్స్.. అదుర్స్

కరీంనగర్‌లోని రాంనగర్‌కు చెందిన ఇస్లావత్ రాజవ్వ- గేమానాయక్‌ది పేద కుటుంబం. గేమానాయక్ ట్రాలీ ఆటో నడుపుతుంటాడు. రాజవ్వ కూలి పనిచేస్తుంది. వారి పెద్దకొడుకు ఇస్లావత్ నవీన్ నాయక్ బీటెక్ పూర్తిచేశాడు. చిన్నకొడుకు ప్రవీణ్‌నాయక్ డిగ్రీ ఫైనల్‌ఇయర్ చదువుతున్నాడు. నవీన్‌నాయక్ కానిస్టేబుల్ కొలువు కోసం కోచింగ్ తీసుకోగా.. తమ్ముడు తన అన్నయ్య నోట్స్ ప్రిపేర్ అవుతూ ఉండేవాడు. పోలీస్‌కానిస్టేబుల్ ఫలితాల్లో ఇద్దరు ఎంపికయ్యారు. నవీన్‌నాయక్‌కు ఫైర్ కానిస్టేబుల్, ప్రవీణ్‌నాయక్‌కు ఏఆర్ కానిస్టేబుల్‌గా ఉద్యోగం వచ్చింది. ఒకేఇంట్లో ఇద్దరు పోలీసు ఉద్యోగాలకు ఎంపికవడంతో కాలనీవాసులు ప్రశంసించారు. అదే విధంగా శంకరపట్నం మండలం కొత్త గట్టు గ్రామానికి చెందిన తీగల రమేశ్-స్వరూప దంపతుల కొడుకులు తీగల సాయికృష్ణ, మహేశ్ కానిస్టేబుళ్లుగా ఎంపికయ్యారు. హుజూరాబాద్ మండలంలోని కందుగులకు చెందిన ఒకే కుటుంబం నుంచి ఇద్దరు అన్నదమ్ములు ఇమ్మడి విజయ్, ఇమ్మడి వినయ్‌లు కానిస్టేబుల్ ఉద్యోగానికి ఎంపికయ్యారు. అదే గ్రామం నుంచి ఇమ్మడి తరుణ్ ఖాకీ కొలువు సాధించాడు.

చొప్పదండి వాసులు



యువకులను అభినందిస్తున్న బాలాజీనగర్ వాసులు

చొప్పదండి: కానిస్టేబుల్ ఫలితాల్లో మండలానికి చెందిన ఇరువై మంది సత్తాచాటారు. పట్టణానికి చెందిన 11 మంది వరకు కానిస్టేబుళ్లుగా ఎంపికయ్యారు. బాలాజీ నగర్‌పరిధిలో నలుగురు యువకులు కొలువు సాధించారు. భూపాలపట్నంలో వైస్ ఎంపీపీ మునిగాల విజయలక్ష్మి, రాగంపేటలో ఎంపీటీసీ సింగిరెడ్డి కృష్ణారెడ్డి యువకులను అభినందించారు.

మానకొండూర్ నుంచి



ఆంజనేయులు



బూస మారుతి



బీరం అన్వేశ్



బి.శ్రీనివాస్

మానకొండూర్ మండలం నుంచి పలువురు కానిస్టేబుళ్లుగా ఎంపికయ్యారు. గంగిపల్లి గ్రామానికి చెందిన రెడ్డపాక ఆంజనేయులు జైళ్ల శాఖలో కానిస్టేబుల్‌గా ఎంపికయ్యాడు. లోకిని శేఖర్ టీఎస్‌పీఎస్‌కి సెలెక్ట్ అయ్యాడు. బోంపల్లి శేఖర్ ఏఆర్ కానిస్టేబుల్ ఉద్యోగం సాధించాడు. గట్టుదుద్దెనపల్లికి చెందిన బూస మారుతి ఫైర్ కానిస్టేబుల్‌గా ఎంపికయ్యాడు. బీరం అన్వేశ్ టీఎస్ఎస్‌పీ కానిస్టేబుల్‌గా పనిచేస్తూనే సివిల్ ఉద్యోగాన్ని సాధించాడు. బండపల్లి శ్రీనివాస్ హోంగార్డుగా పనిచేస్తూ.. ఫైర్ కానిస్టేబుల్‌గా ఎంపికయ్యాడు.

పీసీగా పీఈటీ



జయంతిని అభినందిస్తున్న అనంతరెడ్డి

కరీంనగర్‌స్పోర్ట్స్: కరీంనగర్ పద్మనగర్‌లోని మానేరు సెంట్రల్ స్కూల్‌లో పీఈటీగా చేస్తున్న తాళ్లపల్లి జయంతి ఏఆర్ కానిస్టేబుల్‌గా ఎంపికైంది. జయంతి సొంతూరు నిజామాబాద్ జిల్లా సిరికొండ మండలం తాటిపల్లి. ఈ సందర్భంగా జయంతిని మానేరు విద్యాసంస్థల అధినేత కడారి అనంతరెడ్డి అభినందించారు. చిన్న వయస్సులోనే ఉద్యోగం పొందడం అభినందనీయమన్నారు. డైరెక్టర్ కడారి సునీతారెడ్డి, ప్రిన్సిపాల్‌లు రాజుచాకో, సరితారెడ్డి, పీఈటీలు సిలివేరి మహేందర్, తిరుపతి, మహేందర్ నాయక్, జహెదా ఉన్నారు.

రైతుబిడ్డ పోలీస్



పొలంపనులు చేస్తున్న సోని

వీణవంక: వ్యవసాయంలో తల్లిదండ్రులు పడుతున్న కష్టాన్ని చూసి తాను ప్రభుత్వ ఉద్యోగం సాధించాలని కష్టపడింది. కానిస్టేబుల్ పరీక్షకు ఇంటి వద్దనే ప్రిపేర్ అయ్యింది. మొదటి ప్రయత్నంలోనే ఉద్యోగం సాధించింది వీణవంక మండలంలోని బేతిగల్ గ్రామానికి చెందిన తడిగొప్పుల సోని. తడిగొప్పుల సమ్మయ్య-స్వరూపకు కొడుకు, కుతూరు సోని ఉన్నారు. సోని పీజీవరకు చదివింది. ఇంటివద్దనే బుక్స్ రెడీచేసుకుని కానిస్టేబుల్ ఉద్యోగానికి ప్రిపేరైంది. మొదటి ప్రయత్నంలోనే విజయం సాధించింది.

గొర్రెలకాపరి నుంచి



దాడి రాజు

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం మొగ్దుంపూర్‌కు చెందిన దాడి రాజు గొర్రెల కాపరిగా పనిచేస్తునే పోలీస్ కానిస్టేబుల్‌గా ఎంపికయ్యాడు. గతంలో శిక్షణ తీసుకుని రాతపరీక్షలో రెండు మార్కుల్లో ఎంపికకాలేదు. పొద్దంతా గొర్రెలను కాస్తునే సాయంత్రం నాలుగైదు గంటలు చదివి తన కలను నెరవేర్చుకున్నాడు. ఇదే గ్రామానికి చెందిన పోతర్ల పూజ రెండోసారి ప్రయత్నంలో పోలీస్‌గా ఎంపికైంది. తల్లిదండ్రులు కనుకయ్య,కొమురమ్మలు కూలీలు. పూజితను డిగ్రీ చదివించారు. పోలీసు ఉద్యోగం సాధించాలనే లక్ష్యంతో కరీంనగర్‌లో ప్రత్యేకశిక్షణ తీసుకుని కొలువు కొట్టింది.

సివిల్ పోలీసుగా జవాన్



జవాన్‌గా మహేందర్

జమ్మికుంట: జమ్మికుంట మండలంలోని సైదాబాద్ గ్రామానికి చెందిన జొన్నల సరోజన- మల్లయ్య దంపతుల పెద్దకొడుకు మహేందర్ 2002లో ఇంటర్‌తో ఆర్మీ జవాన్‌గా ఎంపికయ్యాడు. 20ఏళ్లపాటు జమ్ముకశ్మీర్, పంజాబ్‌తోపాటు వివిధ ప్రాంతాల్లో పనిచేసి 2021లో వాలంటరీ రిటైర్మెంట్ తీసుకున్నాడు. ఓపెన్ యూనివర్సిటీ ద్వారా డిగ్రీ పూర్తిచేశాడు. ఇటీవల పోలీసు కొలువుకోసం సన్నద్ధమయ్యాడు. సివిల్‌కానిస్టేబుల్‌గా కొలువు సాధించాడు. మహేందర్ భార్య శ్వేత ఖమ్మంలో జూనియర్ లెక్చరర్‌గా కొనసాగుతున్నారు.

రైస్‌మిల్లులపై రాజకీయాలు వద్దు



విద్యానగర్(కరీంనగర్): ప్రభుత్వ నిబంధనల మేరకే బియ్యం ఎగుమతి చేస్తున్నామని కరీంనగర్ రైస్‌మిల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బోయినిపల్లి నర్సింగరావు, ప్రధాన కార్యదర్శి తొడుపునూరి కరుణాకర్ తెలిపారు. గురువారం కరీంనగర్‌లోని రైస్‌మిల్ అసోసియేషన్ కార్యాలయంలో మాట్లాడుతూ.. ప్రభుత్వ ధాన్యాన్ని మరాడించి ఎఫ్‌సీఐ నిబంధనల మేరకే తిరిగి అప్పగిస్తున్నామని, ఇప్పటివరకు 50శాతం బియాన్ని అందించామని అన్నా రు. గత పదేళ్లనుంచి ప్రైవేట్ బియ్యం వ్యాపారం చేయలేదన్నారు. ఇటీవల తాము కొనుగోలు చేసిన ధాన్యాన్ని బియ్యంగా మార్చి ఇతర రాష్ట్రానికి పంపిస్తే దాన్ని రాజకీయం చేస్తున్నారని ఆరోపించారు. తాము రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు, రైతులను మోసం చేయడం లేదన్నారు. బియ్యం పక్క రాష్ట్రాలకు పంపిస్తున్న విషయం ప్రభుత్వానికి, అధికారులకు తెలుసని స్పష్టం చేశారు.

పదోన్నతులతో కూడిన బదిలీలు చేపట్టాలి

కరీంనగర్: పదోన్నతులతో కూడిన బదిలీలు చేపట్టాలని డీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వైద్యుల రాజిరెడ్డి డిమాండ్ చేశారు. గురువారం డీటీఎఫ్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట నిరసన ప్రదర్శన చేపట్టారు. రాజిరెడ్డి మాట్లాడుతూ కోర్టు వివాదాలతో మధ్యలోనే పదోన్నతులు నిలుపుదల చేసి, రాష్ట్ర ప్రభుత్వం బదిలీల ప్రక్రియను కొనసాగిస్తోందని, కోర్టు వివాదాలకు రాష్ట్ర ప్రభుత్వ తప్పుడు విధానాలే కారణమని అన్నారు. కోర్టు వివాదాలను తక్షణమే పరిష్కరించి పదోన్నతులతో కూడిన ఎస్జీటీ బదిలీలు చేపట్టాలని డిమాండ్ చేశారు. డీటీఎఫ్ రాష్ట్ర పూర్వ అధ్యక్షుడు ఎం.రఘుశంకర్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి తూముల తిరుపతి, ఏసురెడ్డి, రాంమోహన్, దామోదర్, నర్సయ్య, దేవేందర్, శంకర్, ప్రశాంత్, రాంలింగారెడ్డి, నర్సింహారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బదిలీల ఆర్డర్లు విడుదల చేయాలి

కరీంనగర్: తెలుగు, హిందీ, ఫిజికల్ డైరెక్టర్ బదిలీల ఆర్డర్లను విడుదల చేయాలని టీపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మాడుగుల రాములు అన్నారు. టీపీటీఎఫ్ జిల్లాశాఖ ఆధ్వర్యంలో గురువారం కలెక్టరేట్ ఎదుట నిరసన ప్రదర్శన చేపట్టారు. టీపీటీఎఫ్ నాయకులు దామోదర్‌రెడ్డి, చంద్రశేఖర్, శ్రీనివాస్, రాంచంద్రారెడ్డి, రఘు, రవి, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న సమ్మె

కరీంనగర్: తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ-పంచాయతీ ఆపరేటర్లు కలెక్టరేట్ ఎదుట చేపట్టిన శాంతియుత సమ్మె గురువారం కొనసాగింది. ఈ-పంచాయతీ ఆపరేటర్ల దీక్ష శిబిరాన్ని జిల్లా ఎంపీవోల సంఘం అధ్యక్షుడు జగన్మోహన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి రాజశేఖర్‌రెడ్డి, జనార్ధన్‌లు సందర్శించి సంపూర్ణ మద్దతు తెలిపారు.

ఉరేసుకుని ఒకరి ఆత్మహత్య

గన్నేరువరం: మండలంలోని గుండ్లపల్లికి చెందిన దిటి రాజు(40) బుధవారం ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల కథనం మేరకు రాజు భార్య కరోనా సమయంలో మృతి చెందింది. అప్పటి నుంచి మద్యానికి బానిసయ్యాడు. ఒంటరి జీవితం భరించలేక ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు తల్లి కనకవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

ప్రభుత్వ హామీలు అమలు చేయాలి



డీడబ్ల్యూవోకు సమ్మె విరమణ పత్రం ఇస్తున్న అంగన్‌వాడీలు

కరీంనగర్: అంగన్‌వాడీ కార్యకర్తలకు ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి టేకుమల్ల సమ్మయ్య కోరారు. తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ జేఏసీ ఆధ్వర్యంలో 24రోజులపాటు నిర్వహించిన సమ్మె విరమించి విధుల్లో చేరుతున్నట్లు జిల్లా సంక్షేమ అధికారి(డీడబ్ల్యూవో) సరస్వతికి గురువారం వినతిపత్రం అందజేశారు. టేకుమల్ల సమ్మయ్య మాట్లాడుతూ ఇచ్చిన హామీలు అమలు చేసి మాట నిలబెట్టుకోవాలని కోరారు. తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్ అసోసియేషన్ ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఏ.రజిత, డి.రజిత, జిల్లా నాయకులు అనురాధ, అరుణ, రాజాదేవి, శారద, శ్రీలత, విజయ, సంధ్య, ఇంద్ర పాల్గొన్నారు.

11 నుంచి బీ ఫార్మసీ పరీక్షలు

కరీంనగర్‌సిటీ: శాతవాహన యూనివర్సిటీ పరిధిలో బీఫార్మసీ పది, 6వ సెమిస్టర్ పరీక్షలు ఈనెల 11వ తేదీ నుంచి జరుగుతాయని యూనివర్సిటీ పరీక్షల నియంత్రణ అధికారి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం రెండు గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఆయా తేదీల్లో పరీక్షలు నిర్వహించనున్నామని వారు పేర్కొన్నారు.

ద్వితీయ సంవత్సరం

బీఫార్మసీ ద్వితీయ సంవత్సరం, మూడో సంవత్సరం రెండో సెమిస్టర్ పరీక్షలు ఈనెల 11వ తేదీ నుంచి, నాలుగో సంవత్సరం రెండవ సెమిస్టర్ పరీక్షలు ఈనెల 16వ తేదీ నుంచి జరుగుతాయని తెలిపారు.

టీఎస్‌పీఎస్‌సీని వెంటనే రద్దు చేయాలి

- ఏబీవీపీ స్టేట్ వర్కింగ్ కమిటీ మెంబర్ రాకేశ్



నిరసన తెలుపుతున్న ఏబీవీపీ నాయకులు

కరీంనగర్: టీఎస్‌పీఎస్‌సీని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఏబీవీపీ జిల్లాశాఖ ఆధ్వర్యంలో గురువారం తెలంగాణ చౌక్‌లో రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఏబీవీపీ స్టేట్ వర్కింగ్ కమిటీ మెంబర్ మల్యాల రాకేశ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గత పది సంవత్సరాలుగా పేద మధ్యతరగతి విద్యార్థులకు, నిరుద్యోగులకు తీరని అన్యాయం చేస్తూ ఉద్యోగాలు ఇవ్వకుండా పూర్తిగా పేపర్ లీకేజీలు లిక్కర్ మాఫియాలకు తెర లేపుతోందని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా లక్షా 91వేల ఉద్యోగాలు పెండింగ్‌లో ఉంచి విద్యార్థుల కుటుంబాలను రోడ్డుకి ఈడ్చిన ఘనత తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. టీఎస్‌పీఎస్‌సీని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. నగర కార్యదర్శి పూసాల విష్ణు, నగర జోనల్ ఇన్‌చార్జిలు బామండ్ల నందు, నితీశ్‌రెడ్డి, శ్రీ వర్దన్, నగర సంయుక్త కార్యదర్శిలు వంశీ, నాగరాజు పాల్గొన్నారు.

'ప్రజాగర్జన'ను విజయవంతం చేయండి

కరీంనగర్: నవంబరు 4న నగరంలోని అంబేడ్కర్ స్టేడియంలో నిర్వహించే ప్రజాగర్జన సభను విజయంతం చేయాలని ప్రజా సంఘాల జేఏసీ రాష్ట్ర చైర్మన్ గజ్జెల కాంతం పిలుపునిచ్చారు. గురువారం ఓ హోటల్‌లో కుల సంఘాల, ప్రజా సంఘాల నాయకులతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. బీసీలపై బీజేపీకి చిత్తశుద్ధి లేదని అన్నారు. ఓబీసీ రిజర్వేషన్లు తెచ్చి అగ్ర వర్ణాలకు అత్యధిక లాభం చేకూర్చిందని మండిపడ్డారు. కేటీఆర్‌ను ముఖ్యమంత్రిని చేయడానికి తన ఆశీర్వాదం కావాలని, సీఎం కేసీఆర్ తనను కోరారని ప్రధాని మోడి బహిరంగ సభలో మాట్లాడారని అన్నారు. అది పూర్తి అవాస్తవమన్నారు. కేటీఆర్‌ను ముఖ్యమంత్రిని చేయాలనుకుంటే అది ఒక్కరోజులో జరిగే పని అన్నారు. నవంబరు 4న కరీంనగర్‌లోని అంబేడ్కర్ స్టేడియంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల ప్రజలతో ప్రజాగర్జన సభను నిర్వహించనున్నట్లు తెలిపారు. సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సముద్రాల అజయ్, జీఎస్ ఆనంద్, మెతుకు సత్యం, షుక్రూద్దీన్, సుద్దాల లక్ష్మణ్, కలర్ సత్తన్న, లత, కోంద్ర స్వరూప, ఐల ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

సైబర్‌క్రైంలో నిందితుడి అరెస్ట్

కరీంనగర్‌క్రైం: సైబర్‌క్రైంలో ఓ నిందితుడిని కరీంనగర్ వన్‌టౌన్ పోలీసులు అరెస్టు చేశారు. పోలీసుల వివరాల ప్రకారం.. కరీంనగర్‌కు చెందిన రియా మొత్వాణికి జూలై 16న కొత్త నంబరు నుంచి ఫోన్ వచ్చింది. గుర్తు తెలియని వ్యక్తి మీకు ఉద్యోగం ఇప్పిస్తాం అని నమ్మబలికాడు. ఆన్‌లైన్‌లో రివ్యూస్ ఇస్తే డబ్బులు ఇస్తామని చెప్పాడు. కొన్ని రివ్యూస్‌కు డబ్బులు చెల్లించాడు. కొద్దిరోజులకు ఒక టాస్క్ చేస్తే పెద్దమొత్తంలో డబ్బులు సంపాదించవచ్చని ఆశ చూపాడు. ఇందుకు కొంత ఫీజు చెల్లించాలని పలుదఫాలుగా రూ.1,09,140 ఆన్‌లైన్ ద్వారా ట్రాన్స్‌ఫర్ చేయించుకున్నాడు. తరువాత అతని నుంచి స్పందన లేకపోవడం, డబ్బు తిరిగి చెల్లించకపోవడంతో మోసపోయానని గ్రహించి కరీంనగర్ వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు రాష్ట్ర సైబర్‌సెక్యూరిటీ బ్యూరో అందించిన సాంకేతిక సాయంతో నిందితుడు మోసిన్ కమల్(35) పశ్చిమబెంగాల్‌లో పట్టుకొని విచారించారు. ఓ గుర్తుతెలియని వ్యక్తి తనవద్దకు వచ్చి తనబ్యాంకు అకౌంట్ పూర్తి డాకుమెంట్లు ఇస్తే రెండునెలలకు రూ.15,000 కమిషన్ ఇస్తానని చెప్పగా, అతనికి తన బ్యాంకు అకౌంట్ పూర్తి డాక్యుమెంట్లు ఇచ్చి కమిషన్ తీసుకుంటున్నట్లు చెప్పాడు. ఈ విధంగా సదరు నిందితుడు బ్యాంకు అకౌంట్లు సంపాదించి అమాయకులకు ఫోన్‌చేసి మోసం చేస్తున్నాడని పోలీసులు తెలిపారు. త్వరలోనే అసలు నిందితుడిని పట్టుకుంటామని అన్నారు. మోసిన్‌కమల్‌ను రిమాండ్‌కు తరలించారు.

క్లుప్తంగా

శిక్షణ శిబిరం ప్రారంభం



ప్రారంభిస్తున్న సి.వినోద్‌కుమార్

విద్యానగర్(కరీంనగర్): కరీంనగర్ సస్‌స్టేషన్ ఆవరణలోని ఆర్టీసీ సమావేశ మందిరంలో ఆర్టీసీ గ్యారేజీ సిబ్బందికి ఏర్పాటు చేసిన శిక్షణ శిబిరాన్ని గురువారం కరీంనగర్ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సి.వినోద్‌కుమార్ ప్రారంభించారు. గ్యారేజీ సిబ్బందికి శిక్షణ తరగతులు నిర్వహించడం వల్ల వారిలో వృత్తిపరమైన నైపుణ్యం పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో కరీంనగర్ రీజినల్ మేనేజర్ ఎన్.సుచరిత, డిప్యూటీ రీజినల్ మేనేజర్(మెకానికల్) కె.సత్యనారాయణ, డిపో మేనేజర్లు ఎల్.మల్లేశం, వి.మల్లయ్య, పర్సనల్ ఆఫీసర్ ఎం.చంద్రయ్య, డిపో సూపర్‌వైజర్లు కవిత, వీరస్వామి, తిరుపతి, మెకానికల్ సూపర్‌వైజర్ రవికుమార్‌లు పాల్గొన్నారు.

సబ్సిడీ గొర్రెలు అందజేత



లబ్ధిదారులతో ప్రజాప్రతినిధులు

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం చెర్లభూత్కూర్‌లో ఆరుగురు లబ్ధిదారులకు మంజూరైన సబ్సిడీ గొర్రెలను గురువారం సర్పంచ్ దబ్బెట రమణారెడ్డి, ఎంపీటీసీ బుర్ర తిరుపతిగౌడ్‌లు అందించారు. కార్యక్రమంలో మొగ్ధుంపూర్ జూనియర్ వెటర్నరీ అధికారి సమ్మయ్య, సబార్డినేట్ లల్లు, కురుమ సంఘం అధ్యక్షుడు చిట్కూరి సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ సౌత్‌జోన్ అధ్యక్షుడిగా హరిశంకర్



నియామక పత్రం అందుకుంటున్న హరిశంకర్

కరీంనగర్‌టౌన్: భారతీయ జనతా పార్టీ నగర సౌత్‌జోన్ అధ్యక్షుడిగా పురం హరిశంకర్‌ను నియమించినట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి తెలిపారు. ఈ మేరకు గురువారం పార్టీ కార్యాలయంలో నియామక పత్రాన్ని హరిశంకర్‌కు అందజేశారు. పార్టీ పటిష్టతకు నిర్విరామ కృషి చేయాలని ఆదేశించారు.

ఆరు గ్యారంటీ పథకాలతో ప్రచారం



ప్రచారం చేస్తున్న నరేందర్‌రెడ్డి

కరీంనగర్‌టౌన్: కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీ పథకాల కార్డులను పంచుతూ గురువారం రేకుర్తిలోని ఎస్‌ఎస్‌కాలనీలో కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి ప్రచారం చేశారు. పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో ఒక్క ఇల్లు కూడా కట్టివ్వలేదని, మహిళలను ఆదుకోలేదని, అడ్డగోలు కరెంటు బిల్లులు, పెరిగిన గ్యాస్, నిత్యావసర వస్తువుల ధరలతో సతమతమవుతున్నామని అన్నారు. కాంగ్రెస్ పార్టీ గ్యారంటీ పథకాలు బాగున్నాయని మహిళలు అంటున్నారని తెలిపారు. ఇల్లు లేని పేదలకు భూమితో పాటు ఇల్లు కట్టుకునేందుకు రూ.5లక్షల సాయం అందించడం ద్వారా నిరుపేదల సొంతింటి కల నెరవేరుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బాలబద్రి శంకర్, డివిజన్ అధ్యక్షుడు అస్తపురం దీక్షిత్, బషీర్, ఎండీ చాంద్, అస్తపురం రమేశ్, ఎండీ తాజ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పవర్‌కట్ ప్రాంతాలు

కొత్తపల్లి: కరీంనగర్‌లో విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు పనులు చేపడుతున్నందున శుక్రవారం 11కేవీ భగత్‌నగర్ ఫీడర్ పరిధిలోని భగత్‌నగర్, శివాలయం, పెద్దమ్మగుడి, వెంకటేశ్వర కాలనీ, విఘ్నేశ్వరకాలనీ, ఫకీర్‌వాడ, ఎర్రగుట్ట కాలనీల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, 11 కేవీ గోదాంగడ్డ ఫీడర్ పరిధిలోని సప్తగిరికాలనీ, శ్రీనగర్‌కాలనీ, గోదాంగడ్డ, భగత్‌నగర్ ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, 11కేవీ శివనగర్ ఫీడర్ పరిధిలోని రాంనగర్, మంకమ్మతోట, మార్కెండేయనగర్, ప్రగతినగర్, సప్తగిరికాలనీ, శివనగర్, రాజీవ్‌పార్కు, హస్నాపూర్‌కాలనీ, బతుకమ్మకాలనీ, టెలిఫోన్ క్వార్టర్స్, సప్తగిరికాలనీ బైపాస్ ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్–2 ఏడీఈ ఎం.సుధీర్‌కుమార్ తెలిపారు.

మిషన్ భగీరథ నీరు వృథా



చెర్లభూత్కూర్‌లో డ్రైనేజీలోకి నీరు



డ్రైనేజీలో మిషన్ భగీరథ నల్లా పైపు

- నల్లాలకు ఆన్, ఆఫ్ బిరడాలు బిగించని అధికారులు
- డ్రైనేజీల పాలవుతున్న శుద్ధ జలాలు
- నీటి వినియోగంలో ప్రజల నిర్లక్ష్యం
- కరీంనగర్ మండలంలో పరిస్థితి

కరీంనగర్‌రూరల్: గ్రామీణ ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని అందించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ప్రవేశపెట్టిన మిషన్ భగీరథ పథకం అధికారుల నిర్లక్ష్యంతో నీరుగారిపోతోంది. ఇంట్రావిలేజ్ కింద గ్రామాల్లో కొత్తగా నల్లా కనెక్షన్లు ఇచ్చి, ఆన్, ఆఫ్ బిరడాలు బిగించకపోవడంతో నీరంతా వృథాగా పోతోంది. నీళ్లు ఎప్పుడు వస్తున్నాయో తెలియకపోవడంతోపాటు కలుషితం కావడంతో గ్రామీణ ప్రజలు మిషన్‌భగీరథ నీటి వినియోగంపై అంతగా ఆసక్తి చూపడం లేదు.

నిర్వహణ అస్తవ్యస్తం

మిషన్ భగీరథ పథకంలో చేపట్టిన ఇంట్రావిలేజ్ స్కీమ్ నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. గేట్ వాల్వ్, పైపులైన్ల లీకేజీలను అరికట్టడం లేదు. ఎల్‌ఎండీలోని ఇన్‌టేక్ వెల్ ద్వారా వచ్చిన నీటిని ఎలగందల్‌లోని సంపుహౌస్‌లో శుద్ధి చేసిన అనంతరం కమాన్‌పూర్ గుట్టపై ఉన్న ఓవర్‌హెడ్ ట్యాంకు నుంచి కరీంనగర్, కొత్తపల్లి మండలాల్లోని 44 హ్యాబిటేషన్లకు సరఫరా చేస్తున్నారు.

17 గ్రామాలు..

ఇంట్రావిలేజ్ స్కీమ్ ద్వారా గ్రామాల్లో ఇంటింటికీ నల్లా నీటిని సరఫరా చేసేందుకు కొత్తగా 14 వాటర్ ట్యాంకులు, 88,369 కిలోమీటర్ల పైపులైన్ వేశారు. కరీంనగర్ మండలంలో మొత్తం 17 గ్రామ పంచాయతీలుండగా ఇంట్రావిలేజ్ కింద దుర్శేడ్, చర్లభూత్కూర్, గోపాల్‌పూర్, నగునూరు గ్రామాల్లో ఇంటింటికీ నల్లా కనెక్షన్ సౌకర్యం కల్పించారు. మొత్తం 12,945 నల్లా కనెక్షన్లలో కొత్తగా 2,784 ఇచ్చారు. అయితే ఆయా గ్రామాల్లో అధికారులు వాటికి ఆన్, ఆఫ్ బిరడాలను అమర్చలేదు. రాత్రివేళల్లో నల్లాను విడిచినట్లయితే నీళ్లన్నీ వృథాగా పోతున్నాయి. చెర్లభూత్కూర్, చామనపల్లి గ్రామాల్లో నల్లా పైపులను డ్రైనేజీల్లో వేయడంతో అవి నీటితో నిండిపోతున్నాయి. స్థానిక ప్రజాప్రతినిధులు సైతం పట్టించుకోకపోవడంతో నల్లాల నిర్వహణ అధ్వానంగా మారింది. నల్లా నీళ్లు వృథా కాకుండా చర్యలు చేపట్టాల్సిన సర్పంచ్‌లు తమకు ఎందుకులే అన్నట్లు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. అంతేకాకుండా పలు గ్రామాల్లో మిషన్ భగీరథ నీటిని తాగేందుకు ప్రజలు ఇష్టపడకపోవడంతో నల్లాల నిర్వహణపై శ్రద్ధ చూపించడం లేదని తెలుస్తోంది.

చర్యలు తీసుకుంటాం

ఇంట్రావిలేజ్ కింద గ్రామాల్లో ఇంటింటికీ నల్లా కనెక్షన్లు ఇచ్చాం. నల్లాలకు ఏర్పాటు చేసిన ఆన్, ఆఫ్ బిరడాలను కొంతమంది తొలగించారు. అవి లేకపోవడంతో నీళ్లు వృథాగా పోతున్నాయి. స్థానిక ప్రజాప్రతినిధుల ద్వారా నల్లాలకు బిరడాలను బిగించేందుకు చర్యలు తీసుకుంటాం.

– సూర్యప్రకాశ్, డీఈ, ఇంట్రావిలేజ్ స్కీమ్

‘అల్ఫోర్స్ జెన్‌నెక్స్’లో బతుకమ్మ వేడుకలు



కొత్తపల్లి: కరీంనగర్ వావిలాలపల్లిలోని అల్ఫోర్స్ స్కూల్ ఆఫ్ జెన్‌నెక్స్‌లో బతుకమ్మ ఉత్సవాలు గురువారం వేడుకగా జరిగాయి. ఈ ఉత్సవాల్లో భాగంగా దుర్గామాత విగ్రహానికి అల్ఫోర్స్ విద్యా సంస్థల చైర్మన్ వి.నరేందర్‌రెడ్డి పూజలు నిర్వహించారు. విద్యార్థినులు, ఉపాధ్యాయినిలు పేర్చిన బతుకమ్మలను ఒకచోట పెట్టి పాటలు పాడుతూ.. కోలాటాలాడుతూ ఉత్సాహంగా సందడి చేశారు. ప్రపంచంలోనే పూలను దేవతగా కొలిచే సంస్కృతి, సంప్రదాయాలు కేవలం తెలంగాణకే చెల్లుతుందని వీఎన్‌ఆర్ అన్నారు. పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

‘కాకా’ సేవలు చిరస్మరణీయం



నివాళి అర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

కరీంనగర్‌టౌన్: మాజీ పార్లమెంట్ సభ్యుడు, మాజీ సీడబ్ల్యూసీ మెంబర్ గడ్డం వెంకటస్వామి (కాకా) సేవలు చిరస్మరణీయమని కాంగ్రెస్ నేతలు కొనియాడారు. గురువారం డీసీసీ కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా శాఖ ఆధ్వర్యంలో కాకా జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కాకా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కేంద్ర మంత్రిగా పారిశ్రామిక ప్రాంతానికి మాత్రమే కాకుండా ఉమ్మడి రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలను ఆదుకొని వారి అభ్యున్నతి కోసం కృషి చేసిన మహనీయుడని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జగిత్యాల జిల్లా అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, డీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు కొరివి అరుణ్‌కుమార్, ఎస్సీ సెల్ నగర అధ్యక్షులు లింగంపల్లి బాబు, నాయకులు బానోతు శ్రావణ్ నాయక్, మడుపు మోహన్, గుండాటి శ్రీనివాస్‌రెడ్డి, రామిడి రాజిరెడ్డి, మామిడి సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

‘మోసం చేస్తున్న పాలకులకు గుణపాఠం తప్పదు’



మాట్లాడుతున్న బ్రాహ్మణపల్లి యుగేందర్

కరీంనగర్: నిరుద్యోగ యువతీ యువకులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించకుండా మోసం చేస్తున్న పాలకులకు గుణపాఠం తప్పదని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బోనగిరి మహేందర్, బ్రాహ్మణపల్లి యుగంధర్‌లు అన్నారు. గురువారం బద్దం ఎల్లారెడ్డిభవన్‌లో జరిగిన ఏఐవైఎఫ్ ముఖ్యుల సమావేశంలో వారు మాట్లాడారు. జిల్లావ్యాప్తంగా ఉన్న నిరుద్యోగ యువతీ, యువకులు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఉద్యమాలు నిర్వహించేందుకు ఈనెల 11న కరీంనగర్‌లో ఏఐవైఎఫ్ జిల్లాస్థాయి వర్క్‌షాప్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ వర్క్‌షాప్‌కు ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ కాశ్యం, ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు సయ్యద్ వల్లి ఉల్లకాద్రిలు హాజరవుతున్నారని అన్నారు. ఈ సమావేశంలో చెంచెల మురళి, కొంకటి ప్రశాంత్, బూడిద కుమార్, వెంకటేష్, రాకేశ్, తదితరులు పాల్గొన్నారు.

ఈద్గాకు స్థలం కేటాయింపుపై ఆందోళన



తెలంగాణచౌక్‌లో ఆందోళన నిర్వహిస్తున్న బీజేపీ శ్రేణులు

కరీంనగర్‌టౌన్: కొత్తపల్లి మండలంలో ఈద్గాకు 8 ఎకరాల భూమి కేటాయింపును నిరసిస్తూ బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ దుబాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో గురువారం నగరంలోని తెలంగాణచౌక్‌లో బీజేపీ నాయకులు ఆందోళన నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ రాస్తారోకో, నిరసన ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా బీజేపీ మాజీ జిల్లా అధ్యక్షుడు బాస సత్యనారాయణ, జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి శ్రీనివాస్‌గౌడ్‌లు మాట్లాడుతూ మైనార్టీ ఓట్లను ప్రసన్నం చేసుకునేందుకే రాష్ట్ర ప్రభుత్వం రాజకీయ డ్రామాలు మొదలు పెట్టిందని, అందులో భాగంగానే కొత్తపల్లిలో ఈ ద్గాకు 8 ఎకరాల స్థలం కేటాయించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధులు బొంతల కల్యాణ్, జానపట్ల స్వామి, గాజె రమేశ్, సిద్ది సంపత్, ఉగిలె సుధాకర్, కటకం లోకేష్, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు సంపత్, నాయకులు పుప్పాల రఘు, యెన్నం ప్రకాశ్, అనూప్, నరహరి లక్ష్మారెడ్డి, పాదం శివరాజ్, సంతోష్, కడార్ల రతన్, బల్బీర్ సింగ్, ముండడ, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

ఎస్సారార్ అధ్యాపకుడికి డాక్టరేట్



పవన్‌కుమార్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

కరీంనగర్‌సిటీ: ఎస్సారార్ ప్రభుత్వ, ఆర్ట్స్, సైన్స్ కళాశాలలో గణిత సహాయ ఆచార్యులుగా పనిచేస్తున్న దొంతుల పవన్‌కుమార్ ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ పొందారు. ఆచార్య వీవీ హరగోపాల్ పర్యవేక్షణలో ఇంటిగ్రేటెడ్ మోడల్ ఫర్ ఫైండింగ్ మోస్ట్ ఎఫిషియన్ట్ సీసీఆర్ బీసీసీ డీఎంయూఎస్ అంశంపై చేసిన పరిశోధనలకు డాక్టర్ డిగ్రీ అందజేశారు. ఈ సందర్భంగా పవన్‌కుమార్‌ను కళాశాల ప్రిన్సిపాల్ కల్వకుంట్ల రామకృష్ణ, టీజీసీజీటీఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సురేందర్‌రెడ్డి, గణితశాస్త్ర శాఖ అధిపతి ఎం.అర్చన, అధ్యాపకులు కొమురయ్య, సత్యనారాయణ, స్టాఫ్ క్లబ్ కార్యదర్శి ఎ.శ్రీనివాస్, వైస్ ప్రిన్సిపాల్ హిమబిందు, ఎన్‌సీసీ అధికారి పి.రాజు, డాక్టర్ మల్లారెడ్డి తదితరులు అభినందించారు. జీవితంలో అనేక ఉన్నత స్థానాలను అధిరోహించాలని కోరారు.

హైమాస్ట్ లైట్లు మంజూరు

కొత్తపల్లి: కొత్తపల్లి మండలం ఎలగందులో గ్రామంలోని ఐదు ప్రాంతాల్లో రూ.6 లక్షల సుడా నిధులతో ఏర్పాటు చేసే హైమాస్ట్ లైట్లు మంజూరైనట్లు ఆ గ్రామ ఎంపీటీసీ రమేశ్‌గౌడ్ తెలిపారు. ఈ మేరకు ఈ లైట్లను గచ్చుబావి, ఎల్లమ్మగుడి, బోనాలపల్లి, గౌడ సంఘం చౌరస్తా, సబ్బుల కార్ఖాన ప్రాంతాల్లో ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. తన విజ్ఞప్తి మేరకు హైమాస్ట్ లైట్ల ఏర్పాటుకు నిధులు మంజూరు చేసిన మంత్రి గంగుల కమలాకర్, సుడా చైర్మన్ రామకృష్ణారావులకు కృతజ్ఞతలు తెలిపారు.

‘మోదీని విమర్శించే అర్హత హరీశ్‌రావుకు లేదు’



మాట్లాడుతున్న జాడి బాల్‌రెడ్డి

కరీంనగర్‌టౌన్: ప్రధాని నరేంద్ర మోదీని విమర్శించే స్థాయి రాష్ట్ర మంత్రి హరీశ్‌రావుకు లేదని బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి జాడి బాల్‌రెడ్డి అన్నారు. గురువారం రేకుర్తిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర పర్యటనలో భాగంగా సిద్దిపేట నుంచి సికింద్రాబాద్ వరకు రైలు వర్చువల్ ప్రారంభోత్సవంలో సిద్దిపేట రైల్వేస్టేషన్ చేరుకున్న మంత్రి హరీశ్‌రావు అసూయతో రైల్వే స్టేషన్లో ఏర్పాటు చేసిన ప్రధాని ఫ్లెక్సీని తన అనుచరులను పురమాయించి చింపించడమే కాకుండా ప్రధానిపై అనవసర వ్యాఖ్యలు చేశారని అన్నారు. రైల్వే సిబ్బందిని దుర్భాషలాడి, బెదిరించి, కొట్టే ప్రయత్నం చేయడాన్ని ఖండిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ ఆస్తిని నష్టం చేసిన మంత్రి హరీశ్‌రావుపై, నరేంద్ర మోదీ ఫ్లెక్సీని చింపిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో బీజేపీ నాయకులు కాల్వ పూర్ణచందర్‌రెడ్డి, కారం రవి ప్రసాద్, చిట్కూరి శ్రీనివాస్, నాగుల వెంకటేశ్‌గౌడ్, పెంటి రాజమౌళి, నిషాని తిరుపతి, సంజీవరెడ్డి పాల్గొన్నారు.

‘సీఎం అల్పాహారం’ ప్రారంభ ఏర్పాట్లు పరిశీలన



డైనింగ్‌హాల్‌ను పరిశీలిస్తున్న ఎంపీడీవో దివ్యదర్శన్‌రావు

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం మొగ్ధుంపూర్ జెడ్పీ పాఠశాలలో ప్రభుత్వం విద్యార్థులకు అమలు చేయనున్న సీఎం అల్పాహారం పథకాన్ని శుక్రవారం బీసీ సంక్షేమ, పౌరసరఫరాలశాఖ మంత్రి గంగుల కమలాకర్ ప్రారంభించనున్నారు. ఈమేరకు గురువారం ఎంపీడీవో దివ్యదర్శన్‌రావు, ఎంపీవో జగన్మోహన్‌రెడ్డి, ఎంఈవో మధుసూదనచారిలు పాఠశాలను సందర్శించారు. సీఎం అల్పాహార పథకం ప్రారంభోత్సవానికి అవసరమైన ఏర్పాట్లను సర్పంచ్ జక్కం నర్సయ్య, పంచాయతీ కార్యదర్శి సల్మాన్‌తో కలిసి పరిశీలించారు. విద్యార్థులకు అల్పాహారం అందించే డైనింగ్‌హాల్‌ను తనిఖీ చేశారు. యుద్ధప్రాతిపదికన పనులు పూర్తి చేయాలని పంచాయతీ సిబ్బందిని ఎంపీడీవో ఆదేశించారు.

టీషర్ట్‌లు ఆవిష్కరణ

కరీంనగర్‌క్రైం: కేబుల్ బ్రిడ్జిపై ఈనెల 8న కరీంనగర్ రన్నర్స్ అండ్ సైక్లిస్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ×మన కోసం–మన కరీంనగర్ కోసం్ణ నినాదంతో జరగనున్న మారథాన్ టీషర్టులను గురువారం టౌన్ ఏసీపీ జి.నరేందర్, రూరల్ ఏసీపీ టి.కరుణాకర్ రావు, ట్రాఫిక్ ఏసీపీ ఎం.సర్వర్‌లు ఆవిష్కరించారు. ,శ్రీచైతన్య విద్యాసంస్థల అధినేత రమేశ్‌రెడ్డి, సిద్ధార్థ స్కూల్ కరస్పాండెంట్ శ్రీపాల్‌రెడ్డి, రన్నర్స్ అండ్ సైక్లిస్ట్ అసోసియేషన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

డివిజన్‌లలో బతుకమ్మ చీరలు పంపిణీ



జ్యోతినగర్‌లో చీరలు అందజేస్తున్న కార్పొరేటర్ మాధవి



9వ డివిజన్‌లో చీరలు పంపిణీ చేస్తున్న ఐలేందర్

కరీంనగర్‌కార్పొరేషన్: నగరంలోని అన్ని డివిజన్‌లలో గురువారం బతుకమ్మ చీరలను కార్పొరేటర్లు పంపిణీ చేశారు. 59వ డివిజన్ జ్యోతినగర్‌లో కార్పొరేటర్ గందె మాధవి డివిజన్ మహిళలకు చీరలు అందచేశారు. ఇన్‌చార్జి రాజేందర్, ఆర్‌పీలు కవిత, మంజుల తదితరులు పాల్గొన్నారు. 35వ డివిజన్ సప్తగిరికాలనీ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కార్పొరేటర్ చాడగొండ బుచ్చిరెడ్డి చీరలు పంపిణీ చేశారు. 9వ డివిజన్ కోతిరాంపూర్‌లో కార్పొరేటర్ ఐలేందర్ యాదవ్ మహిళలకు బతుకమ్మ చీరెలు పంపిణీ చేశారు.

గ్రామీణ యువకుల విజయం

- కరీంనగర్ మండలంలో 25మంది కానిస్టేబుళ్లుగా ఎంపిక
- మొగ్ధుంపూర్‌లో అత్యధికంగా 9 మంది



ఎంపికైన యువకులను సన్మానిస్తున్న నాయకులు

కరీంనగర్‌రూరల్: ప్రస్తుత పోటీప్రపంచంలో ప్రభుత్వ ఉద్యోగం సాధించడం యువకులకు కత్తిమీద సాములా మారింది. పోలీస్ కావడమే లక్ష్యంగా శ్రమించిన గ్రామీణ యువకులు కల ప్రభుత్వం ప్రకటించిన ఫలితాల్లో ఎంపిక కావడంతో నెరవేరింది. కరీంనగర్ మండల పరిధిలో 25మంది యువతీయువకులు పోలీస్‌కానిస్టేబుళ్లుగా ఎంపికయ్యారు. కేవలం ఒక్క మొగ్ధుంపూర్ నుంచి 9మంది యువకులు ఎంపికై రికార్డు సృష్టించారు. అందులో యాదవ సామాజిక వర్గానికి చెందిన ఐదుగురు, ముగ్గురు ఎస్సీల్లో ఒకరు మహిళ కాగా ఒక నాయీబ్రాహ్మణ యువకుడు ఎంపికయ్యారు. అదే విధంగా మందులపల్లిలో ఐదుగురు, చేగుర్తిలో నలుగురు, చెర్లభూత్కూర్‌లో ముగ్గురు, నగునూరులో ఇద్దరు, గోపాల్‌పూర్‌లో ఒక మహిళ, జూబ్లీనగర్‌లో ఒక మహిళ కానిస్టేబుళ్లుగా ఎంపికయ్యారు. గురువారం మొగ్ధుంపూర్‌లో యాదవ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు బండి మల్లయ్య ఆధ్వర్యంలో పోలీస్ కానిస్టేబుళ్లుగా ఎంపికైన తమ్మనవేణి రమేశ్, బండి శ్రావణ్, దాడి సంజయ్, రాజు,శ్రవణ్‌లను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో యాదవ సంఘం ప్రతినిధులు దాడి తిరుపతి, లక్ష్మణ్, కూకట్ల రమేశ్, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

నేడు మొగ్ధుంపూర్‌లో బతుకమ్మ చీరల పంపిణీ

కరీంనగర్‌రూరల్: తెలంగాణ సంస్కృతికి ప్రతీకైన బతుకమ్మ పండుగను పురస్కరించుకుని ప్రభుత్వం ఆడపడుచులకు పండుగ కానుకగా చీరలను అందిస్తోంది. ఈ ఏడాది కరీంనగర్ మండలానికి మొత్తం 15,510 చీరలు అవసరం కాగా ప్రస్తుతం 11,167 చీరలు కేటాయించారు. అంబేడ్కర్ స్టేడియంలోని గోదాం నుంచి 17 గ్రామపంచాయతీలకు ట్రాక్టర్లు, ట్రాలీ ఆటోల ద్వారా చీరల స్టాక్‌ను అధికారులు పంపించారు. శుక్రవారం మొగ్ధుంపూర్‌లో బీసీ సంక్షేమ, పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ బతుకమ్మ చీరల పంపిణీ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభిస్తారు. అనంతరం మిగితా గ్రామాల్లో స్థానిక ప్రజాప్రతినిధుల ఆధ్వర్యంలో లబ్ధిదారులకు చీరలు పంపిణీ చేసేందుకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు.

ఆశా కార్యకర్తల మహా ధర్నా



కరీంనగర్‌టౌన్: ఫిక్స్‌డ్ వేతనం రూ.18వేలు, ఈఎస్‌ఐ, పీఎఫ్, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేస్తూ ఆశా కార్యకర్తలు చేపట్టిన నిరవధిక సమ్మె గురువారం 11వ రోజుకు చేరుకుంది. కలెక్టర్ కార్యాలయం ఎదుట మహా ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎడ్ల రమేశ్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఆశా కార్యకర్తల సమ్మె వల్ల ప్రజలంతా రోగ్యాలతో ఆస్పత్రుల్లో బెడ్లు దొరకక వరండాలో వైద్యం పొందుతున్నారని అన్నారు. ఆశా కార్యకర్తలు విధుల్లో ఉంటే ప్రజలకు ఇళ్లలోనే వైద్యం అందేదని తెలిపారు. బంగారు తెలంగాణ అనారోగ్య తెలంగాణ అయ్యిందన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాస్, గుడికందుల సత్యం, నరేశ్‌పటేల్, సుంకరి సంపత్, మర్వాడి సుదర్శన్, గంగారెడ్డి, తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ కరీంనగర్ జిల్లా ప్రధాన కార్యదర్శి మారెళ్ల శ్రీలత, జిల్లా అధ్యక్షులు శారద, బాధ్యులు పద్మ, శోభ, విజయలక్ష్మి, రాజమణి, లలిత తదితరులు పాల్గొన్నారు.

కుట్టు మిషన్లు పంపిణీ

విద్యానగర్: రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా కరీంనగర్‌లోని ముస్లిం మహిళలకు మంజూరైన 100 కుట్టు మిషన్లను గురువారం ఎంఐఎం కార్యాలయం దారుస్సలాంలో నగర అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ పంపిణీ చేశారు. మాజీ డిప్యూటీ మేయర్ అబ్బాస్ సమీ, ఎంఐఎం నగర ప్రధాన కార్యదర్శి సయ్యద్ బర్కత్ అలీ, సంయుక్త కార్యదర్శులు సయ్యద్ మొయిజుద్దీన్ ఖాద్రీ, కమరుద్దీన్ ఖాజా, కార్పొరేటర్లు అఖిల్ ఫెరోజ్, షర్ఫుద్దీన్, జహీర బాను, గౌసియా బేగం తదితరులు పాల్గొన్నారు.

‘షాపింగ్ మాల్‌పై చర్య తీసుకోవాలి’

కరీంనగర్ కార్పొరేషన్: ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్న షాపింగ్ మాల్ యాజమాన్యంపై చర్య తీసుకోవాలని సీపీఐ నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్‌రెడ్డి, సహాయ కార్యదర్శి పైడిపల్లి రాజు డిమాండ్ చేశారు. గురువారం నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ స్వరూపరాణికి వినతిపత్రం అందచేశారు. ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ రాష్ట్ర నాయకుడు కోమటిరెడ్డి తేజ్‌దీప్‌రెడ్డి, బండారి శేఖర్‌లు పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ నగరంలోని కోర్టు ప్రాంతంలో కొత్తగా ప్రారంభించిన షాపింగ్ మాల్‌తో ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు.

రేపు మల్కాపూర్‌లో ఉచిత న్యాయ సహాయ శిబిరం

కొత్తపల్లి: కొత్తపల్లి మండలం మల్కాపూర్ గ్రామపంచాయతీ ఆవరణలో ఈనెల 7వ తేదీన మధ్యాహ్నం 3 గంటలకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, న్యాయ సహాయ కేంద్రం, జస్టిస్ కుమారయ్య కాలేజ్ ఆఫ్ లా సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత న్యాయ సహాయ శిబిరం ఏర్పాటు చేసినట్లు లా కళాశాల ప్రిన్సిపాల్ కె.జలజ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరానికి ముఖ్యఅతిథిగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి కె.వెంకటేష్ ముఖ్య అతిథిగా హాజరవుతున్నట్లు చెప్పారు. అర్హత గల గ్రామస్తులు పాల్గొని వారికి కావాల్సిన ఉచిత న్యాయ సహాయాన్ని పొందాలని కోరారు. ఈ శిబిరంలో భాగంగా లా కళాశాల విద్యార్థులు ఈనెల 4 నుంచి 6వ తేదీ వరకు ఇంటింటికీ సర్వే నిర్వహిస్తూ గ్రామప్రజలకు ఉచిత న్యాయ సహాయంపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ప్యానల్ అడ్వకేట్లు, కళాశాల అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొని గ్రామస్తులకు అవగాహన కల్పించాలని కళాశాల డైరెక్టర్ జి.కృష్ణప్రసాద్ పేర్కొన్నారు.

తీర్పు 9వ తేదీన వెల్లడిస్తాం

మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌పై దాఖలైన ఎన్నికల పిటిషన్‌పై హైకోర్టు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌పై దాఖలైన ఎన్నికల పిటిషన్ (ఈపీ)లో తీర్పును ఈ నెల 9న వెల్లడిస్తామని హైకోర్టు స్పష్టం చేసింది. ఎన్నికల అఫిడవిట్‌లో తన భార్యకు సంబంధించిన స్థిరాస్తుల గురించి శ్రీనివాస్‌గౌడ్ తప్పుడు సమాచారం ఇచ్చారని, రూ.12 లక్షల మార్టిగేజ్ లోన్, బ్యాంక్ అకౌంట్ల వివరాలు కూడా తప్పుగా ఇచ్చారంటూ మహబూబ్‌నగర్‌కు చెందిన సీహెచ్ రాఘవేంద్రరాజు 2019లో హైకోర్టులో ఈపీ దాఖలు చేసిన విషయం తెలిసిందే. దీనిపై జస్టిస్ ఎం.లక్ష్మణ్ ధర్మాసనం విచారణ చేపట్టింది. సాక్ష్యుల వాంగ్మూలాలు నమోదు చేసేందుకు గత నెల అడ్వొకేట్ కమిషనర్‌ను నియమించింది. మంత్రి సహా అందరూ అడ్వొకేట్ కమిషనర్ ముందు హాజరై వివరాలు అందజేయడంతో నివేదికను ఆయన ధర్మాసనానికి అందజేశారు. వాదనలు పూర్తి కావడం, నివేదిక అందడంతో ధర్మాసనం తీర్పు రిజర్వు చేసింది. ఈ నెల 9న తీర్పు వెల్లడిస్తామని స్పష్టం చేసింది. కాగా, శ్రీనివాస్‌గౌడ్ నామినేషన్‌తోపాటే అఫిడవిట్ వేశారని, తర్వాత అఫిడవిట్‌ను సవరించారని.. దీనికి సహకరించిన ఎన్నికల అధికారులపై కేసు నమోదు చేయాలంటూ రాఘవేంద్రరాజు ట్రయల్ కోర్టులో మరో పిటిషన్ వేశారు. దీనిపై విచారణ జరిపిన జడ్జి.. ఎన్నికల అధికారులు, మంత్రి, రెవెన్యూ అధికారులపై కేసు నమోదు చేయాలని పోలీసులను ఆదేశించడంతో కేసు నమోదు చేసిన విషయం విషయం తెలిసిందే. ఇదిలా ఉండగా, కొత్తగూడెం శాసనసభ్యుడు వనమా వెంకటేశ్వరరావు, గద్వాల శాసనసభ్యుడు బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి ఎన్నికలను ఇదే హైకోర్టు రద్దు చేసిన నేపథ్యంలో 9న వెలువడనున్న తీర్పుపై ఉత్కంఠ నెలకొంది.

ఆధార్ కేంద్రాల్లో 'ఈకేవైసీ' కిటకిట!

రేషన్ కార్డు, ఆరోగ్యశ్రీ, ఆయుష్మాన్ భారత్ అప్‌డేషన్ కోసం క్యూలైన్లు

సాక్షి, హైదరాబాద్: ఆధార్ కేంద్రాల వద్ద జాతర సాగుతోంది. రేషన్ కార్డు, ఆరోగ్యశ్రీ, ఆయుష్మాన్ భారత్ కార్డులకు సంబంధించి ప్రభుత్వం ఈకేవైసీ (ఎలక్ట్రానిక్ నో యువర్ కస్టమర్) నిబంధనను తప్పనిసరి చేయడంతో లబ్ధిదారుల్లో హడావుడి మొదలైంది. ఆధార్‌లో వేలిముద్రల అప్డేషన్, ఫోన్ నంబర్‌కు ఓటీపీ (ఒన్ టైమ్ పాస్‌వర్డ్) సౌకర్యం, లబ్ధిదారు ఫోన్ నంబర్‌కు వచ్చే ఓటీపీ ఆధారంగానే కార్డులను డౌన్‌లోడ్ చేసుకునే అవకాశం కలిగించింది. ఈ వసతులు లేకుంటే రేషన్ నిలిపివేత, కార్డుల జారీ నిలిచిపోతుండటంతో ఆందోళన చెందుతున్న లబ్ధిదారులు ఆధార్ నమోదు కేంద్రాల వద్ద ఈకేవైసీ కోసం పాట్లు పడుతున్నారు. ఉదయం నుంచే ఆధార్ నమోదు కేంద్రాల వద్ద క్యూలైన్లలో నిలబడి ఫింగర్‌ప్రింట్స్, ఫోన్ నంబర్ అప్‌డేట్ చేసుకుంటున్నారు. ఆధార్ ఎన్‌రోల్‌మెంట్ సెంటర్లు పరిమితంగా ఉండటంతో పక్షం రోజులుగా ఈ కేంద్రాలన్నీ కిటకిటలాడుతున్నాయి.

పరిమిత కేంద్రాలు... ప్రజలకు కష్టాలు...

రాష్ట్రంలో మొత్తం 820 ఆధార్ ఎన్‌రోల్‌మెంట్ కేంద్రాలకుగాను నిర్వహణ భారం తదితర కారణాల వల్ల 250 కేంద్రాలు మూతబడ్డాయి. మిగిలిన 570 కేంద్రాల్లోనూ దాదాపు 150 కేంద్రాల్లో ఆపరేటర్ల అనుమతులు బ్లాక్ అయ్యాయి. ప్రస్తుతం 4వందలకు పైబడి కేంద్రాల్లోనే ఆధార్ ఎన్‌రోల్‌మెంట్ సాగుతోంది. ఒక్కో కేంద్రంలో రోజుకు గరిష్ఠంగా వంద వరకు ఆధార్ ఎన్‌రోల్‌మెంట్, ఎడిట్, అప్‌డేషన్‌కు అవకాశం ఉన్నప్పటికీ గరిష్ఠంగా 80 టోకెన్లకు మించి చేయలేమని నిర్వాహకులు చెబుతున్నారు. ఒక్కో కేంద్రం వద్దకు సగటున 150 నుంచి 200 మంది వస్తున్నప్పటికీ నిర్వాహకులు మాత్రం పరిమిత సంఖ్యలో టోకెన్లు ఇచ్చి ఆమేరకు ప్రక్రియ చేస్తున్నారు. దీంతో ఆధార్ కార్డుదారులు పలుమార్లు కేంద్రాలకు వచ్చి టోకెన్ల కోసం పాట్లు పడాల్సి వస్తోంది.

అవగాహన లేక అవస్థ పడుతున్నారు

ఈ-కేవైసీ కోసం నిర్దిష్టమైన గడువును ప్రభుత్వం నిర్ణయించలేదు. ఈ అంశంపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వకపోవడంతో లబ్ధిదారుల్లో గందరగోళం నెలకొంది. ప్రభుత్వ తక్షణం స్పందించి డెడ్‌లైన్ లేదనే విషయాన్ని విస్తృతంగా ప్రచారం చేయాలి. దీంతోపాటు జనాభా సంఖ్యకు అనుగుణంగా ఆధార్ నమోదు కేంద్రాల సంఖ్యను పెంచాలి.

– బైర శంకర్, ఆధార్ నమోదు కేంద్రం నిర్వాహకుడు, సరూర్‌నగర్, రంగారెడ్డి జిల్లా

'ప్రణాళిక'కు పెద్దపీట!

- రాష్ట్రంలో ఈ ఆర్థిక సంవత్సరంలో భారీగా పెరిగిన ప్రణాళికా వ్యయం
- తొలి ఐదు నెలల్లో రూ.18,500 కోట్ల ఖర్చు.. బడ్జెట్ అంచనాల్లో ఇది 50శాతం
- గత ఏడాది ఇదే సమయంలో ప్రణాళిక ఖర్చు రూ.7 వేల కోట్లు మాత్రమే..
- అప్పులపై వడ్డీల కింద ఈ ఏడాది చెల్లించినది రూ.8,800 కోట్లపైమాటే..
- గత ఏడాదితో పోలిస్తే 4శాతం తగ్గిన సబ్సిడీ వ్యయం
- రూ.99 వేల కోట్లు దాటిన ఐదు నెలల రాబడి.. ఖర్చు రూ.95 వేల కోట్లకుపైనే..



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2023–24)లో ప్రణాళిక వ్యయం కింద భారీగానే ఖర్చు చేసిందని గణాంకాలు చెప్తున్నాయి. గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే ఈసారి తొలి ఐదు నెలల్లో ప్రణాళిక పద్దు కింద మూడు రెట్లు ఖర్చు జరిగింది. 2022–23లో ఏప్రిల్ నుంచి ఆగస్టు చివరి వరకు రూ.6,289.41 కోట్లను ఈ పద్దు కింద వెచ్చిస్తే.. 2023–24లో ఇదే సమయంలో రూ.18,432.24 కోట్లను వెచ్చించినట్టు రాష్ట్ర ప్రభుత్వం కాగ్‌కు తాజాగా పంపిన నివేదికలో వెల్లడించింది. గత ఏడాది ఈ సమయానికి బడ్జెట్ అంచనాల్లో 21.16 శాతం ప్రణాళిక పద్దు కింద ఖర్చు పెట్టగా.. ఈసారి 50శాతం మేర ఖర్చు చేయడం గమనార్హం.

మొత్తం ఖర్చు రూ.95వేల కోట్లపైమాటే..

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి ఐదు నెలల్లో మొత్తంగా రూ.99,106 కోట్ల రాబడులు ఖజానాకు వచ్చాయని రాష్ట్ర ప్రభుత్వం కాగ్‌కు వెల్లడించింది. మొత్తం ఏడాది బడ్జెట్ అంచనా రూ.2.59 లక్షల కోట్లుకాగా.. అందులో 38.14 శాతం సమకూరిందని తెలిపింది. ఇక ఇదే సమయంలో రూ.95,081.08 కోట్లు వ్యయం చేసినట్టు సర్కారు పేర్కొంది. దీనిలో రెవెన్యూ వ్యయం కింద రూ.76,648 కోట్ల ఖర్చు చూపగా.. దీనిలో రెవెన్యూ పద్దు కింద రూ.39,872.48 కోట్లు, అప్పులకు వడ్డీల కింద రూ.8,851.71 కోట్లు, వేతనాల కోసం రూ.16,937.20 కోట్లు, పింఛన్ల పద్దు కింద రూ.6,973.05 కోట్లు, సబ్సిడీల కింద రూ.4,014.40 కోట్లు ఖర్చయ్యాయి. గత ఏడాది ఇదే సమయానికి సబ్సిడీల కింద రూ.4,198.40 కోట్లు ఖర్చయ్యాయి. అంటే ఈసారి సబ్సిడీల కింద 4 శాతం ఖర్చు తక్కువగా నమోదైంది.

ఏప్రిల్ నుంచి ఆగస్టు చివరి వరకు కీలక విభాగాల రాబడులివీ

ఆదాయ వనరు	ఆదాయం (రూ.కోట్లలో)
జీఎస్టీ	18,754.10
రిజిస్ట్రేషన్లు	5,852.43
అమ్మకపు పన్ను	12,386.59
ఎక్సైజ్	10,149.17
కేంద్ర పన్నుల్లో వాటా	5,064.36
ఇతర పన్నులు	3,234.96
పన్నేతర ఆదాయం	14,482.39
గ్రాంట్ ఇన్ ఎయిడ్	3,009.26

'డైట్' చార్జీల పెంపు ఉత్తర్వులెక్కడ!

సీఎం ఆమోదించి మూడు నెలలు కావస్తున్నా జీఓలు ఇవ్వని ఆర్థిక శాఖ

- జూలై నుంచే పెంచిన చార్జీలు ఇస్తామని సీఎం హామీ
- కానీ ఇప్పటికీ పాత చార్జీలను ఆమోదిస్తున్న వైనం

సాక్షి, హైదరాబాద్: సంక్షేమ వసతి గృహాలు, గురుకుల విద్యా సంస్థల్లో కొత్త డైట్ చార్జీలపై సందిగ్ధం వీడలేదు. స్వయంగా ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు డైట్ చార్జీల పెంపు ఫైలుపై సంతకం చేసి ఆమోదించినప్పటికీ నేటికీ ఉత్తర్వుల జాడే లేదు. సీఎం ఆమోదించిన ఫైలు ఆర్థిక శాఖకు చేరి దాదాపు మూడు నెలలు కావస్తున్నా ఇప్పటికీ క్లియరెన్స్ ఇవ్వకపోవడంతో ఉత్తర్వులు వెలువడలేదని తెలుస్తోంది.

- కోవిడ్–19 తర్వాత నిత్యావసర సరుకుల ధరలు విపరీతంగా పెరగడంతో సంక్షేమ హాస్టళ్లు, గురుకులాల్లోని విద్యార్థులకు పాత ధరలతో భోజన వసతి కల్పించడం భారమవుతుందని భావించిన రాష్ట్ర ప్రభుత్వం ఆ చార్జీల పెంపుపై నిర్ణయానికి ప్రత్యేకంగా మంత్రివర్గ ఉప సంఘాన్ని ఏర్పాటు చేసింది. ఇందులో భాగంగా పలు కోణాల్లో పరిశీలన చేసిన మంత్రివర్గ ఉపసంఘం రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక సమర్పించింది. ఈ నివేదికకు అనుగుణంగా అధికారులు రూపొందించిన ఫైలును సీఎం కేసీఆర్ ఈ ఏడాది జూలై 22న ఆమోదించారు. తక్షణమే అమలు చేయాలని ఆదేశించడంతో జూలై నెల నుంచే పెంచిన చార్జీలు అమలు చేయొచ్చని సంక్షేమ శాఖలు భావించాయి. అయితే మూడు నెలలు కావస్తున్నా డైట్ చార్జీల పెంపు ఉత్తర్వులు రాకపోవడంతో క్షేత్రస్థాయిలో గందరగోళం నెలకొంది.

ప్రస్తుతానికి పాత ధరలే...

గత నెలలో గురుకుల సొసైటీ అధికారులు సంబంధిత ప్రిన్స్‌పాళ్లతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. అటు జిల్లా స్థాయిలోనూ ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ శాఖ అధికారులు కూడా సంక్షేమ వసతిగృహ అధికారులతో సమీక్ష చేపట్టారు. రాష్ట్ర ప్రభుత్వం ఇంకా డైట్ చార్జీల పెంపు ఉత్తర్వులు విడుదల చేయకపోవడంతో పాత ధరలకు అనుగుణంగా సరుకులు కొనుగోలు చేయాలని సూచించారు. ఈ మేరకు పాత ధరలకు అనుగుణంగానే డైట్ అందిస్తున్నారు. జూలై నెంచే చార్జీల పెంపు అమల్లోకి వస్తుందని సీఎం స్పష్టత ఇచ్చినప్పటికీ ఆర్థిక శాఖ నిర్వాకంతో ఉత్తర్వుల జారీ జాప్యం జరుగుతోందని తెలుస్తోంది. ఫలితంగా సంక్షేమ విద్యార్థులకు అరకొర వసతులతోనే భోజనాన్ని అందిస్తున్నారు.

ప్రలోభాలపై పక్కా నిఘా

▶ మొదటి పేజీ తరువాయి

తనిఖీలు చేయాలని సంబంధిత యంత్రాంగాలను కోరాం. చీరలు, కుక్కర్లు వంటి ఎన్నికల్లో పంపిణీ చేసే కానుకలను నిల్వ చేసే ప్రైవేటు గోదాముల వద్ద గట్టి నిఘా పెట్టాలని రాష్ట్ర దర్యాప్తు సంస్థలను కోరాం. రైల్వేస్టేషన్లు, బస్టాండ్‌లతో పాటు ఎయిర్‌పోర్టులు, కార్గో ఫ్లయిట్లు, ప్రైవేటు ఎయిర్ స్ట్రిప్‌లు, రాజకీయ నేతలు వినియోగించే వాణిజ్యేతర విమానాలు, ప్రత్యేక విమానాలు సైతం తనిఖీ చేయాలని కోరాం. పేమెంట్ వ్యాలెట్ల ద్వారా జరిగే ఆన్‌లైన్ నగదు లావాదేవీలపై నిఘా పెట్టాలని ఆర్బీఐ, ఎస్ఎల్‌బీసీకి సూచించాం. ఒకే ఖాతా నుంచి వందల సంఖ్యలోని ఖాతాలకు ఆన్‌లైన్ ద్వారా నగదు బదిలీ జరిగితే గుర్తించి విచారణ జరపాలని ఆదేశించాం. చిన్న చిన్న డ్రగ్ పెడ్లర్లపై చర్యలతోనే సరిపెట్టరాదని, పెద్ద మొత్తంలో మద్యం, మాదక ద్రవ్యాల సరఫరా, ఇతర అక్రమాలకు పాల్పడే కింగ్‌పిన్స్‌ను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించాం. రాష్ట్ర సరిహద్దులతో పాటు రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటు చేయనున్న 148 చెక్‌పోస్టులను సీసీటీవీ కెమెరాల ద్వారా కంట్రోల్ రూమ్ నుంచి నిరంతరంగా పర్యవేక్షిస్తాం..' అని సీఈసీ తెలిపారు.

ఫిర్యాదులపై కలెక్టర్లు, ఎస్పీలు స్పందించాలి 'రాజకీయ పార్టీలు, అభ్యర్థుల నుంచి వచ్చే ఫిర్యాదులన్నింటిపై విచారణ జరిపి వారికి సమాధానం ఇవ్వాలని జిల్లా కలెక్టర్లు, ఎస్పీలను ఆదేశించాం. రాజకీయ పార్టీలు, అభ్యర్థులందరికీ సమాన అవకాశాలు కల్పించాలని చెప్పాం. పోలింగ్ రోజుకి రెండు రోజుల కన్నా ముందే ఓటరు స్లిప్పులు పంపిణీ చేయాలని, ఈవీఎంలు/వీవీ ప్యాట్‌లను అధికారిక వాహనాల్లోనే రవాణా చేయాలని కోరాం. ఎన్నికలను సజావుగా నిర్వహించడానికి సాధారణ పరిశీలకులు, పోలీసు పరిశీలకులు, వ్యయ పరిశీలకులను నియమిస్తాం. ఫిర్యాదుల స్వీకరణ కోసం వారి చిరునామాలు సైతం తెలియజేస్తాం. సామాజిక మాధ్యమాల్లో ఫేక్‌న్యూస్‌ను కట్టడి చేసేందుకు ప్రత్యేక సెల్స్ ఏర్పాటు చేస్తాం..' అని రాజీవ్‌కుమార్ చెప్పారు.

ఫిర్యాదులపై కలెక్టర్లు, ఎస్పీలు స్పందించాలి

'రాజకీయ పార్టీలు, అభ్యర్థుల నుంచి వచ్చే ఫిర్యాదులన్నింటిపై విచారణ జరిపి వారికి సమాధానం ఇవ్వాలని జిల్లా కలెక్టర్లు, ఎస్పీలను ఆదేశించాం. రాజకీయ పార్టీలు, అభ్యర్థులందరికీ సమాన అవకాశాలు కల్పించాలని చెప్పాం. పోలింగ్ రోజుకి రెండు రోజుల కన్నా ముందే ఓటరు స్లిప్పులు పంపిణీ చేయాలని, ఈవీఎంలు/వీవీ ప్యాట్‌లను అధికారిక వాహనాల్లోనే రవాణా చేయాలని కోరాం. ఎన్నికలను సజావుగా నిర్వహించడానికి సాధారణ పరిశీలకులు, పోలీసు పరిశీలకులు, వ్యయ పరిశీలకులను నియమిస్తాం. ఫిర్యాదుల స్వీకరణ కోసం వారి చిరునామాలు సైతం తెలియజేస్తాం. సామాజిక మాధ్యమాల్లో ఫేక్‌న్యూస్‌ను కట్టడి చేసేందుకు ప్రత్యేక సెల్స్ ఏర్పాటు చేస్తాం..' అని రాజీవ్‌కుమార్ చెప్పారు.

ఫిర్యాదుల కోసం సీ-విజిల్ యాప్

'ఎన్నికల్లో ప్రలోభాలు, ఇతర అక్రమాలపై 'సీ-విజిల్' యాప్ ద్వారా అక్కడికక్కడే ఫోటోలు తీసి పంపిస్తే 100 నిమిషాల్లోగా చర్యలు తీసుకుంటాం. ఫిర్యాదుదారుల గోప్యతను పరిరక్షిస్తాం. ఓటర్ హెల్ప్‌లైన్ యాప్ ద్వారా ఓటరుగా నమోదు, జాబితాలో పేరు, పోలింగ్ కేంద్రం పరిశీలన వంటి సేవలను ఉపయోగించుకోవచ్చు. ప్రలోభాలకు తావులేకుండా ఎన్నికలు జరపాలని, ధన, మద్య ప్రవాహం లేకుండా చూడాలని అన్ని రాజకీయ పార్టీలు కోరాయి. సమస్యాత్మక ప్రాంతాల్లో కేంద్ర సాయుధ బలగాలను నియమించాలని, విద్వేష ప్రసంగాలు, సోషల్ మీడియాలో ఫేక్ న్యూస్‌ను కట్టడి చేయాలని విజ్ఞప్తి చేశాయి. అభ్యర్థుల ఎన్నికల గరిష్ఠ వ్యయ పరిమితిని పెంచాలని ఓ పార్టీ కోరింది. త్వరలో వీటికి బదులిస్తాం..' అని సీఈసీ తెలిపారు.

ధ్రువీకరణ తర్వాతే ఓట్ల తొలగింపులు

'ఓటర్ల తొలగింపు కోసం వచ్చిన ఫామ్–7 దరఖాస్తులను క్షేత్ర స్థాయిలో పరిశీలించిన తర్వాతే చనిపోయిన, డూప్లికేట్ ఓటర్లను తొలగించాం. మా అంతట మేముగా ఎలాంటి ఓట్లు తొలగించలేదు. మరణ ధ్రువీకరణ పత్రం పరిశీలించిన తర్వాతే రిజిస్టర్డ్ మృతుల ఓట్లను తొలగించాం. 10 శాతం తొలగించిన ఓట్లను ఎంపిక చేసి పునఃపరిశీలన జరిపాం. 2022, 2023లో మొత్తం 22 లక్షల ఓట్లను తొలగించాం. చెంచు, కోలం, తోటి, కొండారెడ్డి వంటి గిరిజన తెగలవారిని 100 శాతం ఓటర్లుగా నమోదు చేశాం..' అని రాజీవ్‌కుమార్ వివరించారు.

అభ్యర్థులు తమ నేర చరిత్రపై ప్రకటన ఇవ్వాలి

అభ్యర్థులు తమ నేరచరిత్రపై 3 వేర్వేరు సమయాల్లో ప్రముఖ పత్రికల్లో ప్రకటన ఇవ్వాల్సి ఉంటుందని సీఈసీ స్పష్టం చేశారు. నేర చరిత్ర కలిగిన అభ్యర్థులను ఎందుకు ఎంపిక చేశారన్న అంశాన్ని రాజకీయ పార్టీలు కూడా ఓటర్లకు తెలపాల్సి ఉంటుందన్నారు. కారణాలను ఒక జాతీయ, మరో ప్రాంతీయ పత్రికలో ప్రచురించాల్సి ఉంటుందని చెప్పారు.

చోరీ చేశావంటూ తోటి విద్యార్థుల నింద | విద్యార్థి ఆత్మహత్య

వార్డెన్‌తోపాటు ఐదుగురు విద్యార్థులపై కేసు



ప్రభాస్

మందమర్రి రూరల్/ నెన్నెల: డబ్బు చోరీ చేశావంటూ తోటి విద్యార్థులు వేసిన నింద భరించలేకపోయాడు. పదేపదే డబ్బు విషయమై ప్రశ్నించడంతో అవమానంగా భావించిన ఓ విద్యార్థి పురుగుల మందు తాగాడు. ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ సంఘటన మంచిర్యాల జిల్లాలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ శ్యాంపటేల్, హాస్టల్ సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం.. నెన్నెల మండలం జోగాపూర్ గ్రామానికి చెందిన కామెర ప్రభాస్(20) మందమర్రి జోన్–2లోని ఎస్సీ బాలుర వసతిగృహంలో ఉంటూ మంచిర్యాలలోని సీవీ. రామన్ కాలేజీలో బీకాం మొదటి సంవత్సరం చదువుతున్నాడు. హాస్టల్‌లో తోటి విద్యా ర్థులు రూ.1,100 పోయాయంటూ ఈ నెల 2వ తేదీన ప్రభాస్ బ్యాగు తనిఖీ చేయగా, అందులో డబ్బులు లభించాయి. ఆ సమయంలో ప్రభాస్ లేకపోవడంతో వచ్చాక డబ్బులు తీశావా అంటూ ప్రశ్నించారు. తాను తీయలేదని చెప్పాడు. కాసేపటి తర్వాత ప్రభాస్ బ్యాగు చూసుకొని అందులో తన డబ్బులు లేవని, ఎవరు తీశారని ప్రశ్నించాడు. దీంతో తోటి విద్యార్థులు బ్యాగులో ఉన్న రూ.1,100 తామే తీశామని, అవి ఎక్కడివని ఎదురు ప్రశ్నించారు. దీంతో తనకు తెలిసిన అమ్మాయి గూగుల్ పే ద్వారా పంపించిందని ఓసారి, హాస్టల్ సమీపంలోని దుకాణ నిర్వాహకుల ఫోన్ ద్వారా పంపించిందని మరోసారి చెప్పాడు. దుకాణానికి వెళ్లి అడగ్గా సరైన సమాధానం లభించలేదు. డబ్బులు పంపించినట్టుగా స్క్రీన్ షాట్ పంపిస్తే నమ్ముతామని చెప్పగా.. 3వ తేదీన తీసుకొస్తానన్నాడు. ఆ రోజు ఇదే విషయమై తోటి విద్యార్థులు మళ్లీ ప్రశ్నించగా, అమ్మాయి కలవలేదని, ఫోన్‌లిఫ్ట్ చేయలేదని చెప్పగా, స్క్రీన్ షాట్ చూపిస్తేనే డబ్బులు ఇస్తామని మళ్లీ చెప్పారు. దీంతో 4వ తేదీన ఉదయం హాస్టల్ నుంచి స్వగ్రామమైన జోగాపూర్‌కు వచ్చి శీతల పానీయంలో పురుగుల మందు కలుపుకొని తాగాడు. ఇరుగుపొరుగు వారు ప్రశ్నించడంతో అవమానపర్చిన విషయం చెప్పాడు. 108 అంబులెన్స్‌లో బెల్లంపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి, మెరుగైన వైద్యం కోసం మంచిర్యాల ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం మధ్యాహ్నం మృతిచెందాడు. మృతుడి అన్న రాజశేఖర్ ఫిర్యాదు మేరకు హాస్టల్ వార్డెన్‌తోపాటు ఐదుగురు విద్యార్థులపై కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ తెలిపారు. కాగా, మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలంటూ మంచిర్యాల ప్రభుత్వాస్పత్రి ఎదుట విద్యార్థి సంఘాలు ధర్నా నిర్వహించాయి.

18 ఏళ్లుగా ఉంటున్నట్టు లోకల్ సర్టిఫికెట్ ఎలా ఇచ్చారు?

అలంపూర్ తహసీల్దార్‌కు హైకోర్టు నోటీసులు

సాక్షి, హైదరాబాద్: ఎంబీబీఎస్ సీటు ఆశిస్తున్న విద్యార్థిని పాఠశాల విద్య, ఇంటర్ తెలంగాణలో చదవకున్నా.. 18 ఏళ్లుగా స్థానికంగా ఉంటున్నట్టు లోకల్ సర్టిఫికెట్ ఎలా ఇచ్చారని అలంపూర్ తహసీల్దార్‌ను హైకోర్టు ప్రశ్నించింది. దీనిపై 2 వారాల్లో వివరణ ఇవ్వాలని నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణ 31కి వాయిదా వేసింది. ఇప్పటికే ఎంబీబీఎస్ అడ్మిషన్ల ప్రక్రియ ముగిసిందని, ఈ క్రమంలో పిటిషనర్‌కు ఎలాంటి ఉపశమన ఆదేశాలు ఇవ్వలేమని చెప్పింది. తహసీల్దార్ తప్పుడు సర్టిఫికెట్ ఆధారంగా లోకల్‌గా పరిగణించలేమని స్పష్టం చేసింది. తను తెలంగాణకు చెందిన అభ్యర్థినే అయినా లోకల్ కోటాలో ఎంబీబీఎస్ సీటు ఇచ్చేందుకు కాళోజీ వర్సిటీ నిరాకరించిందని పేర్కొంటూ ఎస్.వెన్నెల హైకోర్టులో పిటిషన్ వేశారు. దీనిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్‌అరాధే, జస్టిస్ ఎన్వీ శ్రవణ్‌కుమార్ ధర్మాసనం గురువారం విచారణ చేపట్టింది. వాదనలు విన్న ధర్మాసనం.. ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు వెన్నెల ఏపీలోని కర్నూల్ జిల్లాలో చదివారని.. తర్వాత ఇంటర్ కృష్ణా జిల్లాలో పూర్తి చేసి, మేలో జరిగిన నీట్‌కు హాజరయ్యారని పేర్కొంది. అయినా, వెన్నెల 18 ఏళ్లు స్థానికంగా ఉంటున్నట్టు అలంపూర్ తహసీల్దార్ ధ్రువపత్రం ఎలా ఇచ్చారో వివరణ ఇవ్వాల్సి ఉందని అభిప్రాయపడింది.

జీహెచ్ఎంసీ తీరుపై హైకోర్టు అసంతృప్తి

10న హాజరుకావాలని కమిషనర్‌కు ఆదేశం



సాక్షి, హైదరాబాద్: గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని చెరువుల రక్షణకు ముఖ్యంగా రామంతాపూర్ పెద్దచెరువు ఆక్రమణల నివారణకు ఏం చర్యలు తీసుకున్నారన్న నివేదికను సమర్పించకపోవడంతో జీహెచ్ఎంసీ తీరుపై హైకోర్టు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. ఈనెల 10న కమిషనర్ కోర్టు ముందు హాజరుకావాలని ఆదేశించింది. తదుపరి విచారణను ఈనెల 10కి వాయిదా వేసింది. హైదరాబాద్‌లో 532 చెరువులు క్షీణిస్తున్నాయని, 25 ఎకరాల్లోని రామంతాపూర్ పెద్దచెరువును డంపింగ్ యార్డుగా మారుస్తున్నారని, ఈ కారణంగా నీటికాలుష్యం పెరిగి దుర్వాసన వ్యాపిస్తోందని ఉస్మానియా ప్రొఫెసర్ డాక్టర్ కెఎల్ వ్యాస్ 2005లో రాసిన లేఖను హైకోర్టు విచారణకు స్వీకరించింది. దీనిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ ఎన్వీ శ్రవణ్‌కుమార్ ధర్మాసనం గురువారం మరోసారి విచారణ చేపట్టింది. గత విచారణ సందర్భంగా చెరువుల రక్షణకు తీసుకున్న చర్యలపై నివేదిక అందజేయాలని జీహెచ్ఎంసీని ఆదేశించిన విషయం తెలిసిందే. అయితే గురువారం నివేదిక అందజేయకపోవడానికి కారణాలను స్టాండింగ్ కౌన్సిల్ చెప్పకపోవడంతో ధర్మాసనం ఆగ్రహం వ్యక్తం చేసింది. ఓ ఫొటో కాపీని అందజేయగా.. దానిపై ఎవరి సంతకం లేదని, ఎవరికి ఇవ్వాలన్నది కూడా లేదని వ్యాఖ్యానించింది. నేరుగా కమిషనర్ హాజరై వివరణ ఇవ్వాలంటూ విచారణ వాయిదా వేసింది.

సింగరేణి ఎన్నికలపై వివరాలు అందజేయండి

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు హైకోర్టు నోటీసులు

సాక్షి, హైదరాబాద్: సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికల నిర్వహణకు సంబంధించిన వివరాలు అందజేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను హైకోర్టు ద్విసభ్య ధర్మాసనం ఆదేశించింది. ఈ మేరకు సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్, కేంద్రం, కేంద్ర కార్మికశాఖ ప్రధానకమిషనర్, భద్రాద్రి కొత్తగూడెం కలెక్టర్ సహా పలువురు ప్రతివాదులకు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణలోగా కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశిస్తూ, విచారణను ఈ నెల 11కు వాయిదా వేసింది. సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికలు ప్రస్తుత పరిస్థితుల్లో నిర్వహించలేమని, గడువు కావాలంటూ యాజమాన్యం గత నెల హైకోర్టును ఆశ్రయించింది. ఆరు జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు ఈ ఎన్నికలను వాయిదా వేయాలని కోరుతూ ప్రభుత్వానికి లేఖలు రాశారని చెప్పింది. వరుస పండుగలు, అసెంబ్లీ ఎన్నికలు ఉన్నాయని, ఎన్నికల సంఘం పలు భేటీలు నిర్వహించనుందని వారు లేఖలో పేర్కొన్నట్టు తెలిపింది. ఈ పరిస్థితుల్లో సింగరేణి ఎన్నికలు నిర్వహించలేమని వారు పేర్కొన్నట్టు వివరించింది. ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన సింగిల్ జడ్జి.. గతంలో అక్టోబర్‌లో నిర్వహించాలని హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను పాటించాలని ఆదేశించారు. యాజమాన్యం దాఖలు చేసిన పిటిషన్‌ను కొట్టివేశారు. సింగిల్ జడ్జి తీర్పును సవాల్ చేస్తూ సింగరేణి యాజమాన్యం అప్పీల్‌కు వెళ్లింది. ఈ అప్పీల్‌పై ప్రధానన్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ ఎన్వీ శ్రవణ్‌కుమార్ ధర్మాసనం గురువారం విచారణ చేపట్టింది. సింగరేణి యాజమాన్యం తరఫున సీనియర్ న్యాయవాది ఆదిత్యాసోంధీ వాదనలు వినిపించారు. అయితే ఎన్నికల నిర్వహణపై వివరాలు తెలుసుకోవడానికి సమయం కావాలని ప్రభుత్వ న్యాయవాది కోరడంతో ధర్మాసనం విచారణ వాయిదా వేసింది.

నేడు నామినేషన్లు

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: ఇప్పటికే జారీ చేసిన షెడ్యూల్ ప్రకారం శుక్రవారం నామినేషన్ల స్వీకరణ ఉంది. ఆ తర్వాత వరుసగా ఉపసంహరణ, స్క్రూటినీ, గుర్తుల కేటాయింపు జరుగుతుంది. ఈ ప్రక్రియ అంతా ఈనెల 10లోగా పూర్తి చేసి 28వ తేదీన పోలింగ్ నిర్వహించాల్సి ఉంది. మరోవైపు కోర్టు తీర్పు అక్టోబర్ 11న రానుంది. ఈ నేపథ్యంలో ఏఐటీయూసీ, బీఎంఎస్ నామినేషన్లకు సిద్ధమయ్యాయి. మరోవైపు మిగిలిన కార్మిక సంఘాలు ఏం నిర్ణయం తీసుకోవాలో తెలియక డోలాయమానంలో పడ్డాయి.

క్లుప్తంగా...

చైతన్యవంతంగా ఓటుహక్కు వినియోగించుకోవాలి

ఓటర్లకు చీఫ్ ఎలక్షన్ కమిషనర్ రాజీవ్‌కుమార్ పిలుపు

సాక్షి, హైదరాబాద్: రానున్న శాసనసభ ఎన్నికల్లో ఓటర్లు, ముఖ్యంగా యువ ఓటర్లు చైతన్యవంతంగా వ్యవహరించాలని, ప్రలోభాలకు లొంగకుండా ఓటుహక్కు వినియోగించుకోవాలనీ కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ రాజీవ్‌కుమార్ పిలుపునిచ్చారు. ఓటర్లను చైతన్యపరచడంలో భాగంగా గురువారం గచ్చిబౌలిలోని టెక్ మహీంద్రా ఆడిటోరియంలో సహచర ఎన్నికల కమిషనర్లు అనూప్ చంద్రపాండే, అరుణ్ గోయల్‌తో కలిసి ఓటర్లతో చర్చాగోష్టి నిర్వహించారు. ఎన్నికల సంఘం ప్రచారకర్త, ప్రముఖనటి అక్కినేని అమల అనుసంధానకర్తగా వ్యవహరించిన ఈ కార్య క్రమంలో వివిధ రంగాల ప్రముఖులు, ట్రాన్స్ జెండర్స్ ప్రతినిధులు, దివ్యాంగులు, ఐటీ పరిశ్రమలు, కాలనీ సంక్షేమ సంఘాల ప్రతిని ధులు పాల్గొన్నారు. అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారత్‌లో ఓటు చాలా విలువైందని, టాటాలు, బిర్లాలతోపాటు సామాన్యపౌరులూ సమాన ఓటుహక్కు కలిగి ఉన్నారని రాజీవ్ కుమార్ తెలిపారు. ఓటర్లను చైతన్యపర చడానికి రాష్ట్రస్థాయిలో డిజైన్, వీడియో రూపకల్పనలపై నిర్వహించిన పోటీల్లో విజేతలుగా నిలిచినవారికి రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్ బహుమతులు అందచేశారు. గోండు, గుస్సాడీ, చెంచు తదితర సాంస్కృతిక సంఘాల ప్రతినిధుల ప్రదర్శనలు ప్రేక్షకులను అలరించాయి.

రాయలసీమ లిఫ్టును నిలువరించాలి

కృష్ణా బోర్డుకు తెలంగాణ ఫిర్యాదు

సాక్షి, హైదరాబాద్: శ్రీశైలం జలాశయం నుంచి 59 టీఎంసీల కృష్ణా జలాలను తరలించడానికి ఏపీ ప్రభుత్వం రాయలసీమ ఎత్తిపోతల పథకం తొలి దశ పనులు చేపట్టేందుకు పరిపాలనాపరమైన అనుమతులు జారీ చేయడంపై తెలంగాణ ప్రభుత్వం తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. అనుమతి లేని ఈ ప్రాజెక్టు పనులను చేపట్టకుండా ఏపీ ప్రభుత్వాన్ని నిలువరించాలని కోరుతూ రాష్ట్ర నీటిపారుదల శాఖ ఈఎన్సీ సి.మురళీధర్ బుధవారం కృష్ణా బోర్డుకు లేఖ రాశారు.

బిహార్ తరహాలో కులగణన చేపట్టాలి

జాజుల శ్రీనివాస్ గౌడ్



సాక్షి, హైదరాబాద్: దేశంలోనే మొట్టమొదటిసారి బిహార్ రాష్ట్ర ప్రభుత్వం కులగణన చేపట్టడం గొప్ప విషయమని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వంతో పాటు దేశంలోని అన్ని రాష్ట్రాలు బిహార్‌ను ఆదర్శంగా తీసుకుని కులగణన చేపట్టాలని డిమాండ్ చేశారు. దాదాపు 13 కోట్ల జనాభా ఉన్న బిహార్ రాష్ట్రంలో ముఖ్యమంత్రి నితీశ్‌కుమార్, ఉప ముఖ్యమంత్రి తేజస్వీయాదవ్ ఆధ్వర్యంలో కులగణన చేపట్టడాన్ని ఆయన అభినందించారు.

దసరాకు ముందే లాభాలవాటా చెల్లింపు

16న సింగరేణి కార్మికులు, ఉద్యోగుల ఖాతాలో జమ

గోదావరిఖని/ సింగరేణి: దసరా పండుగకు ముందే సింగరేణి కార్మికులు/ఉద్యోగులకు లాభాల వాటా చెల్లించేందుకు సంస్థ సిద్ధమైంది. 2022–23 ఆర్థిక సంవత్సరంలో రూ.2,222.46 కోట్లు లాభాలు సాధించగా, అందులో 32% వాటాగా రూ.711.18 కోట్లు అందించనుంది. ఈ మొత్తాన్ని ఈనెల 16న సింగరేణి కార్మికులు, ఉద్యోగుల ఖాతాల్లో జమచేయనున్నట్టు గురువారం సర్క్యులర్ విడుదల కాగా, ఆ వివరాలు సీఎండీ శ్రీధర్ ఓ ప్రకటనలో వెల్లడించారు. ఒక్కో కార్మికునికి సగటున రూ. 1.53 లక్షలు రానుంది.

త్వరలో దీపావళి బోనస్ కూడా...

దీపావళి బోనస్‌గా పేర్కొనే పీఎల్‌పీ కూడా పండుగకు ముందే చెల్లించనున్నట్టు ఎన్.శ్రీధర్ ప్రకటించారు. ఇది కూడా రూ.300 కోట్ల వరకు ఉండొచ్చని అంచనా వేస్తున్నారు. సగటున ఒక్కో కార్మికుడు గతేడాది రూ.76,500 పొందగా, ఈసారి గతంలోకన్నా ఎక్కువ పొందే అవకాశాలు ఉన్నాయి.

భారత జట్టును గెలిపించిన తెలంగాణ గ్రాండ్‌మాస్టర్ అర్జున్

ఆసియా క్రీడల చెస్ ఈవెంట్‌లో భారత పురుషుల జట్టు నాలుగో విజయం నమోదు చేసింది. వియత్నాం జట్టుతో గురువారం జరిగిన ఏడో రౌండ్‌లో భారత్ 2.5-1.5తో గెలిచింది. దొమ్మరాజు గుకేశ్, ప్రజ్ఞానంద, విదిత్ తమ ప్రత్యర్థులతో గేమ్‌లను 'డ్రా' చేసుకోవడంతో స్కోరు 1.5-1.5తో సమంగా నిలిచింది. నాలుగో మ్యాచ్‌లో తెలంగాణ గ్రాండ్‌మాస్టర్ ఇరిగేశి అర్జున్ 30 ఎత్తుల్లో తువాన్ మిన్ ట్రాన్‌పై నెగ్గి భారత్‌కు 2.5-1.5తో విజయాన్ని అందించాడు. మహిళల విభాగంలో కజకిస్తాన్‌తో జరిగిన ఏడో రౌండ్ మ్యాచ్‌ను భారత జట్టు 2-2తో 'డ్రా'గా ముగించింది. జిబిసారాతో జరిగిన గేమ్‌ను కోనేరు హంపి 24 ఎత్తుల్లో 'డ్రా' చేసుకోగా... కమలిదెనోవాపై ద్రోణవల్లి హారిక 75 ఎత్తుల్లో గెలిచింది. వైశాలి 51 ఎత్తుల్లో జాన్సాయా చేతిలో ఓడిపోగా... దినారాతో జరిగిన గేమ్‌ను వంతిక 31 ఎత్తుల్లో 'డ్రా' చేసుకుంది. ఏడో రౌండ్ తర్వాత భారత పురుషుల, మహిళల జట్లు రెండో స్థానంలో కొనసాగుతూ పతకాల రేసులో ఉన్నాయి.



కాన్వేతో కలిసి... గెలుపు 'రచిన్'చాడు

- ప్రపంచకప్ తొలి మ్యాచ్‌లో న్యూజిలాండ్ గెలుపు బోణీ
- 9 వికెట్లతో ఇంగ్లండ్‌పై ఘన విజయం
- కాన్వే, రచిన్ రవీంద్ర అజేయ సెంచరీలు

గత ప్రపంచకప్ ఫైనల్‌కు ప్రతీకారమా అంటే సరిగ్గా ఈ మ్యాచ్‌కు ఆ విలువ లేకపోవచ్చు. కానీ ఇంగ్లండ్‌ను తాము చిత్తు చేసిన తీరు న్యూజిలాండ్‌కు మాత్రం పూర్తి సంతృప్తినిచ్చి ఉంటుంది. దుర్భేద్యమైన జట్టు, ఫేవరెట్‌లలో ఒకటిగా బరిలోకి దిగిన డిఫెండింగ్ చాంపియన్ ఇంగ్లండ్ తొలి మ్యాచ్‌లో పూర్తిగా చేతులెత్తేసింది. అటు పేలవ బ్యాటింగ్ ఆపై పసలేని బౌలింగ్‌తో తమ స్థాయిపై సందేహాలు రేకెత్తించింది. కివీస్ మాత్రం అద్భుత ఆటతో తమపై ఉన్న అంచనాలను అమాంతం పెంచేసుకుంది. కట్టుదిట్టమైన బౌలింగ్‌తో ప్రత్యర్థిని పడగొట్టి ఆపై సునాయాస విజయాన్ని సొంతం చేసుకుంది. ప్రపంచకప్‌లో తాము ఆడిన తొలి మ్యాచ్‌ల్లోనే అజేయ మెరుపు సెంచరీలు సాధించి కాన్వే, రచిన్ రవీంద్ర మరో 13.4 ఓవర్లు మిగిలి ఉండగానే జట్టు పేరిట గెలుపును లిఖించారు. రాహుల్+సచిన్ పేర్లను తన పేరులో ఉంచుకున్న రచిన్ అటు క్లాస్, ఇటు మాస్ ఆటను కూడా చూపించడం విశేషం.



రచిన్ రవీంద్ర
కాన్వే

అహ్మదాబాద్: వన్డే వరల్డ్ కప్ తొలి పోరు ఏకపక్షంగా ముగిసింది. 2019 ఫైనలిస్ట్‌ల మధ్య జరిగిన ఈ మ్యాచ్‌లో న్యూజిలాండ్ 9 వికెట్ల తేడాతో ఇంగ్లండ్ జట్టును ఓడించింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన ఇంగ్లండ్ 50 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 282 పరుగులు చేసింది. జో రూట్ (86 బంతుల్లో 77; 4 ఫోర్లు, 1 సిక్స్) టాప్ స్కోరర్ కాగా, జోస్ బట్లర్ (42 బంతుల్లో 43; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు) ఫర్వాలేదనిపించాడు. అనంతరం కివీస్ 36.2 ఓవర్లలో వికెట్ నష్టానికి 283 పరుగులు చేసింది. డెవాన్ కాన్వే (121 బంతుల్లో 152 నాటౌట్; 19 ఫోర్లు, 3 సిక్స్‌లు), 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' రచిన్ రవీంద్ర (96 బంతుల్లో 123 నాటౌట్; 11 ఫోర్లు, 5 సిక్స్‌లు) సెంచరీలతో చెలరేగారు. వీరిద్దరు రెండో వికెట్‌కు అభేద్యంగా 273 పరుగులు జోడించడం విశేషం. వన్డేల్లో రెండో వికెట్‌కు న్యూజిలాండ్ తరఫున ఇదే అత్యుత్తమ భాగస్వామ్యం. గప్టిల్-విల్ యంగ్ పేరిట ఉన్న 203 పరుగుల రికార్డు భాగస్వామ్యాన్ని కాన్వే-రచిన్ సవరించారు.

కీలక భాగస్వామ్యం...

బలమైన లైనప్, చివరి ఆటగాడి వరకు బ్యాటింగ్ చేయగల సామర్థ్యం ఉన్న ఇంగ్లండ్‌ను చూస్తే భారీ స్కోరు ఖాయమనిపించింది. తొలి ఓవర్ రెండో బంతినే బెయిర్‌స్టో (35 బంతుల్లో 33; 4 ఫోర్లు, 1 సిక్స్) సిక్సర్‌గా మలిచాడు. వరల్డ్ కప్ చరిత్రలో 'సిక్స్'తో స్కోరు మొదలు కావడం ఇదే తొలిసారి. అయితే ప్రత్యర్థిని కట్టడి చేయడంలో కివీస్ బౌలర్లు సఫలమయ్యారు. మలాన్ (14) విఫలం కాగా, ఆ తర్వాత తక్కువ వ్యవధిలో కివీస్ మరో 3 వికెట్లు పడగొట్టింది. రవీంద్ర ఓవర్లో వరుసగా 4, 4, 6 కొట్టిన బ్రూక్ (25) తర్వాతి బంతికి వెనుదిరిగాడు. ఈ దశలో రూట్, బట్లర్ ఆదుకున్నారు. వీరిద్దరు ఐదో వికెట్‌కు 72 బంతుల్లోనే 70 పరుగులు జోడించారు. అయితే ఈ భాగస్వామ్యాన్ని హెన్రీ విడదీశాక ఇంగ్లండ్ వేగంగా వికెట్లు కోల్పోయింది. లోయర్ ఆర్డర్‌లో ఎవరూ ఆశించిన స్థాయిలో ప్రభావం చూపలేకపోవడంతో స్కోరు కనీసం 300 పరుగులకు చేరువగా కూడా రాలేదు. వన్డే చరిత్రలో ఆడిన 11 మందీ కనీసం రెండంకెల స్కోరు చేయడం ఇదే మొదటిసారి కాగా... ప్రతీ ఒక్కరు అంతంతమాత్రంగానే ఆడటంతో ఇంగ్లండ్‌కు ఫలితం దక్కలేదు.



రూట్

ఆడుతూ పాడుతూ...

స్యామ్ కరన్ వేసిన రెండో ఓవర్ తొలి బంతికే యంగ్ (0) అవుట్! దాంతో కివీస్ ఎలా లక్ష్యాన్ని ఛేదిస్తుందనేది ఆసక్తికరంగా మారింది. కానీ కాన్వే, రవీంద్ర అసలు ఎలాంటి అవకాశం ఇవ్వలేదు. కెరీర్‌లో 13వ వన్డే ఆడుతూ తొలిసారి ఓపెనర్‌గా బరిలోకి దిగిన రవీంద్ర పూర్తి ఆత్మవిశ్వాసంతో ఆడగా, ఐపీఎల్ అనుభవాన్ని కాన్వే అద్భుతంగా వాడుకున్నాడు. వీరిద్దరు ప్రత్యర్థిపై బౌలర్లందరిపై ఆధిపత్యం ప్రదర్శిస్తూ చకచకా పరుగులు రాబట్టారు. 10 ఓవర్లలోనే స్కోరు 81 పరుగులకు చేరగా, చెరో 36 బంతుల్లోనే రవీంద్ర, కాన్వే అర్ధసెంచరీలు పూర్తి చేసుకున్నారు. వీరిని కట్టడి చేయడంలో ఇంగ్లండ్ విఫలం కావడంతో 20 ఓవర్లకే స్కోరు 150 పరుగులకు చేరింది. ఆ తర్వాత ఈ జోడి ఎదురులేకుండా దూసుకుపోయింది. ముందుగా కాన్వే 83 బంతుల్లో, ఆ తర్వాత రవీంద్ర 82 బంతుల్లో శతకాలను అందుకున్నారు. ఆ తర్వాత ఇంగ్లండ్ ఎన్ని ప్రయత్నాలు చేసినా లాభం లేకపోగా... కివీస్ సునాయాసంగా లక్ష్యం చేరింది. విలియమ్సన్ గాయం నుంచి కోలుకోకపోవడంతో లాథమ్ కెప్టెన్‌గా వ్యవహరించాడు.

ప్రపంచకప్‌లో నేడు

పాకిస్తాన్ X నెదర్లాండ్స్
వేదిక: హైదరాబాద్
మధ్యాహ్నం 2 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్, హాట్‌స్టార్ యాప్‌లో ప్రత్యక్ష ప్రసారం

స్కోరు వివరాలు

ఇంగ్లండ్ ఇన్నింగ్స్: బెయిర్‌స్టో (సి) మిచెల్ (బి) సాన్‌ట్నర్ 33; మలాన్ (సి) లాథమ్ (బి) హెన్రీ 14; రూట్ (బి) ఫిలిప్స్ 77; బ్రూక్ (సి) కాన్వే (బి) రవీంద్ర 25; మొయిన్ అలీ (బి) ఫిలిప్స్ 11; బట్లర్ (సి) లాథమ్ (బి) హెన్రీ 43; లివింగ్‌స్టోన్ (సి) హెన్రీ (బి) బౌల్ట్ 20; కరన్ (సి) లాథమ్ (బి) హెన్రీ 14; వోక్స్ (సి) యంగ్ (బి) సాన్‌ట్నర్ 11; ఆదిల్ రషీద్ (నాటౌట్) 15; వుడ్ (నాటౌట్) 13; ఎక్స్‌ట్రాలు 6; **మొత్తం (50 ఓవర్లలో 9 వికెట్లకు) 282. వికెట్ల పతనం:** 1-40, 2-64, 3-94, 4-118, 5-188, 6-221, 7-229, 8-250, 9-252. **బౌలింగ్:** బౌల్ట్ 10-1-48-1, హెన్రీ 10-1-48-3, సాన్‌ట్నర్ 10-0-37-2, నీషమ్ 7-0-56-0, రవీంద్ర 10-0-76-1, ఫిలిప్స్ 3-0-17-2.

న్యూజిలాండ్ ఇన్నింగ్స్: కాన్వే (నాటౌట్) 152; యంగ్ (సి) బట్లర్ (బి) కరన్ 0; రచిన్ రవీంద్ర (నాటౌట్) 123; ఎక్స్‌ట్రాలు 8; **మొత్తం (36.2 ఓవర్లలో వికెట్ నష్టానికి) 283. వికెట్ల పతనం:** 1-10. **బౌలింగ్:** వోక్స్ 6-0-45-0, స్యామ్ కరన్ 6-2-47-1, వుడ్ 5-0-55-0, అలీ 9.2-0-60-0, రషీద్ 7-0-47-0, లివింగ్‌స్టోన్ 3-0-24-0.

స్పందన కరువైంది...

వరల్డ్ కప్ తొలి మ్యాచ్ అంటే సహజంగా క్రికెట్ అభిమానుల్లో అమితాసక్తి ఉంటుంది. టాస్ వేసేసరికే స్టేడియాలు నిండిపోతాయి. కానీ ఈ మ్యాచ్‌పై అహ్మదాబాద్ ప్రేక్షకులు పెద్దగా ఆసక్తి చూపించినట్లుగా లేదు. మ్యాచ్ ఆరంభమైన చాలాసేపటి వరకు కూడా స్టేడియంలో చాలా భాగం ఖాళీగా కనిపించింది. భారత్ లేని మ్యాచ్‌కు లక్షకు పైగా సామర్థ్యం ఉన్న స్టేడియం ఫ్యాన్స్‌తో హౌస్‌ఫుల్ అవుతుందని కోరుకోవడం అత్యాశే అయినా మరీ నామమాత్రంగా కూడా జనం లేకపోవడం ఆశ్చర్యం కలిగించింది. చివరి వరకు వేర్వేరు కారణాలతో టికెట్లు అమ్మకానికి ఉంచకపోవడం, నగరంలో తీవ్రమైన ఎండ, వారాంతం కాకపోవడం కూడా అందుకు కారణాలు కావచ్చు. 40 వేల టికెట్లను స్థానిక రాజకీయ నాయకులు తమ కార్యకర్తలకు పంచిపెట్టారు. టికెట్లు తీసుకున్న వారంతా వచ్చేందుకు ఆసక్తి కనబర్చలేదని తెలిసింది. నిజానికి ఇలాంటి మెగా ఈవెంట్‌లు ఆతిథ్య జట్టు మ్యాచ్‌తో ప్రారంభం కావడం సహజంగా జరుగుతూ ఉంటుంది. కానీ నిర్వాహకులు భిన్నంగా ఆలోచించి 'ఫైనలిస్ట్'లతో పోరు ఖరారు చేశారు. మ్యాచ్ సాగినకొద్దీ సాయంత్రానికి స్టేడియంలో ప్రేక్షకులు సంఖ్య పెరగడం కాస్త ఊరట.



మన బాణం బంగారం

- ఆర్చరీలో భారత మహిళల, పురుషుల జట్లకు స్వర్ణ పతకాలు
- జ్యోతి సురేఖ, అదితి స్వామి, పర్ణీత్ కౌర్ బృందం అద్భుతం
- ఓజస్ ప్రవీణ్, అభిషేక్ వర్మ, ప్రథమేశ్ జట్టు సంచలనం



జ్యోతి సురేఖ

ఆసియా క్రీడల్లో పన్నెండో రోజు భారత క్రీడాకారులు పసిడి ప్రదర్శనతో అలరించారు. ఆర్చరీ టీమ్ విభాగంలో రెండు స్వర్ణ పతకాలు సొంతం చేసుకోగా... స్క్వాష్ మిక్స్‌డ్ డబుల్స్ విభాగంలో దీపిక పల్లికల్-హరీందర్‌పాల్ సింగ్ జోడీ బంగారు పతకంతో అదరగొట్టింది. స్క్వాష్ పురుషుల సింగిల్స్ విభాగంలో భారత స్టార్ సౌరవ్ ఘోషాల్ రజతం నెగ్గి వరుసగా ఐదో ఆసియా క్రీడల్లోనూ పతకం సంపాదించడం విశేషం. మహిళల రెజ్లింగ్‌లో రైజింగ్ స్టార్ అంతిమ్ పంఘాల్ కాంస్య పతకంతో రాణించింది. బ్యాడ్మింటన్ పురుషుల సింగిల్స్‌లో హెచ్‌ఎస్ ప్రణయ్, డబుల్స్‌లో సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి సెమీఫైనల్లోకి ప్రవేశించి పతకాలను ఖరారు చేసుకున్నారు. పన్నెండో రోజు పోటీలు ముగిశాక భారత్ 21 స్వర్ణాలు, 32 రజతాలు, 33 కాంస్యాలతో కలిపి 86 పతకాలతో నాలుగో స్థానంలో కొనసాగుతోంది.



స్వర్ణ పతకాలతో జ్యోతి సురేఖ, అదితి స్వామి, పర్ణీత్ కౌర్



పసిడి పతకాలతో ప్రథమేశ్, అభిషేక్ వర్మ, ఓజస్ ప్రవీణ్ దేవ్‌తలే

హాంగ్జౌ: చైనా నేలపై భారత బాణం బంగారమైంది. ఆసియా క్రీడల ఆర్చరీ ఈవెంట్‌లో భారత మహిళల కాంపౌండ్ జట్టు తొలిసారి స్వర్ణ పతకం సాధించగా... భారత పురుషుల కాంపౌండ్ జట్టు 2014 తర్వాత మళ్లీ పసిడి పతకం సంపాదించింది. ఆంధ్రప్రదేశ్ అమ్మాయి వెన్నం జ్యోతి సురేఖ, అదితి స్వామి, పర్ణీత్ కౌర్‌లతో కూడిన భారత మహిళల జట్టు ఫైనల్లో 230-229తో యి సువాన్ చెన్, హువాంగ్ ఐజు, లు యున్ వాంగ్‌లతో కూడిన చైనీస్ తైపీ జట్టును ఓడించి తొలిసారి ఆసియా క్రీడల చాంపియన్‌గా అవతరించింది. సెమీఫైనల్లో భారత్ 233-219తో ఇండోనేసియా జట్టుపై, క్వార్టర్ ఫైనల్లో 231-220తో హాంకాంగ్ జట్టుపై విజయం సాధించింది. 2014 ఇంచియోన్ ఏషియాడ్‌లో జ్యోతి సురేఖ, త్రిషా దేబ్, పూర్వాషా షిండేలతో కూడిన భారత జట్టు కాంస్యం నెగ్గగా... 2018 జకార్తా ఏషియాడ్‌లో జ్యోతి సురేఖ, ముస్కాన్, మధుమితలతో కూడిన టీమిండియా రజతం కైవసం చేసుకుంది. మూడో ప్రయత్నంలో భారత్ ఖాతాలో స్వర్ణం చేరడం విశేషం. ఈ మూడుసార్లూ జ్యోతి సురేఖ జట్టు విజయాల్లో కీలకపాత్ర పోషించింది. 'ఆసియా క్రీడల్లో తొలిసారి టీమ్ స్వర్ణం నెగ్గినందుకు సంతోషంగా ఉన్నాం. శనివారం నా వ్యక్తిగత విభాగం ఫైనల్ కూడా ఉంది. ఆ ఈవెంట్‌లోనూ స్వర్ణమే లక్ష్యంగా బరిలోకి దిగుతా' అని విజయవాడకు చెందిన 27 ఏళ్ల జ్యోతి సురేఖ వ్యాఖ్యానించింది. ఓజస్ ప్రవీణ్ దేవ్‌తలే, అభిషేక్ వర్మ, ప్రథమేశ్‌లతో కూడిన భారత పురుషుల కాంపౌండ్ జట్టు ఫైనల్లో 235-230తో జేహున్ జూ, జేవన్ యాంగ్, కింగ్ జాంగ్‌హోలతో కూడిన దక్షిణ కొరియా జట్టును ఓడించి బంగారు పతకం నెగ్గింది. సెమీఫైనల్లో భారత్ 235-224తో చైనీస్ తైపీపై, క్వార్టర్ ఫైనల్లో 235-221తో భూటాన్‌పై, తొలి రౌండ్‌లో 235-219తో సింగపూర్‌పై గెలుపొందింది. 2014 ఇంచియోన్ ఏషియాడ్‌లో రజత్ చౌహాన్, సందీప్ కుమార్, అభిషేక్ వర్మలతో కూడిన భారత జట్టు తొలిసారి పసిడి పతకం గెలిచింది.

సురేఖ బృందానికి సీఎం జగన్ అభినందనలు

సాక్షి, అమరావతి: తమ అద్భుతమైన ప్రదర్శనతో మహిళల ఆర్చరీ కాంపౌండ్ టీమ్ విభాగంలో స్వర్ణ పతకం సాధించిన వెన్నం జ్యోతి సురేఖ, పర్ణీత్ కౌర్, అదితిలను ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అభినందించారు. విజయవాడకు చెందిన జ్యోతి సురేఖ సాధించిన విజయం పట్ల తనతో పాటు, ఆంధ్రప్రదేశ్ ఎంతో గర్వపడుతోందన్నారు. తెలుగు జెండా రెపరెపలాడుతోందంటూ సీఎం వైఎస్ జగన్ గురువారం ట్వీట్ చేశారు.

పతకాల పట్టిక (టాప్-10)

దేశం	స్వ	ర	కాం	మొ
చైనా	179	99	55	333
జపాన్	44	54	60	158
దక్షిణ కొరియా	33	47	77	157
భారత్	21	32	33	86
ఉజ్బెకిస్తాన్	19	16	25	60
చైనీస్ తైపీ	15	15	23	53
ఉత్తర కొరియా	10	16	9	35
థాయ్‌లాండ్	10	14	27	51
బహ్రెయిన్	10	2	5	17
ఇరాన్	8	17	17	42

నోట్: స్వ-స్వర్ణం, ర-రజతం, కాం-కాంస్యం, మొ-మొత్తం.

సూపర్ సౌరవ్...

వరుసగా ఐదో ఆసియా క్రీడల్లో పతకం



దీపిక పల్లికల్
హరీందర్



సౌరవ్ ఘోషాల్

భారత స్క్వాష్ స్టార్ సౌరవ్ ఘోషాల్ వరుసగా ఐదో ఆసియా క్రీడల్లోనూ పతకంతో మెరిశాడు. గురువారం జరిగిన పురుషుల సింగిల్స్ ఫైనల్లో 37 ఏళ్ల సౌరవ్ 11-9, 9-11, 5-11, 7-11తో ఇయిన్ యో ఎన్జీ (హాంకాంగ్) చేతిలో ఓడిపోయి రజత పతకం దక్కించుకున్నాడు. 2006 దోహా ఆసియా క్రీడల్లో అరంగేట్రం చేసి కాంస్యం నెగ్గిన సౌరవ్.. ఆ తర్వాత 2010లో కాంస్యం, 2014లో రజతం, 2018లో కాంస్యం సాధించాడు. తొలిసారి ప్రవేశపెట్టిన మిక్స్‌డ్ డబుల్స్‌లో దీపిక పల్లికల్-హరీందర్‌పాల్ జోడీ (భారత్) స్వర్ణ పతకం గెలిచింది. ఫైనల్లో దీపిక-హరీందర్‌పాల్ ద్వయం 11-10, 11-10తో ఐఫా బింతి అజ్మన్-కమాల్ (మలేసియా) జంటపై నెగ్గింది.

రెజ్లర్ అంతిమ్‌కు కాంస్యం



మహిళల రెజ్లింగ్‌లో భారత రైజింగ్ స్టార్ అంతిమ్ పంఘాల్ కాంస్య పతకం గెలిచింది. 53 కేజీల విభాగం కాంస్య పతక బౌట్‌లో 19 ఏళ్ల అంతిమ్ 3-1తో టోక్యో ఒలింపిక్స్ కాంస్య పతక విజేత బొలోర్‌తుయా బత్‌ఒచిర్ (మంగోలియా)పై సంచలన విజయం సాధించింది. భారత్‌కే చెందిన పూజా గెహ్లోత్ (50 కేజీలు) కాంస్య పతక బౌట్‌లో 2-9తో కెయునిమ్‌జేవా (ఉజ్బెకిస్తాన్) చేతిలో... మాన్సి అహ్లావత్ కాంస్య పతక బౌట్‌లో 70 సెకన్లలో సాబిరోవా (ఉజ్బెకిస్తాన్) చేతిలో ఓడిపోయారు. మరోవైపు భారత మహిళల హాకీ జట్టు సెమీఫైనల్లో 0-4 గోల్స్ తేడాతో చైనా జట్టు చేతిలో ఓడిపోయింది. శనివారం జరిగే కాంస్య పతక మ్యాచ్‌లో జపాన్‌తో భారత్ ఆడుతుంది. పురుషుల మారథాన్ రేసులో (42.195 కిలోమీటర్లు) భారత అథ్లెట్లు మాన్ సింగ్ ఎనిమిదో స్థానంలో (2గం :16ని:59 సెకన్లు), అప్పచంగడ బెలియప్ప (2గం :20ని:52 సెకన్లు) 12వ స్థానంలో నిలిచారు.

41 ఏళ్ల నిరీక్షణకు తెర



సాత్విక్, చిరాగ్



విజయానంతరం ప్రణయ్ భావోద్వేగం

- ఆసియా క్రీడల బ్యాడ్మింటన్‌లో భారత్‌కు రెండు పతకాలు ఖాయం
- 1982 తర్వాత పురుషుల సింగిల్స్, డబుల్స్‌లో సెమీస్ చేరిన భారత క్రీడాకారులు
- ప్రణయ్, సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి జోడీ ఘనత

ఈ సీజన్‌లో తమ అద్భుతమైన ప్రదర్శనను కొనసాగిస్తూ... 41 ఏళ్ల సుదీర్ఘ నిరీక్షణకు తెరదించుతూ.... భారత స్టార్ షట్లర్ హెచ్‌ఎస్ ప్రణయ్... సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి జోడీ ఆసియా క్రీడల్లో పతకాలను ఖాయం చేసుకున్నారు. న్యూఢిల్లీ వేదికగా 1982లో జరిగిన ఆసియా క్రీడల్లో చివరిసారి బ్యాడ్మింటన్ పురుషుల సింగిల్స్, డబుల్స్ విభాగాల్లో భారత్‌కు పతకాలు లభించాయి. 1982 ఆసియా క్రీడల పురుషుల సింగిల్స్‌లో దివంగత సయ్యద్ మోడీ... పురుషుల డబుల్స్‌లో లెరాయ్ ఫ్రాన్సిస్-ప్రదీప్ గాంధె సెమీఫైనల్లో ఓడిపోయి కాంస్య పతకాలు గెలిచారు. ఆ తర్వాత తొమ్మిదిసార్లు ఆసియా క్రీడలు జరిగినా పురుషుల సింగిల్స్, డబుల్స్ విభాగాల్లో భారత క్రీడాకారులెవరూ సెమీఫైనల్ దశకు చేరుకోలేకపోయారు. చైనా గడ్డపై ఎట్టకేలకు ఈ నిరీక్షణకు ప్రణయ్, సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి ముగింపు పలికారు. సింగిల్స్‌లో ప్రణయ్... డబుల్స్‌లో సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి సెమీఫైనల్లోకి దూసుకెళ్లారు. గురువారం జరిగిన క్వార్టర్ ఫైనల్లో ప్రణయ్ 21-16, 21-23, 22-20తో లీ జి జియా (మలేసియా)పై గెలుపొందాడు. 78 నిమిషాలపాటు హోరాహోరీగా సాగిన ఈ మ్యాచ్‌లో కేరళకు చెందిన 31 ఏళ్ల ప్రణయ్ రెండో గేమ్‌లోనే గెలవాల్సింది. తొలి గేమ్‌ను సొంతం చేసుకొని, రెండో గేమ్‌లో 20-18తో ఆధిక్యంలో నిలిచిన ప్రణయ్ రెండు మ్యాచ్ పాయింట్లను వదులుకున్నాడు. స్కోరును సమం చేసిన లీ జి జియా అదే జోరులో రెండో గేమ్‌ను నెగ్గి మ్యాచ్‌లో నిలిచాడు. నిర్ణాయక మూడో గేమ్ కూడా నువ్వా నేనా అన్నట్లు సాగింది. చివరకు ప్రణయ్ 18-20తో ఓటమి అంచుల్లో నిలిచాడు. అయితే సంయమనం కోల్పోకుండా ఆడిన ప్రపంచ ఏడో ర్యాంకర్ ప్రణయ్ వరుసగా నాలుగు పాయింట్లు గెలిచి గేమ్‌తోపాటు మ్యాచ్‌ను కైవసం చేసుకున్నాడు. నేడు జరిగే సెమీఫైనల్లో ప్రపంచ ఎనిమిదో ర్యాంకర్ లీ షి ఫెంగ్ (చైనా)తో ప్రణయ్ ఆడతాడు. ముఖాముఖి రికార్డులో ప్రణయ్ 3-0తో లీ షి ఫెంగ్‌పై ఆధిక్యంలో ఉన్నాడు.

డబుల్స్ క్వార్టర్ ఫైనల్లో సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి ద్వయం 21-7, 21-9తో ఎన్జీ జా జియు-జాన్ ప్రజోగో (సింగపూర్) జంటపై గెలిచి సెమీఫైనల్ చేరింది. నేడు జరిగే సెమీఫైనల్లో ఆరోన్ చియా-సూ వుయ్ యిక్ (మలేసియా) జంటతో సాత్విక్-చిరాగ్ ద్వయం తలపడుతుంది.

సింధుకు నిరాశ

మరోవైపు మహిళల సింగిల్స్‌లో భారత స్టార్ పీవీ సింధు పోరాటం ముగిసింది. 2018 జకార్తా ఆసియా క్రీడల్లో ఫైనల్లో ఓడి రజత పతకం సాధించిన సింధు ఈసారి మాత్రం క్వార్టర్ ఫైనల్ దాటలేకపోయింది. క్వార్టర్ ఫైనల్లో సింధు 16-21, 12-21తో ప్రపంచ ఐదో ర్యాంకర్ హి బింగ్జియావో (చైనా) చేతిలో ఓడిపోయింది.




సింధు

జంతువులు చేసే కామెడీని ప్రతిబింబించే కామెడీ వైల్డ్ లైఫ్ ఫొటోగ్రఫీ పురస్కారాల ఫైనలిస్టులను తాజాగా ప్రకటించారు. 2015 నుంచి ఈ అవార్డులను ఇస్తున్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న వైల్డ్ లైఫ్ ఫొటోగ్రాఫర్లు దీని కోసం పోటీపడుతుంటారు. ఫైనల్ జాబితాకు చేరిన వాటిల్లో కొన్ని మీకోసం









క్లుప్తంగా...

రాష్ట్రంలో ప్రతిఒక్కరికీ సీపీఆర్‌పై శిక్షణ అవసరం

గవర్నర్ తమిళిసై సౌందరరాజన్



సాక్షి, హైదరాబాద్: తెలంగాణలోని ప్రతి ఒక్కరికీ సీపీఆర్‌పై శిక్షణ అవసరమని రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ అన్నారు. గురువారం ఇక్కడ రాజ్‌భవన్, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సంయుక్తంగా నిర్వహించిన సదస్సులో ఆమె మాట్లాడారు. సీపీఆర్‌పై అవగాహన పెంచడానికి రెడ్‌క్రాస్ సొసైటీ చేస్తున్న ప్రయత్నాలను ఆమె కొనియాడారు. ఈ లైఫ్–సేవింగ్ టెక్నిక్‌పై అందరికీ అవగాహన ఉండాలన్నారు. విద్యపై పెట్టుబడి రాష్ట్ర భవిష్యత్తుకు పెట్టుబడి అని పేర్కొన్నారు. ఆరోగ్యవసతులను మెరుగుపరచడంలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా ప్రతీ 50 కిలోమీటర్లకు ఒక రక్తనిధి కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని సూచించారు. స్థానిక సంస్కృతి, వారసత్వ ప్రదేశాలను ప్రోత్సహించాలని కోరారు. ఈ విషయంలో తెలంగాణ జిల్లాలు ఆదర్శంగా నిలిచాయని, ఈ మేరకు భారత రాష్ట్రపతి నుంచి కూడా గుర్తింపు పొందాయన్నారు. సీపీఆర్ శిక్షణ, రాష్ట్రవ్యాప్తంగా జనరిక్ మందుల లభ్యతలో పురోగతి ఉందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మన్‌దీప్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో డిగ్రీ విద్యార్థులకు గవర్నర్ చేతుల మీదుగా మూడు ల్యాప్‌టాప్‌లను పంపిణీ చేశారు.

నేటినుంచి హస్తకళలు, చేనేత, పిండి వంటల ప్రదర్శన

సాక్షి, హైదరాబాద్: చేనేత, హస్తకళలు, వివిధ రకాల పిండి వంటల ప్రదర్శనను శుక్రవారం సాయంత్రం పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ప్రారంభించనున్నారు. ఈనెల 16 వరకు నెక్లెస్ రోడ్‌లోని ప్రసాద్ ఐమాక్స్ పక్కన హెచ్ఎండీఏ మైదానంలో నిర్వహించనున్నారు. ఉదయం 11 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు నిర్వహించే ఈ ప్రదర్శనకు ప్రవేశం ఉచితమని నిర్వాహకులు తెలిపారు. సాయంత్రం వేళ తెలంగాణ సాంస్కృతికశాఖ ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలుంటాయని గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ముఖ్య కార్యనిర్వహణాధికారి గౌతం పోట్రు గురువారం ఒక ప్రకటనలో వెల్లడించారు.

అందుబాటులోకి 18 కొత్త ఫైర్ స్టేషన్‌లు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా మరో 18 కొత్త ఫైర్ స్టేషన్లు అందుబాటులోకి రానున్నాయి. హైదరాబాద్‌లో ఎల్బీనగర్ ఫైర్ స్టేషన్‌ను రాష్ట్ర హోం శాఖ మంత్రి మహమూద్ అలీ, విద్యా శాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డితో కలసి శుక్రవారం ఉదయం ప్రారంభించనున్నట్టు అగ్నిమాపక శాఖ డీజీ వై. నాగిరెడ్డి తెలిపారు. అలాగే రాష్ట్రంలో ఇటీవల ఏర్పాటు చేసిన మరో 17 ఫైర్ స్టేషన్లను హోం మంత్రి మహమూద్ అలీ వర్చువల్‌గా ప్రారంభిస్తారని డీజీ పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. వీటితోపాటు రాష్ట్ర అగ్నిమాపక శాఖలో ఏర్పాటు చేసిన ఎస్డీఆర్ఎఫ్ (స్టేట్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్) ప్రత్యేక బృందాన్ని ప్రజల సేవకు అంకితం చేస్తారని తెలిపారు. 39 క్విక్ రెస్పాన్స్ రెస్క్యూ టెండర్ వాహనాలను హోం మంత్రి ప్రారంభిస్తారని డీజీ నాగిరెడ్డి పేర్కొన్నారు.

ప్రారంభం కానున్న ఫైర్‌స్టేషన్లు ఇవే..
నర్సాపూర్, స్టేషన్ ఘన్‌పూర్, జూబ్లీహిల్స్, చాంద్రాయణగుట్ట, అంబర్‌పేట్, మల్కాజ్‌గిరి, రాజేంద్రనగర్, షాద్‌నగర్, డోర్నకల్, ఎల్బీనగర్, కల్వకుర్తి, అలంపూర్, మక్తల్, పినపాక, నందిపేట్, బాల్కొండ, ధర్మపురి, హుస్నాబాద్.

సమాచార శాఖలో 88 ఔట్‌సోర్సింగ్ పోస్టులు

సాక్షి, హైదరాబాద్: సమాచార, ప్రజా సంబంధాల శాఖ కమిషనర్ ఆధ్వర్యంలో పనిచేసేందుకు ఔట్‌సోర్సింగ్ ప్రాతిపదికన 88 మంది ఉద్యోగుల నియామకానికి రాష్ట్ర ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీ ద్వారా ఎంపికయ్యే ఉద్యోగులు రాష్ట్ర సమాచార కమిషనర్ కార్యాలయంతోపాటు 33 జిల్లాల్లోని ప్రజా సంబంధాల అధికారి కార్యాలయాల ఆధీనంలో పనిచేయాల్సి ఉంటుంది. అసిస్టెంట్ పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్, పబ్లిసిటీ అసిస్టెంట్, ఆఫీస్ సబార్డినేట్ పోస్టులను ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీ ద్వారా భర్తీ చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఆ తిండితో మానసికంగానూ ముప్పే!



- అల్ట్రా ప్రాసెస్డ్ పుడ్‌తో ఎన్నో అనర్థాలని ఇప్పటికే అనేక అధ్యయనాల స్పష్టీకరణ
- యూపీఎఫ్‌తో మానసిక సామర్థ్యం సైతం గణనీయంగా తగ్గుతుందని తేల్చిన తాజా పరిశోధన
- ఈ తరహా ఆహారానికి దూరంగా ఉండే వారితో పోలిస్తే మూడు రెట్లు ఎక్కువ హాని
- దేశంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న యూపీఎఫ్ మార్కెట్
- ఇదే పరిస్థితి కొనసాగితే 2032 కల్లా పాశ్చాత్య దేశాల మాదిరి ఆరోగ్య సమస్యలు ఖాయమంటున్న అధ్యయనం

'ఈ తరహా ఆహారానికి ఉన్న మన ఆలోచనలు, భావోద్వేగాలను నియంత్రించే సామర్థ్యం ఉందని, దీని అధిక వినియోగం వల్ల డిప్రెషన్ మాత్రమే కాదు అంతకు మించిన మానసిక ఆరోగ్య క్షీణత సంభవిస్తున్నట్టుగా గమనించాం..'అని సేపియన్ ల్యాబ్స్ వ్యవస్థాపకురాలు, చీఫ్ సైంటిస్ట్ తారా త్యాగరాజన్ చెబుతు

డిప్రెషనే కాదు అంతకు మించి..

న్నారు. వీటి వినియోగం వల్ల కలిగే మానసిక సమస్యల్లో మానసిక వేదన, నిస్సత్తువ, ఆకలి మందగింపు వంటివి సంభవించే అవకాశం ఉందని అధ్యయనం కనుగొంది. ముఖ్యంగా 18–24 సంవత్సరాల వయస్సు గల యువతలో ఇది బాగా ఎక్కువగా ఉంది. ఎందుకంటే వారు 45 ఏళ్ల అంతకంటే ఎక్కువ వయస్సు ఉన్న పెద్దలతో పోలిస్తే ప్రతిరోజూ అలాంటి ఆహారాన్ని తీసుకునే అవకాశం రెండు రెట్లు ఎక్కువ.

సాక్షి, హైదరాబాద్: అల్ట్రా–ప్రాసెస్డ్ ఫుడ్ (యూపీఎఫ్) (ఎక్కువగా ప్రాసెస్ చేసిన ఆహారం) తరచుగా తీసుకోవడం ఊబకాయం, మధుమేహం, గుండె జబ్బులు తదితర సమస్యలకు దోహదం చేస్తుందని గతంలో చేసిన అధ్యయనాలు తేల్చాయి. అయితే వీటి వల్ల మానసిక సామర్థ్యం సైతం గణనీయంగా తగ్గుతుందని తాజా అధ్యయనం ఒకటి వెల్లడించింది. రోజుకు పలుమార్లు అల్ట్రా ప్రాసెస్డ్ ఫుడ్ తినే వారు.. ఈ ఆహారాలను అరుదుగా లేదా ఎప్పుడూ తీసుకోని వారితో పోలిస్తే మానసిక ఆరోగ్యంతో బాధపడే అవకాశం దాదాపు మూడు రెట్లు ఎక్కువ అని మన దేశానికి చెందిన 30 వేల మంది వ్యక్తులను భాగస్వాముల్ని చేసిన ఈ అధ్యయనం వెల్లడించింది. ప్రపంచ వ్యాప్తంగా మానసిక శ్రేయస్సును అధ్యయనం చేసే అమెరికాకు చెందిన లాభాపేక్ష లేని స్వచ్ఛంద సంస్థ సేపియన్ ల్యాబ్స్ గ్లోబల్ మైండ్ ప్రాజెక్ట్‌లో ఈ అధ్యయనం ఒక భాగం. ప్రపంచ వ్యాప్తంగా దాదాపు 3 లక్షల మంది నుంచి వచ్చిన ప్రతిస్పందనలు, అధ్యయన ఫలితాలతో ఇటీవల ఒక నివేదిక విడుదల చేశారు.

యూపీఎఫ్ అంటే ఏమిటి?

యూపీఎఫ్‌ను సరైన విధంగా నిర్వచించడం కొంతవరకు కష్టమే. అయితే సగటు గృహాలలో తయారు కాని, ఇంటి వంటగదికి ఆవల ప్రాసెసింగ్ చేసిన ఆహార పదార్థాలను యూపీఎఫ్‌గా తారా త్యాగరాజన్ నిర్వచిస్తున్నారు. ఎరేటెడ్ డ్రింక్స్ (కొన్నిరకాల శీతల పానీయాలు, ఐస్‌క్రీమ్స్, ప్యాక్ చేసిన చిప్స్, స్నాక్స్, మిఠాయిలు ఈ కోవలోకి వస్తాయి. దీర్ఘకాలం మన్నేందుకు గాను సాల్ట్, సుగర్, ఫ్యాట్ వంటివి అధికంగా కలిపేవి ప్రాసెస్డ్ ఫుడ్ కాగా, అల్ట్రా ప్రాసెస్డ్ ఫుడ్‌లో కృత్రిమ స్వీటెనర్లు, ఫ్లేవర్లు ఇతరత్రా కూడా జత కలుస్తాయి. రెడీ టూ ఈట్ మీల్స్, తీపి పానీయాలు వంటివన్నీ వీటిలో భాగమే.


పెరుగుతున్న వినియోగం

మన దేశంలో అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న మార్కెట్‌లలో యూపీఎఫ్ కూడా ఉంది. ఇండియన్ కౌన్సిల్ ఫర్ రీసెర్చ్ ఆన్ ఇంటర్నేషనల్ ఎకనామిక్ రిలేషన్స్‌తో కలిసి గత ఆగస్టులో ప్రపంచ ఆరోగ్య సంస్థ విడుదల చేసిన ఒక నివేదిక వీటి వినియోగం ఎంతలా ఉందో స్పష్టం చేసింది. కోవిడ్ సందర్భంగా 2020లో కాస్త తగ్గుముఖం పట్టినప్పటికీ ఆ తర్వాత అంతకు ముందుకన్నా రెట్టింపు అమ్మకాలు సాగుతున్నాయని ఈ నివేదిక తేల్చింది. ఈ విజృంభణ ఇలాగే కొనసాగితే 2032 కల్లా పాశ్చాత్య దేశాల్లో ప్రస్తుతం వెల్లువెత్తుతున్న రకరకాల ఆరోగ్య సమస్యలతో మన దేశం కూడా సతమతమవడం తథ్యమని కూడా ఆందోళన వ్యక్తం చేసింది.

పాఠశాలల్లో నిషేధించాలి

గత నెలలో బ్రెస్ట్ ఫీడింగ్ ప్రమోషన్ నెట్‌వర్క్, న్యూట్రిషన్ అడ్వకసీ ఇన్ పబ్లిక్ ఇంట్రెస్ట్ సంస్థలు సంయుక్తంగా.. మన దేశంలో యూపీఎఫ్‌ల వినియోగం –ప్రభావంపై నిర్వహించిన పరిశోధన పలు హెచ్చరికలు జారీ చేసింది. ఈ సంస్థలు రూపొందించిన నివేదిక.. అన్ని రకాల జంక్ ఫుడ్స్, కుకీస్, చాకొలెట్స్, కన్ఫెక్షనరీ, హెల్త్ డ్రింక్స్, చిప్స్, ఐస్ క్రీమ్స్, పిజ్జా వంటి ఉత్పత్తులపై వార్నింగ్ లేబుల్ ఉండేలా చర్యలు తీసుకోవాలని కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖను కోరింది. పాఠశాలలు, ఆసుపత్రులు, ప్రభుత్వ కార్యాలయాల్లో వీటి విక్రయాలను నిషేధించాలని, ఈ ఉత్పత్తులపై భారీ జీఎస్టీని విధించాలని కూడా నివేదిక సూచించింది.

టుడేస్ గ్రాఫిక్



పేదింట కొలువుల పంట

- ఒక కుటుంబంలో నలుగురు, మరో ఇంట ముగ్గురు
- కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఎంపిక

కల్హేర్(నారాయణఖేడ్)/నిజాంపేట(మెదక్): వారిది పేద కుటుంబం. పనిచేయనిదే పూటగడవని పరిస్థితి. అలాంటి రెండు కుటుంబాల్లో ఏడుగురు పోలీసు కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఎంపికయ్యారు. కల్హేర్ మండలం సిర్గాపూర్ మండలం జమ్లా తండాకు చెందిన మెఘావత్ నెహ్రూనాయక్–మరోనిబాయి దంపతులు వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఆ దంపతులకు రమేష్ నాయక్, సంతోష్, రేణుక సంతానం. మలోత్ రోజా ఆ దంపతుల కోడలు. రమేష్, సంతోష్, రేణుక, రోజా పోలీసు కానిస్టేబుల్ ఉద్యోగాల ఎంపికలో ప్రతిభ కనబర్చారు. రమేష్ నాయక్, రేణుక సివిల్ కానిస్టేబుళ్లుగా, సంతోష్, రోజా ఏఆర్ కానిస్టేబుళ్లుగా ఉద్యోగాలు సాధించారు. నిజాంపేట మండలం నందిగామ గ్రామానికి చెందిన సంగు దుర్గయ్య, లక్ష్మి దంపతుల ముగ్గురు కుమారులు కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఎంపికయ్యారు. శ్రావణ్ (టీఎస్‌పీసీ), ప్రశాంత్ (ఏఆర్ పీసీ), సందీప్(టీఎస్‌పీసీ) కానిస్టేబుల్ పోస్టులకు ఎంపికయ్యారు.


శ్రావణ్, ప్రశాంత్, సందీప్



రమేష్, సంతోష్, రేణుక, రోజా

వరద రాకముందే పసిగట్టొచ్చు!

సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి

హైదరాబాద్ కోసం ప్రత్యేకంగా వరద సమాచార వ్యవస్థ

- ఎక్కడ, ఎంత వర్షం/వరద ఉందో కచ్చితత్వంతో అంచనా.. అర్బన్ ఫ్లడ్ ఇన్ఫర్మేషన్ సిస్టంను అభివృద్ధి చేస్తున్న ఐఐటీ హైదరాబాద్
- జీహెచ్ఎంసీ, ఇతర ప్రభుత్వ విభాగాల నుంచి సమాచార సేకరణ
- ప్రజలను అప్రమత్తం చేయడం, వరద సన్నద్ధతలో ప్రభుత్వానికి తోడ్పాటే లక్ష్యం



భాగ్యనగరంలో ఏటా వర్షాలకు రోడ్లన్నీ చెరువులను తలపిస్తూ ప్రజలు, వాహనదారులు తీవ్ర అవస్థలు పడుతుండటం, ఒక్కోసారి ప్రమాదవశాత్తూ మ్యాన్‌హోల్స్ లేదా నాలాల్లో పడి పలువురు దుర్మరణం పాలవుతున్న ఘటనలు చోటుచేసుకుంటున్న నేపథ్యంలో ఈ సమస్యకు వినూత్న పరిష్కారం కనుగొనేందుకు ఐఐటీ హైదరాబాద్ ముందుకొచ్చింది. ప్రజలపై వరద ప్రభావాన్ని వీలైనంత తగ్గించేందుకు, నగరంలోని వివిధ ప్రాంతాల్లో వర్షపాతం వివరాలను ముందుగానే కచ్చితత్వంతో అంచనా వేసేందుకు వీలుగా పట్టణ వరద సమాచార వ్యవస్థ (అర్బన్ ఫ్లడ్ ఇన్ఫర్మేషన్ సిస్టం–యూఎఫ్ఐఎస్)ను అభివృద్ధి చేస్తోంది. తద్వారా నగరవాసులను ముందే అప్రమత్తం చేయడంతోపాటు వరద సన్నద్ధత చర్యల్లో వివిధ ప్రభుత్వ విభాగాలకు తోడ్పాటు అందించనుంది. ఐఐటీహెచ్ సివిల్ ఇంజనీరింగ్, క్లైమేట్ చేంజ్ విభాగానికి చెందిన అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ రేగొండ సతీష్‌కుమార్ నేతృత్వంలోని పరిశోధన బృందం ఈ దిశగా కసరత్తు ప్రారంభించింది.

విశ్లేషించి.. అంచనా వేసి..
ఇందుకోసం జీహెచ్ఎంసీలోని విపత్తుల నిర్వహణ విభాగంతోపాటు హైదరాబాద్ వాతావరణ కేంద్రం, నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ (హైదరాబాద్), తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి ప్రణాళికా సంఘం తదితర సంస్థలతో ఐఐటీ హైదరాబాద్ పరిశోధన బృందం సమన్వయం చేసుకోనుంది. ఆయా సంస్థలు అందించే వాతావరణ గణాంకాల ఆధారంగా నగరంలో ఎక్కడెక్కడ ఎంత మేర వర్షం కురిసే అవకాశం ఉందో విశ్లేషించనుంది. లోతట్టు ప్రాంతాలు, వరద వ్యాప్తిని సిమ్యులేషన్ మోడలింగ్ టెక్నిక్‌ల సాయంతో కచ్చితత్వంతో అంచనా వేయనుంది. అలాగే స్నాప్‌ఫ్లడ్ టీఎం అనే సాఫ్ట్‌వేర్ ప్లాట్‌ఫాం ద్వారా నగరవాసుల నుంచి ఎప్పటికప్పుడు రియల్‌టైంలో వరద వివరాలను సేకరించాలని ఐఐటీ హైదరాబాద్ ప్రణాళికలు రచిస్తోంది. దీనికి అదనంగా ఫ్లడ్ హాట్‌స్పాట్లను గుర్తించేందుకు ట్విట్టర్ వంటి సోషల్ మీడియా సంస్థల సహకారం సైతం తీసుకోనుంది. రెయిన్‌ఫాల్–రన్‌ఆఫ్ అనాలసిస్ మోడలింగ్ అండ్ ఫోర్‌కాస్టింగ్ టూల్స్ (రాఫ్ట్) పేరుతో ఈ పరిశోధన బృందం పనిచేయనుంది.

నగరాలకు ఎంతో ఉపయోగం
అర్బన్ ఫ్లడ్ ఇన్ఫర్మేషన్ సిస్టం అనేది ఒక్క హైదరాబాద్ నగరానికే కాకుండా దేశంలోని ఇతర వరద పీడిత నగరాలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ఐఐటీ హైదరాబాద్ డైరెక్టర్ ప్రొఫెసర్ బీ.ఎస్.మూర్తి తెలిపారు. తాము చేపట్టే పరిశోధనలు నిత్యం సమాజంలో ఎదురవుతున్న సవాళ్లను సమర్థంగా ఎదుర్కొనేందుకు ఉపయోగపడుతాయన్నారు. ప్రొఫెసర్ సతీష్ కుమార్ మాట్లాడుతూ భారీ వర్షాలతో వచ్చే వరదల ప్రభావాన్ని తగ్గించేందుకు అర్బన్ ఫ్లడ్ ఇన్ఫర్మేషన్ సిస్టం ఎంతో ఉపయోగంగా ఉంటుందన్నారు.

ఇవీ ప్రయోజనాలు..

- అర్బన్ ఫ్లడ్ ఇన్ఫర్మేషన్ సిస్టం ద్వారా వరద ముంచెత్తే ప్రాంతాలను ముందే గుర్తించొచ్చు. తద్వారా ఆ ప్రాంతాలవైపు ప్రజలు వెళ్లకుండా అప్రమత్తం చేయొచ్చు.
- వరద నీరు ఎటువైపు పారుతోంది.. ఏయే ప్రాంతాల్లో ఎంత మేర నిలిచి ఉంది... వరద హాట్‌స్పాట్‌లు ఎక్కడెక్కడ ఉన్నాయి వంటి పూర్తి సమాచారాన్ని తెలుసుకొనేందుకు వీలు కలుగుతుంది.

ఇడ్లీ సాంబార్ .. పూరీ కుర్మా

నేటినుంచి ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అల్పాహారం

- రావిర్యాలలో పథకం ప్రారంభించనున్న మంత్రి సబిత
- ఆరు రోజుల్లో రోజుకో రకం అందించేలా మెనూ
- స్కూల్ వేళలకు 45 నిమిషాల ముందే బ్రేక్‌ఫాస్ట్
- దసరా నుంచి అన్ని పాఠశాలల్లో అమలు
- 23 లక్షల మంది విద్యార్థులకు ప్రయోజనం



సాక్షి, హైదరాబాద్: సాంబార్ ఇడ్లీ, పూరీ–ఆలూ కుర్మా, ఉప్మా, వెజిటబుల్ పలావ్, ఉగ్గాని.. పాఠశాల విద్యార్థులకు వేడి వేడిగా రోజుకో అల్పాహారం అందించేలా మెనూ ఖరారయ్యింది. శుక్రవారం నుంచి రాష్ట్రవ్యాప్తంగా 'ముఖ్యమంత్రి అల్పాహారం' పథకం ప్రారంభించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లూ పూర్తి చేశారు. మహేశ్వరం మండలం రావిర్యాల ప్రభుత్వ పాఠశాలలో విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి ఈ పథకాన్ని లాంఛనంగా ప్రారంభిస్తారు. మంత్రి హరీశ్‌రావు కూడా ఈ కార్యక్రమానికి హాజరవుతారని అధికార వర్గాలు తెలిపాయి. ఇక రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గంలో ఆయా జిల్లాల మంత్రులు, ఎమ్మెల్యేలు అల్పాహార పథకం ప్రారంభిస్తారు. విద్యార్థులను బడికి రప్పించడం, వారికి తగిన పౌష్టికాహారం అందించడం ఈ పథకం ముఖ్య ఉద్దేశం. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 27,147 పాఠశాలల్లో 1–10వ తరగతి వరకు చదివే 23 లక్షల మంది విద్యార్థులకు దీనివల్ల ప్రయోజనం చేకూరుతుందని ప్రభుత్వం చెబుతోంది. పాఠశాల ప్రారంభానికి 45 నిమిషాల ముందే విద్యార్థులకు అల్పాహారం అందించనున్నారు.

హెచ్ఎంలకు నిర్వహణ బాధ్యత
రాష్ట్ర విద్యాశాఖ, పంచాయతీరాజ్, స్త్రీ, శిశు సంక్షేమ శాఖల సమన్వయంతో అమలయ్యే ముఖ్యమంత్రి అల్పాహారం పథకాన్ని తొలుత నియోజకవర్గానికి ఒకటి రెండు పాఠశాలల్లో లాంఛనంగా ప్రారంభిస్తారు. దసరా నుంచి రాష్ట్రంలోని అన్ని పాఠశాలల్లో పూర్తి స్థాయిలో అమలు చేస్తారు. ఇందుకు సంబంధించిన విధి విధానాలను, మెనూను విద్యాశాఖ వెల్లడించింది. ఈ పథకాన్ని ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న ప్రభుత్వం అమలు తీరును పర్యవేక్షించేందుకు ప్రత్యేక ట్రాకింగ్ మొబైల్ యాప్‌ను కూడా రూపొందించింది. అన్ని రకాల విటమిన్స్ లభించే పౌష్టికాహారంతో రోజుకో రకమైన బ్రేక్‌ఫాస్ట్ ఉంటుందని అధికారులు తెలిపారు. పథకం నిర్వహణ బాధ్యత సంబంధిత పాఠశాల ప్రధానోపాధ్యాయులపైనే పెట్టారు. మండల నోడల్ అధికారి మండల స్థాయిలో, జిల్లా విద్యాశాఖాధికారి జిల్లా స్థాయిలో, పాఠశాల విద్య శాఖ రాష్ట్ర స్థాయిలో పథకం అమలు తీరును పర్యవేక్షిస్తుంది. జిల్లా కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, స్థానిక సంస్థల అధికారులకు అల్పాహారం అందుతున్న తీరును పర్యవేక్షించే అధికారాలు ఇచ్చారు.

బ్రేక్‌ఫాస్ట్ అందించే వేళలివే..: మధ్యాహ్న భోజనం పథకం కార్మికులే అల్పాహారం తయారు చేస్తారు. హైదరాబాద్, సికింద్రాబాద్ మినహా రాష్ట్రంలోని అన్ని ప్రాథమిక పాఠశాలు ఉదయం 9.30 మొదలవుతాయి. ఆయా చోట్ల ఉదయం 8.45 గంటలకు విద్యార్థులకు అల్పాహారం అందిస్తారు. జంటనగరాల్లో ప్రైమరీ స్కూళ్ళు ఉదయం 8.45 గంటల నుంచి మొదలవుతాయి. దీనివల్ల ఈ స్కూళ్ళలో ఉదయం 8 గంటలకే బ్రేక్‌ఫాస్ట్ ఇస్తారు. ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో రాష్ట్రవ్యాప్తంగా ఉదయం 8.45 గంటలకు, జంటనగరాల్లో ఉదయం 8 గంటలకు అల్పాహారం అందిస్తారు.

ఆరు రోజులు..ఆరు రకాలు

సోమవారం: ఇడ్లీ సాంబార్ లేదా పచ్చడితో కూడిన గోధుమరవ్వ ఉప్మా

మంగళవారం: ఆలూ కుర్మాతో పూరీ లేదా టమాటో బాత్ సాంబార్‌తో


బుధవారం: సాంబార్ ఉప్మా లేదా చట్నీతో కూడిన బియ్యం రవ్వ కిచిడీ

గురువారం: మిల్లెట్స్ ఇడ్లీ విత్ సాంబార్ లేదా సాంబార్‌తో పొంగల్

శుక్రవారం: ఉగ్గానీ, పోహా, మిల్లెట్ ఇడ్లీ విత్ చట్నీలో ఏదో ఒకటి లేదా గోధుమరవ్వ కిచిడీ చట్నీతో

శనివారం: సాంబార్‌తో పొంగల్ లేదా వెజిటబుల్ పలావ్, రైతా, ఆలూకుర్మా

డ్రాపౌట్లు తగ్గిస్తుంది



ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేద విద్యార్థులకు పౌష్టికాహారం అందించే ఈ పథకం విద్యార్థుల డ్రాపౌట్ల (బడి మానేవారి సంఖ్య)ను తగ్గిస్తుందని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబిత ఇంద్రారెడ్డి తెలిపారు. పథకాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని అధికారులను కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించేందుకు ప్రభుత్వం ఇప్పటికే రూ.672 కోట్లు తన వాటాగా ఖర్చు చేస్తోందన్నారు. దేశంలోనే ఎక్కడా లేని విధంగా మధ్యాహ్న భోజన పథకం కింద సన్న బియ్యంతో కూడిన భోజనం, వారానికి మూడు గుడ్లను అందిస్తున్నామని తెలిపారు. ఐరన్, సూక్ష్మ పోషకాలతో కూడిన ఆహారాన్ని అందించే ఉద్దేశంతో రూ. 32 కోట్లు వెచ్చించి రాగి జావను ఇస్తున్నామని చెప్పారు.

– మంత్రి సబితా ఇంద్రారెడ్డి

Published and Printed by V. Murali, on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527, T.G., and Printed at Jagati Publications Limited Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527 T.G.,
Editor: V. Murali(Responsible for selection of News under the PRB Act), Phone No. 0878 - 2223017, Fax No. 0878 – 2223019. RNI Regn No. TELTEL/2008/23800.